సోమవారం 21-1-2019



'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00

సంపుటి: 11
సంచిక: 300

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

నగల విక్రయాల్లో.. నిజం, పారదర్శకత!

బంగారు ఆభరణాలు తయారీ ధరకే..!



వజ్రాభరణాలు

క్యారెట్ రూ.46,000 కన్నా అధికంగా ఇస్తున్నారంటే..

మీరు తెలిసే మోసపోతున్నట్టు!

భారతదేశంలోనే తక్కువ ధరకు వజ్రాభరణాలు!

క్యారెట్ రూ. 46000 నుంచి!

V.A. గ్రాముకు రూ.975 మాత్రమే



అన్ని వజ్రాభరణాలకు అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్ అందజేస్తాం.

మా దగ్గర కొన్న వజ్రాభరణాలకు 100% ఎక్స్ఛేంజ్ చేసుకునే సౌకర్యం మరియు 85% క్యాష్‌బాక్ సౌకర్యం.

100% Quality. E-F Colour Grade & VVS Clarity.

నాణ్యత తక్కువైన G-H కలర్‌గ్రేడ్ ఆభరణాలను మేం విక్రయించం.

వెండి వస్తువులు

కనువిందు చేసే సంప్రదాయ మరియు వినూత్నమైన వెండిసామగ్రి.

మార్కెట్‌లోనే అతి తక్కువ ధరకు అందిస్తున్నాం!



నగల బుకింగ్ పథకం

One Time Payment !

ఏ నగకూ 100% V.A. లేదు

మొత్తం నగదును ఒకసారి చెల్లించి, తర్వాత..
V.A. లేకుండా నగలు కొనుగోలు చేసుకోండి.

5 నెలల నుంచే ఫలితం!

11 నెలల తర్వాత నగను కొనేటప్పుడు, 14% లేదా 16% వరకు V.A. ఉన్న నగ అయినప్పటికీ..
1% V.A. కూడా చెల్లించనక్కర్లేదు.

మీ పాత నగలను ఇచ్చి కూడా ఈ పథకంలో చేరొచ్చు.

కేవలం అరశాతం (0.5%) మీ పాత బంగారు నగలను మెల్టింగ్, ప్యూరిఫికేషన్ చేసేందుకు పట్టుకుంటాం.

కస్టమర్ GST భరించాల్సి ఉంటుంది.

నగలు కొనుగోలు పథకం

11 నెలల 'నగలు కొనుగోలు పథకం'!

తొలి వాయిదా ఉచితం!

+

V.A. 50% ఉచితం!

ఈ సువర్ణ అవకాశం అన్ని బంగారు నగలకు వర్తిస్తుంది!

రూ.1000 / రూ.1500 / రూ.2000 / రూ.2500
చిన్న వాయిదాలు, రెండింతల ప్రయోజనం!

ప్రతినెలా నగల కొనుగోలు పథకంలో చెల్లిస్తున్నది డబ్బు కాదు..
అది మీ శ్రమ! అందుకు తగ్గ ఫలితాన్ని అందించాలన్నదే నా ఉద్దేశం!

కస్టమర్ GST భరించాల్సి ఉంటుంది.

Lalithaa®©

లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రై. లిమిటెడ్

100% నాణ్యత - BIS 916 హాల్‌మార్క్
లక్షలాది డిజైన్లు!

వైజాగ్ : 29-1-75/1, ఆర్‌టీసీ బస్టాండ్, ద్వారకా నగర్. ఫోన్: 0891-6600001.

తిరుపతి : 481/482, రెడ్డి అండ్ రెడ్డి కాలనీ, మాస్కోరోడ్, (V.V. మహల్‌రోడ్) ఫోన్: 0877-666 0505 / 0606 / 7888.

విజయవాడ : 60-9-10, పిన్నమనేని పాలిక్లినిక్ రోడ్, సిద్ధార్థ నగర్, సిద్ధార్థ క్యాటరింగ్ కాలేజ్ ఎదురుగా.
ఫోన్: 0866-2481133 / 91332 98333 / 91332 98444.

హైదరాబాద్ : 6-3-883, SBR సౌక్, రాజీవ్‌గాంధీ విగ్రహం ఎదురుగా, సోమాజిగూడ సర్కిల్. ఫోన్: 040 - 6748 6677. www.lalithaajewellery.com

చెన్నై • తిరువళ్లూరు • మదురై • తిరుచ్చి • పుదుచ్చేరి • కుంభకోణం • బెంగళూరు • రామనాథపురం • కోయంబత్తూరు • సేలం • నాగర్‌కోవిల్ • ఈరోడ్


'ప్రాజెక్టులను నిర్లక్ష్యం చేస్తే భవిష్యత్తు తరాలు ఎవరినీ క్షమించవు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 14+4+16 వెల: ₹ 5.00
సంపుటి: 11
సంచిక: 300

సోమవారం 21-1-2019



రుణానికి కొత్త రూటు.. పీ2పీ
సులభంగా రుణాలు పొందే చోటు. ఒకరికి అవసరం... మరొకరికి రాబడి
-10లో



ఫెడరర్‌కు షాక్
ఆస్ట్రేలియన్ ఓపెన్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన డిఫెండింగ్ చాంపియన్ -స్పోర్ట్స్‌లో

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

ఎద్దులతో ఫైట్..

జల్లికట్టుకు గిన్నిస్‌లో చోటు



తమిళుల సాహసక్రీడ జల్లికట్టు గిన్నిస్ రికార్డుల్లోకి ఎక్కింది. ఆదివారం పుదుకోట్టై జిల్లా విరాళిమలైలో అట్టహాసంగా జరిగిన ఈ పోటీలో అత్యధికంగా 1,354 ఎద్దులను నిర్వాహకులు బరిలోకి దించారు. దీంతో అత్యధిక సంఖ్యలో ఎద్దులను బరిలోకి వదిలిన విభాగం కింద గిన్నిస్ ప్రతినిధులు దీన్ని రికార్డుగా గుర్తించారు. 424 మంది యువకులు పాల్గొన్న ఈ పోటీలో ఇద్దరు సందర్శకులు మృతి చెందారు. 31 మంది యువకులు గాయపడ్డారు.

- వివరాలు 9లో

ఎమ్మెల్యేల ఫైట్..

రిసార్టులో బాహాబాహీ



కర్ణాటకలోని బెంగళూరు శివార్లలో ఉన్న ఈగల్‌టన్ రిసార్టులో కలకలం చెలరేగింది. ఈ రిసార్టులో శనివారం రాత్రి కాంగ్రెస్ నేతలు భోజనం చేస్తుండగా కంప్లి ఎమ్మెల్యే జె.ఎన్.గణేశ్, హోసపేటె ఎమ్మెల్యే, గనుల వ్యాపారి ఆనంద్ సింగ్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో సహనం కోల్పోయిన గణేశ్ టేబుల్‌పై ఉన్న మద్యం బాటిల్‌తో ఒక్కసారిగా ఆనంద్‌సింగ్‌పై దాడిచేశారు.

- వివరాలు 9లో

100% రైతు ప్రభుత్వమే

దేశవ్యాప్తంగా మాకు ఆ పేరే ఉంది.. మేం అలాగే ఉంటాం

- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానం సందర్భంగా కేసీఆర్
- భూ రికార్డుల ప్రక్షాళన సాహసోపేత కార్యక్రమం
- త్వరలోనే అందుబాటులోకి ధరణి వెబ్‌సైట్
- దీని ఆధారంగానే బ్యాంకు రుణాలు
- పక్కాగా కొత్త పంచాయతీరాజ్ చట్టం అమలు
- ప్రజలందరికీ రక్త పరీక్షల పథకం తీసుకొస్తాం
- ఆరోగ్యశ్రీ భేష్.. వైఎస్ఆర్ గొప్పగా ఆలోచించారు
- నీటిపారుదల, సంక్షేమం, రోడ్లు మా ప్రాధాన్యతలు
- వచ్చే ఆర్థిక సంవత్సరం నుంచీ హామీల అమలు

సాక్షి, హైదరాబాద్: తమ ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా, రైతు ప్రయోజనాలే లక్ష్యంగా ముందుకు సాగుతోందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. తమది రైతు ప్రభుత్వమని దేశవ్యాప్తంగా పేరు వచ్చిందని.. నూటికి నూరు శాతం రైతు ప్రభుత్వంగానే ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ అనంతరం విపక్ష సభ్యులు లేవనెత్తిన పలు అంశాలపై సీఎం మాట్లాడారు. రైతు సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని సభ ద్వారా రైతులకు వాగ్దానం చేస్తున్నామన్నారు. 100% భూరికార్డుల ప్రక్షాళన చేస్తామన్నారు. ఈ దిశగా ప్రభుత్వం తీసుకొస్తున్న ధరణి వెబ్‌సైట్ విప్లవాత్మకమైనదిగా ఉండబోతోందన్నారు. రాష్ట్రంలోని ప్రతి అంగుళం భూమి వివరాలు కూడా వెబ్‌సైట్‌లో ఉంటాయన్నారు. బ్యాంకులు కూడా ధరణి వెబ్‌సైట్ చూసి రుణాలు ఇచ్చే పరిస్థితి తీసుకొస్తామన్నారు. రిజిస్ట్రేషన్లలో అవినీతి రహిత విధానాన్ని అమలు చేస్తామన్నారు. రిజిస్ట్రేషన్ అయిన గంటకే మ్యుటేషన్ అయ్యేలా చేస్తామని కేసీఆర్ స్పష్టం చేశారు. రిజిస్ట్రేషన్లలో స్లాట్ అలాట్ చేస్తామని, వాటి ఆధారంగా తహసీల్దార్లు రిజిస్ట్రేషన్ చేస్తారన్నారు. ఆ అధికారం తహసీల్దార్లకు ఇస్తామన్నారు. భూ రికార్డుల ప్రక్షాళనలో కఠినంగా వ్యవహరించాల్సి వచ్చినా వెనక్కు తగ్గలేదన్నారు. ఇప్పటికే 54 లక్షల మంది రైతులకు పాస్‌బుక్‌లు ఇచ్చామని వెల్లడించారు. చెప్పింది చేసి చూపించినందుకే ప్రజలు బ్రహ్మాండమైన

మిగతా 2వ పేజీలో ▶



ఆరోగ్యశ్రీ ఎన్నో రెట్లు బెటర్

కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆయుష్మాన్ భారత్ పథకం కంటే దివంగత సీఎం వైఎస్ రాజశేఖర రెడ్డి ప్రవేశ పెట్టిన ఆరోగ్యశ్రీ పథకం ఎన్నో రెట్లు మెరుగైందని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. 'మంచి పథకం ఎవరు తెచ్చినా చరిత్రలో నిలిచిపోతారు. దాన్ని కాదనలేం. తుడిచేయలేం. వైఎస్ రాజశేఖరరెడ్డి ఆరోగ్యశ్రీ తీసుకొచ్చారు. కచ్చితంగా అది చాలా మంచి పథకం. మాకు భేషజాలు లేవు. మంచిని మంచిగా అంగీకరించాలి. సీఎంగా ఉన్నప్పుడు ఆయనకు ఈ ఆలోచన వచ్చింది. అది వెరీగుడ్ స్కీం. కేంద్రం తెచ్చిన ఆయుష్మాన్ భారత్ కంటే ఇది ఎన్నో రెట్లు మెరుగైన పథకం. అదే పథకాన్ని యధాతథంగా నాలుగున్నరేళ్లుగా కొనసాగించాం. ఇప్పుడు కూడా ముందుకు తీసుకుపోతాం. దానికి కొన్ని యాడ్ చేస్తున్నాం. వైఎస్ఆర్ 108 తెచ్చారు. మేము అమ్మ ఒడి పెట్టి, ఇంకా బలోపేతం చేసుకొని కొనసాగిస్తున్నాం. మీ పథకం ఇన్ఫీరియర్‌గా ఉంది. కాబట్టి మేం ఆయుష్మాన్ భారత్‌లో చేరబోమని ప్రధానికి చెప్పాను' అని కేసీఆర్ వివరించారు.



'పంచాయతీ'

పోరు షురూ

నేడే తొలి విడత ఎన్నికలు

- ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్
- మధ్యాహ్నం 2 గంటల నుంచి ఓట్ల లెక్కింపు.. ఫలితాల ప్రకటన

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక తొలిసారి జరుగుతున్న గ్రామ పంచాయతీ ఎన్నికలకు రంగం సిద్ధమైంది. మూడు విడతల్లో జరగనున్న ఈ ఎన్నికల్లో సోమవారం తొలి విడత పోలింగ్ జరగనుంది. ఇందుకోసం అధికార యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పోలింగ్ కొనసాగనుంది. ఆ తర్వాత మధ్యాహ్నం రెండు గంటల నుంచి ఓట్ల లెక్కింపు మొదలవుతుంది. లెక్కింపు ప్రక్రియ ముగియగానే సోమవారమే ఫలితాలను ప్రకటించనున్నారు. మొదటి దశలో మొత్తం 3,701 సర్పంచ్ స్థానాలకు 12,202 మంది, మొత్తం 28,976 వార్డు మెంబర్ స్థానాలకు 70,094 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. వాస్తవానికి ఈ విడతలో మొత్తం 4,479 స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా 769 సర్పంచ్ స్థానాలు ఏకగ్రీవమయ్యాయి. అలాగే 39,822 వార్డుసభ్య స్థానాలకు ఎన్నికలు జరగాల్సి ఉండగా

మిగతా 2వ పేజీలో ▶



సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని సీఎం కేసీఆర్ వ్యవసాయ క్షేత్రంలో మహారుద్ర సహస్ర చండీయాగం కోసం సిద్ధమైన యాగశాల

బంగారు తెలంగాణ కోసం..

నేటి నుంచి సహస్ర చండీయాగం

- కేసీఆర్ ఫాంహౌస్‌లో భారీగా ఏర్పాట్లు
- భారతీ తీర్థస్వామి ఆశీస్సులతో యాగం
- 300 మంది రుత్వికుల ఆధ్వర్యంలో..
- హాజరుకానున్న రాజకీయ, ఆధ్యాత్మిక ప్రముఖులు
- ఫాంహౌస్ వద్ద పటిష్టమైన భద్రత
- 25 వరకు కొనసాగనున్న కార్యక్రమం

5లో

ఐదు గదులు.. ప్రత్యేక కిచెన్



- ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న అన్నా డీఎంకే మాజీ నాయకురాలు శశికళకు జైలులో ప్రత్యేక మర్యాదలు, సౌకర్యాలు కల్పించారని విచారణ కమిటీ తేల్చింది. ఆర్టీఐ కార్యకర్త నరసింహమూర్తి దాఖలుచేసిన అర్జీకి ఈ మేరకు సమాధానం లభించింది.

- వివరాలు 9లో

170 మంది జలసమాధి!

ఉత్తర ఆఫ్రికా నుంచి యూరప్‌కు వలస వెళ్తుండగా మధ్యధరా సముద్రంలో నీటమునిగిన రెండు పడవలు

లిబియా తీరంలో, మొరాకో సమీపంలో ప్రమాదాలు

మృతుల సంఖ్యను ధ్రువీకరించని ఐక్యరాజ్యసమితి

- వివరాలు 9లో



లిబియా తీరంలో ప్రమాదానికి గురైన పడవ నుంచి 47 మంది శరణార్థులను మరో బోటులోకి తరలిస్తున్న సహాయ సిబ్బంది

అవినీతి.. అస్థిరత.. వ్యతిరేకభావం



- వాటి కలబోతే మహాకూటమి
- నాలుగున్నరేళ్లలో దేశం వేగంగా అభివృద్ధి చెందింది
- పేదలకు రిజర్వేషన్లతో విపక్షాలకు నిద్ర కరువు
- బీజేపీ కార్యకర్తలతో మోదీ

- వివరాలు 9లో

గోడకు నిధులిస్తే.. డ్రీమర్లకు గడువిస్తాం

- డెమొక్రాట్లకు అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదన
- ట్రంప్ ఆఫర్‌ను తిరస్కరించిన స్పీకర్ పెలోసీ

9లో

ఇందూ'టూన్'



అబ్బే! కిడ్నాప్ కాదు పార్టీ మారబోతుంటే పట్టుకుని పార్టీ ఆఫీసుకు లాక్కుపోతున్నాడు!

2014, మార్చి 8..



239 మంది ప్రయాణికులతో బయల్దేరిన మలేసియా ఎయిర్‌లైన్స్ విమానం ఎంహెచ్ 370
అంతుచిక్కని రీతిలో మాయమైంది...
అన్ని రకాల టెక్నాలజీలను వాడి వెతికారు.. ఇదిగో తోక..
అదిగో రెక్క అన్నారు.. మూడేళ్లకుపైగా వెతికారు..
చివరికి ఎక్కడుందో కనుక్కోలేక చేతులెత్తేశారు..
విమానం ఎక్కడో కూలి ఉంటుందని..
అందరూ చనిపోయిఉంటారని చెబుతూ కేస్ క్లోజ్ చేశారు..
ఇంతకీ అదెక్కడ కూలింది.. ఆ విమానానికి ఏమైంది అని అడిగితే
ఏమో.. ఎవరిని అడిగినా ఇదే జవాబు..

అయితే, ఇకపై అలా ఉండదు..
ఈ భూప్రపంచం మొత్తమ్మీద
ఏ విమానం ఎటు వెళ్లినా.. ఎటు కదిలినా..
అనుక్షణం పర్యవేక్షించే కొత్త వ్యవస్థ వచ్చేస్తోంది..
విమానం తప్పిపోయినా.. దారి మళ్లినా..
క్షణాల్లో గుర్తించి, అప్రమత్తం చేసే
అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం
అందుబాటులోకి వచ్చేస్తోంది..
అదే **ఇరిడియం నెక్ట్స్..**



wherever you go our network follows

హచ్ డాగ్‌లా
వెంటే.. వెన్నంటే..

ఇరిడియం నెక్ట్స్.. ఇందులో భాగంగా మొత్తం 75 ఉపగ్రహాలను మోహరిస్తున్నారు. తాజాగా ఇందులోని చివరి 10 ఉపగ్రహాలను కూడా అంతరిక్షంలోకి ప్రవేశ పెట్టారు. ఈ మొత్తం ఉపగ్రహాల వ్యవస్థ భూమి చుట్టూ ఓ సాలిగూడులా ఏర్పడి.. విమానాల రాకపోకలను అనుక్షణం పర్యవేక్షిస్తుంటాయి. దీని వల్ల తొలిసారిగా ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ వ్యవస్థకు ప్రపంచంలోని ఏ విమానం ఎక్కడుందన్న విషయం క్షణాల్లో తెలుస్తుందని అమెరికాకు చెందిన ఇరిడియం సంస్థ తెలిపింది. 2020 సరికి ఈ వ్యవస్థ పూర్తి స్థాయిలో అమల్లోకి వస్తుంది.

ఇప్పటి వరకూ ఇలా..

ఇప్పటివరకూ విమానం రాకపోకలను రాడార్లు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ గ్రౌండ్ సిస్టం ద్వారా ట్రాక్ చేస్తున్నారు. విమానం కాక్‌పిట్‌లో ఉండే బ్లాక్ బాక్స్ ద్వారా ప్రతి 10 నుంచి 15 నిమిషాలకొకసారి ఈ సిగ్నల్ అందుతుంది. ఎంహెచ్ 370 విషయానికొస్తే.. ఆ బ్లాక్ బాక్స్ అన్నది దొరకనే లేదు. దీని వల్ల అసలేం జరిగిందన్నది తెలియరాలేదు. అసలు.. ఆ 10 నుంచి 15 నిమిషాల మధ్యలో ఆ విమానం ఎక్కడుంది అన్న విషయాన్ని ట్రాక్ చేస్తే వ్యవస్థ ప్రస్తుతానికి లేదు. ఇరిడియం నెక్ట్స్ ప్రాజెక్టు అమల్లోకి వస్తే.. ఉపగ్రహాలు అన్ని విమానాలను కనిపెట్టుకుని ఉంటాయి. తేడా వస్తే. వెంటనే ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్లకు సమాచారమందిస్తాయి. అంటే.. ఇక భవిష్యత్తులో ఎంహెచ్ 370లాంటి మిస్టరీలకు చోటు లేదన్నమాట.. ప్రమాదం జరిగినా.. ఎక్కడ జరిగిందన్న విషయం క్షణాల్లో తెలిసిపోతుంది కనుక.. సహాయక చర్యలను వెంటనే చేపట్టడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చు. ఈ ఇరిడియం.. ఇరగదీసే ఐడియా కదూ..

- సాక్షి సెంట్రల్ డెస్క్..



చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు రావాలని సీఎం కేసీఆర్‌ను ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, చిరుమర్తి లింగయ్య

చెర్వుగట్టు బ్రహ్మోత్సవాలకు రండి

సీఎంను ఆహ్వానించిన ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య
నియోజకవర్గ సమస్యలపై వినతిపత్రాలిచ్చిన ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి, హర్ష

సాక్షి, హైదరాబాద్: వచ్చే నెల 12 నుంచి ప్రారంభం కానున్న నల్లగొండ జిల్లా నార్కెట్‌పల్లి మండలం చెర్వుగట్టు జడల రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించారు. ఆదివారం అసెంబ్లీలోని సీఎం చాంబర్‌లో ఆయనను కలిసిన చిరుమర్తి చెర్వుగట్టు అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రస్తుతం చెర్వుగట్టుకు ఒకటే రోడ్డు ఉందని, వచ్చి వెళ్లేందుకు వేర్వేరు మార్గాలు ఉంటే బాగుంటుందని, అదే విధంగా గుట్ట కింద పార్కింగ్ ప్లేస్‌ను ప్రత్యేకంగా ఏర్పాటు చేయాలని, సత్రాలు నిర్మించాలని కోరారు. గట్టుపై ఉన్న భూమిని చదును చేసేందుకు నిధులు మంజూరు చేయాలని, నార్కెట్‌పల్లి నుంచి చెర్వుగట్టు మీదకు వచ్చే సర్వీసు రోడ్డును పూర్తి చేయాలని ఆయన కోరారు. అదే విధంగా నకిరేకల్ పట్టణం నుంచి నల్లగొండకు వెళ్లే సింగిల్ రోడ్డు చాలా ప్రమాదకరంగా మారిందని, దానికి మరమ్మతులు చేపట్టాలని కోరారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డిలు తమ నియోజకవర్గ సమస్యలపై వేర్వేరుగా సీఎంకు వినతిపత్రాలు అందజేశారు.

పార్లమెంటు ఎన్నికల్లో విజయమే లక్ష్యం

బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు విజయా రోహాత్కర్



మీడియాతో మాట్లాడుతున్న విజయా రోహాత్కర్

సాక్షి, హైదరాబాద్: రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీ విజయమే లక్ష్యంగా కార్యాచరణ రూపొందిస్తున్నట్లు బీజేపీ మహిళా మోర్చా జాతీయ అధ్యక్షురాలు విజయా రోహాత్కర్ అన్నారు. ఆదివారం నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్రం మహిళా సాధికారతకు అనేక పథకాలు ప్రవేశపెట్టిందని, అవన్నీ స్త్రీల పురోగతికి ఎంతగానో దోహదపడుతున్నాయని తెలిపారు. ఆడపిల్లలకు విద్యనందించే భేటీ బచావ్.. భేటీ పడావ్‌తో కోట్లాది మంది చదువుకు దగ్గరయ్యారన్నారు. త్రిపుల్ తలాఖ్‌ను వ్యతిరేకిస్తూ తీసుకొచ్చిన బిల్లు కారణంగా దాదాపు 8 కోట్ల మంది ముస్లిం మహిళలకు భరోసా లభించిందని పేర్కొన్నారు. కమల్ జ్యోతి సంకల్ప్ పేరిట కేంద్రం ప్రవేశపెట్టిన పథకాల వల్ల కలిగే విస్తృత ప్రయోజనాల గురించి జనవరి 26 నుంచి ఇంటింటికీ తిరిగి వివరిస్తామని చెప్పారు. ఇందులో ఎన్జీవోలు, స్వయం సహాయక సంఘాలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీలు, ఇతర వృత్తి నిపుణులు పాలుపంచుకుంటారని వివరించారు. ఫిబ్రవరి 10న మహిళా పురోగతికి పాటుపడుతున్న వివిధ ఎన్జీవోలతో హైదరాబాద్‌లో మహిళా సమ్మేళన్ నిర్వహిస్తున్నామని వెల్లడించారు.

ఎన్నికల్లో బీసీ అభ్యర్థులను గెలిపిద్దాం

బీసీ సంఘం నేత ఆర్.కృష్ణయ్య

సాక్షి, హైదరాబాద్: పంచాయతీ ఎన్నికల్లో జనరల్ స్థానాల నుంచి పోటీ చేస్తున్న బీసీ అభ్యర్థులకు గెలిపించి బీసీల ఐక్యతను చాటాలని బీసీ సంక్షేమ సంఘం నేత ఆర్.కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీలకు రిజర్వేషన్ల పరంగా తీవ్ర అన్యాయం జరిగిందని, ఈ పరిణామం బీసీల ఉనికికే ప్రమాదమని ఆందోళన వ్యక్తం చేశారు.

హర్షవర్ధన్‌ను విచారించిన ఎన్‌ఐఏ

కొనసాగుతున్న ఏపీ ప్రతిపక్షనేత వైఎస్ జగన్‌పై హత్యాయత్నం కేసు దర్యాప్తు



సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం: ఏపీ ప్రతిపక్షనేత, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై హత్యాయత్నం కేసులో కీలకంగా భావిస్తున్న ఎయిర్‌పోర్ట్‌లోని ఫ్యూజన్‌ఫుడ్స్ రెస్టారెంట్ యజమాని, టీడీపీ నేత హర్షవర్ధన్ చౌదరిని జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్‌ఐఏ) అధికారులు విచారించారు. గత ఏడాది అక్టోబర్ 25న విశాఖ విమానాశ్రయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై కత్తి దూసి హత్యాయత్నానికి పాల్పడిన శ్రీనివాసరావు ఫ్యూజన్‌ఫుడ్స్‌లో పనిచేసిన సంగతి తెలిసిందే. ఆ రెస్టారెంట్ కేంద్రంగానే కుట్ర జరిగిందనేది అందరూ అనుమానించినా.. రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సిట్ అధికారులు హర్షవర్ధన్ జోలికే వెళ్లలేదు. సీఎం కుటుంబానికి సన్నిహితుడైన హర్షవర్ధన్‌తో కనీసం మాట్లాడేందుకు సాహసించలేదు. అయితే ఎన్‌ఐఏ నోటీసులు అందుకున్న తర్వాత హర్షవర్ధన్ పత్తాలేకుండా పోయారు. ఇదే విషయమై సాక్షిలో వార్త వచ్చిన దరిమిలా.. తనకు యాక్సిడెంట్ అయి ఇంట్లోనే కదల్లేని స్థితిలో ఉన్నానని ఎన్‌ఐఏ అధికారులకు హర్షవర్ధన్ సమాచారమిచ్చారు. దీంతో ఎన్‌ఐఏ అధికారులే రెండు రోజుల కిందట గాజువాకలోని అతని ఇంటికి వెళ్లి విచారణ చేపట్టారు. ఆయన చెప్పిన వివరాలను మొత్తం రికార్డు చేశారు. శ్రీనివాసరావు ఎలా పరిచయం, ఎన్‌వోసీ లేకుండా ఎలా ఉద్యోగంలోకి తీసుకున్నారు. అతను రెస్టారెంట్‌లోనే కత్తులు దాచినా ఎందుకు గమనించలేదని ప్రశ్నించినట్టు తెలుస్తోంది.

100% రైతు ప్రభుత్వమే

▶ మొదటి పేజీ తరువాయి

మెజార్టీతో గెలిపించారన్నారు. 'రైతు సీఎంగా ఉంటే రైతే రాజు ఎలా అవుతారో ఇపుడు అర్థమైంద'ని చేవెళ్ల నుంచి వచ్చిన ఓ రైతు తనతో చెప్పారన్నారు.

రూ. లక్ష రుణ మాఫీ చేస్తాం

రాష్ట్రంలో చిన్న, పెద్ద తారతమ్యం లేకుండా అందరు రైతులకు లక్ష రూపాయల వరకు రుణమాఫీని అమలు చేస్తామన్నారు. ఎన్నికల సందర్భంగా తాము పాతవే కొనసాగిస్తామని చెబితే కాంగ్రెస్ ఏకమొత్తంలో రూ.2లక్షల వరకు మాఫీ చేస్తామని చెప్పిందన్నారు. అయినా ప్రజలను తమనే విశ్వసించారన్నారు. ఏకమొత్తంలో చేస్తామని చెప్పిన పంజాబ్‌లో ఇంకా అమలు కాలేదని.. మధ్యప్రదేశ్, రాజస్థాన్ ప్రభుత్వాలు సంతకాలు మాత్రమే చేశాయని, ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదన్నారు. నాలుగేళ్లలో రూ.17 వేల కోట్ల రైతు రుణాలను మాఫీ చేశామని, ఇపుడు రూ.24 వేల కోట్ల రుణాలను మాఫీ చేస్తామన్నారు. రిటైర్‌మెంట్ వయస్సు పెంపు, నిరుద్యోగ భృతి వంటి హామీలన్నీ ఎప్పుడు అమలు చేస్తారన్న ఆతృత అవసరం లేదన్నారు. ఐదేళ్ల కాలంలో పూర్తి చేయాల్సి హామీలపై ప్రతిపక్షాలు రాద్ధాంతం చేయొద్దన్నారు. రూ.5 వేల రైతుబంధు, పింఛన్లు వంటివి వచ్చే ఆర్థిక సంవత్సరంలో అమలు చేస్తామన్నారు. నిరుద్యోగ భృతి మాత్రం ఐదారు నెలలు ఆలస్యం అవుతుందన్నారు. రైతుబంధు భూ యజమానులకే ఇస్తున్నందున, కౌలు రైతుల విషయంలో యజమానులకు బాధ్యత ఉందన్నారు.

రైతులకు మద్దతు లభించేలా

పంటలకు గిట్టుబాటు ధర మనకు మనమే ఏర్పాటు చేయలేమన్నారు. అది కేంద్రం చేతిలో ఉంటుందన్నారు. అయినా రైతు మద్దతు కోసం చర్యలు చేపడుతున్నామన్నారు. ఐకేపీ ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయడం, 45 వేలకుపైగా ఉన్న మహిళా సంఘాలను పాత్రధారులుగా చేసి.. వ్యవసాయ ఉత్పత్తుల ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను నియోజకవర్గానికి రెండు, మూడు, కొన్నిచోట్ల మండలానికి ఒకటి ఏర్పాటు చేస్తామన్నారు. రైతు ఆత్మహత్యల అంశంపై మాట్లాడుతూ రైతు చనిపోయినా, ఆత్మహత్య చేసుకున్నా ఆ రైతు కుటుంబాలకు మేలు జరిగేలా చర్యలు చేపట్టామన్నారు. రైతు బీమా పథకంతో ఇప్పటివరకు 6,062 మంది రైతు కుటుంబాలకు రూ.303 కోట్ల లబ్ధి చేకూరిందన్నారు. దరఖాస్తు చేసుకోవాల్సిన అవసరమే లేకుండా ఎల్‌ఐసీ ద్వారా బీమా అందిస్తున్నామన్నారు.

ఈఎన్‌టీ.. ఆ తర్వాత రక్త పరీక్షలు

కంటి వెలుగు తర్వాత ఈఎన్‌టీ పరీక్షలు నిర్వహించాలని నిర్ణయించామని కేసీఆర్ పేర్కొన్నారు. కంటివెలుగు ద్వారా కింద ఇప్పటి వరకు 1.32 కోట్ల మందికి పరీక్షలు జరిగాయన్నారు. ఈఎన్‌టీ పథకాలు అమల్లోకి వచ్చిన తరువాత రాష్ట్రంలోని ప్రతి వ్యక్తికి రక్త పరీక్షలు నిర్వహించి వారి ఆరోగ్య పరిస్థితి నమోదు చేసే చర్యలు చేపడుతున్నామన్నారు. పాతాలజీ బృందాలు క్షేత్ర స్థాయికి వెళ్లి పరీక్షలు నిర్వహిస్తాయన్నారు.

అధికారులకే 'డబుల్' బాధ్యతలు

గత ప్రభుత్వాల హయాంలో గృహ నిర్మాణాల్లో అవినీతి జరిగిందని కేసీఆర్ పేర్కొన్నారు. పైగా ఉచితంగా ఇవ్వకపోవడంతో దర్వాజాలు తీసుకెళ్లే పరిస్థితి నెలకొందన్నారు. తాము పేదలపై ఉన్న ఆ రూ.4 వేల కోట్ల బకాయిలను రద్దు చేశామన్నారు. ఉచితంగా ఇళ్లు ఇచ్చే చర్యలు చేపట్టామన్నారు. వాటిని హడావుడిగా కట్టబోమన్నారు. 'ఆలస్యం అవుతుందని గతంలోనే చెప్పాం. గతంలో ఇచ్చినవన్నీ చేసి ఉంటే.. ఇపుడు ఇళ్లు కట్టే అవసరమే వచ్చేది కాదు. కానీ పరిస్థితి భిన్నంగా ఉంది. అందుకే గ్రామ సర్పంచి, కార్యదర్శులను బాధ్యులుగా చేసి ఏ గ్రామంలో ఎన్ని అవసరమో లెక్కలు తేల్చి నిర్మిస్తాం'అని కేసీఆర్ అన్నారు. లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను జిల్లా కలెక్టర్లకే అప్పగించామన్నారు.



ఆదివారం శాసనసభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

పక్కాగా 'పంచాయతీరాజ్'అమలు

పంచాయతీరాజ్ చట్టాన్ని ఎన్నికల కోడ్ తర్వాత ఆగస్టు నుంచి పక్కాగా అమలు చేస్తామన్నారు. చెత్తవేస్తే రూ.500 జరిమానా విధించేలా చర్యలు చేపడతామన్నారు. అలాగే ఆక్సిజన్ కొనుక్కునే దుస్థితి రాకుండా చేసేందుకు అడవుల పరిరక్షణకు కఠిన చర్యలు అమలు చేస్తామన్నారు. పోడు వ్యవసాయానికి ముగింపు పలకాల్సిన అవసరం ఉందన్నారు. డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామన్నారు. 'ధూల్‌పేట్ విషయంలో నేను ఫెయిల్ అయ్యా. ఈసారి కచ్చితంగా వస్తా. అందరితో మాట్లాడి అక్కడి ప్రజల బాగోగులపై ఏం చేయాలన్న దానిపై చర్చిస్తా'అని కేసీఆర్ పేర్కొన్నారు.

ప్రభుత్వ విధానమే గవర్నర్ చెప్పారు

గవర్నర్ ప్రసంగం పబ్లిక్ మీటింగ్‌లో కేసీఆర్ ప్రసంగంలా ఉందని కొంతమంది అన్నారని.. అలాంటి వారి రాజకీయ పరిజ్ఞానానికి జాలి పడటం తప్ప చేయగలిగిందేమీ లేదని సీఎం అన్నారు. కేసీఆర్ ప్రసంగాన్ని ఆమోదించి, ఏ పార్టీ ప్రభుత్వాన్ని గెలిపించారో, ఆ పార్టీ మేనిఫెస్టో, అదే పాలసీ గవర్నర్ ప్రసంగంలో ఉంటుందని పేర్కొన్నారు. రాజకీయాల్లో పరిణతి స్థాయి పెరగాలన్నారు.

వచ్చే ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్లు

తెలంగాణ వచ్చే ఐదేళ్లలో సమకూర్చుకునే ఆదాయం, పెట్టే ఖర్చు రూ.10లక్షల కోట్లపైనే ఉంటుందని కేసీఆర్ వివరించారు. అందులో నాలుగైదు లక్షల కోట్లు అభివృద్ధి పనులకు కేటాయిస్తామని పేర్కొన్నారు. ఈ ఐదేళ్లలో రూ.2.40 లక్షల కోట్ల అప్పు తీర్చేస్తామన్నారు. మార్చి 31 నాటికి మిషన్ భగీరథ పూర్తి చేస్తామన్నారు. ఉన్నత విద్యలో ప్రైవేటు భాగస్వామ్యం పెంచుతామన్నారు. పాఠశాల విద్యలో గురుకులలాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. విద్యుత్తు సామర్థ్యాన్ని 28 వేల మెగా వాట్లకు పెంచుకొని మిగులు విద్యుత్తు రాష్ట్రంగా ఘనత సాధించనున్నామని కేసీఆర్ తెలిపారు. అన్ని జిల్లా కేంద్రాల్లో మెడికల్ కాలేజీలు ఏర్పాటుచేస్తామని మొదటి ప్రాధాన్యం సంగారెడ్డికి ఇస్తామన్నారు. వరంగల్, ఇతర పట్టణాలకు విద్యా సంస్థలు విస్తరిస్తామన్నారు. సీఎం ప్రసంగం అనంతరం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానాన్ని సభ ఆమోదించింది. అనంతరం సభ గణాంకాలను వెల్లడించిన స్పీకర్ నిరవధికంగా వాయిదా వేశారు.

నీటి పారుదలే తొలి లక్ష్యం

రాష్ట్రప్రభుత్వం మొదటి ప్రాధాన్యం ఇరిగేషన్ అని, రానున్న మూడేళ్లలో 1.25 కోట్ల ఎకరాలకు నీరందించబోతున్నామని కేసీఆర్ తెలిపారు. సాగునీటి ప్రాజెక్టులపై ఇప్పటివరకు రూ.99 వేల కోట్లు ఖర్చు పెట్టామని.. కొనసాగుతున్న ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు మొత్తంగా రూ.1.17లక్షల కోట్లు ఖర్చు చేయబోతున్నామని సీఎం చెప్పారు. కృష్ణా, గోదావరి జలాల్లో రాష్ట్ర వాటా 1,330 టీఎంసీలను సంపూర్ణంగా వినియోగించేలా చర్యలు చేపట్టామన్నారు. సంక్షేమం తన రెండో ప్రాధాన్యమన్నారు. మూడో ప్రాధాన్యంగా రోడ్లను తీసుకున్నామన్నారు. కొత్తగా ఏర్పడిన అన్ని గ్రామపంచాయతీలకు బీటీ రోడ్లు వేస్తామన్నారు. పాత గ్రామపంచాయతీల్లో ఉన్న రోడ్లను బాగు చేస్తామన్నారు. శాంతి భద్రతల విషయంలో ఎలాంటి రాజీ ఉండబోదని.. పోలీస్ కమాండ్ కంట్రోల్‌లోఅన్ని విభాగాలను సమన్వయం చేసుకునేలా ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగం ప్రకారం రాష్ట్రానికి రావాల్సిన నిధులనే ఇస్తోందని, అదనంగా ఏమీ ఇవ్వడంలేదన్నారు. తెలంగాణకు కేంద్రం ప్రత్యేకంగా 3వేల కిలోమీటర్ల జాతీయ రహదారులను ఇచ్చిందన్నారు. రీజినల్ రింగురోడ్డును మంజూరు చేసిందని కేసీఆర్ వెల్లడించారు.

రాష్ట్రంలో సామాజిక కోణాలు చెల్లవు

- కేసీఆర్ సీఎం అవ్వడమే దానికి ఉదాహరణ
- విజయశాంతి పోటీచేయకపోతే నా భార్యకోసం అడుగుతా
- మీడియాతో చిట్‌చాట్‌లో కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో సామాజిక కోణాలు చెల్లవని కేసీఆర్ రెండోసారి సీఎం అయ్యాక తేలిపోయిందని సంగారెడ్డి కాంగ్రెస్ ఎమ్మెల్యే జగ్గారెడ్డి వ్యాఖ్యానించారు. ఆదివారం సీఎల్పీ కార్యాలయంలో ఆయన మీడియాతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ, కేసీఆర్ నిర్వహిస్తున్న చండీయాగానికి తనకు ఆహ్వానం లేదని, అయినా తనకు అంత ప్రొటోకాల్ లేదని అన్నారు. కేసీఆర్ భట్టికి ఇచ్చే ప్రాధాన్యత ఉత్తమ్‌కు ఇవ్వకపోవచ్చని అన్నారు. సీఎల్పీ నేత ఎంపిక విషయంలో రాహుల్ నిర్ణయమే శిరోధార్యమని, సీఎల్పీ నేత ఎంపికలో లాబీయింగ్‌తో పాటు ఎమ్మెల్యేల అభిప్రాయం కూడా పనిచేసిందని అన్నారు. సీఎల్పీ నేతగా నియమించి భట్టికి కాంగ్రెస్ అధిష్టానం మంచి అవకాశం ఇచ్చిందని, ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీయడం ద్వారా భట్టి తన పనితనాన్ని నిరూపించుకోవాలని అభిప్రాయపడ్డారు. తమ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఎవరూ టీఆర్‌ఎస్‌లోకి వెళ్లరని జగ్గారెడ్డి చెప్పారు. ఇటీవలి ఎన్నికల్లో కాంగ్రెస్ ఓటమికి ఉత్తమ్ కారణం కానే కాదని, ఆయన సమర్థవంతంగా పనిచేశారని, కానీ పరిస్థితులు అనుకూలించలేదని అన్నారు. ఎన్నికలకు ముందు ఉత్తమ్ గొప్పవాడు అన్న సర్వే సత్యనారాయణ ఇప్పుడు ఉత్తమ్ పనికిరాడని ఎలా అంటారని ఆయన ప్రశ్నించారు. ఉత్తమ్ బలహీనుడు కాదని, బలవంతుడని అన్నారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉత్తమ్‌ను మరో ఐదేళ్లు కొనసాగించినా తప్పేమీ లేదని అన్నారు. మెదక్ లోక్‌సభ స్థానం నుంచి విజయశాంతి పోటీచేయకపోతే తన భార్య నిర్మలకు అవకాశం ఇవ్వాలని అధిష్టానాన్ని కోరతానని జగ్గారెడ్డి చెప్పారు.

'పంచాయతీ' పోరు షురూ

▶ మొదటి పేజీ తరువాయి

వాటిలో 10,654 వార్డు స్థానాలకు అభ్యర్థులను ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మరోవైపు కోర్టు కేసుల కారణంగా 9 పంచాయతీల్లో ఎన్నికలు జరగట్లేదు. తొలి విడత ఫలితాల ప్రకటన వెలువడిన వెంటనే ఉప సర్పంచ్ ఎన్నిక నిర్వహిస్తారు. ఏదైనా కారణంతో ఉప సర్పంచ్ ఎన్నిక జరగకపోతే ఆ గ్రామ పంచాయతీ పరిధిలో మరుసటి రోజు ఆ ఎన్నికను నిర్వహించాల్సి ఉంటుందని రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్‌ఈసీ) ఇప్పటికే స్పష్టం చేసింది.

ఎన్నికల ఏర్పాట్లు...

పంచాయతీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా రాష్ట్ర ఎన్నికల కమిషన్ పటిష్ట బందోబస్తు కల్పిస్తోంది. మొత్తం 26 వేల మంది పోలీసు సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసింది. వివిధ రూపాల్లోని పోలింగ్ విధుల నిర్వహణ కోసం 1,48,033 మంది ఎన్నికల సిబ్బంది సేవలను ఉపయోగించుకుంటోంది. ప్రజలు ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ఓటర్ స్లిప్పులను కూడా పంపిణీ చేసింది. ఓటింగ్ స్లిప్పులు అందని వారు టీ–పోల్ యాప్ ద్వారా స్లిప్పులను డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కూడా ఎస్‌ఈసీ కల్పించింది. ఎన్నికలు జరగనున్న గ్రామాల్లో పరిశీలకులు, మైక్రో అబ్జర్వర్లు పర్యటిస్తూ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. నగదు, మద్యం పంపిణీపైనా ఎన్నికల అధికారులు నిఘా పెంచారు.

'స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్స్'...

పంచాయతీ ఎన్నికలు ముగిసే వరకు కట్టుదిట్టమైన చర్యలతోపాటు అవసరమైన చోట్ల కఠిన ఆంక్షలు చేపట్టేందుకు వీలుగా ఆయా గ్రామ పంచాయతీల పరిధిలో 'స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్స్'ను నియమించేందుకు న్యాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసింది. సంబంధిత జిల్లా కలెక్టర్ నిర్దేశించిన పరిధిలో ఆయా విభాగాల అధికారులు పనిచేసేలా ఈ ఉత్వర్వులు వర్తిస్తాయి. ఈ మేరకు ఆదివారం 26 జిల్లాల్లో ఆయా శాఖల అధికారులు వారికి నిర్దేశించిన పరిధిలో 'స్పెషల్ ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్స్'గా విధులు నిర్వహించేలా ఉత్తర్వులు జారీ చేశారు.

ఉపసర్పంచ్ ఎన్నిక ఇలా..

సర్పంచ్, వార్డు సభ్యుల ఫలితాలను సంబంధిత రిటర్నింగ్ అధికారి ప్రకటించిన వెంటనే సోమవారం ఎన్నికల నోటీస్‌లో పేర్కొన్న సమయం, స్థలంలో ఉపసర్పంచ్ ఎన్నిక కోసం ప్రత్యేక సమావేశాన్ని నిర్వహిస్తారు. జిల్లా పంచాయతీ అధికారి మరో చోటును నిర్దేశిస్తే తప్ప గ్రామ పంచాయతీ కార్యాలయంలోనే ఈ సమావేశం నిర్వహించాలి. ఉపసర్పంచ్ ఎన్నికను నిర్వహించకపోతే, తర్వాతి రోజు ఆ ఎన్నిక పూర్తి చేయాలి. ఈ ఎన్నిక నిర్వహణ కోసం నిర్వహించే సమావేశానికి రిటర్నింగ్ అధికారే అధ్యక్షత వహిస్తారు. ఉప సర్పంచ్ ఎన్నిక ఫలితాలు ప్రకటించిన తర్వాత రిటర్నింగ్ అధికారి, గ్రామ పంచాయతీ నోటీస్ బోర్డుపై ఉపసర్పంచ్‌గా ఎన్నికైన వారి పేరును తెలియజేస్తూ నోటీస్‌ను ప్రకటిస్తారు. ఈ నోటీస్‌ను ఉపసర్పంచ్‌కు కూడా అందజేస్తారు.

సాగరళ మథనం


హుస్సేన్‌సాగర్‌లో 'బయో రెమిడేషన్'తో తగ్గుతున్న దుర్వాసన

సత్ఫలితాలిస్తున్న నాకాఫ్ సంస్థ చర్యలు
చెడు బ్యాక్టీరియాకు చెక్ పెడుతున్న ఐఎం రసాయనాలు
సున్నా శాతం నుంచి 7.6 శాతానికి పెరిగిన నీటిలోని ఆక్సిజన్ స్థాయి
మరో ఆరు నెలల్లో పూర్తిస్థాయిలో దుర్గంధం దూరం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధానిలో ప్రధాన పర్యాటక కేంద్రమైన హుస్సేన్‌సాగర్ ప్రక్షాళన సత్ఫలితాలనిస్తోంది. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) పది నెలల క్రితం మొదలుపెట్టిన 'బయో రెమిడేషన్' ప్రక్రియతో సా'గరళం' క్రమంగా తగ్గుముఖం పడుతోంది. డ్రైనేజీ, రసాయన వ్యర్థాలు నిండటంతో సాగర్‌లోంచి వెలువడుతున్న సంస్థ కొంతమేర నియంత్రిం చగలిగింది. అడపాదడపా హుస్సేన్‌సాగర్ నుంచి దుర్వా సన వస్తున్నా పూర్తిస్థాయిలో నియంత్రణలోనే ఉండటంతోపాటు నీటిలో ఆక్సిజన్ శాతం పెరగడమే కాకుండా వ్యర్థ బ్యాక్టీరియాలు నశించడం సానుకూల సంకేతాలను ఇస్తోంది. హెచ్‌ఎండీఏ అధికారుల మార్గదర్శనంలో మరో ఆరు నెలలపాటు ఈ ప్రక్రియ కొనసాగితే పర్యాటకులు, నగరవాసులను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న దుర్వాసన పూర్తిస్థాయిలో దూరం కానుంది.

2దశల్లో.. పనులు

హుస్సేన్‌సాగర్ విస్తరిత ప్రాంతంతోపాటు దుర్గంధం అధికంగా వచ్చే ప్రాంతాలపై నాకాఫ్ సంస్థ దృష్టి సారించింది. మొదటి దశలో ఐఎం సొల్యూషన్స్‌ను ట్యాంకర్ల ద్వారా హుస్సేన్‌సాగర్‌లో చల్లుతున్నారు. దీనివల్ల జలాశయంలోని వ్యర్థ బ్యాక్టీరియాలు నశించి ఆరోగ్యకరమైన బ్యాక్టీరియా పెరుగుతోంది. రెండో దశలో బొకాషి బాల్స్‌ను జలాశయంలోకి వదలుతున్నారు. దీనివల్ల ఆ రసాయనాలు సాగర్ అడుగున ఉన్న బ్యాక్టీరియాలను తినేస్తున్నాయి. ఈ ప్రక్రియ కోసం పర్యాటకశాఖ నుంచి బోటును అద్దెకు తీసుకొని 'బొకాషి బాల్స్'ను జలాల్లో వేస్తున్నారు. దీంతో చెడు బ్యాక్టీరియా తగ్గి నీటి నాణ్యతను పెంచే బ్యాక్టీరియా అభివృద్ధి చెందడమే కాకుండా ఆక్సిజన్ శాతం పెరుగుతోంది. తాజా పీసీబీ గణాంకాల ప్రకారం గతంలో శూన్య శాతంలో ఉన్న డిసాల్వ్‌డ్ ఆక్సిజన్ ఇప్పుడు 7.6 శాతం దాకా చేరుకుంది. ఈ ఏడాది సాగర్ పరిసరాల్లో దుర్గంధం అంతగా లేదని పర్యాటకులు చెబుతున్నారు.



హెచ్‌ఎండీఏ కమిషనర్ డాక్టర్ బి. జనార్దన్‌రెడ్డి అమెరికా పర్యటన ఉండటంతో ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు స్వీకరించిన మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ అర్వింద్ కుమార్ హుస్సేన్ సాగర్‌లో శనివారం పర్యటించి నాకాఫ్ సంస్థ పనితీరును మెచ్చుకున్నారు.

రారా.. అక్కడకు రారా

'ఓఎల్ఎక్స్ నేరగాళ్ల' కొత్త ఎత్తులు

తమ ప్రాంతాలకు రావాలంటూ ఎర.. ఆపై కిడ్నాప్ చేసి బంధిస్తున్న వైనం

ఉన్నది మొత్తం దోచుకుని విడుదల.. ఓ వ్యాపారికి ఎదురైన అనుభవం

ఓఎల్ఎక్స్‌తోపాటు ఇతర ఈ–కామర్స్ సైట్స్‌లో తక్కువ ధరకు వాహనాలు అమ్ముతామంటూ పోస్టులు పెట్టి అందినకాడికి దండుకునే మోసగాళ్ల పంథా మారుతోంది. ఇప్పటివరకు ఆన్‌లైన్‌లో 'అడ్వాన్స్' తీసుకుని మోసం చేసేవారు. తాజాగా తమ మాటల వలలో పడినవారిని రాజస్థాన్‌తోపాటు హర్యానాలోని కొన్ని ప్రాంతాలకు రప్పించి కిడ్నాప్ చేసి దోచేస్తున్నారు. ఈ విధంగా మోసపోయిన ఓ వ్యక్తి పోలీసుల్ని సంప్రదించడంతో విషయం వెలుగులోకి వచ్చింది. – సాక్షి, హైదరాబాద్



ఇక్కడివరకు రొటీన్ పంథానే..

ఓఎల్ఎక్స్‌తోపాటు మరికొన్ని సైట్స్‌లోనూ ఖాతాలు తెరిచి పోస్టింగ్స్ పెడుతున్న సైబర్ నేరగాళ్లు ప్రధానంగా రాజస్థాన్‌లోని భరత్‌పూర్‌కు చెందిన వారే. ప్రజల్ని తేలిగ్గా మోసం చేయడానికి దేశ వ్యాప్తంగా విధులు నిర్వర్తించే, ఎప్పుడు–ఎక్కడికైనా బదిలీ అయ్యే ఆర్మీ ఉద్యోగుల పేర్లు వాడుకుంటున్నారు. వివిధ మార్గాల్లో సేకరించినవారి ఫొటోలతోనో, తామే ఆ వేషాలు వేసుకునో పోస్టింగ్స్ చేస్తున్నారు. వాటిలో బుల్లెట్‌తోపాటు వివిధ రకాలైన కార్లకు సంబంధించిన ఆకర్షణీయమైన ఫొటోలను, వాటికి అత్యంత తక్కువ ధరలను పొందుపరుస్తు న్నారు. తమకు వేరే ప్రాంతానికి బదిలీ అయినందుకో, రిటైర్ అయిన నేపథ్యంలోనో ఆయా వాహనాలను అమ్మి వెళ్లిపోవడానికి నిర్ణయించుకున్నామంటూ ఆ పోస్ట్‌లో పొందుపరుస్తున్నారు. ఇక్కడిదాకా గతంలో ఎలా వ్యవహరించారో అలానే చేస్తున్నారు.

పరిచయం లేని వారితో లావాదేవీలు వద్దు

కేవలం ఓఎల్ఎక్స్ యాడ్స్ విషయంలోనే కాదు ఏ విషయంలోనూ పరిచయం లేని వ్యక్తులతో ఆర్థిక లావాదేవీలు వద్దు. వాహనాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు తక్కువ ధరకు విక్రయిస్తామంటూ వివిధ ఈ–కామర్స్ సైట్స్‌లో ఉన్న ప్రకటనలు గుడ్డిగా నమ్మకూడదు. ప్రత్యక్షంగా వస్తువుల్ని, వ్యక్తుల్ని చూడకుండా అడ్వాన్స్‌లు చెల్లించవద్దు. ఎవరైనా కొత్త వ్యక్తులు వ్యాపారం తదితరాల పేర్లు చెప్పి నగదుతో తమ ప్రాంతాలకు రమ్మంటే వెళ్లకపోవడం ఉత్తమం. అనేక సందర్భాల్లో ఆయా పోలీసు విభాగాల నుంచి పూర్తి సహకారం లభించకపోవచ్చు. అన్ని వివరాలు పక్కాగా సరిచూసుకున్న తర్వాతే ఆర్థిక లావాదేవీలు చేయాలి. – సైబర్ క్రైమ్ అధికారులు

డిపాజిట్ కాకుండా నేరుగా రమ్మని..

కొత్తగా కనిపిస్తున్న వాహనాలు తక్కువ ధరకు విక్రయానికి ఉన్నాయని ఓఎల్ ఎక్స్ పోస్టు ద్వారా నమ్మినవారు ఎవరైనా సంప్రదిస్తే అసలు కథ మొదలెడుతున్నారు. ఇలా ఫోన్ ద్వారా సంప్రదిస్తే వాహనాలను చూపించాలన్నా, డెలివరీ ఇవ్వాలన్నా అడ్వాన్స్‌గా కొంత మొత్తం చెల్లించాలని చెప్పేవారు. దీనికోసం బోగస్ వివరాలతో తెరిచిన తమ బ్యాంకు ఖాతాలతోపాటు వివిధ వ్యాలెట్స్‌లోకి ఆ నగదు బదిలీ చేయించుకుని ఫోన్ స్విచ్ఛాఫ్ చేసేసేవారు.

అడుగుపెట్టగానే అపహరించి...

ఈ మాటలు నమ్మినవారు ఎవరైనా నగదుతో అక్కడకు చేరుకుంటే వెంటనే సీన్ మారి పోతోంది. బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో వేచి ఉండే ఆ ముఠాలు కస్టమర్లను కిడ్నాప్ చేస్తున్నాయి. అక్కడి నిర్మానుష్య ప్రాంతాలకు తీసుకువెళ్లి నగదు, బంగారం దోపిడీ చేస్తున్నాయి. అంతటితో ఆగకుండా వారిని ఏటీఎం కేంద్రాలకు తీసుకువెళ్లి వీలున్నంత వరకు డ్రా చేయించి స్వాహా చేసి తీవ్రంగా భయపెట్టి వదిలిపెడుతున్నారు. బాధితులు అక్కడి పోలీసుల్ని ఆశ్రయించినా ఫలితం లేకుండా ఉండేందుకు హర్యానా పరిధిలో నేరం చేస్తే వెంటనే దగ్గరలోనే ఉండే యూపీ లేదా రాజస్థాన్ పరిధిలోకి వెళ్లిపోయి కొన్నిరోజులు తలదాచుకుంటున్నాయి. ఇటీవల ఓ వ్యక్తికి తక్కువ ధరకు కారును ఆశగా చూపి హర్యానాలోకి హొడల్‌కు రప్పించి నిలువు దోపిడీ చేసి పంపాయి. ఆ బాధితుడి ద్వారా విషయం తెలుసుకున్న పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. కేసు నమోదుకు సంబంధించి న్యాయపరమైన సలహా తీసుకోవాలని నిర్ణయించారు.

దామాషా ప్రకారం రిజర్వేషన్లు అమలు చేయాలి

బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్



హైదరాబాద్: బీసీ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ అమలు చేయాలని తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాల సందర్భంగా గవర్నర్ నరసింహన్ ప్రసంగంలో బీసీల ఊసు లేకపోవడం విచారకరమన్నారు. బీసీలకు రిజర్వేషన్ కల్పించకపోవడం వారిని మోసం చేయడమేనని విమర్శించారు. కేసీఆర్ సీఎం కావాలని బీసీలందరూ ఓటేస్తే వారికి శఠగోపం పెట్టారన్నారు. పంచాయతీ ఎన్నికల్లో బీసీల రిజర్వేషన్ 22 శాతానికి తగ్గించడం వల్ల 1,099 మంది బీసీలు సర్పంచ్‌లు కాకుండా పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబుకు గిఫ్ట్ ఇస్తానన్న కేసీఆర్ రిజర్వేషన్ తగ్గించి బీసీలకే పెద్ద గిఫ్ట్ ఇచ్చారని ఎద్దేవా చేశారు. రాజ్యాంగాన్ని రక్షించాలి, సామాజిక న్యాయాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 22న అన్ని బీసీ సంఘాలతో సదస్సు, ఫిబ్రవరి మొదటివారంలో బస్సు యాత్రను నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దేశగోని సంపత్‌గౌడ్, విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు విక్రంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీకి ఆధునిక సాంకేతికత అవసరం

- రక్షణ రంగం, పరిశ్రమల మధ్య అంతరాన్ని తగ్గించేందుకు సిద్ధం
- ఆర్మీ స్టాఫ్ చీఫ్ జనరల్ బిపిన్ రావత్



హైదరాబాద్: దేశ సరిహద్దుల్లో సైనికులు ఎదుర్కొంటున్న సమస్యలను అధిగమించాలంటే ఆర్మీకి ఆధునిక సాంకేతికత అవసరమని ఆర్మీ స్టాఫ్ చీఫ్ జనరల్ బిపిన్ రావత్ అన్నారు. 'దేశ రక్షణ రంగ తయారీలో స్వావలంభన' అంశంపై ఫోరం ఫర్ ఇంటిగ్రేటెడ్ నేషనల్ సెక్యూరిటీ ఆధ్వర్యంలో జూబ్లీహిల్స్ దస్పల్లా హోటల్‌లో జరిగిన 2 రోజుల సదస్సు ఆదివారంతో ముగిసింది. సదస్సుకు హాజరైన యువ శాస్త్రవేత్తలు, పారిశ్రామికవేత్తలు, విద్యార్థులు, రక్షణ రంగ నిపుణులను ఉద్దేశించి రావత్ మాట్లాడారు. పరిశ్రమలతో సంబంధాలు కొనసాగించడంలో నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లతో పోలిస్తే ఆర్మీ కాస్త వెనకబడి ఉండటం బాధాకరమన్నారు. పరిశ్రమలు, రక్షణ రంగానికి మధ్య అంతరాన్ని తగ్గించేందుకు ఆర్మీ సిద్ధంగా ఉందన్నారు. రక్షణ రంగానికి సంబంధించిన ఉత్పత్తులను తయారు చేసే పరిశ్రమలకు తమతో కలిసి పనిచేసేందుకు అవకాశాలు కల్పిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం 'ఆర్మీ డిజైన్ డివిజన్'వేదికగా పనిచేస్తుందన్నారు. పారిశ్రామికవేత్తలు ఆ వేదికను సంప్రదిస్తే అందుకు సంబంధించిన ఏర్పాట్లు చేయడానికి సిద్ధంగా ఉంటారన్నారు. ఆర్మీ అవసరాలు, సమస్యలు, సవాళ్లతో కూడిన 4 నివేదికలను సిద్ధం చేశామని, వాటి మీద పనిచేయడానికి సిద్ధంగా ఉన్నవారు ముందుకురావచ్చని పేర్కొన్నారు.

కృత్రిమ మేధస్సుతో సరైన నిర్ణయాలు..

ఉపగ్రహ, డ్రోన్‌ల వ్యవస్థలతోపాటు పలు రకాలుగా వచ్చే సమాచారాన్ని కృత్రిమ మేధస్సు(ఏఐ), బిగ్ డేటా ఎనలిటిక్స్ సహకారంతో విశ్లేషించి సరైన నిర్ణయాలు తీసుకోవడానికి ఆస్కారముందని అన్నారు. రక్షణ ఉత్పత్తులను తయారు చేసుకోగలిగితే దిగుమతి చేసుకునే సమస్య ఉండదన్నారు. ఇందుకు దేశీయ పరిశ్రమలకు ప్రోత్సాహం ఇవ్వడానికి ఆర్మీ సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. దేశంలో కొత్తగా ఉత్తరప్రదేశ్, తమిళనాడుల్లో డిఫెన్స్ మ్యానుఫ్యాక్చరింగ్ సెక్టార్స్‌ను ప్రారంభించనున్నట్లు తెలి పారు. కార్యక్రమంలో రక్షణ రంగ నిపుణులు వీఎస్ హెగ్డే, సందీప్ ఉన్నితన్, లెఫ్టినెంట్ జనరల్ డీబీ షేకట్కర్, సంజయ్ పరషార్ పాల్గొన్నారు.

సోమశిల ఆలయ బ్రిడ్జిని నిర్మించాలి

సీఎం కేసీఆర్‌ను కోరిన ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సోమశిల సిద్దేశ్వర ఆలయ బ్రిడ్జిని నిర్మించాలని కొల్లాపూర్ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డి సీఎం కేసీఆర్‌ను కోరారు. శాసనసభ సమావేశాల అనంతరం మీడియా పాయింట్ వద్ద ఆయన మాటాడుతూ.. సోమశిల సిద్దేశ్వర ఆలయ బ్రిడ్జి నిర్మాణం కోసం కేసీఆర్‌ను కలిశానన్నారు. ఈ బ్రిడ్జిని నిర్మిస్తే కొల్లాపూర్ ప్రాంతానికి రవాణా సౌకర్యం సులభం అవుతుందన్నారు. దీంతో సమీప గ్రామాలు కూడా అభివృద్ధి చెందుతాయన్నారు. త్వరలోనే ఆ బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు తీసుకుంటానని సీఎం చెప్పారన్నారు.

చంద్రబాబు కుట్రలను అడ్డుకొని తీరుతాం

తెలంగాణ విద్యుత్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శివాజీ


సమావేశంలో మాట్లాడుతున్న శివాజీ

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంతోపాటు, సంస్థలూ రెండుగా విడిపోయిన తర్వాత కూడా తెలంగాణ విద్యుత్ సంస్థల్లో ఏపీ ఉద్యోగులను తిష్టవేయించేందుకు ఏపీ సీఎం చంద్రబాబు కుట్రలు చేస్తున్నారని తెలంగాణ విద్యుత్ ఇంజనీర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.శివాజీ ఆరోపించారు. ఆదివారం మింట్ కాంపౌండ్‌లోని టీఏఈఈఏ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. రాష్ట్రంతో పాటు సంస్థలు విడిపోయిన తర్వాత కూడా కొంతమంది ఏపీ ఇంజనీర్లు ఇంకా ఇక్కడే కొనసాగుతున్నారని చెప్పారు. వారంతా సొంత రాష్ట్రానికి వెళ్లేందుకు ఆసక్తి చూపుతున్నప్పటికీ.. వారిని ఇక్కడే కొనసాగించి తెలంగాణ విద్యుత్ సంస్థలను దెబ్బతీసేందుకు కుట్ర పన్నారన్నారు. స్వయంగా ఏపీ సర్కారే వారికి రవాణా, వసతి కల్పించి ఏకసభ్యకమిషన్ వద్దకు పంపి బలవంతంగా వారితో ఆప్షన్లు ఇప్పించిందని విమర్శించారు. ఏపీ ఉద్యోగులను ఇంకా ఇక్కడే కొనసాగించాలని చూస్తే మరో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ విషయంలో గవర్నర్ చొరవ తీసుకొని రెండు ప్రభుత్వాలతో మాట్లాడి, ఉద్యోగుల విభజన అంశాన్ని శాంతియుత మార్గంలో పరిష్కరించాలని కోరారు.

సత్వర న్యాయం అందడం లేదు

అఖిల భారత జడ్జీల సంఘం అధ్యక్షుడు జస్టిస్ రాజేంద్రప్రసాద్


మాట్లాడుతున్న జస్టిస్ రాజేంద్రప్రసాద్

సాక్షి, హైదరాబాద్: న్యాయవ్యవస్థలో ఇప్పటికీ బ్రిటీష్ విధానాలను అనుసరిస్తుండటం వల్ల సామాన్యులకు సత్వర న్యాయం అందడం లేదని అఖిల భారత జడ్జీల సంఘం అధ్యక్షుడు జస్టిస్ రాజేంద్రప్రసాద్ అభిప్రాయపడ్డారు. ఆదివారం రెండో జుడీషియల్ పే కమిషన్ అమలుకు సంబంధించి రాజేంద్రప్రసాద్ తెలంగాణ న్యాయాధికారులతో చర్చించారు. జస్టిస్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ... ప్రజలకు సత్వర న్యాయం అందించేందుకు న్యాయవ్యవస్థలో ప్రస్తుతం అమలవుతున్న సంస్కరణలను నిరంతరం కొనసాగించాల్సిన అవసరం ఉందన్నారు. హత్య, అత్యాచారం వంటి కేసుల్లో 2 నెలల్లో శిక్షలు తేలాలని, అప్పుడు ప్రజలకు న్యాయవ్యవస్థపై నమ్మకం పెరుగుతుందని తెలిపారు. ప్రస్తుతం 40 ఏళ్ల వ్యక్తిపై హత్యానేరం తేలేందుకు 30 ఏళ్లు పడుతోందన్నారు. ఈ పరిస్థితిలో మార్పు రావాల్సి ఉందన్నారు. ఏసీబీ దాడులకు సంబంధించి న్యాయాధికారుల రక్షణ సంగతి హైకోర్టు చూసుకుంటుందన్నారు. ఇటీవల ఆదాయానికి మించి ఆస్తుల కేసులో అరెస్టయిన న్యాయాధికారి వి.వరప్రసాద్‌పై ఏసీబీ చేసిన ఆరోపణలను తాము పరిశీలించామని, ఆ ఆరోపణల్లో వాస్తవం లేదని భావిస్తున్నామని చెప్పారు. దీనిపై హైకోర్టుకు వినతిపత్రం సమర్పిస్తామన్నారు. సమావేశంలో సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు వసంత్‌కుమార్ షా, ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ నతాని, కోశాధికారి రణధీర్ సింగ్ పాల్గొన్నారు.

మెడికల్ పీజీ డిప్లొమా సీట్లను పీజీ డిగ్రీగా మార్చుకునే వీలు

25 వరకు దరఖాస్తు చేసుకోవాలని ఎంసీఐ సూచన

సాక్షి, హైదరాబాద్: పీజీ మెడికల్ డిప్లొమా కోర్సులను పీజీ ఎండీ, ఎంఎస్ కోర్సులుగా మార్చుకునేందుకు వీలు కల్పిస్తూ మెడికల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (ఎంసీఐ) అనుమతించింది. ఈ మేరకు అన్ని ప్రభుత్వ, ప్రైవేటు మెడికల్ కాలేజీలు ఈ నెల 25లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. పీజీ మెడికల్ డిప్లొమా రెండేళ్ల కోర్సు కాగా, అదే పీజీ డిగ్రీ (ఎండీ లేదా ఎంఎస్) కోర్సు మూడేళ్లు ఉంటుంది. అయితే డిప్లొమా చేసినవారికి మెడికల్ ఫ్యాకల్టీగా పనిచేసే వీలు లేదు. పీజీ డిగ్రీ చేసిన వారికి మాత్రమే ఫ్యాకల్టీగా పనిచేసే వీలుంది. దీంతో సీట్లను మార్చుకునేందుకు వీలుకల్పించారు. దరఖాస్తు చేసుకున్న కాలేజీల్లో ప్రస్తుతం ఉన్న డిప్లొమా సీట్లకు సరిసమానంగా పీజీ డిగ్రీ సీట్లను కేటాయిస్తారు.

అవును.. ఇది టీఆర్ఎస్ ప్రభుత్వమే

- గండ్ర వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించిన సీఎం కేసీఆర్
- 'మీ గవర్నర్' అంటూ గండ్ర అనడంతో 'మన గవర్నర్' అనాలని సూచన



సాక్షి, హైదరాబాద్: గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపేందుకు ఆదివారం సమావేశమైన శాసనసభలో ముఖ్యమంత్రి కేసీఆర్‌కు, కాంగ్రెస్ సభ్యుడు గండ్ర వెంకటరమణారెడ్డి మధ్య కాస్తంత వాడీ వేడీ చర్చ జరిగింది. గండ్ర మాట్లాడుతున్నప్పుడు 'మీ గవర్నర్'అని సంబోధించడంపై ముఖ్యమంత్రి కేసీఆర్ జోక్యం చేసుకుని 'మన గవర్నర్'అనాలని సూచించారు. టీఆర్ఎస్‌కు ఒక గవర్నర్, కాంగ్రెస్‌కు మరో గవర్నర్ ఉండరని వ్యాఖ్యానించారు. కాబట్టి గండ్ర వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని స్పీకర్‌ను ముఖ్యమంత్రి కోరారు. దీనికి కొనసాగింపుగా గండ్ర మాట్లాడుతూ.. అలాగైతే గవర్నర్ ప్రసంగంలో ముస్లిం రిజర్వేషన్ల విషయంలో 'టీఆర్ఎస్ ప్రభుత్వం'పోరాడుతుందని అనడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం అని చదవకుండా, టీఆర్ఎస్ ప్రభుత్వమని ఎలా అన్నారని ప్రశ్నించారు. దీన్ని కూడా రికార్డుల నుంచి తొలగించాలని గండ్ర డిమాండ్ చేశారు. వెంటనే సీఎం జోక్యం చేసుకొని గండ్రపై మండిపడ్డారు. రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వమే ఉన్నది కాబట్టి గవర్నర్ అలాగే చదివారన్నారు. ప్రజలు టీఆర్ఎస్‌నే గెలిపించాక ఇందులో అభ్యంతరం ఏముందని ప్రశ్నించారు. కాంగ్రెస్‌కు ఎందుకంత అసహనమని నిలదీశారు. టీఆర్ఎస్‌కు ప్రజలు పట్టం కట్టారు కదా అని అన్నారు. 'టీఆర్ఎస్ ప్రభుత్వమనే రాస్తాం. అలా రాయడమే కరెక్ట్'అని ముఖ్యమంత్రి ఘాటుగా సమాధానం ఇచ్చారు. దీనిపై గండ్ర స్పందిస్తూ.. సీఎం వ్యాఖ్యలపై తాను వాదనకు దిగదల్చుకోలేదని, ఇక ఆ విషయంపై చర్చను కొనసాగించాలనుకోవడం లేదని గవర్నర్ ప్రసంగంపై మాట్లాడారు.

నువ్వే మార్గదర్శకుడివి అన్నా..

ఎమ్మెల్యేలు ఎర్రబెల్లి, గండ్రల సరదా సంభాషణ



సాక్షి, హైదరాబాద్: వరంగల్ జిల్లాకు చెందిన రాజకీయ ప్రత్యర్థులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, గండ్ర వెంకటరమణారెడ్డిల మధ్య ఆదివారం అసెంబ్లీ ప్రాంగణంలో సరదా సంభాషణ జరిగింది. ఉదయం సభా ప్రారంభానికి ముందు సీఎల్పీ కార్యాలయం వద్ద గండ్ర, మాజీ మంత్రి హరీశ్‌రావులు తారసపడ్డారు. ఈ సందర్భంగా హరీశ్, గండ్రలు పలకరించుకున్న సమయంలో అక్కడకు ఎర్రబెల్లి వచ్చారు. వచ్చీ రాగానే ఆయన ఏం బుద్ధిమంతుడిలా ఉన్నావ్.. అని గండ్రనుద్దేశించి అన్నారు. ఇందుకు స్పందించిన గండ్ర 'నేనెప్పుడూ బుద్ధిమంతుడినే అన్నా.. అయినా అన్నీ నీ నుంచి నేర్చుకున్నవే కదా.. నువ్వే మార్గదర్శకుడివి అన్నా' అనడంతో అక్కడ నవ్వులు విరిశాయి.

గుత్తాకు ఉత్తమ్ కంగ్రాట్స్..

సభ ముగిసిన తర్వాత అసెంబ్లీ లాబీల్లో నల్లగొండ జిల్లా నేతలు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, గుత్తా సుఖేందర్‌రెడ్డిల మధ్య కూడా సరదా చర్చ జరిగింది. తనకు తారసపడిన ఉత్తమ్‌ను గుత్తా పలకరించగా.. కంగ్రాట్స్ గుత్తా గారూ అంటూ ఉత్తమ్ సరదాగా వ్యాఖ్యానించారు. కంగ్రాట్స్ ఎందుకు చెబుతున్నారో అర్థం కానట్లు గుత్తా సైలెంట్‌గా నవ్వి ఊరుకున్నారు. అయితే, గుత్తా మంత్రి కాబోతున్నారని, అందుకే ఉత్తమ్ కంగ్రాట్స్ చెప్పినట్టున్నారని అక్కడ ఉన్న జర్నలిస్టులు చర్చించుకోవడం గమనార్హం.

తెలంగాణ రాష్ట్రంలో తెలుగే మాట్లాడతా



ఆకట్టుకున్న రాజాసింగ్ ప్రసంగం

సాక్షి, హైదరాబాద్: బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ మొదటిసారిగా అసెంబ్లీలో తెలుగులో మాట్లాడి ఆకట్టుకున్నారు. ఆదివారం గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రంలో తాను తెలుగులోనే మాట్లాడేందుకు ప్రయత్నిస్తున్నానని చెప్పారు. ఈ సందర్భంగా తెలుగు బాగా నేర్చుకోవాలని టీఆర్ఎస్ ఎమెల్యేలు ఆయనకు సూచించారు. గవర్నర్ ప్రసంగం బాగుందని, అయితే కొన్ని అంశాల్లో తనకు అనుమానాలు ఉన్నాయన్నారు. సభలో గవర్నర్ ప్రసంగంలోని అంశాల గురించి మాట్లాడాలేకానీ కొందరు ఎమ్మెల్యేలు రాజకీయాల గురించి మాట్లాడారన్నారు. ఏ పార్టీ సీఎం ఉంటే ఆయన కాళ్లు పట్టుకునే ప్రజాప్రతినిధులు కొందరు ఉంటారని, చంద్రబాబు మొదలుకొని వైఎస్, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఇపుడు కూడా అలా కాళ్లు పట్టుకొని తిరుగుతున్న నేతలు ఉన్నారన్నారు. అయితే సీఎంలు జాగ్రత్తగా ఉండాలని, వాళ్ల కాళ్లు పట్టుకోవడమే కాకుండా కాళ్లు పట్టి గుంజే అవకాశం కూడా ఉంటుందని అన్నారు. కేసీఆర్ కిట్ పథకం బాగుందని, అందులో రాష్ట్ర వాటా ఎంత? కేంద్రం వాటా ఎంత? అనే వివరాలు ఉంటే బాగుండేదన్నారు. చారిత్రక ఉస్మానియా ఆసుపత్రి భవనం కూలిపోయే పరిస్థితి నెలకొందని, హెరిటేజ్ అధికారులతో మాట్లాడి త్వరలో కొత్త భవనం కట్టించాలన్నారు. కంటివెలుగులో ఎంతమందికి ఆపరేషన్లు అవసరం అనేది చెప్పలేదని, ఇంకా అనేక మంది అద్దాల కోసం తిరుగుతున్నారన్నారు. ప్రభుత్వం యూనివర్సిటీలు, కేజీ టు పీజీ, ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కోరారు. ఆసరా పెన్షన్లు కొంతమందికి రావడం లేదని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్‌లో పెళ్లయిన తరువాత ఒకటి రెండేళ్లకు చెక్‌లు వస్తున్నాయన్నారు. డ్రగ్స్ కేసులో ఎంతమంది సెలబ్రిటీలపై కేసులు పెట్టారు? ఎంతమందిపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారో ప్రభుత్వం చెప్పాలన్నారు. ధూల్‌పేట్ వాసులకు పునరావాసం విషయంలో పక్కా చర్యలు లేకుండాపోయాయన్నారు. సీఎం కూడా వస్తానని రాలేదని, ఆ కుటుంబాలకు పిల్లల ఫీజుల చెల్లించే పరిస్థితి లేకుండాపోయిందన్నారు. వీటిపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని రాజాసింగ్ కోరారు.

మీరు మారండి.. కాదు.. మీరే పార్టీ మారండి

షబ్బీర్ ఉర్దూ షాయరీపై మండలిలో సరదా చర్చ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ శాసనమండలిలో సభాపతి, సభ్యుల మధ్య సరదా చర్చ సాగింది. నలుగురు కాంగ్రెస్ సభ్యులు సీఎల్పీగా సమావేశమై టీఆర్ఎస్‌లో విలీనమైనట్లు ప్రకటించడం, దానిని ఆమోదించడంపై తాము కోర్టుకు వెళ్తామని కాంగ్రెస్ ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ తెలిపారు. ఈ సందర్భంలో 'దేవుడి సేవకులారా అర్థం చేసుకోండి. కొన్నిరోజులే జీవితం. గెలుపుతో గర్వం పెంచుకోకు. ఇప్పటికైనా మారేందుకు సమయముంది'అనే అర్థం వచ్చేలా ఉర్దూలో ఒక కవితను షబ్బీర్ వినిపించారు. దీనిపై శాసనమండలి చైర్మన్ కె.స్వామిగౌడ్ స్పందిస్తూ.. సీనియర్ సభ్యులు, మంత్రులుగా పనిచేసిన వారు సైతం విలీనంపై తన నిర్ణయాన్ని ప్రశ్నించడం సరికాదని వ్యాఖ్యానించారు. 'మీరు కూడా ఇప్పటికైనా మారండి'అంటూ చురక వేశారు. అయితే ఉర్దూ షాయరీలోని గర్వం అనే పదాన్ని తొలగించాలంటూ మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి కోరారు. దీంతో ఆ పదాన్ని రికార్డుల నుంచి తొలగిస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. ఇంకా సమయముంది మారడానికి అన్న పదాన్ని కడియం శ్రీహరి ఎత్తిచూపారు. ఇతర కాంగ్రెస్ సభ్యులు మారారు, మీరు కూడా మారండి అంటూ నర్మగర్భంగా షబ్బీర్ కవితను కడియం శ్రీహరి ఉటంకించగా సభలో నవ్వులు విరిశాయి. బీజేపీ సభ్యుడు ఎన్.రామచంద్రరావు ప్రసంగిస్తున్న సమయంలో ఎమ్మెల్సీ పాతూరి సుధాకర్‌రెడ్డి జోక్యం చేసుకుని కొన్ని వ్యాఖ్యానాలు చేశారు. దీనిపై సభాపతి స్పందిస్తూ.. కొందరు సీనియర్ సభ్యులు చైర్మన్ అనుమతి కోరకుండానే నేరుగా ఇతర సభ్యులను ఉద్దేశించి సభలో మాట్లాడుతున్నారని, ఇకనైనా సభామర్యాదలు పాటించాలని విజ్ఞప్తి చేశారు. మరో సందర్భంలో కేంద్ర ప్రభుత్వ పథకాల గురించి రామచంద్రరావు ప్రస్తావించగా దాంతో తమకేం సంబంధముందని పాతూరి వ్యాఖ్యానించగా.. ఇందులో సభకు సంబంధముంది కదా అని చైర్మన్ అనడంతో నవ్వులు విరిశాయి.

ప్రతిపక్షాలకు విమర్శించడమే తెలుసు



ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రతిపక్షాలకు ప్రభుత్వాన్ని విమర్శించడం మాత్రమే తెలుసని జనగామ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి పేర్కొన్నారు. శాసనసభ సమావేశం అనంతరం ఆదివారం ఆయన మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. అసెంబ్లీ సమావేశాలను ఉద్దేశించి గవర్నర్ చేసిన ప్రసంగం ఆశాజనకంగా ఉందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేయలేని పనులను టీఆర్ఎస్ ప్రభుత్వం చేసిచూపిందని తెలిపారు. ఆసరా పింఛన్ల అంశాన్ని దేశంలోని అన్ని రాష్ట్రాలు ఆదర్శంగా తీసుకుని అమలు చేస్తున్నాయన్నారు. రైతుబంధు పథకం కూడా దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. ఇంతటి ఘనమైన కార్యక్రమాలు అమలు చేస్తున్నప్పటికీ ప్రతిపక్ష పార్టీలు మాత్రం తీరు మార్చుకోవడం లేదని వాపోయారు. ఇచ్చిన హామీలు అమలు చేసినందుకే ప్రజలు మరోసారి టీఆర్ఎస్‌కు అధికారాన్ని కట్టబెట్టారని పేర్కొన్నారు.

కేసీఆర్ ప్రధాని కావాలి!

- దేశానికి ఇలాంటి నాయకుడు అవసరం
- సంపద సృష్టించడం.. పేదలు, రైతులకు పంచడం ఆయన లక్ష్యం
- గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే సందర్భంగా ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డి



సాక్షి, హైదరాబాద్: సీఎం కేసీఆర్ ప్రధాన మంత్రి కావాల్సిన అవసరముందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి వ్యాఖ్యానించారు. ఇన్నాళ్లూ దేశాన్ని పాలించిన కాంగ్రెస్, బీజేపీలు ఎలాంటి మార్పు తీసుకురానందున.. దేశానికి కేసీఆర్ వంటి నాయకుడి అవసరం ఉందన్నారు. గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ఆదివారం ఆయన శాసన సభలో మాట్లాడుతూ.. 'దేశంలో గుణాత్మక మార్పు తీసుకొచ్చేందుకే సీఎం కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్ ఏర్పాటుకు పూనుకున్నారు. ఈ ప్రయత్నంలో భాగంగానే ఇప్పటికే పలు రాష్ట్రాల్లో పర్యటించారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధిని చూసి దేశం విస్మయం చెందుతోంది. ప్రధాని మోదీతోపాటు సీఎంలు నవీన్ పట్నాయక్, మమతా బెనర్జీలు మన పథకాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. జాతీయ మీడియా కూడా కేసీఆర్ మోడల్‌పై దృష్టిసారించింది'అని ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ నాయకత్వాన్ని అన్ని రాష్ట్రాల సీఎంలు అనుసరించాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. ప్రజల సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే విధంగా కేసీఆర్ కృషి చేశారని ప్రశంసించారు. సంపద సృష్టించి, దాన్ని పేదలకు, రైతులకు పంచడమే కేసీఆర్ లక్ష్యమన్నారు. ఎవరెన్ని తిట్టినా, విపక్షాలన్నీ జతకూడినా, కొన్ని పత్రికలు కక్షగట్టి ఎన్ని రాతలు రాసినా, చంద్రబాబు నీచరాజకీయాలు చేసినా.. టీఆర్ఎస్‌కు ప్రజలు 88 సీట్లు కట్టబెట్టారన్నారు. వచ్చే ఏప్రిల్ నాటికి మిషన్ భగీరథ ద్వారా ప్రతి ఇంటికి నల్లా నీళ్లు వస్తాయన్నారు.

అందుకే మళ్లీ పట్టం: మండలిలో పల్లా



రాష్ట్రంలో నాలుగున్నరేళ్లలో సంక్షేమం, అభివృద్ధి జోడెడ్ల పాలనగా సాగింది కాబట్టే.. కేసీఆర్‌కు ప్రజలు మరోసారి పట్టంగట్టారని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్‌రెడ్డి పేర్కొన్నారు. మండలిలో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాద తీర్మానాన్ని పల్లా ప్రారంభించారు. ఆర్థిక క్రమశిక్షణతోపాటు అవినీతిరహిత పాలన కారణంగానే 88 సీట్లతో ప్రభంజనం సృష్టించామన్నారు. తెలంగాణ ఏర్పడే నాటికి ముందున్న పరిస్థితులు, సమస్యలను అధిగమించి రాష్ట్రాన్ని సంక్షేమబాటలో నిలిపేందుకు కేసీఆర్ చేసిన కృషిని దేశం ప్రశంసించిందని పల్లా చెప్పారు. కరెంట్ సంక్షోభం నుంచి గట్టెక్కి మిగులు విద్యుత్‌ను సాధించడం ఒక అద్భుతమైన విజయ గాథని ఆయన అన్నారు. తెలంగాణలో అమలుచేస్తున్న రైతుబంధు సహా పలు పథకాలను ఒడిశా, పశ్చిమ బెంగాల్ రాష్ట్రాలతోపాటు కేంద్రం కూడా అమల్లోకి తీసుకొచ్చే ఆలోచనలో ఉందన్నారు. ఇరిగేషన్ ప్రాజెక్టులు, ఇతర అంశాలపై కోర్టుల్లో కేసులు వేయడం మానుకోవాలని, ప్రభుత్వంపై అనవసర విమర్శలు చేయకుండా నిర్మాణాత్మక సూచనలతో బాధ్యతా యుతంగా వ్యవహరించాలని ఎమ్మెల్సీ బోడకుంటి వెంకటేశ్వర్లు విపక్షాలకు విజ్ఞప్తిచేశారు. 'నేను రాను బిడ్డో.. సర్కారు దవాఖానాకు'అనే పరిస్థితి నుంచి.. 'నేను వస్త బిడ్డో.. సర్కారు దవాఖానకు'అనేట్లుగా పరిస్థితి మారిందన్నారు.

రికార్డులు సవరించాలి: షబ్బీర్



ఒక్క కేసీఆర్ వల్లే తెలంగాణ వచ్చిందని గవర్నర్ చేసిన వ్యాఖ్యలు సవరించి.. 1969 నుంచి అమరుల త్యాగాలు, ప్రత్యేక రాష్ట్ర సాధనలో కాంగ్రెస్ కృషిని కూడా ప్రభుత్వం, గవర్నర్ రికార్డుల్లో చేర్చాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ షబ్బీర్ అలీ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం చేసే తప్పులను ఎత్తి చూపే బాధ్యత ప్రతిపక్షంగా తమపై ఉందన్నారు. ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు పెంపు, పీఆర్సీ అమలు, బయ్యారం స్టీల్‌ప్లాంట్‌పై స్పష్టతనివ్వడంతో పాటు, నిరుద్యోగ భృతి అమలు, పెంచిన పింఛన్లు, ఇతరత్రా కొత్త హామీలు ఎప్పటి నుంచి అమలుచేస్తారో ప్రభుత్వం వెల్లడించాలన్నారు. సంక్షేమ రంగానికి భారీగా నిధులు కేటాయిస్తున్నట్టు చూపుతున్నా.. వాటిలో 20% కూడా క్షేత్రస్థాయిలో ఖర్చు కావడం లేదన్నారు. బడ్జెట్‌లో మైనారిటీలకు 2వేల కోట్లు కేటాయిస్తే, రూ.989 కోట్లు మంజూరుచేసి.. ఖర్చుచేసింది రూ.509 కోట్లేననిచెప్పారు.

అభివృద్ధికి అద్దం పట్టింది: కొప్పుల



గవర్నర్ నరసింహన్ ప్రసంగం రాష్ట్రాభివృద్ధికి అద్దం పట్టిందని టీఆర్ఎస్ ఎమ్మెల్యే కొప్పుల ఈశ్వర్ అన్నారు. నాలుగున్నరేళ్లలో రాష్ట్రం ఎంతో పురోగతి సాధించిందన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసన సభలో చర్చను కొప్పుల ఈశ్వర్ ప్రారంభించారు. కొత్త రాష్ట్రమైనప్పటికీ సంక్షేమ పథకాల అమల్లో ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచామని చెప్పారు. సంక్షేమ ఫలాలు ప్రజలకు అందాయి కాబట్టే ప్రజలు మళ్లీ టీఆర్ఎస్‌కు పట్టంగట్టారన్నారు. రైతుబంధు పథకం దేశానికే ఆదర్శంగా నిలిచిందని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయినిగా నిలుస్తుందని కొప్పుల అన్నారు. కోటి ఎకరాలకు నీరందించే సంకల్పంతో సీఎం కేసీఆర్ ముందుకు సాగుతున్నారని.. రైతుల కష్టాలు తీర్చేందుకు ప్రభుత్వం అహర్నిశలు కృషి చేస్తుందని చెప్పారు. ఇది కేసీఆర్ పాలనాదక్షతకు నిదర్శనమన్నారు. కేసీఆర్‌ను తమ పెద్దకొడుకులా ప్రజలు ఆశీర్వదించారన్నారు. నాలుగు మెడికల్ కాలేజీలను త్వరలో తమ ప్రభుత్వం ప్రారంభించనుందని కొప్పుల చెప్పారు.

సొంతకాళ్లపై నిలబడేలా: రామచంద్రరావు



ఉత్పాదకత పెంచి ప్రజలు సొంత కాళ్లపై నిలబడేలా చేయూత నివ్వాలి గానీ.. వివిధ రూపాల్లో ప్రజలు ప్రభుత్వంపై ఆధారపడేలా చేయడం సరికాదని బీజేపీ ఎమ్మెల్సీ రామచంద్రరావు అన్నారు. వివిధ రంగాలకు సంబంధించి అది చేశాం, ఇది చేశాం అని గవర్నర్ చెప్పారని, అయితే నిజంగా ఆయా రంగాల్లో అంతగా అభివృద్ధి జరిగిందా అన్న సమీక్ష జరగాలన్నారు. విద్యారంగంలో రాష్ట్రం వెనుకబడి ఉందని రామచంద్రరావు పేర్కొన్నారు. డీఎస్సీ ద్వారా ఎంత మంది టీచర్లను భర్తీచేశారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వైద్య రంగంలో రాష్ట్రం సాధించాల్సింది ఎంతో ఉందన్నారు. కేంద్రం తీసుకొచ్చిన 'ఆయుష్మాన్ భారత్'పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఎందుకు నిర్లక్ష్యం చేస్తుందో చెప్పాలన్నారు. హైకోర్టు విభజన జరిగినందున జిల్లా కోర్టులు, వినియోగదారుల కోర్టులు నిర్మించాలని సూచించారు. జంట నగరాల్లో డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణం వేగం పెంచాలని ఎంఐఎం ఎమ్మెల్సీ సయ్యద్ అమీ నుల్ జాఫ్రీ కోరారు. వెనుకబడిన ముస్లిం వర్గాలకు 12%, ఎస్టీలకు 10% రిజర్వేషన్ల కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. కాంపన్సేటరీ పెన్షన్ స్కీమ్ విధానం రద్దుకు చర్యలు చేపట్టాలని ఎమ్మెల్సీ కాటేపల్లి జనార్దనరెడ్డి సూచించారు. కొత్త జోనల్ విధానం తెలంగాణలో నిరు ద్యోగుల పాలిట వరంగా మారిందన్నారు.

రాష్ట్ర ప్రయోజనాలే ప్రధానం

- ప్రతి ఎమ్మెల్యేకు మాట్లాడే అవకాశం
- గాడితప్పితే చర్యలు తప్పవు
- అసెంబ్లీ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి



అసెంబ్లీ కమిటీ హాల్లో మాట్లాడుతున్న స్పీకర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని శాసనసభలో ప్రతి ఎమ్మెల్యేకు తప్పకుండా మాట్లాడే అవకాశం ఉంటుందని శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. శాసనసభ నిబంధనలను అతిక్రమించి గాడితప్పి మాట్లాడిన వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. ఆదివారం అసెంబ్లీ కమిటీ హాల్‌లో స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి విలేకరులతో మాట్లాడారు. 'అసెంబ్లీ సభాపతిగా నన్ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సీఎం కేసీఆర్‌తోపాటు అన్ని పక్షాల నేతలకు ధన్యవాదాలు. రాష్ట్రంలో రెండోసారి ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ఎటువంటి అహంకారం లేదు. మరింత బాధ్యత పెరిగింది. సభలో రాష్ట్ర ప్రజలకు న్యాయం చేసేందుకు అన్ని రంగాలపై క్లుప్తంగా చర్చలు జరపాల్సిన అవసరం ఉంది. భవిష్యత్‌లో సభ్యులందరూ నాతో సహకరిస్తారని, హుందాగా వ్యవహరిస్తారని నాకు నమ్మకం ఉంది. కేసీఆర్ మంత్రివర్గంలో నేను వ్యవసాయ మంత్రిగా పనిచేశాను. ఇవాళ మన వ్యవసాయ రంగం దేశానికే ఆదర్శంగా నిలిచింది. మన రాష్ట్రంలో అమలు చేస్తున్న రైతుబంధు, రైతు బీమా, 24 గంటల కరెంట్ సరఫరా కార్యక్రమాలను చూసి దేశంలోని నేతలందరూ ఆశ్చర్యపోతున్నారు. తెలంగాణ శాసనసభను సైతం దేశానికి ఆదర్శంగా ఉండేలా నేను ప్రణాళికలతో ముందుకు వెళ్తాను. సంక్షేమ రంగంలో తెలంగాణ దేశంలో మొదటి స్థానంలో ఉంది. అదేవిధంగా శాసనసభ వ్యవహారాల్లోనూ మొదటి స్థానంలో ఉండేలా సభ్యులందరూ సహకరించాలి. గవర్నర్ ప్రసంగం రాష్ట్ర ప్రభుత్వ పాలనకు అద్దం పట్టేలా ఉంది. గవర్నర్ ప్రసంగంపై సభలో అన్ని పార్టీల నుంచి ఐదుగురు సభ్యులు మాట్లాడారు. అనంతరం ముఖ్యమంత్రి కేసీఆర్ మాట్లాడారు. ప్రతి ఎమ్మెల్యే సభను వినియోగించుకోవాలి. సభ నియమ, నిబంధనలపై కొత్త సభ్యులకు శిక్షణ తరగతులు ఉంటాయి. అవసరాన్ని బట్టి శాసనసభ పనిదినాలను నిర్వహిస్తాం. పార్టీ ఫిరాయింపు అంటే ఎమ్మెల్యేలు తమ సొంత ఇష్టంతో పార్టీ మారుతున్నారు. పార్టీల చేరికలపై తేడాలు ఉంటే చర్యలు తప్పవు. నియమ, నిబంధనలతో పనిచేసే వ్యక్తులకు ఏ పదవి అయినా బరువు కాదు. అసెంబ్లీ వ్యవహారాల శాఖ వెబ్‌సైట్‌ను మరింత ఆధునీకరణ చేస్తున్నాం. ఈ రోజుతో రెండో శాసనసభ సమావేశాలు ముగిశాయి. ఎన్నికల్లో గెలిచి అసెంబ్లీకి వచ్చిన ఎమ్మెల్యేలకు అభినందనలు. ఇవాళ సభలో నాకు వచ్చిన పదవి వారసత్వంగా వచ్చింది కాదు. తెలంగాణ శాసనసభ గౌరవాన్ని పెంచుతా'అని స్పీకర్ పోచారం అన్నారు.

ఫార్మల్ సభ... ఫార్మల్‌గానే జరిగింది

- వచ్చే సమావేశాల నుంచి ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తాం
- ఉత్తమ్‌తో సన్నిహిత సంబంధాలున్నాయి
- ఫిరాయింపులను సీఎం ప్రోత్సహిస్తారని అనుకోను
- మీడియాతో చిట్‌చాట్‌లో భట్టి



సాక్షి, హైదరాబాద్: కొత్తగా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఫార్మల్‌గా జరగాల్సిన అసెంబ్లీ సమావేశాలు ఫార్మల్‌గానే జరిగాయని ప్రతిపక్ష నేత మల్లు భట్టివిక్రమార్క అన్నారు. వచ్చే సమావేశాల నుంచి ప్రజాసమస్యలపై ప్రభుత్వాన్ని గట్టిగా నిలదీస్తామని ఆదివారం శాసనసభలోని తన చాంబర్‌లో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ భట్టి చెప్పారు. గత రెండేళ్లుగా ప్రజాసమస్యలపై రాష్ట్రంలో చర్చ జరగడం లేదని, బాధ్యతాయుత ప్రతిపక్షంగా రానున్న కాలంలో ప్రజాసమస్యలపై నిర్మాణాత్మకంగా పోరాడతామని అన్నారు. రూ. 2.5 లక్షల కోట్ల ఖర్చుతో కూడిన ప్రాజెక్టులకు తానే డిజైనర్ అని సీఎం అంటున్నారని, కేసీ ఆర్ సాంకేతికంగా అంత నిపుణుడు అయినప్పుడు ఇక ఇంజనీర్లు ఎందుకని ప్రశ్నించారు. గత సభలో ప్రతిపక్ష నేతగా పనిచేసిన జానారె డ్డిని కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నానని చెప్పారు. పీసీసీ చీఫ్ ఉత్తమ్‌తోకూడా తనకు సన్నిహిత సంబంధాలున్నాయన్నారు. సీఎం కేసీఆర్ పార్టీ ఫిరాయింపులను ప్రోత్సహిస్తారని తాను అనుకోవడం లేదని భట్టి అన్నారు.

ఎత్తిపొడవటం సరికాదు: భట్టి

వివిధ మాధ్యమాలు, ప్రజల ద్వారా తమ దృష్టికి వచ్చిన అంశాలను సభ్యులు లేవనెత్తితే సీఎం పదే పదే సభ్యుని పేరు పేర్కొంటూ ఎత్తిపొడవడం హుందాతనం అనిపించుకోదని సభలో భట్టి పేర్కొన్నారు. సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి లేవనెత్తిన అంశాలపై సీఎం కేసీఆర్ ఆయన పేరు ప్రస్తావించి మాట్లాడటంపై భట్టి విక్రమార్క పై విధంగా స్పందించారు. సీఎం కేసీఆర్ స్పందిస్తూ.. మాట్లాడుతూ ఉన్నది ఉన్నట్లు చెబితే జీర్ణించుకోకపోతే తామేం చేయలేమన్నారు.

పూర్తిస్థాయి మంత్రివర్గమేదీ?

- ఎన్నికల ఫలితాలు వచ్చి 40 రోజులైనా ఇదే పరిస్థితా?
- ముఖ్యమంత్రి తీరుపై అసెంబ్లీలో కాంగ్రెస్ సభ్యుడు గండ్ర విమర్శ



సాక్షి, హైదరాబాద్: ఎన్నికల ఫలితాలు వచ్చి 40 రోజులు గడిచినా రాష్ట్రంలో పూర్తి స్థాయిలో మంత్రివర్గాన్ని ఎందుకు ఏర్పాటు చేయలేదని కాంగ్రెస్ ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి నిలదీశారు. ఆదివారం శాసనసభలో గవర్నర్ ప్రసంగంపై ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. 'మొత్తం 90 మంది సభ్యులున్నారు... కానీ సీఎం, హోంమంత్రితోనే పాలన సాగిస్తున్నారు. ప్రభుత్వమంటే సమష్టి నిర్ణయమని చట్టం చెబుతోంది. పంచాయతీ ఎన్నికలు జరుగుతున్నాయి, నెల రోజుల్లో పార్లమెంటు ఎన్నికల షెడ్యూల్ వచ్చే అవకాశముంది...ఆ తర్వాత మున్సిపల్, జెడ్పీ ఎన్నికలూ జరిగే అవకాశముంది... ఇలా ఎన్నికల కోడ్‌తో అనేక కార్యకలాపాలు నిలచిపోయే ప్రమాదముంది. మంత్రివర్గ విస్తరణ జరగకపోవడంతో పాలన కుంటుపడే పరిస్థితి ఉంది' అని గండ్ర ఆందో ళన వ్యక్తం చేశారు. ఇక గవర్నర్ ప్రసంగం ఎన్నికల్లో కేసీఆర్ ప్రసంగాన్ని తలపించిందని ఆయన ఎద్దేవా చేశారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లపై స్పష్టత లేదన్నారు. ఆరోగ్యశ్రీని అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రవేశపెడితే, అందులోనుంచి కొన్ని వ్యాధులను తొలగించారని తెలిసిందన్నారు. 108 వాహనాలకు డీజిల్ పోయలేని పరిస్థితి నెలకొందన్నారు.

బాబు పప్పులుడకలేదు: అబ్దుల్లా బలాల



రాష్ట్రంలో ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో సాఫీగా జరిగాయని ఎంఐఎం సభ్యుడు అబుల్లా బలాల అన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షు డు అమిత్‌షా, ప్రధాని నరేంద్ర మోదీలు వచ్చి నా బీజేపీ ఎన్నికల్లో గట్టెక్కలేక నామరూపాలు లేకుండా పోయిందన్నారు. ఏపీని వదిలి ఇక్క డకువచ్చి ప్రచారం చేసిన అక్కడి సీఎం చంద్ర బాబుకు ప్రజలు గట్టి బుద్ధి చెప్పారన్నారు. ఏఐసీసీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ వచ్చి ప్రచా రం చేసినా కేసీఆర్‌ను ఏమీ చేయలేకపోయారన్నారు. కేసీఆర్ ఫెడరల్ ఫ్రంట్‌కు ఎంఐఎం సంపూర్ణ మద్దతు ఇస్తుందన్నారు. గవర్నర్ ప్రసంగంలో ప్రస్తావించిన అంశాలు రాష్ట్రాభివృద్ధిని తెలియజేశాయన్నారు. ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లు కల్పించడంలో కేసీఆర్ కృషిచేయాలని బలాల కోరారు.

భట్టికి సీఎం అభినందన

- అసెంబ్లీలో విక్రమార్క సీటు వద్దకు వెళ్లి అభినందించిన సీఎం కేసీఆర్
- ప్రతిపక్ష నాయకునిగా గుర్తిస్తున్నట్లు ప్రకటించిన స్పీకర్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ (సీఎల్పీ) నేతగా ఎంపికైన మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్కను ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రత్యేకంగా అభినందించారు. ఆదివారం శాసనసభ ప్రారంభమైన వెంటనే మల్లు భట్టి విక్రమార్క కూర్చున్న సీటు వద్దకు ముఖ్యమంత్రి కేసీఆర్ వెళ్లి కరచాలనం చేసి అభినందనలు తెలిపారు. భట్టిని ప్రతిపక్ష నేతగా శాసనసభ స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ ను ప్రధాన ప్రతిపక్షంగా గుర్తిస్తున్నట్లు వెల్లడించారు. ఆయన బాగా పని చేయాలని కోరుకుంటున్నానన్నారు. గవర్నర్ ప్రసంగం సమయంలో సభ గౌరవంగా, హుందాగా కొనసాగిందన్నారు. చాలా మంది అభినందనలు తెలియజేశారన్నారు. విమర్శలు చేయడం, పేపర్లు చించి వేయడం లేదన్నారు. ఈ సంప్రదాయాన్ని కొనసాగించాలన్నారు. అంతకుముందు టీడీపీకి చెందిన సండ్ర వెంకటవీరయ్య ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశారు.

నాలుగు రోజులు.. నాలుగు ఘట్టాలు

- సభ్యుల ప్రమాణం, స్పీకర్ ఎన్నిక, గవర్నర్ ప్రసంగం, ప్రతిపక్షనేత ఎంపికతో సరి
- అక్బరుద్దీన్, జాఫర్ మినహా 118 మంది సభ్యుల ప్రమాణం
- అసెంబ్లీ ముందుకు పంచాయతీరాజ్ ఆర్డినెన్స్
- రాష్ట్ర భవిష్యత్ ప్రణాళికను చెప్పిన ముఖ్యమంత్రి కేసీఆర్



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రెండో శాసన సభ తొలి సమావేశాలు ఆదివారంతో ముగిశాయి. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి శాసనసభను, చైర్మన్ వి.స్వామిగౌడ్ శాసనమండలిని నిరవధిక వాయిదా వేస్తున్నట్లు ఆదివారం సభలలో ప్రకటించారు. నాలుగు రోజులపాటు జరిగిన ఈ అసెంబ్లీ సమావేశాల్లో నాలుగు ప్రధాన ఘట్టాలు ముగిశాయి. కొత్తగా అసెంబ్లీకి ఎన్నికై న 120 మంది (నామినేటెడ్ ఎమ్మెల్యేతో సహా) సభ్యుల్లో మొత్తం 118 మంది సభ్యులు ఈ సమావేశాల్లో ప్రమాణ స్వీకారం చేశారు. దీంతోపాటు అసెంబ్లీ కొత్త స్పీకర్‌గా టీఆర్ఎస్ సీనియర్ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డిని సభ ఏకగ్రీవంగా ఎన్నుకుంది. కొత్త శాసనసభ కొలువుదీరినప్పుడు ఉభయసభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించే ఘట్టం కూడా ఈ సమావేశాల్లోనే పూర్తైంది. ఈనెల 19న ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ ప్రసంగించగా, చివరిరోజు రెండు సభలు ఆయన ప్రసంగానికి ధన్యవాదాలు తెలుపుతూ తీర్మానాలు ఆమోదించడంతో నాలుగు రోజుల సభలు నిరవధికంగా ముగిశాయి. ఈ సమావేశాల్లోనే ప్రతిపక్ష నేత ఎంపిక కూడా పూర్తైంది. కాంగ్రెస్ పక్షాన ఆ పార్టీ సీనియర్ ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క ప్రతిపక్ష నేతగా ఎంపికయ్యారు. ఆయన ఎంపికను అసెంబ్లీ స్పీకర్ కూడా గుర్తించడంతో ఇక నుంచి భట్టి ప్రతిపక్ష నేతగా పనిచేయనున్నారు.

భవిష్యత్తుపై ఆశలు

తొలి అసెంబ్లీ సమావేశాలే అయినా రాష్ట్ర భవిష్యత్తును నిర్దేశించే రీతిలో జరిగాయి. ముఖ్యంగా గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై సభలో సమాధానమిచ్చిన సీఎం కేసీఆర్ తన ప్రసంగంలో రానున్న ఐదేళ్లలో రాష్ట్ర భవిష్యత్తును ఆవిష్కరించారు. కచ్చితంగా రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తామని చెప్పిన కేసీఆర్ గ్రామస్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు రూపొందిస్తామని, పంచాయతీరాజ్ చట్టాన్ని అమలుపరుస్తామని వెల్లడించారు. తమ ప్రభుత్వానికి సాగునీటి అంశమే ప్రధానమని, రానున్న మూడేళ్లలో 1.25 కోట్ల ఎకరాలకు సాగునీరు అందించేలా రూ.1.17 లక్షల కోట్లు ఖర్చు పెట్టబోతున్నామని వెల్లడించారు. రెండో ప్రాధాన్యంగా రోడ్ల అంశాన్ని చేపడతామని, రాష్ట్రంలోని అన్ని గ్రామపంచాయతీలను బీటీరోడ్లతో అనుసంధానం చేస్తామన్నారు. దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలో ప్రారంభించిన ఆరోగ్యశ్రీ పథకాన్ని కొనియాడారు. వైఎస్ ప్రవేశపెట్టిన ఆరోగ్యశ్రీ కేంద్రం చేపట్టిన ఆయుష్మాన్‌భారత్ కంటే మెరుగైనదని ప్రశంసించిన ఆయన రానున్న కాలంలో ఆరోగ్యశ్రీని పటిష్టంగా అమలు చేస్తామని ప్రకటించారు. రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి రక్త పరీక్షలు చేస్తామని చెప్పారు. ఏ పార్టీ నుంచి గెలిచారన్న దానితో సంబంధంతో లేకుండా రాష్ట్రంలోని అన్ని నియోజకవర్గాల్లో ప్రాధాన్యతల వారీగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందడమే ధ్యేయంగా పనిచేస్తామని కేసీఆర్ చెప్పారు.

ఇవీ శాసన సభ, మండలి గణాంకాలు

అసెంబ్లీ జరిగిన రోజులు: 4
పనిగంటలు: 9గంటల 28 నిమిషాలు
మాట్లాడిన సభ్యుల సంఖ్య: 5
శాసన మండలి జరిగిన రోజులు: 1
పని గంటలు: 4 గంటల 54 నిమిషాలు
మాట్లాడిన సభ్యుల సంఖ్య: 18

కొడంగల్ ఎమ్మెల్యేకు సీఎం శుభాకాంక్షలు

కొడంగల్ శాసనసభ్యుడు పట్నం నరేందర్‌రెడ్డికి ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం పుట్టిన రోజు కావడంతో నరేందర్‌రెడ్డి సీఎం కేసీఆర్ దగ్గరకు వెళ్లి ఆశీర్వాదం తీసుకున్నారు. ఆయనకు శాసనసభలో పలువురు ఎమ్మెల్యేలు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.

సీఎంను కలసిన గుండు సుధారాణి...

వరంగల్ మహానగరపాలక సంస్థ (జీడబ్ల్యూఎంసీ) మేయర్ పదవిని తన కోడలు అశ్రితారెడ్డికి ఇవ్వాలని టీఆర్ఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు గుండు సుధారాణి సీఎం కేసీఆర్‌ను కోరారు. సుధారాణి ఆదివారం అసెంబ్లీలో సీఎం కేసీఆర్‌ను కలసి ఈ మేరకు విజ్ఞప్తి చేశారు. శాసనసభ వాయిదా పడిన అనంతరం సుధారాణి, ఆమె కోడలు అశ్రితారెడ్డి టీఆర్ఎస్ శాసనసభాపక్ష కార్యాలయంలో టీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్‌ను కలసి మేయర్ పదవికి తమ పేరును పరిశీలించాలని కోరారు.

ఒక రోజు మండలి

ఈసారి సమావేశాల షెడ్యూల్‌లో భాగంగా మండలి కూడా ఒక రోజు నడిచింది. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపేందుకు సమావేశమైన మండలి సభ్యులు ధన్యవాదాల తీర్మానంపై చర్చించి ఆమోదం తెలిపారు. దీంతో పాటు ఇటీవల పంచాయతీరాజ్ చట్టంలో మార్పులు చేస్తూ ప్రభుత్వం చేసిన ఆర్డినెన్స్‌ను బిల్లు రూపంలో ఆమోదానికి గాను ఈ సమావేశాల్లోనే ఉభయసభల్లో ప్రభుత్వం ప్రవేశపెట్టింది. కాగా, ఎంఐఎం సభ్యులు అక్బరుద్దీన్, జాఫర్‌లు మినహా అందరూ ఈ సమావేశాల్లో ప్రమాణం చేశారు. మంత్రివర్గ విస్తరణ లేకపోవడంతో ముఖ్యమంత్రితో పాటు హోంమంత్రి మహమూద్‌అలీలతోనే నాలుగు రోజుల సభాకార్యకలాపాలు నడిచాయి.

చండీయాగంలో పాలుపంచుకోండి

ప్రజాప్రతినిధులకు అందిన ఆహ్వానం

సాక్షి, హైదరాబాద్: సోమవారం నుంచి సీఎం కేసీఆర్ ఎర్రవెల్లి వ్యవసాయ క్షేత్రంలో నిర్వహిస్తోన్న సహస్ర చండీయాగానికి ప్రజాప్రతినిధులందరికీ ఆహ్వానం అందింది. ఉదయం 11గంటల నుంచి ప్రారంభమయ్యే ఈ యాగానికి రాష్ట్రానికి చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జడ్పీచైర్మన్లందరూ ఆహ్వానితులేనని సీఎంవో వర్గాలు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపాయి. మాడుగుల మాణిక్య సోమయాజులు, నరేంద్రకాపే, ఫణిశశాంక శర్మ, భద్రకాళి వేణు తదితర వేద పండితుల ఆధ్వర్యంలో ఈ యాగం జరుగుతుందని, ఐదు రోజుల పాటు జరగనున్న ఈ యాగంలో ముఖ్యమంత్రి దంపతులు పాల్గొంటారని, ముందుగా గోపూజ చేసిన తర్వాత యాగం ప్రారంభమవుతుందని వెల్లడించాయి. యాగంలో 300 మంది రుత్వికులు పాల్గొంటారని, మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, మహారాష్ట్రలకు చెందిన రుత్వికులు యాగం నిర్వహిస్తాయని తెలిపాయి.

గద్దర్‌కు ఈశ్వరీబాయి అవార్డు



సాక్షి, హైదరాబాద్: ఈశ్వరీబాయి మెమోరియల్ ట్రస్ట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఈశ్వరీబాయి శతజయంతి ఉత్సవాలు ఈ నెల 23న నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా ఈశ్వరీబాయి మెమోరియల్ శతజయంతి అవార్డు (ఈశ్వరీ బాయి మెమోరియల్ సెంటినరీ అవార్డు) ను ప్రజా గాయకుడు గద్దర్‌కు ప్రదానం చేయనున్నామని చెప్పారు. ఈ కార్యక్రమం రవీంద్ర భారతిలో సాయంత్రం 5 గంటలకు జరుగుతుందని పేర్కొన్నారు.

శాసనమండలి నిరవధిక వాయిదా

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఉభయసభల్లో గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై శాసనమండలి ఆదివారం సమావేశమైంది. ఒక్కరోజు జరిగిన సభలో 4.54గంటల పాటు గవర్నర్ ప్రసంగంలోకి అంశాలపై 18మంది సభ్యులు చర్చలో పాల్గొన్నట్టు మండలి చైర్మన్ స్వామిగౌడ్ ప్రకటించారు. టీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరిన ముగ్గురు ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, భూపతిరెడ్డి, రాములునాయక్‌పై అనర్హత వేటు వేసినట్టు చైర్మన్ తెలిపారు.

గవర్నర్ ప్రసంగంపై సభ్యుల చర్చ...



సహకరిస్తాం.. కానీ: పొంగులేటి

టీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తు న్న మంచి పనులకు, అభివృద్ధికి తాము సహకరిస్తామని, కానీ గవర్నర్ ప్రసంగంలో కొన్ని అర్ధసత్యాలు, కొన్ని అసత్యాలున్నాయని, వాటిపై వివరణ ఇవ్వాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు.

'గాడిలో పడ్డ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ'



రాష్ట్ర ఏర్పాటు తర్వాత కేసీఆర్ సీఎంగా రావడంతో గ్రామీణ ప్రాంతాల్లో అన్ని కులాల్లో ఆర్థిక వ్యవస్థ గాడిలో పడిందని టీఆర్ఎస్ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణ్ రావు అభిప్రాయపడ్డారు. రాష్ట్ర వ్యాప్తంగా చేసిన సమగ్ర సర్వేతో ఏ కులాలకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందించాలన్న దానిపై అధ్యయనం చేసి పథకాలు రూపొందించారన్నారు.

'సమస్యలు తొలగిపోయాయి'




రాష్ట్ర ఏర్పాటు జరిగితే తెలంగాణ అంధకారంలో మగ్గిపోతుందన్న ఉమ్మడి రాష్ట్ర మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి వ్యాఖ్యల్ని పటాపంచలు చేయడంలో కేసీఆర్ కృషి ఎనలేనిదని ఎమ్మెల్సీలు సలీం, ఎంఎస్ ప్రభాకర్ అన్నారు. తెలంగాణ నీళ్ల, నిధులు, నియామకాల్లో 60 ఏళ్ల సమస్యలన్నీ నాలుగున్నరేళ్లలో తొలగిపోయాయన్నారు.

'వ్యవసాయరంగంలో ఎనలేని అభివృద్ధి'




రాష్ట్రంలో వ్యవసాయ రంగాన్ని ఎనలేని అభివృ ద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడంలో టీఆర్ఎస్ సర్కార్, సీఎం కేసీఆర్ సఫలీకృతమయ్యారని ఎమ్మెల్సీలు గంగాధర్‌గౌడ్, కృష్ణారెడ్డి ప్రశంసించారు. కేసీఆర్ రాష్ట్రాన్ని రైతుబంధు, రైతుబీమా తో దేశానికే రోల్ మోడల్‌గా తీర్చిదిద్దారన్నారు.

'రైతులు వైఎస్, కేసీఆర్‌లను నమ్మారు'



రైతులు నమ్మిన నేతలే ప్రభుత్వాలను ఏర్పాటుచేస్తారని ఎమ్మెల్సీ ఫరీద్దుదీన్ అన్నారు. రైతులకు ఉచిత కరెంట్ ఇస్తామని హామీ ఇచ్చిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి, రైతులకు 24గంటల ఉచిత కరెంట్, రైతు బీమా, రైతు బంధు పథకాలిచ్చిన కేసీఆర్‌లు విజయం సాధించడమే దీనికి నిదర్శనమన్నారు.

'సుదీర్ఘ ఆలోచన కేసీఆర్‌కే సాధ్యం...'




రైతులకు సీఎం కేసీఆర్ సంక్షేమాన్ని అందిస్తున్నారని ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. అందులో ఒకటి దీర్ఘకాలిక ప్రణాళిక ద్వారా సాగునీటి ప్రాజెక్టులతో నీళ్లందించడం, రెండోది తక్షణసాయం కింద రైతుబీమా, రైతు బంధుతో పాటు విత్తనాలు, ఎరువులివ్వడం చేస్తున్నారన్నారు. మైనారిటీలకు ఏ రాష్ట్రంలో లేని తీరుగా సంక్షేమ పథకాలను కేసీఆర్ అమలుచేస్తున్నారని ఎమ్మెల్సీ రాజేశ్వర్‌రావు అన్నారు.

గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు



రాష్ట్ర అభివృద్ధి పథంలో పయనిస్తోందని, అందుకు కేసీఆర్, టీఆర్ఎస్ సర్కార్ చేస్తున్న కృషే నిదర్శనమని హోంమంత్రి మహమూద్ అలీ అన్నారు. గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చించిన సభ్యులు, వారు లేవనెత్తిన అంశాలపై ఆయన సమాధానాలు చెప్పారు. కాగా, గవర్నర్ ప్రసంగానికి ధన్యవాదాల తీర్మానాన్ని పల్లారాజేశ్వర్‌రెడ్డి ప్రాతిపాదించగా, సభ ఆమోదిస్తున్నట్లు స్వామిగౌడ్ తెలిపారు. మండలిని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్టు వెల్లడించారు.

'కేంద్ర నిధులపై శ్వేతపత్రం విడుదల చేయాలి'



సాక్షి, హైదరాబాద్: కేంద్రం ఇచ్చిన నిధులపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.లక్ష్మణ్ ఆదివారం డిమాండ్ చేశారు. కేంద్రంపై సీఎం నిందలు మోపడం మానుకోవాలని హితవు పలికారు. సీఎం కేసీఆర్ తన మాటలతో శాసనసభ, ప్రజలను తప్పుదారి పట్టించారన్నారు. కేంద్రం నిధులిచ్చినా ఖర్చుపెట్టలేని దీన స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందన్నారు. కేంద్రం తెచ్చిన ఆయుష్మాన్ భవ పథకాన్ని రాష్ట్రం ఎందుకు అమలు చేయడం లేదో చెప్పాలన్నారు. రాష్ట్ర బీజేపీ నాయకత్వం కేంద్రాన్ని కోరడం వల్లే భువనగిరిలో ఏయిమ్స్ ఏర్పాటయిందన్నారు. రాష్ట్రంలో గిరిజన వర్సిటీ ఏర్పాటు చేసిన కేంద్రంపై నిందలు మోపడం మానుకోవాలన్నారు. కాళేశ్వరం, సీతారామ ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు అనతికాలంలోనే ఇచ్చిన విషయం సీఎం మర్చిపోయారా అని ప్రశ్నించారు. దేశానికి స్వతంత్రం వచ్చినప్పటి నుంచి ఏ ప్రభుత్వం తెలంగాణకు ఎన్ని నిధులు ఇచ్చింది, గత ఐదు సంవత్సరాల్లో మోదీ ఎన్ని నిధులు ఇచ్చారో చర్చకు రావాలని అని సవాల్ చేశారు. పదేళ్ల యూపీఏ హయాంలో తెలంగాణకు దాదాపు 16 వేల కోట్లు ఇస్తే, నరేంద్ర మోదీ ప్రభుత్వం ఒక లక్ష 15 వేల కోట్ల రూపాయలు నిధులు కేటాయించిన విషయం వాస్తవం కాదా అని ప్రశ్నించారు. తిన్న ఇంటి వాసాలు లెక్కపెట్టిన చందంగా టీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ వ్యవహారం ఉందని పేర్కొన్నారు.



సోమవారం నిర్వహించనున్న చండీయాగానికి సర్వాంగసుందరంగా సిద్ధమైన యాగశాలలు

నేటి నుంచి సహస్ర చండీయాగం

కేసీఆర్ ఫాంహౌస్‌లో భారీగా ఏర్పాట్లు

గజ్వేల్/జగదేవ్‌పూర్: రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, సంక్షేమ పథకాలు నిరాటంకంగా కొనసాగి బంగారు తెలంగాణ కల సాకారం కావాలని ఆకాంక్షిస్తూ సీఎం కేసీఆర్ నేటినుంచి మహారుద్ర సహస్ర చండీయాగం చేయనున్నారు. శృంగేరి పీఠాధిపతి భారతీతీర్థ స్వామి ఆశీస్సులతో.. సిద్దిపేట జిల్లా ఎర్రవల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్‌లో ఐదురోజుల పాటు ఈ యాగాన్ని నిర్వహించనున్నారు. ఈ ఐదురోజుల్లో చతుర్వేద, పురస్సర, మహారుద్ర సహస్ర చండీయాగాలు చేస్తారు. మొదటిరోజు ఈ యాగంలో సీఎం కేసీఆర్ దంపతులు పాల్గొననున్నారు. ఉదయం గణపతి పూజ అనంతరం పుణ్యాహవచనం, రుత్వికహవనం, యాగశాల ప్రవేశం, గోపూజ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం వరకు పూజలు కొనసాగుతాయి. తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7:30 గంటల వరకు వివిధ కార్యక్రమాలు జరగనున్నాయి. ఈ యాగాన్ని, పూజ కార్యక్రమాలను మాణిక్య శర్మ, సోమయాజులు, నరేంద్ర కాప్రేలతో పాటు శృంగేరీ పీఠం పండితులు ఫణిశశాంక శర్మ, గోపికృష్ణ శర్మ, పురాణం మహేశ్వర శర్మలు పర్యవేక్షించనున్నారు. తొలిరోజు మధ్యాహ్నం వరకు వివిధ రకాల పూజ కార్యక్రమాలు చేయనున్నారు. మూడు యాగశాలల్లో 27 హోమ గుండాల వద్ద 300 మంది రుత్వికులు పూజల్లో పాల్గొననున్నారు. అపారమైన దైవభక్తి ఉన్న కేసీఆర్ యజ్ఞాలు, సంఖ్యాశాస్త్రాలను బాగా విశ్వసిస్తారన్న సంగతి తెలిసిందే. తొలి తెలంగాణ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత రాష్ట్ర ప్రజానీకం బాగుండాలని కోరుతూ ఆయుత చండీయాగం నిర్వహించారు. రాష్ట్ర ప్రజల శేయస్సు కోరుతూ గతేడాది నవంబర్‌లో రాజశ్యామల యాగాన్ని నిర్వహించారు.

ఏకోత్తర వృద్ధితో పారాయణం

యాగశాలకు నాలుగు దిక్కులా నాలుగు వేదాలు రక్షణగా ఉండాలనే సంకల్పంతో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తూర్పు దిక్కున రుగ్వేదం, దక్షిణ దిక్కున యజుర్వేదం, పశ్చిమ దిక్కున సామవేదం, ఉత్తరాన అధర్వన వేదపారాయణం నిర్వహిస్తారు. ఒక్కో హోమగుండం వద్ద ఎనిమిది మంది రుత్వికులు వేద పారాయణం చేస్తారు. ఐదు రోజులు సాగే ఈ యాగంలో ఏకోత్తర వృద్ధి పద్ధతిలో పారాయణం నిర్వహిస్తారు. మొదటి రోజు వంద పారాయణాలు, రెండో రోజు రెండొందల పారాయణాలు... ఇలా పెంచుతూ మొత్తంగా వెయ్యి పారాయణాలుగా సహస్రం పూర్తవుతాయి. ఇందుకోసం పది హోమ గుండాలు, ఒక్కో దాని వద్ద పది మంది చొప్పున పాయసం ద్రవ్యంతో హోమం చేస్తారు. యాగంలో చండీతో పాటు అనుబంధ యాగాలు కూడా నిర్వహించనున్నారు. అనుబంధ యాగాలను 100 మంది రుత్వికులు పర్యవేక్షిస్తారు. మహారుద్రం, రాజశ్యామల, పీతాంబరీదేవి, అనుష్ఠానం, సూర్యయాగం, నవగ్రహ యాగం, సూర్య అనుష్ఠాలు, వాస్తు, గణపతి వంటి అనుబంధ యాగాలు నిర్వహించనున్నారు. మహారుద్రం, భగలాముఖి నవగ్రహ, చతుర్వేద పారాయణం వంటివి పూజా కార్యక్రమాల్లో భాగంగా ఉంటాయి. అనుబంధ యాగాలు నిర్వహించడానికి వేరుగా యాగశాలను ఏర్పాటు చేశారు.



పనులను పరిశీలించిన కేసీఆర్



యాగం ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీఎం కేసీఆర్, ఇతర ఉన్నతాధికారులు

సోమవారం నుంచి తన ఫాంహౌస్‌లో ప్రారంభమయ్యే మహారుద్ర సహస్ర చండీయాగం పనులను ఆదివారం సాయంత్రం సీఎం కేసీఆర్ పర్యవేక్షించారు. హైదరాబాద్ నుంచి రాగానే ఫాంహౌస్‌లో ఏర్పాటైన యాగశాలలన్నింటి వద్దకు చేరుకున్నారు. అలాగే హోమగుండాల వద్ద జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. యాగశాలలను అందంగా తీర్చిదిద్దడంపై సీఎం సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. ఆయన వెంట ఎంపీ జోగినపల్లి సంతోష్‌కుమార్, సీఎం రాజకీయ సలహాదారు శేరి సుభాష్‌రెడ్డి తదితరులు ఉన్నారు. కాగా, యాగానికి రాజకీయ, ఆధ్యాత్మిక ప్రముఖులు పలువురు పెద్దసంఖ్యలో హాజరు కానున్నట్టు తెలిసింది. ఈ మహాక్రతువు కోసం 10రోజులుగా యాగశాలలు సిద్ధం చేస్తున్నారు. మూడు చోట్ల యాగశాలలను తీరొక్క పూలతో అందంగా ముస్తాబు చేశారు. పక్కన వివిధ రకాల పూలకుండీలను పెట్టారు. అలాగే రాత్రి వేళల్లో యాగశాలలు మిరుమిట్లు గొలిపేలా రంగురంగుల విద్యుద్దీపాలను అలంకరించారు.

సకల సౌకర్యాలు.. పటిష్ట భద్రత

యాగం నిర్వహించడానికి వచ్చే రుత్వికులకు సకల సౌకర్యాలు ఏర్పాటు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి 300 మంది రుత్వికులు యాగంలో పాల్గొననున్నారు. వారంతా శని, ఆదివారాల్లో ఫాంహౌస్‌కు చేరుకున్నారు. వారికి సరిపడే గదులు, ఇతర వసతులు కల్పించారు. కర్ణాటక రాష్ట్రం నుంచి కొంతమంది రుత్వికులు వచ్చారు. సంప్రదాయం ప్రకారం ఎర్రవల్లి గ్రామ పూజారులు, మండలానికి చెందిన పండితులు కూడా ఫాంహౌస్‌కు చేరుకున్నారు. ఐదు రోజుల పాటు యాగంలో ఈ రుత్వికులు అందరూ పాల్గొంటారు. ఈ యాగం నేపథ్యంలో ఎర్రవల్లిలోని గ్రామదేవతలకు ఆదివారం రాత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పోచమ్మ, గడిమైసమ్మ, బొడ్రాయి, మహంకాళమ్మ, హనుమాన్ ఆలయాల వద్ద ఈ పూజలు జరిగాయి. గ్రామస్తులు ఈ పూజల్లో పాల్గొన్నారు. యాగానికి సీఎంతో పాటు ప్రముఖులు వస్తున్నందున.. వ్యవసాయ క్షేత్రం చుట్టూ పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు. సిద్దిపేట జిల్లా పోలీస్ కమిషనర్ జోయల్ డేవిస్ ఆధ్వర్యంలో ఈ ఏర్పాట్లు జరిగాయి. ఇద్దరు ఏసీపీలు, నలుగురు సీఐలు, 15 మంది ఎస్‌ఐలను బందోబస్తు విధుల్లో నిమగ్నం కానున్నారు. మహారుద్ర సహస్ర చండీయాగానికి సీనియర్ జర్నలిస్టు స్వామి గౌరీశంకర్.. హరిద్వార్ నుంచి తీసుకొచ్చిన గంగాజలాన్ని అందించారు.

రూ.66 లక్షల విలువైన బంగారం పట్టివేత

- విమాన సర్వీసుల మార్పిడిని తమకు అనుకూలంగా మార్చుకున్న స్మగ్లర్లు
- 1.9 కేజీల బంగారం స్వాధీనం, లోతుగా విచారిస్తున్న అధికారులు



శంషాబాద్ ఎయిర్ పోర్టులో స్మగ్లర్ నుంచి అధికారులు స్వాధీనం చేసుకున్న బంగారం

సాక్షి, హైదరాబాద్/శంషాబాద్: విదేశాల నుంచి అంతర్జాతీయ సర్వీసుగా వచ్చి.. దేశంలోకి ప్రవేశించాక దేశీయ సర్వీసులుగా మారే విమానాలను ఎంచుకొని సాగుతున్న బంగారం అక్రమ రవాణా వ్యవహారం వెలుగు చూసింది. హైదరాబాద్‌లోని శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు ఆదివారం తెల్లవారుజామున ఓ వ్యక్తిని పట్టుకుని రూ.66 లక్షల విలువైన 1.99 కేజీల బంగారం స్వాధీనం చేసుకున్నారు. స్మగ్లింగ్‌కు పాల్పడిన కేరళ వాసిని అదుపులోకి తీసుకున్న డీఆర్ఐ విభాగం దీని వెనుక ఉన్న ముఠా కోసం విచారిస్తోంది. దుబాయ్, మస్కట్, సౌదీ అరేబియా తదితర దేశాల నుంచి భారత్‌లోకి ప్రవేశించే వరకు అంతర్జాతీయ సర్వీసుగా ఉండే విమానాలు దేశంలో డొమెస్టిక్‌గా మారతాయి. వీటి ఆసరాగా ఈ అక్రమ రవాణా సాగుతోంది.

పట్టుబడింది ఇలా...

మధ్యప్రదేశ్ రాజధాని ఇండోర్ నుంచి ఇండిగో సంస్థకు చెందిన 6ఈ–648 విమానం ఆదివారం తెల్లవారుజామున శంషాబాద్ ఎయిర్‌పోర్టుకి వచ్చింది. అందులో హైదరాబాద్‌కు వచ్చిన ఓ కేరళ వాసి స్మగ్లింగ్ చేస్తున్నట్లు డీఆర్ఐకు సమాచారం అందింది. దీంతో కాపుకాసిన అధికారులు అతనిని పట్టుకొని 4 బంగారం బిస్కెట్లను స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.66.27 లక్షలు ఉంటుందని అధికారులు ప్రకటించారు. అతను ప్రయాణించిన విమానం షార్జా నుంచి కేరళలోని త్రివేండ్రానికి అంతర్జాతీయ సర్వీసుగా నడుస్తోంది. ఆపై దేశీయ సర్వీసుగా మారి మధ్యప్రదేశ్ రాజధాని ఇండోర్‌కు వెళ్తుంది. అక్కడ నుంచి హైదరాబాద్‌కు వస్తుంది. ఇలా సూత్రధారుల ఆదేశాల ప్రకారం షార్జా నుంచి బంగారాన్ని తీసుకువచ్చిన వారు దాన్ని ఆ విమానం బాత్‌రూమ్స్‌లోని రహస్య ప్రదేశాల్లో దాచి దేశంలోకి ప్రవేశించగానే దాన్ని వదిలేసి తనిఖీల్లో చిక్కకుండా దిగి వెళ్లిపోతారు. ఆపై అదే విమానంలో వారికి చెందిన వ్యక్తి ప్రయాణించేలా చేసి టాయ్‌లెట్స్‌లో ఉన్న బంగారం తీసుకుంటారు. ఆపై గమ్యస్థానం చేరగానే కస్టమ్స్ తనిఖీలు లేకుండా బయటకు వచ్చేస్తాడు. ఈ తరహాలోనే ప్రస్తుతం పట్టుబడిన కేరళ వాసి ఇండోర్ నుంచి హైదరాబాద్‌కు ప్రయాణించాడు. ఈ స్మగ్లర్‌కు పేరు మార్చి, బోగస్ ఆధార్‌కార్డు సృష్టించి సూత్రధారులు ఇచ్చారు.

నాలుగు రోజుల క్రితం ఢిల్లీలో...

ఇలాంటి వ్యవహారమే కిందటి గురువారం తెల్లవారుజామున ఢిల్లీలోని ఇందిరాగాంధీ ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్‌లో వెలుగులోకి వచ్చింది. దుబాయ్ నుంచి ఇంటర్నేషనల్ సర్వీసుగా బెంగళూరు వరకు వచ్చి ఆపై కొలంబియా వెళ్లి చెన్నైకు తిరిగి వచ్చి డొమెస్టిక్ సర్వీస్‌గా ఆ విమానం మారింది. ఇందులోని టాయిలెట్స్‌లోని అద్దాల వెనుక స్మగ్లర్లు రూ.60 లక్షల విలువైన 30 బంగారం కడ్డీలను అమర్చారు. ఇది జనవరి 13న చెన్నై నుంచి పుణేకు వెళ్లింది. ఆ తర్వాత పుణే–చెన్నై, చెన్నై–హైదరాబాద్, హైదరాబాద్–రాయ్‌పూర్ తదితర మార్గాల్లో దేశీయంగా తిరిగింది. అయినా విమానంలోని బంగారాన్ని ఎవరూ గుర్తించలేదు. చివరకు గురువారం తెల్లవారుజామున ఢిల్లీ చేరుకున్నప్పుడు దీనిపై అక్కడి కస్టమ్స్ అధికారులకు సమాచారం అందడంతో వారు తనిఖీలు చేసి బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ రెండు స్మగ్లింగ్ల వెనుక ఒకే సూత్రధారులు ఉన్నారా? అనే కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు.

'కుప్టీ'కి లైన్‌క్లియర్..

- రిజర్వాయర్ పనులకు టెండర్లు పిలవాలని సీఎం ఆదేశం
- వారం రోజుల్లో టెండర్లు

సాక్షి, హైదరాబాద్: కడెం నదీ జలాల సంపూర్ణ వినియోగం, కుంటాల జలపాతానికి సమృద్ధి జలాల లభ్యత లక్ష్యంగా చేపట్టనున్న కుప్టీ రిజర్వాయర్ పనులకు లైన్‌క్లియర్ అయింది. కొత్త పనులను ఇప్పట్లో ఆరంభించరాదని నిర్ణయం తీసుకున్న ప్రభుత్వం కుప్టీకి మాత్రం మినహాయింపునిచ్చింది. ఈ రిజర్వాయర్ పనులను వెంటనే ఆరంభించేలా టెండర్ల ప్రక్రియ మొదలు పెట్టాలని ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు అధికారులను ఆదేశించారు. వాస్తవానికి గోదావరి ఉపనది అయిన కడెంపై ఇప్పటికే కడెం ప్రాజెక్టు నిర్మించినా దీని నుంచి ఆశించిన నీటి వినియోగం జరగడం లేదు. కడెం ప్రాజెక్టుకు 13.42 టీఎంసీల నీటి కేటాయింపులు ఉండగా 7.2 టీఎంసీల సామర్థ్యంతో ప్రాజెక్టును చేపట్టారు. ఇందులో 4 టీఎంసీలే వాడుకుంటుండగా మిగతా 3 టీఎంసీలు డెడ్ స్టోరేజీగా ఉంది. ఆ 4 టీఎంసీలతో 68,150 ఎకరాలకు నీరివ్వాలనే లక్ష్యం ఉన్నా ఆశించిన మేర అందడం లేదు. అదీగాక వరద ఉన్న ఒక్క సీజన్‌లోనే పంటలకు నీరందుతోంది. మరోవైపు మొత్తం కేటాయింపుల్లో 6.22 టీఎంసీల నీటి వినియోగమే లేదు. ఈ నేపథ్యంలో కుప్టీ రిజర్వాయర్ నిర్మించాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఆదిలాబాద్ జిల్లాలో నేరడిగొండ, ఇచ్చోడ మండలాల పరిధిలో కొండల మధ్య ప్రవహించే కడెం నదికి అడ్డుకట్ట వేస్తూ ఆనకట్ట నిర్మిస్తే 6.22 టీఎంసీల నీటిని వినియోగంలోకి తీసుకురావచ్చని తొలుత అంచనా వేసింది. దీనిపై సర్వే నిర్వహించగా 5.32 టీఎంసీలతో ప్రాజెక్టు నిర్మించవచ్చని తేలింది. దీనికి రూ. 744 కోట్ల వ్యయం అవుతుందని అంచనా వేసింది. ఈ పనులకు సాంకేతిక అనుమతులు వచ్చినా ఇటీవల కొత్త పనులను ఆరంభించరాదని, ఈ దృష్ట్యా టెండర్లు ఆపాలని సీఎం నిర్ణయించారు.

నెల రోజుల్లో పనులు ఆరంభం

ఆదిలాబాద్ జిల్లాకు చెందిన నేతలు కుప్టీని చేపట్టాలని ప్రజల నుంచి డిమాండ్ వస్తోందని సీఎం దృష్టికి తీసుకెళ్లారు. దీనికి అంగీకరించిన ముఖ్యమంత్రి కుప్టీ పనులకు వారం రోజుల్లో టెండర్లు పిలవాలని, నెల రోజుల్లో పనులు ఆరంభించాలని ఆదేశించారు. దీంతో అధికారులు కార్యరంగంలోకి దిగారు. కుప్టీని కడెం ప్రాజెక్టుకు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌గా వాడుకుంటూ బోథ్ నియోజకవర్గంలో 30 వేల ఎకరాలకు నీరిచ్చే అవకాశం సైతం ఉండగా, కాల్వల నిర్మాణంపై మళ్లీ నిర్ణయం తీసుకోనున్నారు.

మాటలకే పరిమితం చేయొద్దు

- మహిళా సాధికారతపై గవర్నర్ నరసింహన్ వ్యాఖ్య
- రాజేంద్రసింగ్‌కు జాగృతి లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డు ప్రదానం
- ముగిసిన తెలంగాణ జాగృతి ఇంటర్నేషనల్ యూత్ లీడర్‌షిప్ సదస్సు



తెలంగాణ జాగృతి యూత్ లీడర్‌షిప్ సదస్సుకు హాజరైన గవర్నర్ నరసింహన్. చిత్రంలో వాటర్‌మెన్ రాజేంద్ర సింగ్, ఎంపీ కవిత, రెజ్లర్ బబితా, మలావత్ పూర్ణ

సాక్షి, హైదరాబాద్: మహిళాసాధికారతను మాటలకే పరిమితం చేయకుండా ఆచరించి చూపాలని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ అన్నారు. మహిళలపై హింస, వివక్ష లేకుండా చూడాలని, వారి భద్రత, సౌకర్యాలకు పెద్ద పీట వేయాలని సూచించారు. యువశక్తిలోనూ మహిళాశక్తి అంతర్భాగమని గుర్తించాలన్నారు. ఆదివారం ఇక్కడ హైటెక్స్‌లో జరిగిన తెలంగాణ జాగృతి ఇంటర్నేషనల్ యూత్ లీడర్‌షిప్ సదస్సు ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాత్ముడు ప్రవచించిన అహింస, సహనం, ప్రేమ, శాంతి వంటి మహోన్నత లక్ష్యాలను స్ఫూర్తిగా తీసుకొని అన్ని రంగాల్లో యువత పురోగమించాలని ఆకాంక్షించారు. పర్యావరణ పరిరక్షణ, సహజవనరుల సంరక్షణ, మహిళలను గౌరవించడం వంటి అంశాలకు పెద్దపీట వేయాలని సూచించారు. యువతలో చైతన్యం తీసుకొచ్చేందుకు తెలంగాణ జాగృతి మూడురోజులపాటు నిర్వహించిన ఈ కార్యక్రమం అద్భుతమన్నారు. సాంకేతికాభివృద్ధిని సమాజహితం కోసమే వాడాలని, కంప్యూటర్లు, స్మార్ట్‌ఫోన్లతో కాలక్షేపం చేయకుండా వ్యక్తిగత, సమాజ హితం కోసం పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

వాతావరణ మార్పులపై అప్రమత్తత అవసరం

రామన్‌మెగసెసే అవార్డు గ్రహీత రాజేంద్ర సింగ్ మాట్లాడుతూ గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పుల పట్ల అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత ఐదేళ్లుగా తాను 40 దేశాల్లో జలసంరక్షణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. జాగృతి అధ్యక్ష19 వేలమందికిపైగా యువతకు వృత్తివిద్యలో శిక్షణనివ్వడంతోపాటు వారిలో 15 వేలమందికి ఉద్యోగ అవకాశాలు కల్పించామన్నారు. ఈ సందర్భంగా ప్రముఖ రెజ్లర్ బబితా పోగట్, ఎవరెస్ట్‌ను అధిరోహించిన మలావత్ పూర్ణలకు గవర్నర్ అవార్డులను ప్రదానం చేశారు. సామాజిక సేవారంగంలో విశిష్ట సేవలందించిన వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్‌కు జాగృతి జీవితకాల సాఫల్య పురస్కారం ప్రదానం చేశారు.

భౌతిక అక్షరాస్యత పెంపొందించండి!

ఎన్ని అడ్డంకులు ఎదురైనా నిర్దేశించుకున్న లక్ష్యాన్ని సాధించాలన్న దృఢ సంకల్పం, క్రమశిక్షణ యువత విజయతీరాలకు చేరేందుకు తారకమంత్రాలని అంతర్జాతీయ క్రీడాకారులు అన్నారు. ఆదివారం ఇక్కడ 'రెజిలియన్స్ ఫర్ యూత్ డెవలప్‌మెంట్: సక్సెస్ అండ్ బియాండ్ 'పేరుతో ఓ చర్చాగోష్టి జరిగింది.ఈ గోష్టికి అఫ్గానిస్తాన్‌కు చెందిన నీలమ్ భక్తియార్ సమన్వయకర్తగా వ్యవహరించారు. గోపీచంద్ మాట్లాడుతూ ఈ కాలం పిల్లలకు అ, ఆ లు వస్తున్నా మన శరీర కదలికలపై అవగాహన లేకుండాపోతోందని, ఈ భౌతిక అక్షరాస్యత కల్పించడం ప్రస్తుత పరిస్థితుల్లో ఎంతైనా అవసరమన్నారు. కొన్నేళ్ల క్రితం తాను ఒక 13 ఏళ్ల బాలికకు కోచింగ్ ఇస్తుండగా చేతులతో షటిల్ ఎలా పట్టుకోవాలో నేర్పించాలని ఆ బాలిక అడగడం తనలో ఎన్నో ఆలోచనలకు నాంది అయిందని చెప్పారు. క్రీడాభివృద్ధికి ప్రభుత్వాలు ఏం చేయాలన్న ఎంపీ కవిత ప్రశ్నకు గోపీచంద్ సమాధానమిస్తూ ఇప్పటికిప్పుడు క్రీడల, కళల అభివృద్ధికి పెట్టుబడులు పెట్టకపోతే సమీప భవిష్యత్తులోనే ఆసుపత్రులు, వైద్య పరిశోధనలపై ఎన్నోరెట్లు ఎక్కువ నిధులు ఖర్చుపెట్టాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.


నేనెవరికీ తీసిపోను: మలావత్ పూర్ణ

ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించే క్రమంలో మూడో బేస్ క్యాంపు వద్ద బోలెడన్ని శవాలు కనిపించినా, తనపై తనకు నమ్మకం సడలలేదని, శిక్షణలో భాగంగా నేర్పించిన ''నేను ఎవరికీ తీసిపోను.. ఏదైనా సాధించగలను''అన్న నినాదాన్ని గుర్తు చేసుకుంటూ లక్ష్యాన్ని సాధించానని పూర్ణ ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. డిగ్రీ చదువుతున్న తాను సివిల్ సర్వీసెస్‌లో చేరాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నట్లు తెలిపారు.

వందరెట్లు ఎక్కువ కష్టపడ్డాం: బబిత

రెజ్లింగ్ శిక్షణ విషయంలో దంగల్ సినిమాలో చూపింది చాలా తక్కువని, వాస్తవానికి తమ తండ్రి ఇంతకు వందరెట్లు ఎక్కువ శ్రమ పెట్టారని రెజ్లర్ బబితా పొగట్ తెలిపారు. ఆడపిల్లలను సుకుమారంగా పెంచడం, నియంత్రణ పెట్టడం సరికాదని, ఏ పనైనా చేయగలరన్న నమ్మకంతో ప్రోత్సహిస్తే విజయం కచ్చితంగా లభిస్తుందనేందుకు తమ తల్లిదండ్రుల పెంపకమే నిదర్శనమని ఆమె వివరించారు.

సాక్షి
సాహిత్యం



నల్లగొండ| సోమవారం
జనవరి | 21 | 2019
మెయిల్: sakshisahityam@gmail.com

గ్రహం అనుగ్రహం

శ్రీ విళంబినామ సంవత్సరం. ఉత్తరాయణం, హేమంత ఋతువు. పుష్యమాసం. తిథి పౌర్ణమి ఉ.11.45 వరకు, తదుపరి బ.పాడ్యమి. నక్షత్రం పునర్వసు ఉ.6.13 వరకు, తదుపరి పుష్యమి తె.4.43 వరకు (తెల్లవారితే మంగళవారం). వర్జ్యం ప.1.43 నుంచి 3.12 వరకు. దుర్ముహూర్తం ప.12.33 నుంచి 1.20 వరకు, తదుపరి ప.2.46 నుంచి 3.33 వరకు. అమృత ఘడియలు ..రా.10.40 నుంచి 11.54 వరకు

సూర్యోదయం : 6.39 సూర్యాస్తమయం : 5.44
రాహుకాలం : ఉ.7.30 నుంచి 9.00 వరకు
యమగండం : ఉ.10.30 నుంచి 12.00 వరకు

నమాజ్ వేళలు
ఫజర్ : 5.34 · జొహర్ : 12.27 · అసర్ : 4.29 · మగ్రీబ్ : 6.05 · ఇషా : 7.21

ఈవారం పుస్తకాలు

ఏనుగుల వీరాస్వామి కాశీయాత్ర



సంపాదకత్వం– సరళీకరణ: ఎం.ఆదినారాయణ; పేజీలు: 304; వెల: 250; ప్రచురణ: బాటసారి బుక్స్; సంపాదకుడి చిరునామా: జోడుగుళ్లపాలెం, 1–55, విశాలాక్షి నగర్ దగ్గర, విశాఖపట్నం–530043. ఫోన్: 9849883570

వాన వెలిశాక (కవిత్వం)



రచన: కృష్ణ బిక్కి; పేజీలు: 144; వెల: 140; ప్రతులకు: బిక్కి నాగలక్ష్మి, డోర్ నం. 867/5, బ్లాక్ నం. 5, ప్లాట్ నం. 5, ఎంఐజి–2, సుందరయ్య పార్క్ దగ్గర, స్ట్రీట్–15, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్–44. ఫోన్: 8374439053

గీతోపదేశం (కథలు)



రచన: డి.కామేశ్వరి; పేజీలు: 220; వెల: 150; ప్రతులకు: రచయిత్రి, బ్లాక్ 7, జలవాయు టవర్స్, లోయర్ ట్యాంక్‌బండ్ రోడ్, హైదరాబాద్–80. ఫోన్: 040–27642486

నిదురించే తోటలోకి (నవల)



రచన: మన్నెం శారద; పేజీలు: 296; వెల: 150; రచయిత చిరునామా: ఫ్లాట్ నం. 504, ఐదో అంతస్తు, సాయి తేజ టవర్స్, ఆరో ఫేజ్, జేఎన్‌టీయూ వెనుక, కేపీహెచ్‌బీ కాలనీ, హైదరాబాద్–72. ప్రతులకు: 8096310140

ద షాడో అండ్ అదర్ స్టోరీస్



తెలుగు మూలం: సి.సుజాత; ఆంగ్లానువాదం: లక్ష్మి హరిబండి; పేజీలు: 80; వెల: 50; ప్రచురణ: రచయిత్రి, ఫోన్: 9948960009; ప్రతులకు: సాహితి ప్రచురణలు, 32–22–2, చంద్రం బిల్డింగ్స్, సి.ఆర్.రోడ్, చుట్టుగుంట, విజయవాడ–4. ఫోన్: 0866–2436642

తెలంగాణ మహనీయులు



రచన: నాగబాల సురేశ్ కుమార్; పేజీలు: 212; వెల: 150; ప్రతులకు: రచయిత, ఎస్‌ఆర్‌టీ–66, శ్రీ నిలయం, సనత్‌నగర్, హైదరాబాద్–18. ఫోన్: 7093093299



కథాసారం

మందడుగు



జూన్ 27. వాతావరణం తేటగా, పొడిగా ఉంది. పదింటి ప్రాంతంలో గ్రామస్థులు పోస్టాఫీసుకూ బ్యాంకుకూ మధ్యనున్న స్థలంలో గుమిగూడసాగారు. వేరే పట్టణాల్లో అయితే ఈ లాటరీ తీయడానికి కనీసం రెండు రోజులు పడుతుంది. అందుకే వ్యవహారం జూన్ 20 కల్లా మొదలైపోతుంది. ఈ గ్రామంలో మహా అయితే ఉన్నది మూడువందల మంది. రెండు గంటల్లోపే లాటరీ తీయడం అయిపోతుంది. పదింటికి మొదలుపెట్టినా మధ్యాహ్న భోజనానికి ఎవరిళ్లకు వాళ్లు వెళ్లిపోవచ్చు.

సహజంగానే పిల్లలు ముందు పోగయ్యారు. ఈమధ్యే వారికి ఎండాకాలం సెలవులు ప్రకటించారు. ఆ స్వేచ్ఛ వారిని నిలువనీయడం లేదు. బాబీ మార్టిన్ అప్పుడే జేబుల్లో రాళ్లను నింపేసుకున్నాడు. మిగిలినవాళ్లు కూడా వాడిని అనుసరిస్తూ గుండ్రటి, నున్నటి రాళ్లను ఏరుతున్నారు. బాబీ, హారీ జోన్స్, డికీ డెలాక్రాయ్ ఒక మూలన రాళ్లు పోగేసి, వాటిని ఎవరూ ఎత్తుకుపోకుండా ఓ కన్నేసి ఉంచారు. ఆడపిల్లలు మరో పక్కన నిల్చుని మాట్లాడుతున్నారు.

తర్వాత మగవాళ్లు రావడం మొదలైంది. పిల్లల్ని ఓ కంట గమనిస్తూ విత్తనాలు, వానలు, ట్రాక్టర్లు, పన్నుల గురించి సంభాషిస్తున్నారు. అనంతరం వెలిసిపోయిన బట్టల్లో గృహిణులు వచ్చారు. ఒకరినొకరు పలకరించుకుని, తమ భర్తల వెనకాల వెళ్లి నిలుచుండి, పిల్లల్ని కేకేశారు. నాలుగైదు సార్లు పిలిచాకగానీ వాళ్లు తల్లుల దగ్గరికి రాలేదు.

గ్రామంలో ఆటపాటలు నిర్వహించినట్టుగానే ఈ లాటరీ బాధ్యతను కూడా మిస్టర్ సమ్మర్స్ చూసుకుంటాడు. ఆయన బ్లూ జీన్స్, తెల్ల చొక్కా వేసుకున్నాడు. బొగ్గు వ్యాపారంలో ఉన్నాడు. పిల్లలు లేరు. సమయాన్నీ శక్తినీ వెచ్చించే వెసులుబాటు ఆయనకు ఉంది. ఆయన చేతిలోని నల్లటి చెక్కపెట్టెను చూడగానే గ్రామస్తుల్లో గుసగుసలు మొదలైనాయి. సమ్మర్స్ వెనకాలే పోస్ట్‌మాస్టర్ మిస్టర్ గ్రేవ్స్ ముక్కాలి స్టూల్‌ను తెచ్చి వేయగానే దానిమీద చెక్కపెట్టెను ఉంచాడు సమ్మర్స్. ఎవరైనా సాయం చేయమని సమ్మర్స్ అనగానే మార్టిన్, ఆయన పెద్దకొడుకు బాక్స్‌టర్ వెళ్లి కదలకుండా స్టూలును పట్టుకున్నారు. లోపలి చీటీలను సమ్మర్స్ కలియబెట్టాడు.

లాటరీకి సంబంధించిన అసలైన సరంజామా ఎప్పుడో పోయింది. ఈ నల్లపెట్టె కూడా ఊరిలోని కురువృద్ధుడు వార్నర్ పుట్టకముందునుంచీ ఉంటున్నది. ఇంకో కొత్తపెట్టె చేయించడం గురించి సమ్మర్స్ చాలాసార్లు గ్రామస్తులతో తలపోశాడు. కానీ సంప్రదాయానికి ప్రాతినిధ్యంగా ఉన్న ఈ నల్లపెట్టెని మార్చడానికి ఎవరూ సిద్ధంగా లేరు. ఊళ్లో చెప్పుకునే కథ ఏమిటంటే, ఈ పెట్టె తయారీలో దీనికి పూర్వం వాడుకలో ఉన్న పెట్టెలోని కొన్ని చెక్కలను కలిపారు; ఆ పాతపెట్టెను గ్రామంలో తొలిగా స్థిరపడిన పెద్దలు నిర్మించారు. కాలక్రమంలో ఆచారంలోని చాలా భాగం మరిచిపోవడమో వదిలివేయడమో జరిగింది.

తరాలుగా వాడుకలో ఉన్న చెక్క పలకల స్థానంలో కాగితాలను ప్రవేశపెట్టడంలో మాత్రం సమ్మర్స్ విజయవంతం అయ్యాడు. జనాభా తక్కువున్నప్పుడు ఆ చెక్క పలకలను నల్లపెట్టెలో వేయడం సులభమయ్యింది. జనం పెరిగాక ఆ పెట్టెలో సులభంగా పట్టేవి కావాలని ఆయన వాదించాడు. లాటరీకి ముందురోజు రాత్రి సమ్మర్స్, గ్రేవ్స్ ఇద్దరూ ఈ చీటీలు సిద్ధం చేసి పెట్టెలో వేసి, తెల్లారి ఇక్కడికి తెచ్చేదాకా సమ్మర్స్ బొగ్గు కంపెనీలో నిలిపి తాళం వేసి ఉంచుతారు. మిగిలిన ఏడాదంతా పెట్టె ఎక్కడో దగ్గర పడివుంటుంది.

ఈ లాటరీ ప్రారంభించడానికి ముందు బానే హడావుడి జరుగుతుంది. ముందు వంశ పెద్దల జాబితా సిద్ధం చేయాలి, తర్వాత కుటుంబ పెద్దల జాబితా, ఆటుపై కుటుంబంలోని సభ్యుల జాబితా. ఈ లాటరీ నిర్వహణ బాధ్యతను సమ్మర్స్‌కు అప్పగిస్తున్నట్టు గ్రేవ్స్ ప్రమాణ స్వీకారం చేయిస్తాడు. ఈ సందర్భానికి తగిన పాటేదో ఉండేది.

సహజంగానే పిల్లలు ముందు పోగయ్యారు. ఈమధ్యే వారికి ఎండాకాలం సెలవులు ప్రకటించారు. ఆ స్వేచ్ఛ వారిని నిలువనీయడం లేదు. బాబీ మార్టిన్ అప్పుడే జేబుల్లో రాళ్లను నింపేసుకున్నాడు. మిగిలిన వాళ్లు కూడా వాడిని అనుసరిస్తూ గుండ్రటి, నున్నటి రాళ్లను ఏరుతున్నారు.

ఇంతలో హడావుడి పడుతూ శ్రీమతి హచిన్‌సన్ పరుగెత్తుకొచ్చింది. శ్రీమతి డెలాక్రాయ్‌తో 'మా ఆయన కట్టెల కోసం పోయాడేమో అనుకున్నా, తీరా కిటికీలోంచి చూస్తే పిల్లలూ లేరు, అప్పుడు గుర్తొచ్చింది ఇవ్వాళ ఇరవై ఏడని, వెంటనే పరుగెత్తుకొచ్చాను' అంది. నువ్వు సమయానికే వచ్చావని శ్రీమతి డెలాక్రాయ్ సమాధానమిచ్చింది.

అందరూ ఉన్నట్టేనా? అని సమ్మర్స్ అడిగాడు. జనం 'డన్‌బార్. డన్‌బార్' అని అరిచారు. 'అవును గదా, క్లైడ్ డన్‌బార్ కాలు విరిగింది. ఆయన బదులుగా ఎవరు చీటీ తీస్తారు?'

నేను తీస్తానంటూ ఒక మహిళ జవాబిచ్చింది. భర్తకు బదులుగా భార్య, ఇంట్లో వయసుకొచ్చిన మగపిల్లలు లేరా జేనీ? అని సమ్మర్స్ అడిగాడు. ఈ విషయం ఊరందరికీ తెలిసినా లాటరీ పెద్దగా ఈ ప్రశ్నలు వేయడం ఆనవాయితీ. హొరేస్ ఉన్నాడు గానీ ఇంకా పదహారేళ్లు నిండలేదని పశ్చాత్తాపంగా జవాబిచ్చింది శ్రీమతి డన్‌బార్.

'వాట్సన్ బాయ్ ఈసారి కూడా తీస్తున్నాడా?'

అవును, మా అమ్మా నా తరపున నేను తీస్తానంటూ గుంపులోంచి ఓ పొడుగాటి యువకుడు చేయెత్తాడు. అందివచ్చిన కొడుకు ఉన్నాడని గుంపులోని కొన్ని గొంతులు మాట్లాడుకున్నాయి.

'ఇప్పుడు నేను ముందుగా వంశపెద్దల పేర్లను పిలుస్తాను, ఒక్కొక్కరూ వచ్చి పెట్టెలోని చీటీ తీసుకోండి. ప్రతి ఒక్కరూ తీసుకునేదాకా మడత విప్పకూడదు. సరేనా?' అని ప్రశ్నించాడు సమ్మర్స్.

ప్రతిసారీ జరిగే తంతే కాబట్టి, సగం సగం విన్నారు జనం. 'ఆడమ్స్'. గుంపులోంచి ఒక మనిషి ముందుకు వెళ్లాడు. 'హాయ్ స్టీవ్' అని పలకరించాడు సమ్మర్స్. 'హాయ్ జో' అని బదులిచ్చాడు ఆడమ్స్. తర్వాత పెట్టెదగ్గరికి వెళ్లి, ఒక చీటీ తీసుకుని తన స్థానంలోకి వచ్చి నిలుచున్నాడు.

'ఆల్లెన్'.

'ఆండర్‌సన్'.

'బెంథామ్'.

మిస్టర్ గ్రేవ్స్ కూడా చీటీ తీసుకున్నాడు. సమ్మర్స్ తన పేరు తానే పిలుచుకుని తనూ ఓ చీటీ తీసుకున్నాడు. అందరూ అయ్యాక, తమ చేతిల్లో ఉన్న చీటీలను తెరిచి చూసుకున్నారు. వెంటనే జనంలో కోలాహలం మొదలైంది. 'ఎవరు?' 'ఎవరికొచ్చింది?' 'హచిన్‌సన్' 'బిల్ హచిన్‌సన్‌కు వచ్చింది.' తండ్రికి విషయం చెప్పిరమ్మని పెద్దకొడుకును ఇంటికి పరుగెత్తించింది శ్రీమతి డన్‌బార్.

హచిన్‌సన్ ఎక్కడున్నాడని జనం వెతికారు. బిల్ హచిన్‌సన్ తన కాగితం చూసుకుంటూ మౌనంగా నిలుచున్నాడు. వెంటనే బిగ్గరగా టెస్సీ హచిన్‌సన్ అరవసాగింది. 'సమ్మర్స్, ఆయనకు కావాల్సిన కాగితాన్ని తీసుకునే సమయం నువ్వు ఇవ్వలేదు, నేను చూశాను, ఇదేం బాగాలేదు'.

'నోర్మూసుకో టెస్సీ' అని బిల్ హచిన్‌సన్ అన్నాడు.



షిర్లీ జాక్సన్

అమెరికన్ రచయిత్రి షిర్లీ జాక్సన్ (1916–1965) కథ 'ద లాటరీ' కి సంక్షిప్త రూపం ఇది. 1948 లో 'న్యూయార్కర్' లో దీన్ని ప్రచురించినప్పుడు వేలాది మంది పాఠకులు తిట్టిపోస్తూ ఉత్తరాలు రాశారు. ఆ పత్రిక చరిత్రలోనే ఇంత స్పందన మరే కథకూ రాలేదు. అయితే, మూక మనస్తత్వాన్నీ, హేతువిరుద్ధంగా ఆచారాలను పాటించే తీరునూ శక్తిమంతమైన సంకేతాలతో చిత్రించిన కథగా విమర్శకులు దీన్ని తర్వాత ప్రశంసించారు. దీని సంక్షిప్తం: సాక్షి సాహిత్యం డెస్క్.

'బిల్, నువ్వు హచిన్‌సన్ వంశానికి చీటీ తీశావు. హచిన్‌సన్ వంశంలో ఎన్ని కుటుంబాలున్నాయి?'

కూతుళ్లు డాన్, ఈవా పేర్లు చెబుతుంది టెస్సీ. వాళ్లను వాళ్ల భర్తల కుటుంబాలతో లెక్కిస్తారు, అది నీకూ తెలుసని జవాబిస్తాడు సమ్మర్స్. తర్వాతి చీటీ, కుటుంబ పెద్ద ఎవరో తెలియడం కోసం తీస్తారు. హచిన్‌సన్ ఇంట్లో పెళ్లయినవాళ్లుపోగా బిల్ జూనియర్, నాన్సీ, డేవ్ ఉన్నారు. అంటే వంశ పెద్దగానూ, కుటుంబపెద్దగానూ రెండింటికీ బిల్ హచిన్‌సన్ చీటీ తీసినట్టు! ఒకేసారి రెండు రౌండ్లు ముగిసినట్టు. ఇక మూడో రౌండులో బిల్, టెస్సీతో కలిపి ఈ ఐదుగురి పేర్లను రాసిన చీటీలను తీయాలి. అయితే డేవ్ పసివాడు కాబట్టి వాడి చీటి విషయంలో సాయపడవలిసిందిగా హారీని కోరాడు సమ్మర్స్. అప్పటికీ టెస్సీ ఇది అన్యాయమని అరుస్తూనేవుంది. మళ్లీ మొదలు పెడదామని డిమాండు చేస్తూనేవుంది. ఆమె మాటల్ని ఎవరూ ఖాతరు చేయలేదు.

ఐదుగురూ ఒక్కొక్కరూ వచ్చి చీటీలను తీసుకున్నారు. డేవ్‌కు హారీ సాయపడ్డాడు. నాన్సీకి రాకూడదని ఆమె స్నేహితురాలు కోరుకుంది. ఐదుగురూ తీసుకున్నాక, చీటీలను తెరిచారు. ఎత్తిపట్టి జనానికి చూపించారు. ఖాళీ. బిల్ నీది? అదీ ఖాళీ. టెస్సీ నీది? టెస్సీ చూపించలేదు. బిల్ భార్యను కొప్పడి, బలవంతంగా తెరిచాడు. నల్లమచ్చ! టెస్సీ చేతికి వచ్చిన కాగితంలో నల్లమచ్చ. జనంలో కదలిక మొదలైంది.

'జనులారా, త్వరగా ముగించేద్దాం' అన్నాడు సమ్మర్స్.

పెద్దరాయిని రెండు చేతులతో ఎత్తింది శ్రీమతి డెలాక్రాయ్. పిల్లలు అప్పటికే సిద్ధంగా ఉన్నారు. ఎవరో డేవ్ చేతికి కూడా కొన్ని గులకరాళ్లు ఇచ్చారు. వార్నర్ ఉత్తేజపరుస్తున్నాడు. ఆడమ్స్, గ్రేవ్స్ కూడా రెడీ.


టెస్సీ హచిన్‌సన్ జనం మధ్యలో నిలబడి వుంది. పక్కనుంచి మొదటి రాయి వచ్చి ఆమె తలకు తగిలింది.

కొత్త బంగారం

ఒక ఒంటరి జీవితగంధం

'ఫ్రెంచ్ స్త్రీ రాబోయే ముందు, నేను సాధించవలసిన పనులు ఎన్నో ఉన్నాయి,' అంటూ ప్రారంభమయ్యే 'ఫ్రెంచ్ పెర్‌ఫ్యూమ్' నవల్లో, అలీ జర్జర్ ఏనాటి నుండో తన మూత్రకోశాన్ని అదుపులో ఉంచుకుని, తన్ని తాను దృఢపరచుకున్న వ్యక్తి. దగ్గు రాకుండా, తన ఊపిరితిత్తులని నిరోధించగలుగుతాడు. తన జ్ఞాపకాల చిత్తభ్రమని నిర్దేశించగలిగేవాడు. అతని ఉనికే స్వీయ నియంత్రణతో ముడిపడి ఉంటుంది. పేదవారికి టీ అమ్మే స్థానిక స్త్రీల, పనికత్తెల, వలసదారులైన స్త్రీల ముందే అస్తమానం వేళ్లాడుతుంటాడు. అతను విడిచిపెట్టిన ఆడవాళ్ళు, 'ఒక వెచ్చని కలని చుట్టుకొని, సంతోషకరమైన జీవితం గురించి కలలు కనే వారు'. 'ఘాలిబ్' (ఉనికిలో లేనిది) అన్న తన 'ఊరి గోడల మీదుండే బీటల్లా వారు ఉపేక్షింపదగ్గవారు' అన్నది అతని అభిప్రాయం. 'నిశ్శబ్దంగా, మృదువుగా తెరుచుకునే తలుపులని ఎవరూ గౌరవించరు' అంటాడు.

అందమైన ఫ్రెంచ్ యువతైన కాతియా, జింబాబ్వేలో నర్స్‌గా పని చేస్తుంటుంది. ఒక విదేశీ మందుల కంపెనీ, నకిలీ మందులను ఆఫ్రికా ఎగుమతి చేస్తోందని యాదృచ్ఛికంగా కనుక్కుంటుంది. ఆ తరువాత, అంతర్జాతీయ కీర్తి పొంది, ఆఫ్రికా ఖండం యొక్క ప్రచార పర్యటన మొదలుపెడుతుంది. ఆమె సూడాన్‌లో ఉన్న ఘాయిబ్‌కు రావలసి ఉన్నప్పుడు, ఆమెకు తగిన వసతి అవీ ఏర్పాటు చేయాల్సిన బాధ్యత రిటైర్ అయిన అలీ జర్జర్ మీద పడుతుంది. అలీ– పుష్టిగా ఉంటాడు. బట్టతల ఉన్న బ్రహ్మచారి. నెట్లో చూసిన పట్ల వ్యామోహం పెంచుకుని, ఆమెను ట్రాల్ చేయడం ప్రారంభిస్తాడు. ఆమెని కలుసుకుని, పెళ్ళి చేసుకుంటానన్న భ్రమలో





అమీర్ తాగ్ ఎల్సిర్

మునిగి ఉంటాడు. కాతియా రాక ఆలస్యం అవుతూ ఉండగా, ఆమెకి ఇష్టమైన నీలం రంగు తన ఇంటి లోపలా, బయటా వేయిస్తాడు. ఇంటర్నెట్ నుండి డౌన్‌లోడ్ చేసుకున్న ఆమె ఫొటోలను ప్రింట్ చేసి, ఆమె స్వాగతం కోసం అందిన డబ్బుని తన పెళ్ళికొడుకు వేషం కోసం ఖర్చు పెట్టి, కాతియా ఫొటోలతో పెళ్ళి చేసుకుంటాడు. ఫొటోషాప్ చేసిన ఆ ఫొటోలను ఊళ్ళో తిప్పి, ఆమెను తన భార్యగా అందరికీ పరిచయం చేస్తాడు. ఆమె గర్భిణి అయిందన్న చాటింపు వేస్తాడు.

ఒంటరితనం అతన్ని పూర్తిగా పిచ్చివాడిని చేసినప్పుడు– కాతియా వ్యభిచరించి తన్ని మోసం చేసిందని నిరూపించడానికి, తన యవ్వనంలో చూసిన సినిమా సీన్ అభినయించి అందరికీ చూపుతాడు. అసూయతో, వీధిలో ఒక 'మగ భూతాన్ని' వంటింటి కత్తితో హత్య చేస్తాడు. కాతియా ఫొటోని అదే కత్తితో పొడిచి, అరెస్ట్ అవతాడు. అతన్ని జైలుకి తీసుకు వెళ్తుండగా కాతియా కారు దిగుతుంది.

'ఎవరినీ పెళ్ళి చేసుకోకపోవడం కన్నా ఒక ఆడ భూతంతో సహవాసం పెంచుకోవడం నయమే' అని అలీ అన్నప్పుడు– ఒంటరితనం అతన్ని తినేస్తున్నప్పటికీ, అతను స్పష్టంగానే మాట్లాడుతున్నాడని తెలుస్తుంది. కానీ, చివరి వరకూ కాతియా పాత్ర నిజమైనదో, అలీ ఊహించుకున్నదో అర్థం కాదు.

సూడాన్ రచయిత అమీర్ తాగ్ ఎల్సిర్, అరబిక్‌లో రాసిన యీ పుస్తకాన్ని, విలియమ్ మేనార్డ్ హచిన్స్ అనువదించారు. మూల పుస్తకంనుండి 'అసంబద్ధత' అన్న భావాన్ని రాబడతారు హచిన్స్. అలీ ప్రత్యక్ష వ్యాఖ్యానం – సాంకేతికతకూ, సాంకేతిక పరికరాలకూ బానిసైన మన సమాజాన్ని వ్యంగ్యంగా విమర్శిస్తుంది. డార్క్ కామెడీ. ప్రతినాయకుడైన అలీ ద్వారా నవల– అనేకమైన ఇతర సామాజిక రుగ్మతలను ఎత్తి చూపుతుంది. దీన్ని 2015లో ప్రచురించింది ఏంటీ బుక్ క్లబ్.

◆ కృష్ణ వేణి

గ్రేట్ రైటర్

భారతీ ముఖర్జీ



కోల్‌కతాలోని బెంగాలీ కుటుంబంలో జన్మించారు భారతీ ముఖర్జీ(1940–2017). ఒకే కాంపౌండులో సుమారు యాభై మంది నివసించేంత పెద్ద ఉమ్మడి కుటుంబం వాళ్లది. పన్నెండు వేల మంది భారతీయులు మాత్రమే అమెరికాలో ఉంటున్న కాలంలో అమెరికాలో స్థిరపడిన తొలితరం భారతీయుల్లో భారతీ ముఖర్జీ ఒకరు. అమెరికా కంటే ముందు ఆమె కొన్నేళ్లు కెనడాలో జీవించారు. సహజంగానే ఇరు దేశాల మధ్యన సాంస్కృతిక తేడాలు, వర్ణ వివక్ష, భయాందోళనలు ఆమె రచనల్లోకి ప్రవేశించాయి. పరదేశంలోని పరాయితనం ఒకవైపూ, తిరిగి మాతృదేశానికి వచ్చినప్పుడు గుర్తించలేనంతగా జరిగిన మార్పులు మరోవైపూ ఆమె పాత్రలు అనుభవిస్తాయి. భారతీయ స్త్రీగా అధిగమించాల్సిన అవరోధాలు ఉండనే ఉన్నాయి. 'ఒక మరణం, మరెన్నో పునర్జన్మలు'. 'జాస్మిన్', 'ద టైగర్స్ డాటర్', 'వైఫ్' ఆమె ప్రసిద్ధ నవలలు. తనను తాను అమెరికా రచయితగానే భావించుకున్న భారతీ ముఖర్జీ, అమెరికా బహుళత్వంలో తానూ భాగమంటారు. 1985లో సిక్కు ఉగ్రవాదులు పేల్చిన విమాన బాంబులో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాల ఆత్మఘోష నేపథ్యంలో సాగే 'ద మేనేజ్‌మెంట్ ఆఫ్ గ్రీఫ్' కథ ఎన్నో అమెరికా కథా సంకలనాల్లో చోటు చేసుకుంది. కెనడా రచయిత క్లార్క్ బ్లెయిజ్‌ను ఆమె వివాహమాడారు. ఇద్దరూ కలిసి 'డేస్ అండ్ నైట్స్ ఇన్ కోల్‌కతా' రాశారు.

సాహిత్య మరమరాలు

నూరు పదాల కథ

రచయిత జెఫ్రీ ఆర్చర్‌ని న్యూయార్క్‌లోని 'రీడర్స్ డైజెస్ట్' సంపాదకుడు ఒక కథ రాయమని కోరాడు. రాయమని ఊరుకోలేదు. కథకు ఒక మొదలు, ఒక మధ్య భాగం, ఒక ముగింపు ఉండాలనీ; కథలోని పదాలు సరిగ్గా వంద ఉండాలి, 99 కానీ, 101 కానీ ఉండకూడదనీ షరతు విధించాడు. పైగా ఇరవై నాలుగు గంటల్లో ఇవ్వాలన్నాడు. జెఫ్రీ ఆర్చర్ ఆ సవాల్‌ను స్వీకరించాడు. ఆ కథ 'అపూర్వం' (యూనిక్) దిగువ. దీన్ని సరిగ్గా నూరు పదాల్లోనే తెలుగులోకి అనువదించినవారు **అనిల్ అట్లూరి.**



పారిస్, మార్చ్ 14, 1921

కేప్ ఆఫ్ గుడ్‌హోప్ తపాలా బిళ్ల అది. త్రికోణాకారంలో ఉంది. తపాలా బిళ్లల సేకరణ అతని సరదా వ్యాపకం. నోట్లో ఉన్న ఆరిపోయిన సీమపొగాకు చుట్టని మళ్ళీ అంటించుకుని, చేతిలోని భూతద్దంతో దాన్ని మరొకసారి క్షుణ్ణంగా పరిశీలించాడు.

'నేను ఇదివరకే చెప్పాను. ఇవి రెండున్నాయని. కాబట్టి ఇదేమీ అపూర్వమైనది కాదు' అన్నాడు డీలర్. అతను తపాలా బిళ్లలు కొని, అమ్ముతూ ఉంటాడు.

'సరే. ఎంత?'

'పదివేల ఫ్రాంకులు.'


చెక్‌బుక్ తీసి పదివేలకి రాశాడు. నోట్లోని పొగాకు చుట్ట ఆరిపోయింది. బల్ల మీదున్న అగ్గిపెట్టె లోంచి, అగ్గిపుల్ల తీసి గీసాడు. ఎదురుగా ఉన్న ఆ తపాలా బిళ్లకి అంటించాడు. పొగలిడుతూ, మాడి మసైపోతున్న ఆ తపాలా బిళ్లని చూస్తూ, నిర్ఘాంతపోతూ నోరు వెళ్లబెట్టాడు డీలర్. చిరునవ్వు నవ్వుతూ, 'మిత్రమా, చూడు. నువ్వు పొరబడ్డావు. ఇప్పుడు నా దగ్గిరున్నది అత్యంత అపూర్వమైనది,' అన్నాడు అతను.

ప్రతిధ్వనించే పుస్తకం

నీతిశాస్త్రము జెప్పబోతది – పాతకములో బడనుబోతది

'యెంత మూర్ఖపు మనసు వినుడీ –
యేమనీ తెల్పుదును గనుడీ
యింతనైన హరిని దలువక –
చింతలల్లా జిక్కబోతది

నీతిశాస్త్రము జెప్పబోతది –
పాతకములో బడనుబోతది
కోతి గుణములు మాననంటది – దాతనూ
మది మరచియుంటది'



1907–57 మధ్యకాలంలో జీవించిన ఈగ బుచ్చిదాసు సంకీర్తనల్లో ఇదీ ఒకటి. దాస సంప్రదాయంలో జీవించిన ఎందరో తెలంగాణ వాగ్గేయకారుల్లాగే తన పేరు చివరా 'దాసు'ను చేర్చుకున్నారాయన. వరంగల్‌కు చెందిన బుచ్చిదాసు అనారోగ్య కారణాల రీత్యా యాదగిరి గుట్టకు వచ్చి అక్కడే కొండపైన కుటీరం నిర్మించుకొని లక్ష్మీ నరసింహస్వామిని సేవించారు.

'తల్లడిల్లె నాదు ప్రాణమూ శ్రీ నారసింహ పుల్లసిల్లె నాదు దేహమూ'.

ఆరోగ్యం బాగుపడిన తర్వాత చుట్టుపక్కల విద్యార్థులకు పాఠాలు బోధించారు. ఈ క్రమంలోనే ఈయనకు అనంతర కాలంలో సాధు బుచ్చిమాంబగా పరిణామం చెందిన బుచ్చమ్మ సహా ఎందరో శిష్యులైనారు. నరసింహస్వామి భక్తుడిగా బుచ్చిదాసు అలవోకగా చెబుతూవుంటే ఈ శిష్యులు రాసిపెట్టేవారు. ఆయన రాసినవాటిల్లో 'శ్రీ లక్ష్మీనరసింహ స్వామి భజన కీర్తనలు', 'శ్రీయాదగిరి నరహరి శతకం', 'శ్రీ యాదగిరి లక్ష్మీ నరసింహ స్వామి బతుకమ్మ పాట' ఉన్నాయి. సీసపద్యాల్లో రాసిన శతకం 'యాదగిరివాస నరహరీ! సాధుపోష!!' మకుటంతో సాగుతుంది.


'జప తపంబుల నేను సలిపితినంచును
గొప్పగా ప్రజలతో జెప్పలేదు
ఆత్మతత్వంబు నే నరసితి నంచును
యార్యులతోడనే నసగ లేదు...'

పల్లెల్లోని భక్త సమాజాలు పాడుకునే ఈ కీర్తనలు, బతుకమ్మ పాటలను 1960ల్లో బుచ్చిమాంబ తొలిసారి ప్రచురింపజేశారు. మళ్లీ వాటిని అన్నింటినీ ఒక దగ్గర చేర్చి, 'యాదగిరి క్షేత్ర సంకీర్తన కవి ఈగ బుచ్చిదాసు' పేరుతో 2017 ప్రపంచ తెలుగు మహాసభల సందర్భంగా తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రచురించింది. దీని పరిష్కర్త డాక్టర్ పి.భాస్కరయోగి.

పదం పలికింది - పాట నిలిచింది

కొమ్మల గువ్వలు గుసగుసమనినా

మనసున మల్లెల మాలలూగెనే
కన్నుల వెన్నెల డోలలూగెనే
ఎంత హాయి ఈ రేయి నిండెనో
ఎన్ని నాళ్ళకీ బ్రతుకు పండెనో
కొమ్మల గువ్వలు గుసగుసమనినా
రెమ్మల గాలులు ఉసురుసురనినా
అలలు కొలనులో గలగలమనినా
దవ్వున వేణువు సవ్వడి వినినా
నీవు వచ్చేవని నీ పిలుపే విని
కన్నుల నీరిడి కలయ చూచితిని
ఘడియ యేని ఇక విడిచిపోకుమా
ఎగసిన హృదయము పగులనీకుమా



మనసులో మల్లెల మాలలు, కన్నుల్లో వెన్నెల డోలలు! మల్లీశ్వరి చిత్రం కోసం దేవులపల్లి కృష్ణశాస్త్రి కలం నుంచి వచ్చిన మెత్తటి పాట ఇది. కొమ్మల్లో కూర్చున్న గువ్వల గుసగుసల్లో, రెమ్మలు వీచే గాలుల ఉసురుసుల్లో, కొలనులోని అలల గలగల్లో కూడా ఆమెకు ప్రియుడి రాకడ సంకేతాలు కనబడుతున్నాయి. అంతటా అతడి నాదమే వినబడుతోంది. కళ్లలో నీళ్లతో కలియజూసే నాయికను అతడు ఇక విడిచిపోతాడా! ఆమె హృదయాన్ని పగలనిస్తాడా!

దీనికి సంగీతం అందించినవారు ఎస్.రాజేశ్వరరావు, అద్దేపల్లి రామారావు. పాడింది ఇందులో నటి కూడా అయిన భానుమతి. ఎన్టీఆర్ కథానాయకుడు. 1951లో విడుదలైన ఈ చిత్రానికి నిర్మాత, దర్శకుడు బి.ఎన్.రెడ్డి.

రారండోయ్

- అఫ్సర్ కథల సంపుటి 'సాహిల్ వస్తాడు' ఆవిష్కరణ సభ హైదరాబాద్, దోమలగూడలోని హైదరాబాద్ స్టడీ సర్కిల్‌లో జనవరి 26న సాయంత్రం 5:30కు ఛాయా రిసోర్స్ సెంటర్ ఆధ్వర్యంలో జరగనుంది.
- 'వర్తమాన సాహిత్యం – విభిన్న ధోరణులు'పై ప్రసంగం; జోద కోబల్ కవిత్వం 'తెలంగాణ నా మాతృభూమి' పుస్తక పరిచయ సభ జనవరి 22న సాయంత్రం 5 గంటలకు మంచిర్యాల, బెల్లంపల్లి చౌరస్తాలోని ఛత్రపతి సాహు మహరాజ్ నాలెడ్జ్ సెంటర్ నందు జరుగుతుంది. తెలంగాణ రచయితల వేదిక, మంచిర్యాల ఆధ్వర్యంలో జరిగే ఈ సభకు అతిథులు ప్రొ. జయధీర్ తిరుమలరావు, అల్లం రాజయ్య.
- వెన్నెల రచన 'వెన్నెల కౌగిళ్లు' ఆవిష్కరణ సభ జనవరి 23న సాయంత్రం 5 గంటలకు విజయవాడలోని హోటల్ ఐలాపురంలో జరగనుంది. ఆవిష్కర్త: జస్టిస్ టి.రజని. నిర్వహణ: నవ్యాంధ్ర రచయితల సంఘం.
- 'ప్రైడ్ ఓవర్ ప్రెజుడీస్' కార్యక్రమంలో భాగంగా, గణతంత్ర దినోత్సవం సందర్భంగా జనవరి 26న సాయంత్రం 5 గంటలకు, సాహిత్యంలో జాతీయతా భావాలు అనే అంశంపై మహీధర రామమోహనరావు నవల 'కొల్లాయి గట్టితేనేమి' నేపథ్యంలో రామతీర్థ ప్రసంగిస్తారు. స్థలం: ఏపీటీడీసీ బోట్ జెట్టీ, బెర్మ్ పార్క్, విజయవాడ. వివరాలకు: సాయి పాపినేని, ఫోన్: 9845034442
- 'పదేళ్ల ప్రరవే' పేరుతో ప్రజాస్వామిక రచయిత్రుల వేదిక సమాలోచన, వార్షిక సదస్సు ఫిబ్రవరి 2, 3 తేదీల్లో యార్లగడ్డ లక్ష్మీప్రసాద్ సెమినార్ హాల్, హిందీ శాఖ, ఆంధ్ర విశ్వవిద్యాలయం, విశాఖపట్నంలో జరగనుంది. ప్రారంభోపన్యాసం: కె. సతీష్‌చందర్. ముఖ్య అతిథి: జి.కల్యాణరావు. నాలుగు సమావేశాలుగా జరిగే ఈ సదస్సులో పలువురు కవులు, రచయితలు ప్రసంగిస్తారు. నిర్వహణ: పలు సంస్థల సహకారంతో ప్రరవే.
- క్రీడలు కేంద్రబిందువుగా తేనున్న తెలుగు కథల సంకలనానికి తోడ్పడవలసిందిగా కోరుతున్నారు సంపాదకులు కస్తూరి మురళీకృష్ణ, కోడీహళ్లి మురళీమోహన్. ప్రచురిత, అముద్రిత కథలు రెండూ సరే. వాట్సాప్: 9849617392. మెయిల్: kmpk2025@gmail.com

సాక్షి స్పోర్ట్స్
సోమవారం
21-1-2019

నేటి ప్రిక్వార్టర్ ఫైనల్స్

పురుషుల సింగిల్స్	మహిళల సింగిల్స్
జొకోవిచ్ x మెద్వెదెవ్	సెరెనా x హలెప్
జ్వెరెవ్ x రావ్‌నిచ్	ఒసాకా x సెవస్తోవా
నిషికోరి x కరెనో బుస్టా	కీస్ x స్వితోలినా
కొరిచ్ x లుకాస్ పుయి	ముగురుజా x ప్లిస్కోవా

ఉదయం గం. 5.30 నుంచి సోనీ సిక్స్‌లో ప్రత్యక్ష ప్రసారం


సిట్సిపాస్

చాంపియన్‌కు షాక్

ప్రిక్వార్టర్స్‌లోనే ఓడిన ఫెడరర్

సీజన్ తొలి గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్ ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆదివారం సంచలనాల మోత మోగింది. ఒకే రోజు టాప్-10లోని నలుగురు సీడెడ్ క్రీడాకారులు నిష్క్రమించారు. పురుషుల సింగిల్స్ విభాగంలో డిఫెండింగ్ చాంపియన్ రోజర్ ఫెడరర్... గతేడాది రన్నరప్, ఆరో సీడ్ మారిన్ సిలిచ్... 20వ సీడ్ దిమిత్రోవ్... మహిళల సింగిల్స్ విభాగంలో రెండో సీడ్ ఎంజెలిక్ కెర్బర్... మాజీ చాంపియన్ షరపోవా... ఐదో సీడ్ స్లోన్ స్టీఫెన్స్ కూడా ప్రిక్వార్టర్స్‌లోనే ఇంటిముఖం పట్టారు.


రోజర్ ఫెడరర్

- గ్రీస్ యువతార సిట్సిపాస్ పెను సంచలనం
- గతేడాది రన్నరప్ సిలిచ్ కూడా ఇంటిముఖం
- రెండో సీడ్ కెర్బర్, మాజీ విజేత షరపోవాలకు చుక్కెదురు

మెల్‌బోర్న్: అనుకున్నదొకటి... అయ్యిందొకటి. తొలి మూడు రౌండ్‌లలో అలవోకగా ప్రత్యర్థుల ఆట కట్టించిన స్విట్జర్లాండ్ టెన్నిస్ దిగ్గజం రోజర్ ఫెడరర్ ప్రిక్వార్టర్ ఫైనల్లో మాత్రం మట్టికరిచాడు. అంతర్జాతీయస్థాయిలో తన అనుభవమంత (21 ఏళ్లు) వయసు లేని 20 ఏళ్ల గ్రీస్ యువతార స్టెఫానోస్ సిట్సిపాస్ చేతిలో ఫెడరర్ కంగుతిన్నాడు. వరుసగా మూడోసారి... రికార్డు స్థాయిలో ఏడోసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ టైటిల్ సాధించాలనే లక్ష్యంతో బరిలోకి దిగిన ఈ స్విస్ స్టార్‌కు... కెరీర్‌లో కేవలం ఆరో గ్రాండ్‌స్లామ్ ఆడుతోన్న సిట్సిపాస్ ఊహించని షాక్ ఇచ్చాడు. 3 గంటల 45 నిమిషాలపాటు జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో 14వ సీడ్ సిట్సిపాస్ 6–7 (11/13), 7–6 (7/3), 7–5, 7–6 (7/5)తో మూడో సీడ్ ఫెడరర్‌పై గెలిచి కెరీర్‌లో తొలిసారి ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. అంతేకాకుండా గ్రాండ్‌స్లామ్ టోర్నీల చరిత్రలో ఈ ఘనత సాధించిన తొలి గ్రీస్ ప్లేయర్‌గానూ గుర్తింపు పొందాడు. తన ప్రత్యర్థి 20 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్ విజేత అని... 21 ఏళ్ల అనుభవమున్న దిగ్గజమని... కళాత్మక ఆటతీరుకు మరో రూపమని తెలిసినా... సిట్సిపాస్ అవేమీ పట్టించుకోలేదు. ఎలాంటి బెరుకు లేకుండా తొలి పాయింట్ నుంచి మ్యాచ్ పాయింట్ వరకు దూకుడుగానే ఆడాడు. ఫలితంగా తన కెరీర్‌లోనే చిరస్మరణీయ విజయాన్ని నమోదు చేసుకున్నాడు. 'ప్రస్తుతం ఈ భూగోళం మీద అమితానందంగా ఉన్న వ్యక్తిని నేనే. నాకు ఆరేళ్ల ఉన్నప్పటి నుంచి ఫెడరర్‌ను ఆరాధిస్తున్నాను. మరో దిగ్గజం రాడ్ లేవర్ పేరిట ఉన్న సెంటర్ కోర్టులోనే ఫెడరర్‌తో ఆడే అవకాశం రావడంతో నా కల నిజమైంది. ఈ ఫలితాన్ని ఎలా వర్ణించాలో కూడా మాటలు రావడంలేదు' అని ఫెడరర్‌ను ఓడించిన అనంతరం సిట్సిపాస్ వ్యాఖ్యానించాడు.'నేను మంచి ప్లేయర్ చేతిలోనే ఓడిపోయాను. ఇటీవల కాలంలో సిట్సిపాస్ చాలా బాగా ఆడుతున్నాడు. కీలక సమయాల్లో అతను ఎంతో ఓర్పుతో ఆడాడు' అని ఫెడరర్ ప్రశంసించాడు.

శక్తివంతమైన సర్వీస్‌లు... కచ్చితమైన రిటర్న్‌లు.. నెట్ వద్ద పైచేయి... ఏకంగా 12 బ్రేక్ పాయింట్లను కాపాడుకోవడం సిట్సిపాస్ విజయంలో కీలక పాత్ర పోషించాయి. మ్యాచ్ మొత్తంలో 20 ఏస్‌లు సంధించిన ఈ గ్రీస్ యువతార కేవలం ఒక డబుల్ ఫాల్ట్ మాత్రమే చేశాడు. మరోవైపు ఫెడరర్ 12 ఏస్‌లు కొట్టినా... 12 బ్రేక్ పాయింట్ అవకాశాల్లో ఒక్కటీ సద్వినియోగం చేసుకోకపోవడం గమనార్హం. 55 అనవసర తప్పిదాలు చేసిన ఈ స్విస్ స్టార్ తగిన మూల్యం చెల్లించుకున్నాడు.

అగుట్ అద్భుతం...

మరోవైపు 22వ సీడ్ బాటిస్టా అగుట్ (స్పెయిన్) మరో అద్భుత విజయం సాధించాడు. తన 25వ గ్రాండ్‌స్లామ్ టోర్నమెంట్‌లో తొలిసారి క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను ఖాయం చేసుకున్నాడు. 3 గంటల 58 నిమిషాలపాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో అగుట్ 6–7 (6/8), 6–3, 6–2, 4–6, 6–4తో నిరుటి రన్నరప్, ఆరో సీడ్ మారిన్ సిలిచ్ (క్రొయేషియా)ను ఓడించాడు. తొలి రౌండ్‌లో బ్రిటన్ స్టార్ ఆండీ ముర్రేపై, మూడో రౌండ్‌లో పదో సీడ్ ఖచనోవ్ (రష్యా)పై గెలిచిన అగుట్ క్వార్టర్ ఫైనల్లో సిట్సిపాస్‌తో తలపడతాడు. మరో మ్యాచ్‌లో అమెరికా యువతార టియాఫో 7–5, 7–6 (8/6), 6–7 (1/7), 7–5తో 20వ సీడ్ దిమిత్రోవ్‌ను ఓడించి తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు చేరాడు. రెండో సీడ్ రాఫెల్ నాదల్ (స్పెయిన్) 6–0, 6–1, 7–6 (7/4)తో థామస్ బెర్డిచ్ (చెక్ రిపబ్లిక్)పై గెలిచి టియాఫోతో క్వార్టర్ ఫైనల్ పోరుకు సిద్ధమయ్యాడు.

కెర్బర్ కుదేలు...

మహిళల సింగిల్స్ విభాగంలో 2016 చాంపియన్, మాజీ నంబర్‌వన్ ఎంజెలిక్ కెర్బర్ (జర్మనీ)కు అనూహ్య ఓటమి ఎదురైంది. తొలిసారి ఆస్ట్రేలియన్ ఓపెన్ ఆడుతోన్న 25 ఏళ్ల అమెరికా అమ్మాయి డానియెలా కొలిన్స్ 6–0, 6–2తో కెర్బర్‌ను చిత్తు చేసింది. గతంలో ఐదు గ్రాండ్‌స్లామ్ టోర్నీల్లో పాల్గొన్న కొలిన్స్ ఏనాడూ తొలి రౌండ్‌ను దాటకపోగా ఆరో ప్రయత్నంలో క్వార్టర్ ఫైనల్ బెర్త్‌ను దక్కించుకోవడం విశేషం. మరో మ్యాచ్‌లో 15వ ర్యాంకర్ యాష్లే బార్టీ (ఆస్ట్రేలియా) 4–6, 6–1, 6–4తో 30వ సీడ్, 2008 చాంపియన్, మాజీ నంబర్‌వన్ మరియా షరపోవా (రష్యా)ను బోల్తా కొట్టించి తొలిసారి గ్రాండ్‌స్లామ్ టోర్నీలో క్వార్టర్ ఫైనల్‌కు చేరింది. 2 గంటల 32 నిమిషాలపాటు జరిగిన మరో ప్రిక్వార్టర్ ఫైనల్లో అన్‌సీడెడ్ అనస్తాసియా పావ్లీ చెంకోవా (రష్యా) 6–7 (3/7), 6–3, 6–3తో ఐదో సీడ్ స్లోన్ స్టీఫెన్స్ (అమెరికా)పై సంచలన విజయం సాధించగా... ఎనిమిదో సీడ్ పెట్రా క్విటోవా (చెక్ రిపబ్లిక్) 6–2, 6–1తో అమండా అనిసిమోవా (అమెరికా)ను ఓడించింది.


కెర్బర్



షరపోవా


స్లోన్ స్టీఫెన్స్


సిలిచ్

లవ్ @ టెన్నిస్ కోర్ట్...

ప్రేమలో పడ్డ మోన్‌ఫిల్స్, స్వితోలినా



మెల్‌బోర్న్: టెన్నిస్ జగతిలో కొత్తగా మరో కొత్త ప్రేమకథ మొదలైంది. ఫ్రాన్స్‌కు చెందిన గేల్ మోన్‌ఫిల్స్, ఉక్రెయిన్ క్రీడాకారిణి ఎలీనా స్వితోలినా తాము ప్రేమలో ఉన్నట్లు ప్రకటించారు. ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో ఆరో సీడ్ స్వితోలినా మ్యాచ్ జరుగుతున్న సమయంలో ప్లేయర్ బాక్స్‌లో కూర్చొని మోన్‌ఫిల్స్ ఆమెను ప్రోత్సహించడం కనిపించింది. దీనిపై ప్రశ్నించగా...'అతను నా కోసమే, నాకు మద్దతుని చ్చేందుకే అక్కడికి వచ్చాడు. నేను కూడా అతని కోసమే ఉన్నాను. ఇప్పుడు మా మధ్య ఎలాంటి అనుబంధం ఉందో ఇద్దరికీ బాగా తెలుసు' అంటూ స్వితోలినా తమ బంధాన్ని నిర్ధారించింది. తమ ఇద్దరి పేర్లు 'గేల్ ఎలీనా మోన్‌ఫిల్స్ స్వితోలినా'లను కలుపుతూ వీరు 'జీ.ఈ.ఎం.ఎస్ లైఫ్' పేరుతో ఒకే ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్‌ను మొదలు పెట్టడం విశేషం. ఇందులో వారిద్దరు కలిసి ఉన్న వీడియోను కూడా పంచుకున్నారు. 7 ఏటీపీ టైటిల్స్ గెలిచిన 32 ఏళ్ల మోన్‌ఫిల్స్ ప్రస్తుతం 33వ ర్యాంక్‌లో ఉన్నాడు. 13 డబ్ల్యూటీఏ టైటిల్స్ సాధించిన 24 ఏళ్ల స్వితోలినా ప్రస్తుతం 7వ ర్యాంక్‌లో కొనసాగుతోంది.

ధోనినే 'బెస్ట్ ఫినిషర్'

కోహ్లి వన్డే బ్రాడ్‌మన్ కాగలడు • ఇయాన్ చాపెల్ ప్రశంస

న్యూఢిల్లీ: వన్డే క్రికెట్‌లో మ్యాచ్‌ను విజయవంతంగా ముగించడంలో ధోని తర్వాతే ఎవరైనా అని ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ అభిప్రాయపడ్డారు. ఈ తరంలో అతడిని మించినవారు ఎవరూ లేరని, ఇప్పటికీ అతనే 'బెస్ట్ ఫినిషర్' అని చాపెల్ ప్రశంసించారు. 'చివరి వరకు నిలిచి జట్టును గెలిపించడంలో ధోని అంత సమర్థంగా ఎవరూ ఒత్తిడిని జయించలేరు. ఇప్పటికే చాలా ఆలస్యమైపోయింది, ఇక కష్టం అనిపించినప్పుడల్లా కొన్ని అద్భుతమైన షాట్లు ఆడి అతను లెక్క సరి చేస్తాడు. ఉత్కంఠభరిత క్షణాల్లో తన వ్యూహానికి అనుగుణంగా ప్రశాంతంగా ఆడటం చూస్తే అతని బుర్ర ఎంత పక్కాగా పని చేస్తుందో అర్థం చేసుకోవచ్చు' అని చాపెల్ విశ్లేషించారు. గతంలో మైకేల్ బెవాన్‌కు ఈ విషయంలో మంచి రికార్డు ఉన్నా...మారిన పరిస్థితులను పరిగణలోకి తీసుకున్నా కూడా బెవాన్‌కంటే ధోనినే అత్యుత్తమమని ఆసీస్ దిగ్గజం అభిప్రాయం వ్యక్తం చేశారు.

కోహ్లి ఇలాగే ఆడితే...

వన్డే క్రికెట్‌లో నలుగురు అత్యుత్తమ బ్యాట్స్‌మెన్‌గా



రిచర్డ్స్, సచిన్, డివిలియర్స్, కోహ్లిలను చాపెల్ అభివర్ణించారు. వీరిలో కోహ్లి ఒక్కడే ఇప్పుడు ఆడుతున్నాడని...అతను ఇప్పటి జోరును కొనసాగిస్తే సచిన్‌కంటే 100 తక్కువ ఇన్నింగ్స్‌లలోనే అతని అన్ని రికార్డులు అధిగమిస్తాడని, మరో 20 సెంచరీలు ఎక్కువ చేస్తాడని కూడా ఇయాన్ అన్నారు. ఇదే జరిగితే విరాట్‌ను 'వన్డే బ్రాడ్‌మన్'గా పిలవడంలో ఎలాంటి సందేహం ఉండనవసరం లేదని ఆయన వ్యాఖ్యానించారు.



కివీస్ సవాల్!

ప్రపంచ కప్‌నకు ముందు మరో సన్నాహకం

చరిత్రను తిరగరాయడం, పాత రికార్డులను చెరిపేసి కొత్త ఘనతలు సృష్టించడం భారత క్రికెట్ జట్టుకు ఇటీవల అలవాటుగా మారింది. ఆస్ట్రేలియాలో సిరీస్ నెగ్గిన మన టీమ్ తర్వాతి మజిలీ న్యూజిలాండ్. ఈ టూర్ తర్వాత స్వదేశంలో మరికొన్ని మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్నా... వరల్డ్ కప్‌నకు ముందు విదేశీ పిచ్‌లపై మన పదును తెలుసుకునేందుకు ఈ సిరీస్ మరో అవకాశం ఇస్తోంది. ఆసీస్‌తో పోలిస్తే సొంతగడ్డపై కివీస్ అతి ప్రమాదకర ప్రత్యర్థి అనడంలో సందేహం లేదు. ఈ నేపథ్యంలో గతంలో న్యూజిలాండ్‌లో భారత ఆడిన ఏడు ద్వైపాక్షిక వన్డే సిరీస్ విశేషాలను చూస్తే...

1976 (2 వన్డేలు)
- ఫలితం: 2-0తో సిరీస్ కివీస్ సొంతం

1981 (2 వన్డేలు)
- ఫలితం: 2-0తో సిరీస్ కివీస్ సొంతం

1994 (4 వన్డేలు)
- ఫలితం: 2-2తో సిరీస్ సమం

1999 (5 వన్డేలు)
- ఫలితం: 2-2తో సిరీస్ సమం (ఒక మ్యాచ్ రద్దు)

2002-03 (7 వన్డేలు)
- ఫలితం: 5-2తో కివీస్ విజయం

2009 (5 వన్డేలు)
- ఫలితం: 3-1తో భారత్ విజయం (ఒక మ్యాచ్ రద్దు)

2014 (5 వన్డేలు)
- ఫలితం: 4-0తో కివీస్ విజయం (ఒక మ్యాచ్ 'టై')

- న్యూజిలాండ్ గడ్డపై 7 సిరీస్‌లు ఆడిన భారత్ 1 గెలిచి, 4 ఓడిపోయింది. మరో 2 'డ్రా'గా ముగిశాయి. ఓవరాల్‌గా ఇరు జట్ల మధ్య 34 వన్డేలు జరగ్గా... భారత్ 10 గెలిచి 21 ఓడిపోయింది. 1 మ్యాచ్ 'టై' కాగా, మరో 2 మ్యాచ్‌లలో ఫలితం తేలలేదు.

నేడు ప్రాక్టీస్...

ఆక్లాండ్: ఆస్ట్రేలియా పర్యటనను విజయవంతంగా ముగించుకున్న భారత జట్టు ఆదివారం కివీస్ గడ్డపై అడుగు పెట్టింది. టీమిండియా ఆటగాళ్లంతా ఆక్లాండ్ నగరానికి చేరుకున్నారు. స్థానికంగా ఉన్న భారత అభిమానులు విమానాశ్రయంలో కాస్త సందడి చేశారు. తొలి వన్డే వేదిక అయిన నేపియర్‌కు భారత్ సోమవారం బయల్దేరుతుంది. అక్కడ నేడు, రేపు ప్రాక్టీస్ అనంతరం బుధవారం న్యూజిలాండ్‌తో తలపడుతుంది.

మహిళలూ అక్కడే...

బుధవారం భారత్, కివీస్ జట్ల మధ్య తొలి వన్డే నేపియర్‌లో జరగనుండగా... మరుసటి రోజు గురువారం ఇదే వేదికపై భారత మహిళల, కివీస్ మహిళల మధ్య కూడా సిరీస్‌లో తొలి వన్డే జరగనుండటం విశేషం.

భారత్ - న్యూజిలాండ్ సిరీస్ షెడ్యూల్

మ్యాచ్	తేదీ	వేదిక
తొలి వన్డే	23 జనవరి	నేపియర్
రెండో వన్డే	26 జనవరి	మౌంట్ మాంగనీ
మూడో వన్డే	28 జనవరి	మౌంట్ మాంగనీ
నాలుగో వన్డే	31 జనవరి	హామిల్టన్
ఐదో వన్డే	3 ఫిబ్రవరి	వెల్లింగ్టన్
తొలి టి20	6 ఫిబ్రవరి	వెల్లింగ్టన్
రెండో టి20	8 ఫిబ్రవరి	ఆక్లాండ్
మూడో టి	2010 ఫిబ్రవరి	హామిల్టన్


అంకిత రైనాకు సింగిల్స్ టైటిల్



న్యూఢిల్లీ: భారత టెన్నిస్ క్రీడాకారిణి అంకిత రైనా 2019 సీజన్‌కు టైటిల్‌తో శుభారంభం పలికింది. సింగపూర్‌లో జరిగిన టోర్నమెంట్‌లో ఆమె సింగిల్స్‌లో విజేతగా నిలిచింది. ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయర్స్‌లో వెనుదిరిగిన ఆమె... వెంటనే సింగపూర్ టోర్నీ బరిలోకి దిగింది. ఫైనల్లో అంకిత 6–3, 6–2తో ప్రపంచ 122 ర్యాంకర్, టాప్ సీడ్ అరంటా రుస్ (నెదర్లాండ్స్)ను కంగుతినిపించింది. ఈ టోర్నీలో భారత క్రీడాకారిణి నలుగురు సీడెడ్ ప్లేయర్లకు షాకిచ్చింది. రెండో రౌండ్లో ఎనిమిదో సీడ్ లెస్లీ కెర్కొవ్ (నెదర్లాండ్స్), ప్రిక్వార్టర్స్‌లో రెండో సీడ్ సబీనా షరిపోవా (ఉజ్బెకిస్తాన్), క్వార్టర్స్‌లో మూడో సీడ్ కాని పెరిన్ (స్విట్జర్లాండ్)లను కంగుతినిపించింది. టైటిల్ విజయంతో 50 రేటింగ్ పాయింట్లు పొందిన 25 ఏళ్ల అంకిత సోమవారం విడుదల చేసే డబ్ల్యూటీఏ ర్యాంకింగ్స్‌లో 168వ స్థానానికి ఎగబాకనుంది.

ముంబై మారథాన్‌లో మెరిసిన సుధా సింగ్

ముంబై: భారత అథ్లెట్లు సుధా సింగ్, నితేంద్ర సింగ్ రావత్ ముంబై మారథాన్‌లో మెరిశారు. మహిళల, పురుషుల విభాగాల్లో భారత్ తరఫున మెరుగైన స్థానంలో నిలిచారు. సుధ 2 గంటల 34 నిమిషాల 56 సెకన్లలో పరుగును పూర్తిచేసి దోహాలో జరిగే ప్రపంచ చాంపియన్‌షిప్ కోసం నిర్దేశించిన 2:37:00 క్వాలిఫయింగ్ మార్క్‌ను అధిగమించింది. రావత్ 2:15:52 సెకన్ల టైమింగ్‌తో మెరిశాడు. పురుషుల కేటగిరీలో 2:16:00 క్వాలిఫయింగ్ మార్క్‌ను నితేంద్రసింగ్ అధిగమించాడు. ఈ మారథాన్‌లో కాస్మస్ లగత్ (కెన్యా; 2:09:15) పురుషుల విభాగంలో విజేతగా నిలువగా... మహిళల కేటగిరీలో వర్క్‌నెష్ అలెము (ఇథియోపియా; 2:25:45) గెలిచింది.



పంజాబ్ రాయల్స్ బోణీ



లుధియానా: డిఫెండింగ్ చాంపియన్ పంజాబ్ రాయల్స్ ప్రొ రెజ్లింగ్ లీగ్ (పీడబ్ల్యూఎల్)లో బోణీ కొట్టింది. ఆదివారం జరిగిన పోరులో పంజాబ్ 4–3తో ఢిల్లీ సుల్తాన్స్‌పై గెలుపొందింది. నిర్ణాయక బౌట్‌లో కామన్వెల్త్, ఆసియా క్రీడల చాంపియన్ రెజ్లర్ బజరంగ్ పూనియా (65 కేజీలు) 9–0తో ఆండ్రి క్విట్కోవ్‌స్కీను ఓడించి పంజాబ్‌ను విజేతగా నిలిపాడు. అంతకుముందు జరిగిన బౌట్లలో వినోద్ (74 కేజీలు) 0–14తో ఢిల్లీ రెజ్లర్ కెటిక్ సబలోవ్ చేతిలో కంగుతినగా, మహిళల 76 కేజీల విభాగంలో వెస్కన్ సింతియా 2–1తో ఝస్తోవా అనస్తాసియా (ఢిల్లీ)పై గెలిచింది. 86 కేజీల్లో డటో మర్సగిష్విలి 12–0తో ప్రవీణ్ రాణా (ఢిల్లీ)పై నెగ్గగా, మహిళల 53 కేజీల్లో పింకీ (ఢిల్లీ) 9–4 అంజును ఓడించింది. కొరే జార్విస్ (125 కేజీలు) 7–2తో సతిందర్ మలిక్ (ఢిల్లీ)పై విజయం సాధించగా, అనిత 0–11తో సాక్షి మలిక్ (ఢిల్లీ) చేతిలో ఓటమి పాలైంది. చివరి దాకా ఇరు జట్లు చెరోటి గెలవడంతో స్కోరు 3–3తో సమమైంది. ఈ దశలో బజరంగ్ 'పట్టు' పట్టడంతో పంజాబ్ ఖాతా తెరిచింది.


ధర్మదర్శనం క్యూలైన్లలో భక్తులు

యాదాద్రిలో భక్తుల రద్దీ

యాదగిరికొండ: యాదాద్రి శ్రీ లక్ష్మీనరసింహస్వామి సన్నిధికి ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. ఆలయ పరిసరాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. సుమారు 15 వేల మంది స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. దర్శనానికి 3 గంటల సమయం పట్టిందని భక్తులు తెలిపారు.

భద్రాద్రి రామయ్యకు రూ. 20 లక్షల వితరణ



భద్రాచలం టౌన్: భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామివారికి ఏపీలోని కృష్ణా జిల్లా బావులపాడుకు చెందిన యార్లగడ్డ వెంకటేశ్వరరావు అనే భక్తుడు రూ. 20 లక్షలు వితరణగా అందించాడు. దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అన్నదాన పథకానికి రూ. 6 లక్షలు, గోశాలకు రూ. 6 లక్షలు, అలాగే రూ.8 లక్షలు సత్రం గది నిర్మాణం కోసం ఆలయ అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా అధికారులు ఆయనకు ఆలయ మర్యాదల ప్రకారం స్వామివారి దర్శనం చేయించారు. వేద పండితులు ఆశీర్వచనం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకుడు అమరవాది విజయరాఘవన్, ఆలయ పర్యవేక్షకులు నిరంజన్, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

కాళ్లు మొక్కుతా.. నన్ను గెలిపించండి



కల్హేర్ (నారాయణఖేడ్): పంచాయతీ ఎన్నికల్లో ప్రతి ఓటూ కీలకమే. అందుకే అభ్యర్థులు ఓటర్లను ఆకట్టుకునేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లా కల్హేర్ మండలం నాగధర్ పంచాయతీలో 3వ వార్డు సభ్యుడిగా ఎన్నికల బరిలో నిలిచిన టీఆర్‌ఎస్ మద్దతుదారుడు చాకలి అడివప్ప ఆదివారం ఓటర్లను ఆకర్షించేందుకు పలు ప్రయత్నాలు చేశాడు. తాను పోటీ చేస్తున్న వార్డు పరిధిలోని ఓటర్ల వద్దకు వెళ్లి గెలిపించాలని ప్రాధేయపడ్డాడు. మరో అడుగు ముందుకేసి ఏకంగా ఓటర్ల కాళ్ల మీద పడి అభ్యర్థించాడు. అంతేకాదు పంచాయతీ ఎన్నికల నోటిఫికేషన్ రాకముందు సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తానని అడివప్ప సొంత మేనిఫెస్టోను రూపొందించాడు. ఎన్నికల్లో గెలిపిస్తే ఐదేళ్లు ఉచితంగా బట్టలు ఉతుకుతానని, ఇంటింటికీ రోజుకు 20 లీటర్ల మినరల్ వాటర్ తదితర హామీలు ఇచ్చాడు. అయితే పంచాయతీ రిజర్వేషన్‌లో భాగంగా ఆ గ్రామం ఎస్సీ మహిళకు కేటాయించారు. దీంతో అడివప్ప ఆశలు గల్లంతయ్యాయి. కనీసం వార్డు సభ్యుడిగానైనా ఎన్నిక కావాలని పోటీలో నిలిచాడు.

ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో టీఎల్‌ఎఫ్

టీఎల్‌ఎఫ్ చైర్మన్ కత్తి వెంకటస్వామి వెల్లడి

హన్మకొండ: ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలవాలని తెలంగాణ లెక్చరర్స్ ఫోరం(టీఎల్‌ఎఫ్) నిర్ణయించింది. ఈ మేరకు రాష్ట్ర కార్యవర్గంలో చర్చించి తీర్మానం చేశారు. వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండలో ఆదివారం జరిగిన ఫోరం రాష్ట్ర కార్యవర్గ సమావేశం అనంతరం ఫోరం చైర్మన్ కత్తి వెంకటస్వామి విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మారుతున్న రాజకీయ పరిస్థితులు, సమీకరణలు, అలాగే ఉపాధ్యాయ, అధ్యాపక వర్గాల ప్రయోజనాల దృష్ట్యా ఎమ్మెల్సీ నియోజకవర్గాల నుంచి పోటీ చేయాలని టీఎల్‌ఎఫ్ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, యువత సమస్యలపై పోరాడాల్సిన అవసరముందని, అందుకు ఎమ్మెల్సీ ఎన్నికలను ఫోరం మంచి వేదికగా భావిస్తోందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో ఫోరం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరునహరి శేషు, ప్రధాన కార్యదర్శి గుర్రం ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

నిర్బంధకాండను ఖండిస్తున్నాం

జయధీర్ తిరుమలరావు

హైదరాబాద్: దేశవ్యాప్తంగా కవులు, రచయితలపై కొనసాగుతున్న నిర్బంధకాండను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడు ప్రొఫెసర్ జయధీర్ తిరుమలరావు అన్నారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం ఆధ్వర్యంలో రాజ్యహింసకు వ్యతిరేకంగా సదస్సు జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న జయధీర్ తిరుమలరావు మాట్లాడుతూ..దేశంలో ఇలాంటి పరిస్థితి ఎన్నడూ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పాలకుల విధానాల్లో మార్పు రానంతకాలం ప్రజలకు కష్టాలు తప్పవన్నారు. అసెంబ్లీలో ప్రతిపక్షం లేకుండా చేయడం రాజకీయం కానీ, సమాజంలో ప్రజల తరఫున మాట్లాడకుండా చేయడం దేనికని ప్రశ్నించారు. ప్రజల తరఫున మాట్లాడిన వారిని నేరస్థులుగా చూస్తున్నారన్నారు. మనుషుల స్వేచ్ఛ దేశం స్వేచ్ఛ అని, స్వేచ్ఛ లేకుంటే ప్రయోజనం ఉండదన్నారు.


కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో బోనాలు తీసుకొస్తున్న భక్తులు
(ఇన్‌సెట్‌లో) కొమురవెల్లి మల్లన్న

నేడు కొమురవెల్లి పెద్దపట్నం

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పట్నం వారానికి భారీగా తరలివచ్చిన భక్తజనం

కొమురవెల్లి (సిద్దిపేట): జానపదుల ఆరాధ్య దైవం కొమురవెల్లి మల్లన్న క్షేత్రంలో సోమవారం అగ్నిగుండాలు, పెద్దపట్నం నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశారు. ఆదివారం సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లి మల్లన్న జాతర బ్రహ్మోత్సవాల్లో ముఖ్య ఘట్టమైన పట్నం వారానికి భక్తులు భారీగా తరలివచ్చారు. పట్నంవారం పురస్కరించుకుని ఆలయ తోటబావి వద్ద పెద్దపట్నం, అగ్నిగుండాలను హైదరాబాద్ యాదవ భక్తులు నిర్వహించనున్నారు. మల్లన్న జాతర బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టం పట్నంవారంతో మొదలై 11 ఆదివారాలు కొనసాగి మార్చి 30న అగ్నిగుండాలతో ముగుస్తాయి. శ్రీమల్లికార్జున స్వామిని మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మల్లారెడ్డి, జీహెచ్‌ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ సతీమణి శ్రీదేవి దర్శించుకుని పూజలు నిర్వహించారు. బ్రహ్మోత్సవాలను హుస్నాబాద్ ఏసీపీ మహేందర్, ఆలయ ఈఓ వెంకటేశ్, ఆలయ చైర్మన్ సెవెల్ల సంపత్, ఏఈఓ సుదర్శన్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు.

24న డ్రైవర్స్ డే

- రాష్ట్ర వ్యాప్తంగా ర్యాలీలు, మానవ హారాలు
- ఆర్టీసీ అధికారుల నిర్ణయం

హన్మకొండ: రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 24న 'డ్రైవర్స్ డే'ను నిర్వహించాలని టీఎస్ ఆర్టీసీ నిర్ణయించింది. ఈ మేరకు ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ రాష్ట్రంలోని రీజినల్ మేనేజర్లు, డివిజనల్ మేనేజర్లు, డిపో మేనేజర్లకు సర్క్యులర్ జారీ చేశారు. ప్రతి డ్రైవర్‌కు శుభాకాంక్షలు, కృతజ్ఞతలు తెలిపే వినూత్న కార్యక్రమానికి ఆర్టీసీ వరంగల్ రీజియన్ 2017 జనవరిలో శ్రీకారం చుట్టింది. గత రెండు పర్యాయాలు డ్రైవర్స్ డేను వరంగల్ రీజియన్‌లో అన్ని వర్గాల భాగస్వామ్యంతో విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రజల్లోకి మరింత లోతుగా తీసుకెళ్లాలనే ఆలోచనతో మూడో సారి వరంగల్ రీజనల్ మేనేజర్ తోట సూర్యకిరణ్, పాఠశాలల విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తున్నారు. డ్రైవర్స్ డేకు అన్ని వర్గాల నుంచి మంచి స్పందన వస్తుండడంతో ఈ ఏడాది రాష్ట్ర వ్యాప్తగా నిర్వహించాలని ఆర్టీసీ యాజమాన్యం నిర్ణయం తీసుకుంది.

అన్ని వర్గాల ఆమోదంతో..

అన్ని వర్గాల ఆమోదంతో డ్రైవర్స్ డేను నిర్వహించాలన్నది వరంగల్ రీజనల్ మేనేజర్ తోట సూర్యకిరణ్ ఆలోచన. ద్విచక్ర వాహనం నుంచి మొదలుకుని భారీ వాహనం నడిపే డ్రైవర్ వరకు డ్రైవర్స్ డే ద్వారా శుభాకాంక్షలు తెలిపి రోడ్డు భద్రతను ప్రోత్సహించాలన్నదే ఈ ప్రయత్నం. రోజూ వందల కిలోమీటర్లు వాహనాన్ని నడిపి ప్రయాణికులను క్షేమంగా గమ్యస్థానం చేరుస్తున్న డ్రైవర్ల వృత్తి అసాధారణమైంది. ఈ నేపథ్యంలో వారికి సరైన గుర్తింపు తీసుకురావాలనే ఆలోచనతో డ్రైవర్ల దినోత్సవాన్ని నిర్వహించాలని సంకల్పించారు. ఈ కార్యక్రమాన్ని ఆర్టీసీకే పరిమితం చేయకుండా వాహనచోదకులందరికీ వర్తించేలా నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా రహదారి భద్రతపై ర్యాలీలు, మానవ హారాలు ఏర్పాటు చేయనున్నారు.

'భగీరథా'.. ఏమిటీ వృథా!



తాడూరు: గంగమ్మ నింగికెగిసింది.. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అవడంతో నీరు ఉవ్వెత్తున ఎగిసిపడింది. ఈ ఘటన నాగర్‌కర్నూల్ జిల్లా తాడూరు మండలం మేడిపూర్ సమీపంలో చోటుచేసుకుంది. నాగర్‌కర్నూల్–కల్వకుర్తి ప్రధాన రహదారి వెంబడి మేడిపూర్ సమీపంలో ఆదివారం సాయంత్రం భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడటంతో నీరు పైకి ఎగజిమ్మింది. నీటి ఉధృతికి దాదాపు 2 గంటల పాటు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఆకాశానికి ఎగిసిపడుతున్న నీటిని చూసి కొంతమంది వాహనదారులు సెల్ఫీలు దిగేందుకు పోటీ పడ్డారు. మేడిపూర్ వాసులు మిషన్ భగీరథ పర్యవేక్షణ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సమీపంలోని ఎంగంపల్లి చౌరస్తాలోని గేట్‌వాల్వ్ వద్ద నీటిని నిలిపివేశారు. అయినా రెండు గంటల పాటు నీటి ప్రవాహం అలాగే కొనసాగింది.

3 జిల్లాల జీవధార సంగారెడ్డి కెనాల్

- కొండపోచమ్మ సాగర్ నుంచి 127 కిలోమీటర్ల మేర కొత్త కాల్వ నిర్మాణం
- మెదక్ జిల్లాలో 45 వేలు, సంగారెడ్డిలో 30 వేలు, సిద్దిపేట జిల్లాలో 15 వేల ఎకరాలకు గోదావరి నీళ్లు
- రూ.1000 కోట్ల అంచనాతో ప్రతిపాదనలు సిద్ధం
- కాల్వ పనులకు త్వరలో సీఎం కేసీఆర్ గ్రీన్ సిగ్నల్
- వచ్చేనెలలో టెండర్లు పిలిచే అవకాశం


కొండ పోచమ్మ సాగర్ ప్రాజెక్టు వద్ద కొనసాగుతున్న పనులు (ఫైల్ ఫొటో)

సాక్షి, మెదక్: సాగు జలాలకు నోచుకోని మెదక్, సంగారెడ్డి జిల్లాలకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు మరోవరం ఇవ్వనున్నారు. ఈ రెండు జిల్లాల్లోని బీడు భూములకు గోదావరి జలాలను తరలించి సస్యశ్యామలం చేయనున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా కొండపోచమ్మ సాగర్ నుంచి తూప్రాన్, నర్సాపూర్ మీదుగా సంగారెడ్డి పట్టణంలోని మహబూబ్‌సాగర్ చెరువు వరకు 127 కిలోమీటర్ల మేర సంగారెడ్డి కెనాల్ నిర్మాణాన్ని కేసీఆర్ తలపెట్టారు. సుమారు రూ.1000 కోట్ల వ్యయంతో దీన్ని నిర్మించనున్నారు. ఈ కెనాల్ పూర్తయితే మెదక్ జిల్లాలోని 45 వేల ఎకరాలకుపైగా, సంగారెడ్డి జిల్లాలోని 30 వేల ఎకరాలు, సిద్దిపేట జిల్లాలోని 3 మండలాల్లో 15 వేల ఎకరాలకు మొత్తం 90 వేల ఎకరాలకు గోదావరి జలాలను పారించనున్నారు. మూడు జిల్లాలోని 62 గ్రామాల మీదుగా ఈ కెనాల్ వెళ్తుంది. దీనికి సంబంధించి డిజైన్లు, ప్రతిపాదనలను నీటిపారుదల శాఖ అధికారులు ప్రభుత్వానికి అందజేశారు. ఈ ప్రతిపాదనకు సీఎం కేసీఆర్ త్వరలోనే ఆమోదముద్ర వేసి, కెనాల్ నిర్మాణ పనులకు గ్రీన్‌సిగ్నల్ ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. పంచాయతీ ఎన్నికల కోడ్ ముగిసిన వెంటనే పనులకు సంబంధించి టెండర్లను పిలిచే అవకాశాలున్నాయి. ఏడాదిన్నరలో ఈ కెనాల్‌ను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నట్లు తెలుస్తోంది.

కాళేశ్వరం కెనాల్‌తో పాటు..

కాళేశ్వరం ప్రాజెక్టు నుంచి మెదక్, సంగారెడ్డి జిల్లాలకు గోదావరి జలాలు తరలించేందుకు మల్లన్నసాగర్ నుంచి సింగూరు వరకు కాళేశ్వరం కెనాల్ నిర్మాణం చేపట్టారు. ఈ కెనాల్ ద్వారా మెదక్, సంగారెడ్డి జిల్లాల్లో 60 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి సింగూరు వరకు 17, 18, 19 ప్యాకేజీ ద్వారా కాల్వ నిర్మించనున్నారు. దీంతో పాటు మెదక్ జిల్లాలోని తూప్రాన్, మనోహరాబాద్, శివ్వంపేట, నర్సాపూర్ మండలాలు, సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి, పటాన్‌చెరు, జిన్నారం, కంది మండలాలకు సాగునీరు ఇచ్చేందుకు కొత్తగా సంగారెడ్డి కెనాల్‌ను నిర్మించనున్నారు. 15 టీఎంసీల సామర్థ్యం ఉన్న కొండపోచమ్మ సాగర్ నుంచి 2.85 లక్షల ఎకరాలకు 9 కాల్వల ద్వారా సాగునీరు ఇవ్వాలని అధికారులు ప్రతిపాదించారు. ఇందులో మొదట సంగారెడ్డి కెనాల్ ప్రతిపాదన లేదు. తాజాగా సీఎం కేసీఆర్ సంగారెడ్డి కెనాల్ నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. కొండ పోచమ్మ సాగర్ 564 మీటర్ల ఎత్తులో ఉంది. అక్కడి నుంచి సంగారెడ్డి వరకు గ్రావిటీ ద్వారా సాగునీరు తరలించటం సులువని సర్వేలో తేలడంతో సంగారెడ్డి కెనాల్ నిర్మాణానికి ప్రభుత్వం ఓకే చెప్పింది. ఇందుకోసం కొండపోచమ్మ సాగర్ నుంచి 2.85 టీఎంసీల నీటిని కేటాయించనున్నారు.

అర్చకులకు రూ.20వేల పింఛన్ ఇవ్వాలి

అర్చక సమాఖ్య నేత గంగు ఉపేంద్ర శర్మ

హైదరాబాద్: ఆలయ అర్చకులకు పదవీ విరమణ అనంతరం రిటైర్‌మెంట్ బెనిఫిట్ కింద రూ.20 లక్షల గ్రాట్యుటీతో పాటుగా రూ.20 వేల పింఛన్ ఇవ్వాలని తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు గంగు ఉపేంద్రశర్మ సీఎం కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. తెలంగాణ అర్చక సమాఖ్య జిల్లాల అధ్యక్షులు, రాష్ట్ర కమిటీ ప్రతినిధుల ఆధ్వర్యంలో ఆదివారం అర్చక భవన్‌లో జరిగిన సమావేశంలో తీసుకున్న పలు కీలక నిర్ణయాలను ఉపేంద్రశర్మ మీడియాకు వెల్లడించారు. రాష్ట్ర ప్రజల సుఖసంతోషాల కోసం సీఎం కేసీఆర్ సోమవారం యాగం నిర్వహిస్తుండటం హర్షణీయమన్నారు. అర్చకులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి జీతాలు అందించిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. నగరంలోని అర్చక సమాఖ్య ఆధ్వర్యంలో వచ్చేనెల భారీ బహిరంగ సభను నిర్వహిస్తామని దీనికి టీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ హాజరవుతారని ఉపేంద్రశర్మ తెలిపారు. కార్యక్రమంలో అర్చక సమాఖ్య ప్రతినిధులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, చిన్నం మోహన్, భాస్కరభట్ల రామశర్మ పాల్గొన్నారు.


బాధితురాలిని అమ్మ అనాథాశ్రమం నిర్వాహకులకు అప్పగిస్తున్న అధికారులు

స్పందించిన హృదయాలు

- మానసిక వికలాంగురాలికి అండ
- కలెక్టర్ ఆదేశాలతో కదలిన జిల్లా అధికారులు
- అక్కున జేర్చుకున్న అమ్మ అనాథాశ్రమం
- సాక్షి కథనానికి స్పందన

నర్సంపేట: మానసిక వికలాంగురాలికి అధికారులు, స్థానిక మహిళలు అండగా నిలిచారు. సుమారు 28 సంవత్సరాల వయసు కలిగిన అనాథ మానసిక వికలాంగురాలయిన యువతి ఆకతాయిల చేతిలో వంచనకు గురైంది. గర్భవతి అయిన ఆమె వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట బస్టాండ్‌లో దిక్కుతోచని స్థితిలో ఉంది. ఆ అభాగ్యురాలి దీన పరిస్థితిపై 'ఇది కథకాదు'.. 'అనాథను అమ్మను చేశారు'.. శీర్షికలతో 'సాక్షి'జిల్లా టాబ్లాయిడ్, మెయిన్‌లో ఆదివారం ప్రచురితమైన కథనాలకు అధికారులతోపాటు స్థానికులు స్పందించారు. విషయం తెలుసుకున్న జిల్లా కలెక్టర్ హరిత, ఐసీడీఎస్ అధికారులతోపాటు నర్సంపేట మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్‌రావు ద్వారా యువతి వివరాలపై ఆరా తీశారు. బాధితురాలికి వైద్య పరీక్షలు నిర్వహించి, ఆమె సంరక్షణ బాధ్యతలు చూసుకోవాలని ఐసీడీఎస్ అధికారులను ఆదేశించారు. దీంతో జిల్లా చిల్డ్రన్స్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ మహేందర్‌రెడ్డి నర్సంపేట బస్టాండ్‌కు చేరుకుని యువతిని పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి ఫిర్యాదు చేశారు. అనంతరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా స్త్రీల వైద్య నిపుణురాలు డాక్టర్ నవనీత, పరీక్షలు నిర్వహించి ఆ యువతి 7 నెలల గర్భిణి అని నిర్ధారించారు. కడుపులోని పిండంతోపాటు తల్లి బలహీనంగా, అనారోగ్యంగా ఉందని.. సరైన పౌష్టికాహారం అవసరమని చెప్పారు. బాధితురాలి పోషణ చూసుకుంటానని వరంగల్ అర్బన్ జిల్లాలోని అమ్మ అనాథాశ్రమ నిర్వాహకురాలు డాక్టర్ శ్రీదేవి ఉన్నతాధికారులను కోరారు. కలెక్టర్ హరిత అనుమతితో ఆ యువతిని అమ్మ అనాథాశ్రమానికి తీసుకెళ్లారు.

శరవేగంగా బీటీపీఎస్ పనులు

- 1080 మెగావాట్ల విద్యుదుత్పత్తి లక్ష్యంతో రూ. 7,241 కోట్లతో నిర్మాణం
- ఈ ఏడాది డిసెంబర్ నాటికి పనులు పూర్తయ్యే అవకాశం


సాగుతున్న బీటీపీఎస్ నిర్మాణ పనులు

మణుగూరు టౌన్: భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు, పినపాక మండలాల సరిహద్దులోని చిక్కుడుగుంట గ్రామంలో చేపట్టిన భద్రాద్రి థర్మల్ పవర్ స్టేషన్ (బీటీపీఎస్) నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ఈ పనులకు 2015 మార్చి 28న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు శంకుస్థాపన చేశారు. తొలుత పనులు మందకొడిగా సాగినా ప్రస్తుతం వేగం పుంజుకున్నాయి. ఉన్నతాధికారులు నిరంతరం పనులను పర్యవేక్షిస్తున్నారు.

రికార్డు స్థాయిలో నిర్మాణాలు

రూ.7,241కోట్లతో 1179 ఎకరాల్లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ పవర్ ప్లాంట్ నిర్మాణం చేపట్టింది. ఒక్కో యూనిట్‌లో 270 మెగావాట్ల విద్యుదుత్పత్తి సామర్థ్యంతో నాలుగు యూనిట్లలో 1080 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసేలా దీనిని నిర్మిస్తున్నారు. ఇందుకు సబ్ క్రిటికల్ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. తొలుత నిర్మాణ వ్యయం రూ. 7,241 కోట్లు అనుకున్నప్పటికీ ప్రస్తుతం సుమారు రూ. 8వేల కోట్లకు చేరుతుందని అంచనా. 90 రోజుల్లో నిర్మించాల్సిన మొదటి యూనిట్ డ్రమ్‌లను కేవలం 65 రోజుల్లో నిర్మించి దేశంలో ఎక్కడా లేని విధంగా రెండు జాతీయ రికార్డులు నెలకొల్పారు. మూడో యూనిట్ డ్రమ్ సైతం కేవలం 75 రోజుల్లో నిర్మించారు. ఇప్పటివరకు మొదటి యూనిట్ నిర్మాణ పనులు సుమారు 85 శాతం వరకు పూర్తయినట్లు చెబుతున్నారు. జనవరి నెలాఖరులోపు 1వ యూనిట్‌లో ఉత్పత్తిని ప్రారంభించేందుకు పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ఏడాది మార్చిలోగా రెండో యూనిట్‌లో విద్యుత్ ఉత్పత్తిని ప్రారంభించాలనే లక్ష్యంతో అధికారులు పనులు చేస్తున్నారు. ప్రస్తుతం ఒక చిమ్నీ నిర్మాణం పూర్తయింది. మరొకటి 263 మీటర్ల ఎత్తు వరకు పూర్తయింది. 4 కూలింగ్ టవర్ బాయిలర్స్‌లో 2 పూర్తయ్యాయి. 400 కేవీ స్విచ్‌యార్డు పనులు దాదాపుగా పూర్తికావొచ్చాయి. ఈ ఏడాది డిసెంబర్ నాటికి ప్లాంట్ నిర్మాణ పనులన్నీ పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సీఎండీ ప్రభాకర్‌రావు ఎప్పటికప్పుడు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్నారు.

బొగ్గు రవాణా కోసం రైల్వే పనులకు సర్వే

ఇక్కడ విద్యుదుత్పత్తికోసం బొగ్గు, నీరు అవసరమవుతుంది. సింగరేణి నుంచి బొగ్గు రవాణాకు రైల్వే ట్రాక్ నిర్మాణం చేపట్టేందుకు సర్వే పూర్తి చేశారు. కోల్ బంకర్ పనులు దాదాపుగా పూర్తి కావొచ్చాయి. రోజుకు సుమారు 17 వేల టన్నుల బొగ్గు అవసరం ఉంటుంది. నీటి సరఫరా కోసం కొండాయిగూడెం సమీపంలో గోదావరి నది వద్ద ఇంటేక్ వెల్ నిర్మాణ పనులు ప్రారంభించారు.

ఎఫ్‌జీడి పరిజ్ఞానానికి అదనంగా రూ.680 కోట్లు

1080 మెగావాట్ల ఈ ప్లాంట్‌ను సబ్ క్రిటికల్ టెక్నాలజీతో నిర్మిస్తున్నారు. దీంతో చిమ్నీల నుంచి బూడిద అధికంగా వెలువడే అవకాశం ఉంది. దీన్ని తగ్గించేందుకు ఎఫ్‌జీడీ టెక్నాలజీని వినియోగిస్తున్నారు. ఇందుకోసం 680 కోట్ల రూపాయలను వెచ్చించనున్నారు. ప్లాంట్‌ను నిర్మిస్తున్న బీహెచ్‌ఈఎల్ సంస్థనే ఎఫ్‌జీడీ పరిజ్ఞానాన్ని సమకూర్చుతోంది.

డిసెంబర్ నాటికి పూర్తి..



ప్రస్తుతం ప్లాంట్‌లో 21 ఏజెన్సీలు పనులు నిర్వహిస్తున్నాయి. జెన్‌కో, భెల్ అధికారులు నిరంతరం శ్రమిస్తున్నారు. 3,600 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు రూ. 4 వేల కోట్లు ఖర్చు చేశాం. 2019 డిసెంబర్ నాటికి పవర్ ప్లాంట్ నిర్మాణం పూర్తి చేస్తాం. కార్మికుల క్వార్టర్స్ పనులు ప్రారంభించాల్సి ఉంది.

– బాలరాజు, సీఈ, భద్రాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్, మణుగూరు

యాదాద్రి ప్రాకారాలకు 28 రాజగోపురాలు

సాక్షి యాదాద్రి /యాదగిరికొండ: యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం పునర్నిర్మాణంలో భాగంగా నూతన ప్రధానాలయం ప్రాకారాలకు మొత్తం 28 చిన్న రాజగోపురాలు రానున్నాయి. 24 గోపురాలను అష్టభుజి మండపాలపై 8 అడుగుల ఎత్తులో ప్రతిష్ఠించనున్నారు. అదే విధంగా నాలుగు మూలల్లోని మండపాలపై మరో నాలుగు రాజగోపురాలు రానున్నాయి. ఇవి సుమారు 13 అడుగుల ఎత్తుతో ఉంటాయి. వీటి నిర్మాణం పూర్తయితే ఆలయం ఇంకా అందంగా కనిపించనుంది. నాలుగు మండపాలపై రానున్న గోపురాలను ఆలయంలోనికి వెళ్లాక కనిపించేలా నిర్మాణం చేస్తున్నారు. అష్టభుజి మండపాలపై వచ్చే గోపురాలు మాత్రం బయటికి స్పష్టంగా కనిపించనున్నాయి. వీటికి సంబంధించిన ప్లాన్లు సైతం రూపొందించారు. నిర్మాణ పనులు త్వరలో ప్రారంభంకానున్నాయి.

సుదర్శన విమాన రాజగోపురం పూర్తి

యాదాద్రి ప్రధానాలయ సప్తగోపుర నిర్మాణాల్లో అత్యంత ప్రధానమైన సుదర్శన విమాన రాజగోపుర నిర్మాణం పూర్తయింది. ఆలయ విస్తరణలో భాగంగా గర్భాలయంపై సుదర్శన విమాన రాజగోపురాన్ని నిర్మించారు. ఐదంతస్తుల్లో 50 వేల టన్నుల కృష్ణశిలలతో ఈ రాజగోపురాన్ని నిర్మించారు. దీనిపై సుదర్శన చక్రం ఏర్పాటు చేసిన అనంతరం పెద్ద ఎత్తున కుంభాభిషేకం చేపడుతారు. దీంతో స్వామి, అమ్మవార్లు కొలువైన గర్భాలయం పైన గల సుదర్శన రాజగోపురం భక్తుల మొక్కులను అందుకోనుంది. ఆలయ విస్తరణలో ఏడు రాజగోపురాలను నిర్మించిన విషయం తెలిసిందే. ఇందులో ఏడంతస్తుల మహారాజగోపురం చివరి దశ పనులు మినహా మిగతా ఆరుగోపురాల పనులు పూర్తయ్యాయి. గర్భాలయంపైన గల సుదర్శన విమాన రాజగోపురంపై దేవతా విగ్రహాల ఏర్పాటు పూర్తయింది. 10 ద్వారపాలకుల విగ్రహాలు, ప్రతి అంతస్తులో రెండు చొప్పున ఏర్పాటు చేశారు. మొత్తం 10 విగ్రహాల ఏర్పాటు పూర్తి కావడంతో శిల్పులు తమ పనులను ముగించుకున్నారు. అయితే ప్రధానాలయం ప్రారంభోత్సవ కార్యక్రమాల్లో భాగంగా స్వయంభువుల ప్రతిష్ఠ తర్వాత రాజగోపురంపై కలశాలను, సుదర్శన చక్రాలను ఏర్పాటు చేస్తారు. ఈ పనులన్నీ జీయర్లు, ఆచార్యులు, వేదపండితుల ఆధ్వర్యంలో జరుగుతాయి. ప్రస్తుతం పూర్తయిన రాజగోపురాలు యాదాద్రికి వచ్చే భక్తులకు కనువిందు చేస్తున్నాయి. అలాగే తిరుమాడ వీధులు, ముఖ మండపం, ఆలయంలో ఫ్లోరింగ్ పనులు చేపట్టడానికి వైటీడీఏ అధికారులు సిద్ధమవుతున్నారు.


కొత్త గోపురాలు రానున్న ఆలయ ప్రాకారం

అమ్మో.. అమెరికా..!

లూయిస్ కార్లోస్ సోల్డ్‌విల్లా మెక్సికో సిటీ హైస్కూల్‌లో మంచి మార్కులతో గ్రాడ్యుయేషన్ చేశాడు. తర్వాత బోస్టన్ యూనివర్సిటీలో కాని, వాషింగ్టన్ యూనివర్సిటీలోకాని చేరాలనుకున్నాడు. ఆ రెండు వర్సిటీలు కార్లోస్‌కు సీటు కూడా ఆఫర్ చేశాయి. అయితే, చివరికి కార్లోస్ ఈ రెండింటిలోనూ కాకుండా కెనడాలోని టొరంటో యూనివర్సిటీలో చేరాడు. అమెరికా వర్సిటీలు సీటివ్వడానికి ముందుకొచ్చినా కూడా కెనడాకెందుకు వెళ్లావని ప్రశ్నిస్తే 19 ఏళ్ల కార్లోస్ చెప్పిన సమాధానం 'అక్కడ ట్రంప్ లేడుగా' అని. ప్రస్తుతం 'అమెరికా చదువుల' పరిస్థితికి నిదర్శనమిది.

- విదేశీ విద్యార్థుల్ని భయపెడుతున్న ట్రంప్ సర్కారు
- అమెరికా వర్సిటీల్లో తగ్గుతున్న విదేశీ విద్యార్థులు

సురక్షితం కాదా!

కొన్ని దశాబ్దాలుగా అమెరికా ప్రపంచంలోని అత్యుత్తమ విద్యార్థులను ఆకట్టుకుంటోంది. అయితే ఇప్పుడు పరిస్థితి తిరగబడింది. విదేశీ విద్యార్థుల వల్ల అమెరికాకు ఏటా కోట్ల డాలర్ల ఆదాయం లభిస్తోంది. వేల ఉద్యోగాల కల్పన జరుగుతోంది. అయితే, ట్రంప్ సర్కారు విధానాలు వారిని భయపెడుతున్నాయి. దాంతో చదువుకోసం ఇక్కడికి వచ్చే బదులు ఇతర దేశాలకు వెళుతున్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ పథకాలు, తీసుకుంటున్న చర్యల కారణంగా విదేశీ విద్యార్థుల రాక తగ్గుతోంది. 2017–18లో అమెరికా విద్యా సంస్థల్లో విదేశీ విద్యార్థుల నమోదు 6.6 శాతం తగ్గిందని ఎన్ఏఎఫ్ఎస్ఏ (అసోసియేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ ఎడ్యుకేటర్స్) డైరెక్టర్ రాచెల్ బ్యాంక్స్ చెప్పారు. వీసా మంజూరులో జాప్యం, వీసాల తిరస్కరణ, దేశంలో సామాజిక, రాజకీయ వాతావరణం, చదువుకయ్యే ఖర్చు పెరగడం వంటి కారణాల వల్ల విదేశీ విద్యార్థుల రాక తగ్గుతోందన్నారు. ట్రంప్ ప్రభుత్వం వలస విధానాలను కఠినతరం చేయడం అంటే ముస్లిం దేశాల ప్రజలను అనుమతించకపోవడం, అక్రమంగా వచ్చిన వాళ్లలో తలిదండ్రులను, పిల్లలను వేరువేరుగా బంధించడం వంటి వాటివల్ల విదేశీ విద్యార్థులు వారి తల్లిదండ్రుల్లో అమెరికా సురక్షితం కాదన్న భావన పెరుగుతోందన్నారు.



విదేశీ విద్యార్థులే ఆధారం

విదేశీ విద్యార్థుల వల్ల కాలిఫోర్నియా, న్యూయార్క్, మసాచుసెట్స్, టెక్సాస్, పెన్సిల్వేనియాలు ఎక్కువ లాభపడ్డాయి. విద్య, ముఖ్యంగా ఉన్నత విద్య అమెరికా అందించే ప్రధాన సేవ. మనం ఈ సేవను అందించడం వల్ల విదేశీయులు దేశంలోకి డబ్బు పంపుతున్నారు. మనం సోయా లేదా బొగ్గును విదేశాలకు పంపితే ఎలాంటి ఆర్థిక ప్రయోజనం కలుగుతుందో అలాంటిదే వీరివల్ల కలుగుతోంది' అని కాలిఫోర్నియా వర్సిటీ ప్రొఫెసర్ డిక్ స్టార్ట్జ్ 2017లో బ్రూకింగ్స్ ఇనిస్టిట్యూషన్ బ్లాగ్‌లో రాశారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాల దగ్గర డాలర్లు నిండుకున్నప్పుడు విద్యాసంస్థలు విదేశీ విద్యార్థులను ట్యూషన్లకు ఉపయోగించుకుంటాయన్నారు.

- అమెరికాలోని విదేశీ విద్యార్థులు **10,00,000**
- వీరి వల్ల 2017-18లో వచ్చిన ఆదాయం **3,900** కోట్ల డాలర్లు
- కొత్తగా ఏర్పడిన ఉద్యోగాలు **4,55,000**
- అమెరికాలో చదువుకునేందుకు వచ్చే విదేశీ విద్యార్థులకు జారీచేసిన ఎఫ్-1 వీసాలు

2015లో	2017లో
6,44,000	3,94,000

కీలక రంగాల్లో వెనకే!

సైన్స్, ఇంజనీరింగ్ వంటి కీలక రంగాలకు సంబంధించిన ఉన్నత విద్యలో అమెరికా ఇతర దేశాల కంటే వెనకబడి ఉంది. ఈ రంగాల్లో విదేశీ విద్యార్థులు లేకుండా అమెరికా పని చేయలేదని నేషనల్ ఫౌండేషన్ ఫర్ అమెరికన్ పాలసీ 2017 నాటి నివేదిక హెచ్చరించింది. దాదాపు 90శాతం అమెరికా వర్సిటీల్లో కంప్యూటర్ సైన్స్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ కోర్సుల్లో మాస్టర్ డిగ్రీ ,పీహెచ్‌డీలు చేసే వారిలో అత్యధికులు విదేశీ విద్యార్థులే. ఆస్ట్రేలియా, కెనడా వంటి దేశాలు విదేశీ మేధావుల్ని ఆకట్టుకుంటున్నాయని నార్త్‌వెస్ట్రన్ యూనివర్సిటీ డైరెక్టర్ రవి శంకర్ అన్నారు.

లిబియా తీరంలో ప్రమాదం నుంచి బయటపడిన వలసదారుల హర్షం



మధ్యధరాలో 170 మంది జలసమాధి!

ట్రిపోలీ: ఉత్తర ఆఫ్రికా నుంచి యూరప్ బయల్దేరిన రెండు పడవలు మధ్యధరా సముద్రంలో మునిగిపోయిన ప్రమాదాల్లో కనీసం 170 మంది చనిపోయి ఉంటారని భావిస్తున్నారు. అందులో ఒకటి లిబియా తీరంలో మునిగిపోగా, మరొకటి మొరాకో సమీపంలో మరో పడవను ఢీకొట్టి గల్లంతైనట్లు తెలిసింది. లిబియా తీరంలో ప్రమాదానికి గురైన పడవలో 120 మంది ప్రయాణిస్తున్నారని, అందులో ముగ్గురిని ప్రాణాలతో కాపాడినట్లు ఇటలీ నేవీ ప్రకటించింది. మిగతా వారి జాడ తెలియాల్సి ఉందని తెలిపింది. మొరాకో సమీపంలో వేరే పడవ మరో పడవను ఢీకొనడంతో 53 మంది వలసదారులు గల్లంతైనట్లు స్పెయిన్ సహాయక బృందాలు వెల్లడించాయి. ఈ రెండు ప్రమాదాల్లో ఎందరు మృతిచెందారో ఐక్యరాజ్య సమితి శరణార్థుల సంస్థ ధ్రువీకరించాల్సి ఉంది. ఇదిలా ఉండగా, లిబియాకు ఉత్తరంగా ఉన్న జువారా పట్టణంలో ప్రమాదంలో చిక్కుకున్న పడవ నుంచి 47 మందిని కాపాడినట్లు జర్మనీ సహాయక బృందాలు తెలిపాయి. గత ఏడాది మధ్యధరాలో 2 వేల మందికి పైగా వలసదారులు మృతి చెందడమో, గల్లంతవడమో జరిగింది.

అవినీతి.. అస్థిరత.. వ్యతిరేకభావం

- వాటి కలబోతే మహాకూటమి
- నాలుగున్నరేళ్లలో దేశం వేగంగా అభివృద్ధి చెందింది
- బీజేపీ కార్యకర్తలతో మోదీ



ముంబై/ మర్గోవా: కోల్‌కతా వేదికగా సంఘీభావం తెలిపిన ప్రతిపక్ష నేతలది అవినీతి, వ్యతిరేకభావం, అస్థిరతలతో కూడిన మహాకూటమి అని ప్రధాని మోదీ అభివర్ణించారు. పేద వర్గాలకు పది శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తాము తీసుకున్న వచ్చిన చట్టంతో ప్రతిపక్షాలకు నిద్ర కరువైందన్నారు. గతంలో బలహీనంగా ఉన్న భారత్ బీజేపీ నాలుగున్నరేళ్ల పాలనలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా మారిందని చెప్పారు. ఆదివారం ఆయన మహారాష్ట్రలోని కొల్హాపూర్, హట్కనంగ్లే, మాఢా, సతారా, దక్షిణ గోవా లోక్‌సభ నియోజకవర్గాల బూత్ స్థాయి కార్యకర్తలతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. మహాకూటమి నేతలది ధనబలం కాగా తమది ప్రజాబలం అన్నారు. తమ కూటమి 125 కోట్ల భారతీయుల ఆకాంక్షలు, ఆశలు, కలలతో ముడిపడి ఉందన్నారు. 'కోల్‌కతా సభా వేదికపై ఉన్న వారంతా బడా నేతల కుమారుడు/కుమార్తె లేదా తమ కుమారుడు/కుమార్తెను రాజకీయాల్లోకి తేవాలని ఆశపడే వారే. తమ పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యంపై నమ్మకం లేని వారు ఇప్పుడు ప్రజాస్వామ్యంపై బహిరంగంగా ఉపన్యాసాలిస్తున్నారు' అని దెప్పి పొడిచారు. ఎన్నికల్లో అన్ని రకాల అక్రమాలకు పాల్పడటమే వారి లక్ష్యమన్నారు. 'లోక్‌సభ ఎన్నికల్లో పరాజయం తప్పదని ముందుగానే ఊహించిన ప్రతిపక్షాలు ఈవీఎంలను సాకుగా చూపాలనుకుంటున్నాయి. పెట్టుబడిదారులు, కుంభకోణాలు, అవినీతి, అపనమ్మకం, అస్థిరతల కలయికే మహాకూటమి' అని ఎద్దేవా చేశారు.

బలహీనం నుంచి అభివృద్ధివైపు పయనం

గత ప్రభుత్వాల పాలనతో బీజేపీ నాలుగున్నరేళ్ల పాలనను పోలుస్తూ ప్రధాని.. 'బీజేపీ అధికారంలోకి వచ్చే సమయానికి దేశ ఆర్థిక వ్యవస్థ బలహీనంగా ఉంది. విద్యుత్ కొరత, ఆర్థిక సంక్షోభాలతో కొట్టుమిట్టాడుతోంది. కుంభకోణాల గురించిన వార్తలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో భారత్ పేరు వినబడేది. ఇప్పుడు కుంభకోణాల(స్కాంల) ప్రస్తావనే లేదు. కేవలం కొత్త పథకాల(స్కీంల) గురించే చర్చ జరుగుతోంది. గత నాలుగున్నరేళ్లలో ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న దేశంగా మారింది. ప్రపంచం ఇప్పుడు భారత్‌ను నమ్మకం, విశ్వాసంతో చూస్తోంది. అప్పట్లో దేశంలోని 98 శాతం మందికి టాయిలెట్ సౌకర్యం అందుబాటులోకి వచ్చింది' అని తెలిపారు.

పేదలకు రిజర్వేషన్లతో విపక్షాలకు నిద్ర కరువు

ఆర్థికంగా బలహీన వర్గాల వారికి విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో 10 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న ప్రభుత్వ సంకల్పంతో ప్రతిపక్ష నేతలకు నిద్ర కరువైందని ప్రధాని వ్యాఖ్యానించారు. 'మా నిర్ణయానికి తగు కారణం లేనట్లయితే, వాళ్లకు అశాంతి కరువయ్యేది కాదు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా అబద్ధాలు, పుకార్లను వ్యాప్తి చేసేందుకు రంగంలోకి దిగేవాళ్లు. వాళ్లు అలా చేయడం లేదంటే దానర్థం.. దేశ ప్రజల కోసం ప్రభుత్వం మంచి పని చేసిందనే కదా' అని అన్నారు. రిజర్వేషన్ల కారణంగా సీట్ల కొరత తలెత్తకుండా ఈ విద్యా సంవత్సరం నుంచే విద్యా సంస్థల్లో సీట్ల సంఖ్యను పది శాతం పెంచుతున్నట్లు వివరించారు. 'ప్రతి ఒక్కరూ సమాన అవకాశాలు పొందాలన్నదే తమ అభిమతం. ఎన్నికలను దృష్టిలో పెట్టుకునే ప్రభుత్వం రిజర్వేషన్లపై చట్టం చేసిందన్న ప్రతిపక్షాల విమర్శలపై ఆయన మాట్లాడుతూ.. ఈ నిర్ణయాన్ని తాము ఎప్పుడు ప్రకటించినా వాళ్లు ఇలాంటి ఆరోపణలే చేసే వారని వ్యాఖ్యానించారు.

ఒకేసారి సూపర్ మూన్.. చంద్ర గ్రహణం



న్యూఢిల్లీ: ఆకాశంలో మరో అద్భుతానికి వేళయింది. ఓ వైపు సంపూర్ణ చంద్ర గ్రహణం, మరోవైపు సూపర్ మూన్ ఒకేసారి దర్శనమివనున్నాయి. ప్రాంతాన్ని బట్టి ఆదివారం అర్ధరాత్రి లేదా సోమవారం వేకువజామున ఇది చోటుచేసుకోనుంది. సుమారు మూడు గంటల పాటు కొనసాగే ఈ దృశ్యం ఆసియా, ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ ప్రాంత ప్రజలకు కనిపించదు. ఉత్తర, దక్షిణ అమెరికా, ఐస్‌లాండ్, గ్రీన్‌లాండ్, స్వీడన్, నార్వే, బ్రిటన్, పోర్చుగల్ , ఫ్రాన్స్, స్పెయిన్ తదితర దేశాల్లో ఈ సంపూర్ణ చంద్రగ్రహణం, సూపర్‌మూన్‌లను పూర్తిగా వీక్షించొచ్చు. 2019, 20 సంవత్సరాల్లో చోటుచేసుకోబోతున్న ఏకైక సంపూర్ణ చంద్రగ్రహణం ఇదే. చంద్రుడు భూమికి సమీపంగా రావడం వల్ల సాధారణం కన్నా ప్రకాశవంతంగా మెరుస్తూ సూపర్‌మూన్‌లా కనిపిస్తాడు. ఈ ఏడాది మరో రెండు సూపర్ మూన్‌లు కనిపించనున్నాయి.

నెలాఖరుకల్లా సంపూర్ణ విద్యుదీకరణ

న్యూఢిల్లీ: భారత్ సంపూర్ణ విద్యుదీకరణ సాధించేందుకు సమయం ఆసన్నమైంది. ఈ నెలాఖరుకల్లా దేశంలో 100 శాతం గృహాలు విద్యుదీకరణ సాధించనున్నాయి. సౌభాగ్య పథకం కింద మొత్తం 2.48 కోట్ల కుటుంబాలు లక్ష్యంగా పెట్టుకోగా రూ.16,320 కోట్ల వ్యయంతో 2.44 కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చారని సంబంధిత అధికారి ఒకరు చెప్పారు. 'రోజుకు 30వేల కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు ఇస్తున్నాం. దీంతో మిగిలిన 4 లక్షల కుటుంబాలకు ఈ నెలాఖరులోగా విద్యుత్ కనెక్షన్ ఇస్తాం' అని ఆయన తెలిపారు. ప్రధానమంత్రి సహజ్ బిజిలీ హర్ ఘర్ యోజన (సౌభాగ్య) అనే పథకం 2017 సెప్టెంబర్‌లో ప్రారంభమైంది.

అత్యంత పెద్ద వయస్కుడు కన్నుమూత



టోక్యో: ప్రపంచంలోనే అత్యంత పెద్ద వయస్కుడు, జపాన్‌కు చెందిన మసాజో నొనాకా(113) ఆదివారం కన్ను మూశారు. నొనాకాకు ఎలాంటి అనారోగ్య సమస్యలు లేవని, సహజ కారణాలతోనే ప్రశాంతంగా చనిపోయారని ఆయన కుటుంబ సభ్యులు చెప్పారు. ఉత్తర జపాన్‌లోని హొక్కాయిడో దీవిలో ఆయన కుటుంబ సభ్యులు నాలుగు తరాలుగా రెస్టారెంట్ వ్యాపారం చేస్తున్నారు. గతేడాది ఏప్రిల్‌లో గిన్నిస్ బుక్ నొనాకాను సజీవంగా ఉన్న అత్యంత వృద్ధ పురుషునిగా గుర్తించింది. అప్పుడు ఆయన వయసు 112 ఏళ్ల 259 రోజులు. 1905లో జన్మించిన నొనాకా..తన ఏడుగురు తోబుట్టువులు, భార్య, ముగ్గురు పిల్లల కన్నా ఎక్కువ కాలం జీవించారు. ప్రపంచంలోనే సజీవంగా ఉన్న అతిపెద్ద వయసున్న మనిషిగా రికార్డులకెక్కిన 116 ఏళ్ల కేన్ తనాకా(మహిళ) కూడా జపాన్‌కు చెందిన వారే.

తిరుచిరాపల్లిలో 'డిఫెన్స్ కారిడార్'

తిరుచిరాపల్లి: రక్షణ పరిశ్రమల కారిడార్ ఏర్పాటు ద్వారా దేశంలో స్వదేశీ రక్షణ రంగ ఉత్పత్తుల జోరు పెరుగుతుందని రక్షణమంత్రి నిర్మలా సీతారామన్ పేర్కొన్నారు. తమిళనాడులోని తిరుచిరాపల్లిలో ఏర్పాటు చేసిన రక్షణ పరిశ్రమల కారిడార్‌ను సీతారామన్ ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...ఈ రక్షణ పరిశ్రమల కారిడార్‌కు రూ.3.038 కోట్లకు పైగా కేటాయిస్తున్నామన్నారు. ఈ కారిడార్‌లో చెన్నై, హోసూర్, సలేమ్, కోయంబత్తూర్, తిరుచిరాపల్లి సహా నాలుగు నోడల్ నగరాలు ఉంటాయని పేర్కొన్నారు.

శబరిమల ఆలయం మూసివేత

శబరిమల: అత్యంత ఉద్రిక్త పరిస్థితుల మధ్య రెండునెలల పాటు కొనసాగిన శబరిమల వార్షిక పూజలు ఆదివారంతో ముగిశాయి. రుతుస్రావం వయస్సులో ఉన్న మహిళలను కూడా ఆలయంలోకి అనుమతించాలన్న సుప్రీం కోర్టు ఉత్తర్వుల నేపథ్యంలో అధికార వామపక్ష, ప్రతిపక్ష బీజేపీ శ్రేణుల నిరసనలు, ఆందోళనలతో రాష్ట్రం అట్టుడికిన విషయం తెలిసిందే. 67 రోజుల అనంతరం ఆదివారం ఉదయం 6.15 గంటలకు పండాలం రాజకుటుంబానికి చెందిన పి.రాఘవ వర్మ రాజా దర్శనం అనంతరం భస్మాభిషేకం పూజతో ఆలయ మహద్వారాన్ని మూసివేశారు. తిరిగి ఫిబ్రవరి 13వ తేదీన మళయాళం నెల కుంభం సందర్భంగా పూజల కోసం ఆలయాన్ని తెరుస్తారు.

సాహస బాలల ఎంపిక బాధ్యత కేంద్రానిదే

న్యూఢిల్లీ: అత్యంత ధైర్యసాహసాలు, ప్రతిభా పాటవాలు ప్రదర్శించిన చిన్నారులకు ఏటా ప్రదానం చేసే 'జాతీయ సాహస బాలల అవార్డుల' (నేషనల్ అవార్డ్స్ ఫర్ చిల్డ్రన్) ఎంపిక ప్రక్రియను ఈసారి కేంద్ర ప్రభుత్వమే చేపట్టినట్లు తెలుస్తోంది. ఈ అవార్డులకు అర్హులను ఎంపిక చేసే ఎన్జీవోపై అవినీతి ఆరోపణలు రావడంతో ఈ నిర్ణయం తీసుకుంది. వీరందరికీ గణతంత్ర దినోత్సవం నాడు రాష్ట్రపతి అవార్డులు ప్రదానం చేయనున్నారు.

జల్లికట్టుకు 'గిన్నిస్'లో చోటు

- ఒకేసారి రంగంలోకి 1,354 ఎద్దులు, 424 మంది క్రీడాకారులు
- ఇద్దరు మృతి, 31 మందికి గాయాలు



నిర్వాహకులకు గిన్నిస్ రికార్డు సర్టిఫికెట్ అందజేస్తున్న ప్రతినిధులు

సాక్షి, చెన్నై: తమిళుల సాహసక్రీడ జల్లికట్టు గిన్నిస్ రికార్డుల్లో స్థానం సంపాదించుకుంది. ఆదివారం పుదుకోట్టై జిల్లా విరాళిమలైలో జరిగిన జల్లికట్టుకు గిన్నిస్ ప్రతినిధులు హాజరై నిర్వాహకులకు సర్టిఫికెట్ అందజేశారు. అయితే, ఈ క్రీడ తిలకించేందుకు వచ్చిన ఇద్దరు ప్రాణాలు కోల్పోగా ఎద్దులను అదుపులోకి తెచ్చేందుకు యత్నించి 31 మంది గాయాలపాలయ్యారు. గిన్నిస్ రికార్డుల్లో చోటు సంపాదించాలన్న ప్రయత్నంలో భాగంగా విరాళి మలైలో జల్లికట్టుకు ప్రత్యేక ఏర్పాట్లు జరిగాయి. 1,354 ఎద్దులను రంగంలోకి దించిన నిర్వాహకులు వీటిని పట్టుకునేందుకు మాత్రం 424 క్రీడాకారులనే అనుమతించారు. తొలుత 2,000కుపైగా ఎద్దులను బరిలోకి దించాలని భావించినప్పటికీ సమయాభావం కారణంగా కుదరలేదు. పోటీలో ఎద్దుల సంఖ్య ఎక్కువ, పాల్గొనేవారి సంఖ్య తక్కువ కావడంతో క్రీడాకారులతో పాటు సందర్శకులకు కూడా వైద్య బీమా కల్పించారు. ఎద్దులతో జరిగిన పోరులో దాదాపు 31 మంది గాయపడ్డారు. తిలకించేందుకు వచ్చిన వారిపైకి ఎద్దులు దూసుకు పోవడంతో రాము(25), సతీష్(43) అనే వారు ప్రాణాలు కోల్పోయారు. బసవన్నలను అదుపు చేసిన విజేతలకు నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కాగా, భారీ ఎత్తున జరిగిన ఈ కార్యక్రమానికి గిన్నిస్ రికార్డు దక్కినందుకు లభించడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

గోడకు నిధులిస్తే.. డ్రీమర్లకు గడువిస్తా

- డెమొక్రాట్లకు ట్రంప్ ప్రతిపాదన
- ట్రంప్ ఆఫర్‌ను తిరస్కరించిన స్పీకర్ పెలోసీ



వాషింగ్టన్: అమెరికాలో కొనసాగుతున్న షట్‌డౌన్‌కు ముగింపు పలికేందుకు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ రాజీ ప్రతిపాదనను తెరపైకి తెచ్చారు. డెమొక్రాట్లు మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి ఆమోదం తెలిపితే, దాదాపు 7 లక్షల మంది డ్రీమర్లకు(బాల్యంలోనే అమెరికాకు అక్రమంగా వచ్చినవారు) మూడేళ్ల పాటు తాత్కాలిక రక్షణ హోదా కల్పిస్తామని ట్రంప్ ప్రకటించారు. వైట్‌హౌస్ నుంచి శనివారం(స్థానిక కాలమానం) ప్రజలు, రాజకీయ నేతలనుద్దేశించి ప్రసంగించిన ట్రంప్.. 'వాషింగ్టన్‌లోని రెండు పక్షాలు(రిపబ్లికన్లు, డెమొక్రాట్లు) ఓ అంగీకారానికి రావాల్సిన అవసరం ఉంది. దేశంలోని 7,00,000 మంది డ్రీమర్లకు మరో మూడేళ్ల పాటు తాత్కాలిక రక్షణ హోదా(టీపీఎస్) కల్పిస్తాం. స్వదేశాల్లో హింస, అంతర్యుద్ధం కారణంగా అమెరికాలో ఉంటున్న 3 లక్షల మంది విదేశీయులకు టీపీఎస్‌ను మూడేళ్ల పాటు పొడిగిస్తాం. ఇందుకు ప్రతిగా అమెరికా–మెక్సికో సరిహద్దులో గోడ నిర్మాణానికి ఆమోదం తెలపాల్సి ఉంటుంది' అని ట్రంప్ స్పష్టం చేశారు. అమెరికా–మెక్సికో సరిహద్దులో గోడ కోసం 5.7 బిలియన్ డాలర్లు(రూ.40,615 కోట్లు) ఇవ్వాలని ట్రంప్ కోరుతున్న సంగతి తెలిసిందే. అధ్యక్షుడి ప్రతిపాదన ఆచరణసాధ్యం కాదని డెమొక్రటిక్ నేత, ప్రతినిధుల సభ స్పీకర్ నాన్సీ పెలోసీ స్పష్టం చేశారు. ప్రభుత్వాన్ని షట్‌డౌన్ చేయడాన్ని ట్రంప్ గర్వంగా భావిస్తున్నారనీ, దీనిని ఎత్తివేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మాయావతి హిజ్రా కన్నా అధ్వానం

బీజేపీ ఎమ్మెల్యే సాధనా సింగ్ నోటి దురుసు



చందౌలి(యూపీ): బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత్రి, యూపీ మాజీ సీఎం మాయావతిపై బీజేపీ ఎమ్మెల్యే సాధనా సింగ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తాజాగా యూపీలో ఎస్పీ–బీఎస్పీ పొత్తుపై ఆమె ఓ బహిరంగ సభలో మాట్లాడుతూ..'అధికారం కోసం గౌరవాన్ని వదులుకున్న మాయావతి తనపై దాడిచేసిన వారితోనే చేతులు కలిపారు. ఆమె ఆడజాతికే కళంకం లాంటిది. అసలు మాయావతి ఆడో, మగో చెప్పలేం. ఆమె హిజ్రా కంటే అధ్వానమైన వ్యక్తి' అని దుర్భాషలాడారు. దీంతో ఈ వ్యాఖ్యలను సుమోటోగా విచారణను స్వీకరిస్తున్నట్లు జాతీయ మహిళా కమిషన్ చైర్మన్ రేఖ శర్మ తెలిపారు. సోమవారం నోటీసులు జారీచేస్తామన్నారు. మరోవైపు సాధనా సింగ్ వ్యాఖ్యలను కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథావలే, ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్, బీఎస్పీ నేత ఎస్సీ మిశ్రా, కాంగ్రెస్ నేత ప్రియాంకా చతుర్వేది ఖండించారు. 1995లో లక్నోలోని ఓ గెస్ట్‌హౌస్‌లో బీఎస్పీ నేతలతో సమావేశమైన మాయావతిపై ఎస్పీ కార్యకర్తలు దాడి చేశారు.

ఐదు గదులు... ప్రత్యేక కిచెన్

- శశికళకు జైల్లో ప్రత్యేక మర్యాదలు నిజమే
- తేల్చిన విచారణ కమిటీ



బెంగళూరు: ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన కేసులో జైలుశిక్ష అనుభవిస్తున్న అన్నా డీఎంకే మాజీ నాయకురాలు శశికళకు జైలులో ప్రత్యేక మర్యాదలు, సౌకర్యాలు కల్పించారని విచారణ కమిటీ తేల్చింది. ఆర్టీఐ కార్యకర్త నరసింహ మూర్తి దాఖలుచేసిన అర్జీకి ఈ మేరకు సమాధానం లభించింది. బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలులో శశికళకు ప్రత్యేక కిచెన్‌తో పాటు, ఐదు గదులు కల్పించారని అప్పటి డీఐజీ(జైళ్లు) డి. రూప ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ ఆరోపణలు నిజమేనని విచారణ జరిపిన రిటైర్డ్ ఐఏఎస్ అధికారి వినయ్ కుమార్ కమిటీ నివేదిక ధ్రువీకరించింది. ఆర్టీఐ అర్జీ ద్వారా ఆ కమిటీ నివేదికను సంపాదించానని, శశికళకు ప్రత్యేక మర్యాదలు జరిగిన సంగతి నిజమేనని దీని ద్వారా తెలుస్తోందని నరసింహ మూర్తి చెప్పారు. కాగా ఈ పరిణామంపై రూప స్పందిస్తూ..తాను ఆనాడు చెప్పిన విషయాల్నే విచారణ కమిటీ ధ్రువీకరించిందని పేర్కొన్నారు. వినయ్ కుమార్ తన నివేదికను 2017లో ప్రభుత్వానికి సమర్పించారు. జైలులో శశికళ తనకు నచ్చిన దుస్తులు ధరించి వంట చేసుకునేవారని, ఆమె సెల్‌లో సుగంధ ద్రవ్యాలు లభించాయని ఆ నివేదిక పేర్కొంది. జైలులో ఆమె స్వేచ్ఛగా సంచరించేవారని, తన సహచరిణి ఇళవరసితో కలసి బయటికి వెళ్తున్నట్లు వీడియోలో కనిపించిందని తెలిపింది. 2017 జూన్ 11న తెలుపు రంగు చొక్కా, ప్యాంటు ధరించిన ఓ వ్యక్తితో శశికళ సుమారు నాలుగు గంటలు మాట్లాడినట్లు పేర్కొంది. కానీ, ఆ వ్యక్తితో శశికళ 45 నిమిషాలే మాట్లాడినట్లు రిజిస్టర్‌లో నమోదైంది.

రిసార్టులో ఎమ్మెల్యేల బాహాబాహీ

- ఆనంద్ సింగ్‌పై మద్యం బాటిల్‌తో గణేశ్ దాడి
- 12 కుట్లు వేసిన అపోలో వైద్యులు
- కర్ణాటకలోని ఈగల్‌టన్ రిసార్టులో రసాభాస



ఆనంద్‌సింగ్



గణేశ్

సాక్షి, బెంగళూరు: కర్ణాటకలోని బెంగళూరు శివార్లలో ఉన్న ఈగల్‌టన్ రిసార్టులో కలకలం చెలరేగింది. ఈ రిసార్టులో శనివారం రాత్రి కాంగ్రెస్ నేతలు భోజనం చేస్తుండగా కంప్లి ఎమ్మెల్యే జె.ఎన్.గణేశ్, హోసపేటె ఎమ్మెల్యే, గనుల వ్యాపారి ఆనంద్ సింగ్‌ల మధ్య వాగ్వాదం జరిగింది. దీంతో సహనం కోల్పోయిన గణేశ్ టేబుల్‌పై ఉన్న మద్యం బాటిల్‌తో ఒక్కసారిగా ఆనంద్‌సింగ్‌పై దాడిచేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడ్డ ఆనంద్‌సింగ్‌ను నేతలు అపోలో ఆసుపత్రికి తరలించగా, వైద్యులు ఆయనకు 12 కుట్లు వేశారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగానే ఉందని వైద్యులు తెలిపారు. కాగా, ఆసుపత్రి ముందు మోహరించిన పోలీసులు ప్రస్తుతం రాజకీయ నేతలెవరినీ లోపలకు వెళ్లనివ్వడం లేదు. ఈ గొడవ విషయమై కాంగ్రెస్ అధికార ప్రతినిధి, నిజామాబాద్ ఎంపీ మధుయాష్కి మాట్లాడుతూ..'బళ్లారి జిల్లాకు చెందిన గణేశ్, ఆనంద్ సింగ్ ఇద్దరూ పలు వ్యాపారాల్లో భాగస్వాములుగా ఉన్నారు. ఈ నేపథ్యంలో ఓ వ్యాపారానికి సంబంధించి ఇద్దరి మధ్య వాగ్వాదం జరిగింది. అదికాస్తా ముదరడంతో గణేశ్, ఆనంద్ సింగ్‌పై దాడిచేశారు. ఈ దాడికి, రాజకీయాలకు ఎలాంటి సంబంధం లేదు' అని స్పష్టం చేశారు.


రహస్య సమాచారం లీక్ చేశాడనే..

ఈగల్‌టన్ రిసార్టులో రెండ్రోజులుగా గణేశ్, ఆనంద్ సింగ్ మధ్య వాగ్వాదం కొనసాగుతున్నట్లు సమాచారం. కాంగ్రెస్–జేడీఎస్ ప్రభుత్వాన్ని పడగొట్టడంలో భాగంగా బీజేపీ నేతలు గణేశ్‌ను సంప్రదించారు. ఈ సందర్భంగా బీజేపీ నేతలు తనను సంప్రదించిన విషయాన్ని, ఇస్తామన్న ఆఫర్‌ను గణేశ్ ఆనంద్‌సింగ్‌తో పంచుకున్నారు. సరిగ్గా ఇదే సమయంలో కాంగ్రెస్ సీఎల్పీ భేటీకి విప్ జారీచేయడంతో గణేశ్ గత్యంతరం లేక హాజరయ్యారు. సమావేశం అనంతరం సీనియర్లు ముందు జాగ్రత్తగా ఎమ్మెల్యేలను నేరుగా రిసార్టుకు తరలించారు. ఈ సందర్భంగా గణేశ్‌ను బీజేపీ ప్రలోభపెట్టిన విషయాన్ని ఆనంద్‌సింగ్ సీఎం కుమారస్వామి, సీఎల్పీ నేత సిద్దరామయ్య చెవిన వేశారు. ఈ విషయం తెలుసుకున్న గణేశ్ ఆగ్రహంతో ఊగిపోయారు. చివరికి మాటామాటా పెరగడంతో ఆనంద్‌సింగ్ తలపై మద్యం బాటిల్‌తో దాడిచేశారు. కాగా, తన భర్తపై దాడిచేసిన వారిపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని ఆనంద్‌సింగ్ భార్య ప్రకటించారు. మరోవైపు ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని బిదాది పోలీసులు తెలిపారు.

బీజేపీ విమర్శలు

ఈగల్‌టన్ రిసార్టులో జరిగిన ఘటన ప్రజాస్వామ్యానికే కళంకమని బీజేపీ విమర్శించింది. ఈ గొడవను రాష్ట్ర పీసీసీ చీఫ్ గుండూరావు ఆపలేకపోవడం నిజంగా దురదృష్టకరమని ఎద్దేవా చేసింది. ఇన్నాళ్లూ ప్రతీ సమస్యకు బీజేపీనే కారణమని ఆరోపించిన గూండూరావు ఇప్పుడేం చేస్తారని ప్రశ్నించింది. మరోవైపు కర్ణాటక బీజేపీ చీఫ్ యడ్యూరప్ప ఆదేశాల మేరకు ఆ పార్టీ ఎమ్మెల్యేలంతా రాష్ట్రానికి తిరిగివస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలోనే గవర్నర్ వజూభాయ్ వాలాను కలిసి కుమారస్వామి సర్కారును బలనిరూపణకు ఆదేశించాల్సిందిగా కమలనాథులు కోరే అవకాశమున్నట్లు సమాచారం.

మోదీ నిరంకుశత్వం నుంచి విముక్తి కావాలి



న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ నిరంకుశత్వం, అసమర్థత నుంచి విముక్తి పొందాలని ప్రజలు కోరుతున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ అన్నారు. 'బచావో..బచావో' అంటూ విపక్షాలు రోదిస్తున్నాయని మోదీ ఎద్దేవా చేసిన మరుసటి రోజే రాహుల్ తిప్పికొట్టారు. కోల్‌కతాలో విపక్ష ర్యాలీపై మోదీ స్పందిస్తూ..పశ్చిమ బెంగాల్‌లో తమకు ఒక్క ఎమ్మెల్యేనే ఉన్నారని, అయినా తమని చూసి విపక్షాలు భయపడుతున్నాయని పేర్కొన్న సంగతి తెలిసిందే. దీనికి రాహుల్ స్పందిస్తూ 'సాయం కోసం ఆర్తనాదాలు చేస్తున్న ఆ అరుపులు నిరుద్యోగ యువత, కష్టాల్లో ఉన్న రైతులు, అణచివేతకు గురైన దళితులు, ఆదివాసీలు, మైనారిటీలు, నష్టాల్లో ఉన్న చిన్న వ్యాపారులవి. మీ నిరంకుశత్వం, అసమర్థత నుంచి బయటపడాలని వారు ప్రార్థిస్తున్నారు. వంద రోజుల్లో వారందరికీ విముక్తి కలుగుతుంది' అని ట్వీట్ చేశారు.

సాక్షి ప్రాఫిట్ ప్లస్
సోమవారం
21-1-2019

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్	నిఫ్టీ
13 ▲	2 ▲
36,387	10,907

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు

సూచీ	ముగింపు	మార్పు
నాస్‌డాక్	7,157	▲ 73
డోజోన్స్	24,706	▲ 336
ఎఫ్‌టీఎస్‌ఈ 100	6,968	▲ 133
డాక్స్	11,206	▲ 287
షాంఘై	2,596	▲ 36
నికాయ్	20,666	▲ 264

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	థామస్‌కుక్	70.4	72.04
£	బ్రిటన్ పౌండ్	థామస్‌కుక్	90.82	94.01
€	యూరో	థామస్‌కుక్	79.73	82.67
¥	జపాన్ ఎన్ (100)	థామస్‌కుక్	63.94	66.34
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	50.16	52.41
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	51.67	53.46
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	17.6	20.75
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	--	--
¥	చైనా యువాన్	థామస్‌కుక్	9.45	11.15

రుణానికి కొత్త రూటు.. పీ2పీ

పీర్ టు పీర్ (పీ2పీ) లెండింగ్‌కు 2018 మంచి ప్రోత్సాహకమైన సంవత్సరంగా చెప్పుకోవచ్చు. పీటూపీ సంస్థలను ఎన్‌బీఎఫ్‌సీలుగా ఆర్‌బీఐ గుర్తించి, లైసెన్స్‌లను మంజూరు చేసింది గతేడాదే. దీంతో క్రౌడ్ ఫండింగ్ వేదికలకు అధికారిక గుర్తింపు లభించింది. దేశంలో 2016 నాటికి 30కి పైగా పీ2పీ సంస్థలు కార్యకలాపాలు నిర్వహిస్తుండగా, వీటిలో 11 సంస్థలకు గతేడాది ఎన్‌బీఎఫ్‌సీ–పీ2పీ లైసెన్స్‌లు ఆర్‌బీఐ నుంచి లభించాయి. వీటిల్లో తొలి లైసెన్స్‌ను పొందిన సంస్థగా ఫెయిర్‌సెంట్ గుర్తుండిపోతుంది. మార్కెట్లో పెద్ద సంస్థ కూడా ఇదే. ఓఎంఎల్‌పీ2పీ, క్యాష్‌కుమార్, మానెక్సో, ఐటూఐ ఫండింగ్, ఫించీ, పీర్‌లాండ్, లెండెన్‌క్లబ్, పైసాదుకాణ్ తదితర సంస్థలు లైసెన్స్‌లు పొందిన కంపెనీల జాబితాలో ఉన్నాయి. 2018 ఈ రంగానికి పునాది వేసిన సంవత్సరం అయితే, 2019 ప్రోత్సాహకరంగా ఉంటుందని... ఈ ఏడాది పీ2పీ సంస్థలు రూ.1,000–1,500 కోట్ల వరకు రుణాలు మంజూరు చేయవచ్చని అంచనా. ఎటువంటి క్రెడిట్ స్కోర్ లేకపోయినా రుణాలు పొందే అవకాశం కల్పిస్తున్న... పీటూపీ సంస్థలపై సమగ్ర కథనమే ఇది...

- సాక్షి, పర్సనల్ ఫైనాన్స్ విభాగం

సులభంగా రుణాలు పొందే చోటు

మరొకరికి రుణాలను ఆఫర్ చేయడానికీ ఇదే మార్గం

ఒకరికి అవసరం... మరొకరికి రాబడి

పీర్ టు పీర్ లెండింగ్ అంటే?

పీర్ టు పీర్ లెండింగ్‌ను పీ2పీ లెండింగ్‌గా కూడా పిలుస్తారు. ఇది క్రౌడ్ ఫండింగ్ తరహాలో ఉంటుంది. రుణాలు ఆశించే వారు, రుణాలు ఇవ్వాలనుకునే వారు ఎవరి సాయం అవసరం లేకుండా ఈ పీటూపీ లెండింగ్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా నేరుగా లావాదేవీలు చేసుకోవచ్చు. సంప్రదాయ విధానంలో రుణాలిచ్చే సంస్థల వద్ద అప్పు పుట్టని వారికి పీటూపీ వేదికలు అనువుగా ఉంటాయి. అధిక వడ్డీ రాబడి ఆశించే వారు పీ2పీ ద్వారా రుణాలు ఇచ్చుకోవచ్చు. పీ2పీ ప్లాట్‌ఫామ్‌లపై రుణాలు కావాలనుకునే వారు, రుణాలు ఇవ్వాలనుకునే వారు తమ పేర్లను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికంటే ముందు అన్ని నియమ, నిబంధనలు, రిస్క్ వివరాలను తెలుసుకుని జాగ్రత్తగా వ్యవహరించాల్సి ఉంటుంది. అన్ని పీ2పీ ప్లాట్‌ఫామ్‌లను ఆర్‌బీఐ ఎన్‌బీఎఫ్‌సీ సంస్థలుగా ప్రస్తుతం పరిగణిస్తోంది. కనుక వీటిపై ఆర్‌బీఐ నియంత్రణ ఉంటుంది.

రుణదాతలు అయితే...

పీ2పీ ప్లాట్‌ఫామ్ ద్వారా రుణాలు ఇచ్చి మంచి ఆదాయం గడిద్దామనుకునే వారు ముందు చూడాల్సిన అంశాలు కొన్ని ఉన్నాయి. గుర్తింపు పొందిన పీటూపీ ప్లాట్‌ఫామ్‌లు కచ్చితమైన మార్గదర్శకాలను అనుసరించాల్సి ఉంటుంది. సమాచార భద్రత, సమాచార వెల్లడి, రుణ గ్రహీత సమాచారాన్ని క్రెడిట్ ఇన్ఫర్మేషన్ బ్యూరోలకు ఇవ్వడం, అలాగే, పలు అంశాలకు సంబంధించి నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి. ఆన్‌లైన్ ప్రపంచంలో ఎన్నో ప్లాట్‌ఫామ్‌లు పీ2పీ సేవలను ఆఫర్ చేస్తుంటే, వీటిలో ఎన్‌బీఎఫ్‌సీ–పీటూపీగా ఆర్‌బీఐ వద్ద పేర్లను నమోదు చేసుకున్నవి కొన్నే. ''సంబంధిత ప్లాట్‌ఫామ్‌పై రుణాల పరిమాణం?, ఎంత మంది రుణ గ్రహీతలు పేర్లను నమోదు చేసుకున్నారు, రుణాలు మంజూరు వంటివి కంపెనీ ప్రణాళికలు. వ్యాల్యూమ్ తక్కువగా ఉంటే, దీర్ఘకాలం పాటు రుణ గ్రహీత లభించకపోవచ్చు. పీ2పీ లెండింగ్ కంపెనీ నుంచి ఈ వివరాలే తెలుసుకోవాలి'' అని ఐటూఐ ఫండింగ్ సహ వ్యవస్థాపకుడు రాఘువేంద్ర ప్రతాప్ సింగ్ తెలిపారు. రుణ ఎగవేతల శాతం ఏ విధంగా ఉందని, తీసుకున్న రుణాన్ని తిరిగి చెల్లించడంలో జాప్యం జరిగితే, లేదా ఎగవేస్తే ఏంటి పరిస్థితి? అన్న వాటిపైనా దృష్టిపెట్టాలి. ప్రతీ పీ2పీ సంస్థ పారదర్శకతలో భాగంగా పోర్ట్‌ఫోలియో పనితీరు సమాచారాన్ని వెల్లడించాల్సి ఉంటుంది. అయితే, చాలా సంస్థలు తమ ప్లాట్‌ఫామ్‌పై రుణ ఎగవేతలు ఏ స్థాయిలో ఉందన్న సమగ్ర వివరాలను బహిర్గతం చేయడం లేదు. అయితే, సంబంధిత ప్లాట్‌ఫామ్ ద్వారా రుణాలు ఇవ్వాలనుకునే వారు ఈ వివరాలను అడిగి తెలుసుకోవాల్సిన బాధ్యత విస్మరించొద్దు. రుణ చెల్లింపుల్లో జాప్యం, ఎగవేతల పట్ల సంబంధిత పోర్టల్ ఏ విధమైన చర్యలు తీసుకుంటుంది, ఎలా రికవరీ చేస్తుందనేది కీలకం. అలాగే చట్టపరమైన ప్రక్రియల గురించి కూడా తెలుసుకోవాలి.

రాబడులు ఏ మేర...

రుణగ్రహీతల అర్హతలపై రుణాలిచ్చే వారి రాబడులు ఆధారపడి ఉంటాయి. భిన్న రిస్క్ కేటగిరీల గురించి ముందు తెలుసుకోవాలి. అప్పుడు రాబడులపై స్పష్టత వస్తుంది. అధిక సగటు రాబడులు వస్తున్నాయంటే అదే స్థాయిలో రిస్కూ ఉంటుందని తెలుసుకోవాలి. కనుక భిన్న విభాగాల్లో రుణాలు ఇవ్వడం ద్వారా రిస్క్‌ను తగ్గించుకోవచ్చు. రుణ గ్రహీత పేరు, ఇతర సమాచారాన్ని పీటూపీ ప్లాట్‌ఫామ్ వెల్లడించకపోవచ్చు. అయితే, రుణం ఇచ్చేవారిగా తీసుకునే వారి వివరాలను అడిగి తెలుసుకునే హక్కు ఉంటుంది. అందుకని వెబ్‌సైట్‌లో వెల్లడించకపోయినా అడిగి తెలుసుకోవాలి.





రుణ గ్రహీతలు అయితే...

ఇతర మార్గాలలో రుణాలు లభించని వారు సహజంగానే పీ2పీ ప్లాట్‌ఫామ్‌లవైపు చూడొచ్చు. ఈ తరహా వ్యక్తులు పీ2పీ ప్లాట్‌ఫామ్ వేదికలపై తమ పేర్లు, ఇతర వివరాలతో నమోదు చేసుకుని, రుణాలు తీసుకునే ముందు తెలుసుకోవాల్సిన విషయాలు కొన్ని ఉన్నాయి. ముందుగా మీరు పేరు నమోదు చేసుకుంటున్న సంస్థకు ఆర్‌బీఐ అనుమతి ఉందా? అని. చాలా సంస్థలు వేగంగా రుణ సదుపాయం కల్పిస్తున్నప్పటికీ ఆర్‌బీఐ వద్ద తమ పేర్లను నమోదు ఎన్‌బీఎఫ్‌సీ–పీటూపీ రిజిస్ట్రేషన్ పొంది వ్యాపారం చేస్తున్నవి కొన్నే. ఆర్‌బీఐ గుర్తింపు ఉన్నవి మార్గదర్శకాల ప్రకారం నడుచుకోవాల్సి ఉంటుంది. ఈ సంస్థల ద్వారా లావాదేవీలు నిర్వహించడం ఒకింత నయం. అదనపు ఫీజులు, కనిపించని చార్జీల గురించి కూడా వాకబు చేయాలి. మొత్తం వడ్డీకి అదనంగా ఏవైనా చార్జీలు వసూలు చేసేదీ, లేదా తాము పొందే రుణంలో ఏమైనా కత్తిరింపు ఉందా అని విచారించాలి. రిజిస్ట్రేషన్ ఫీజు, ప్రాసెసింగ్ ఫీజులు సహజంగానే ఉంటాయి. ఇవి కాకుండా ఇంకా ఏవైనా ఉన్నాయేమో తెలుసుకోవాలి. తీసుకున్న రుణాన్ని ముందుగానే తీర్చేద్దామనుకుంటే చార్జీల విధింపు ఉందా అని చూడాలి. ఆర్‌బీఐ మార్గదర్శకాల ప్రకారం ఒక ఈఎంఐని 90 రోజుల్లోపు చెల్లించడంలో విఫలమైతే అది చెల్లింపుల వైఫల్యంగా పరిగణించడం జరుగుతుంది. ఈ గడువు కొన్ని ప్లాట్‌ఫామ్‌లలో భిన్నంగా ఉంది. సకాలంలో రుణం లభించడం ఎంతో అవసరం. అప్పుడే అవసరాలకు ఉపయోగపడుతుంది. అందుకే మీరు ఆశ్రయించే ప్లాట్‌ఫామ్‌పై ఎంత వేగంగా రుణాల మంజూరు ఉందనేది తెలుసుకోవడం అవసరం. ఎందుకంటే ఒక్కో కంపెనీకి ఇది వేర్వేరుగా ఉంటుంది.

ఈ రంగంలో ప్రముఖ సంస్థలు...



మార్కెట్లో ఎన్నో పీ2పీ సంస్థలు ఉన్నాయి. అయితే, వీటిల్లో కొన్ని ప్రముఖమైన పోర్టళ్లు, వాటికి సంబంధించి ముఖ్యమైన అంశాలను గమనించినట్టయితే...

ఫెయిర్‌సెంట్

రూ.750 అప్పు కూడా ఈ సంస్థ నుంచి సాధ్యమే. ఉదాహరణకు ఏ అనే ఒక రుణ గ్రహీత రూ.లక్ష రుణాన్ని కోరుకుంటుంటే... రుణం ఇవ్వాలనుకునే వ్యక్తి అయితే ఇందులో 20 శాతం అంటే రూ.20,000 వరకే రుణాన్ని ఇవ్వడానికి అవకాశం. అదే అధిక నెట్‌వర్త్ కలిగిన వారు 50 శాతం వరకు, ఇన్‌స్టిట్యూషన్స్ అయితే 100 శాతం వరకు రుణాన్ని మంజూరు చేయవచ్చు. తిరిగి రాని, ఏక కాల రిజిస్ట్రేషన్ చార్జ్ కింద రూ.1,000 సమర్పించుకోవాలి. రుణ కాల వ్యవధి ఆరు నెలల నుంచి 36 నెలల వరకు ఉంటుంది. తమకు అనువైన కాల వ్యవధి పరిధిలో ఉన్న రుణ గ్రహీతలను ఎంచుకుని రుణాలు ఇచ్చుకునే వెసులుబాటు ఉంటుంది. వడ్డీ రేట్లు 12 నుంచి 28 శాతం మధ్య ఉన్నాయి.

లెండెన్ క్లబ్

కనీసం రూ.2,000 నుంచి రూ.15,000 వరకు ఒక్కొకరికి రుణాన్ని ఇచ్చుకునే అవకాశం ఉంటుంది. రిజిస్ట్రేషన్ చార్జ్ 500. వడ్డీ రావడం ప్రారంభమైన దగ్గర్నుంచి ఫెసిలిటేషన్ ఫీజు వసూలు చేస్తుంది. కమీషన్ అన్నది పెట్టుబడిపై వచ్చే రాబడిపై 1 శాతం నుంచి 25 శాతం వరకు ఉండొచ్చు. 26–35 శాతం మధ్య రాబడుల రేటు ఉంటే 1.5 శాతం, అంతకుమించితే 3 శాతం కమీషన్ తీసుకుంటుంది. మూడు నెలల నుంచి 24 నెలల కాలానికి రుణాలు ఇచ్చుకోవచ్చు. రుణాలిచ్చే వారికి సగటు రాబడులు 25.5 శాతంగా ఉన్నాయి.

ఐటూఐ ఫండింగ్

రూ.5,000 మొత్తం నుంచి ఈ ప్లాట్‌ఫామ్‌పై అప్పిచ్చు వ్యాపారం మొదలు పెట్టుకోవచ్చు. రుణ కాల వ్యవధి నెల నుంచి 36 నెలల మధ్య ఉంటుంది. అన్ని పీ2పీ ప్లాట్‌ఫామ్‌ల్లోనూ కలిపి గరిష్టంగా రూ.10 లక్షల వరకే ఒకరు రుణాలు ఇచ్చుకోవడానికి పరిమితి ఉంది. 3, 6, 9, 12, 24, 36 నెలల రుణ కాల వ్యవధులు ఉన్నాయి. ఒక్కసారి రిజిస్ట్రేషన్ ఫీజు రూ.500 వసూలు చేసుకోవచ్చు. ఒక శాతం ప్రాసెసింగ్ ఫీజు కూడా రుణం మంజూరుపై ఉంటుంది. రాబడుల రేటు 27.99 శాతం వరకూ ఉంది.

లెండ్‌బాక్స్

రుణ దాతలు కనీసం రూ.10,000 నుంచి గరిష్టంగా రూ.10 లక్షల వరకు ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. రుణ గ్రహీతలు రూ.25,000 నుంచి రూ.5 లక్షల వరకు రుణం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

క్యాష్ మేకర్

రూ.20,000 నుంచి రూ.1.5 లక్షల వరకు రుణాలు మంజూరు చేసుకోవచ్చు. రుణ కాలవ్యవధి 3–12 నెలలు. 3 ఈఎంఐలు చెల్లించిన తర్వాత ఎప్పుడైనాసరే ముందస్తుగా రుణం తీర్చేసే అవకాశం రుణగ్రహీతలకు ఉంటుంది. రుణదాతల నుంచి రూ.1,000ను రిజిస్ట్రేషన్ ఫీజు వసూలు చేస్తోంది.

అప్పు ఎగ్గొడితే...?

పీ2పీ లెండింగ్ సంస్థల ద్వారా ఎవరైనా రుణాలను ఇతరులకు ఆఫర్ చేయడం ద్వారా వడ్డీ ఆదాయం అందుకోవచ్చు. రెండంకెల రాబడులంటే సహజంగానే ఆసక్తి ఉంటుంది. మరి రుణం తీసుకున్న వ్యక్తి తిరిగి చెల్లించడంలో విఫలమైతే ఏంటి పరిస్థితి? వీరి విషయంలో పీ2పీ సంస్థలు ఏ విధంగా వ్యవహరిస్తాయి? అన్న సందేహాలు ఉంటుంటాయి. అయితే, ఈ విషయంలో పీ2పీ సంస్థలు ఎన్‌బీఎఫ్‌సీ సంస్థల మాదిరే చురుగ్గానే వ్యవహరిస్తున్నాయి. రుణాలు తీసుకునే వారికి సంబంధించిన సమాచారాన్ని భిన్న మార్గాల్లో సేకరిస్తుంటాయి. ''నిజమైన కస్టమర్లకే రుణాలు అందించాలి. కస్టమర్ ఉద్దేశాన్ని తెలుసుకుని, దరఖాస్తులను ప్రాసెస్ చేసే విషయంలో ప్రత్యామ్నాయ సమాచారం ఉపయోగపడుతుంది'' అని క్యాష్‌కుమార్ సహ వ్యవస్థాపకుడు ధీరేన్ మఖిజియా తెలిపారు. మా దగ్గర నమోదు చేసుకునే ప్రతీ కస్టమర్ డేటా, క్రెడిట్ సమాచారం, రిస్క్‌ను ఆటోమేటెడ్ ఆల్గోరిథమ్ టూల్స్ ద్వారా తనిఖీ చేయబడుతుంది. ఆర్థిక, సామాజిక, వ్యక్తిగత స్థాయిలో 400 పాయింట్లను పరిశీలించడం జరుగుతుంది. ఎన్నో చర్యల్ని తీసుకోవడం ద్వారా రుణ ఎగవేతల రేటును పరిమిత స్థాయిలోనే ఉండేలా చూస్తాం'' అని ఫెయిర్‌సెంట్ వ్యవస్థాపకుడు వినయ్ మాథ్యూస్ తెలిపారు.



చార్జీల వసూలు ఇలా...

పీ2పీ ప్లాట్‌ఫామ్‌లు ఎన్నో రకాల చార్జీలు వసూలు చేస్తుంటాయి. వాటిని పరిశీలిస్తే...



రిజిస్ట్రేషన్ ఫీజు

చాలా వరకు సంస్థలు రిజిస్ట్రేషన్ చార్జీ కింద రూ.100 నుంచి రూ.1,000 వరకు వసూలు చేస్తున్నాయి.

లోన్ ప్రాసెసింగ్ చార్జీ

మంజూరు అయిన రుణం మొత్తంలో 1–10 శాతం మధ్య ఉంటుంది. రిస్క్ గ్రేడ్‌పై ఈ చార్జీ ఆధారపడి ఉంటుంది. అయితే, పలు పీ2పీ ప్లాట్‌ఫామ్‌లలో ఈ చార్జీ సగటున 2–4 శాతం మధ్య ఉంటుంది.

వడ్డీ రేట్లు

వడ్డీ రేట్లను రుణదాత, రుణగ్రహీత నిర్ణయిస్తారు. వీరిరువురు చర్చించుకోవడం ద్వారా ఓ రేటును ఖరారు చేసుకోవచ్చు. 14–36 శాతం మధ్య ఇది ఉంటుంది. రుణ కాల వ్యవధి, రుణ గ్రహీత ఆర్థిక, సామాజిక పరిస్థితులపైనా ఆధారపడి ఉంటుంది.

ముందస్తు చెల్లింపులపై చార్జీలు

మూడు నెలల తర్వాత రుణాన్ని ముందుగా తీర్చివేసినా చార్జీలు ఉండవు. మూడు నెలల్లోపు రుణం మొత్తాన్ని చెల్లించేస్తానంటే చార్జీలు భరించాల్సి ఉంటుంది. ఇలాంటి సందర్భాల్లో మూడు నెలల వడ్డీ చెల్లిస్తే సరిపోతుంది.

లేట్ పేమెంట్ ఫీజు

రుణ ఈఎంఐ చెల్లింపులో జాప్యం జరిగితే చార్జీలు ఉంటాయి. లీగల్ నోటీసు పంపిస్తే రూ.500 వరకు చార్జీ చెల్లించాల్సి వస్తుంది.

చెక్‌బౌన్స్ చార్జీలు

రూ.250 వరకు చార్జీ ఉంటుంది.

స్టాంప్ డ్యూటీ

స్టాంప్ డ్యూటీ చార్జీలను రుణ గ్రహీతే భరించాలి.

ఇతర చార్జీలు

బ్యాంకు ఖాతా వివరాల్లో మార్పులు చోటు చేసుకుంటే కొన్ని సంస్థలు చార్జీలు వసూలు చేస్తున్నాయి. ఈఎంఐ బకాయి ఉన్నా చార్జీ వసూలు చేసేవీ ఉన్నాయి. రూ.200–1,000 వరకు వీటి రూపంలో వసూలు చేస్తున్నాయి.

ఏ బ్యాంకులో ఎంత వడ్డీ?

రూ. కోటి వరకు డిపాజిట్లు, (జనవరి-11- 2019 అంకెలు శాతాల్లో)

బ్యాంకులు	6 నెలలు- ఏడాది	1–2 ఏళ్లు	3–5 ఏళ్లు
ఆంధ్రా బ్యాంక్	6.6	6.8	6.75
యాక్సిస్ బ్యాంక్	7.1	7.35	7.25
బ్యాంక్ ఆఫ్ బరోడా	6.5	6.85	6.7
బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.25	6.7	6.5
కెనరా బ్యాంక్	6.4	7.1	6.2
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	6.5	6.6	6.5
కార్పొరేషన్ బ్యాంక్	6.35	6.8	6.5
హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్	7.1	7.3	7.25
ఐసీఐసీఐ బ్యాంక్	6.75	7.1	7.5
ఐడీబీఐ బ్యాంక్	6.5	7.05	7.2
ఇండస్‌ఇండ్ బ్యాంక్	7.5	8	7.5
కోటక్ మహీంద్రా బ్యాంక్	7	7.4	7.1
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	6.5	6.75	6.75
ఎస్‌బీఐ	6.4	6.8	6.85
సిండికేట్ బ్యాంక్	6.35	6.8	6.6
పీఎన్‌బీ	6.35	6.85	6.25
యస్ బ్యాంక్	7	7.85	7.5

బ్యాంక్ బజార్.కామ్ అందించిన వివరాల ఆధారంగా...

బాండ్ ఫండ్స్‌లో మెరుగైన పనితీరు...

ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఆల్ సీజన్స్‌బాండ్ ఫండ్

గత ఏడాది బాండ్ మార్కెట్ తీవ్రమైన ఒడిదుడుకులకు గురైంది. ఈ ఏడాది మాత్రం బాండ్ మార్కెట్ జోరుగానే ఉండొచ్చన్న అంచనాలు నెలకొన్నాయి. గత కొన్ని నెలలుగా ద్రవ్యోల్బణం దిగివస్తోంది. మరోవైపు రేట్ల నిర్ణయం విషయంలో విధానాల మార్పు కారణంగా ఆర్‌బీఐ పాలసీ సరళంగానే ఉండొచ్చని విశ్లేషకులు భావిస్తున్నారు. అంతే కాకుండా బహిరంగ మార్కెట్ కార్యకలాపాల జోరును పెంచుతోంది. బహిరంగ మార్కెట్ కార్యకలాపాల్లో భాగంగా ఆర్‌బీఐ ప్రభుత్వ బాండ్లను జోరుగా కొనుగోలు చేస్తోంది. ... ఇవన్నీ బాండ్ మార్కెట్‌కు సానుకూలాంశాలే అని చెప్పవచ్చు. అయితే ఈ ఏడాది జనవరి–మార్చి క్వార్టర్లో వివిధ రాష్ట్ర ప్రభుత్వాలు అంచనాలను మించి మార్కెట్ రుణాలను సమీకరించనుండటం, కేంద్ర ప్రభుత్వ ద్రవ్య స్థితిగతులు, ద్రవ్యోల్బణ సంబంధిత రిస్క్‌లు ....ఇవన్నీ రానున్న నెలల్లో బాండ్ మార్కెట్‌పై ప్రభావం చూపే ప్రతికూలాంశాలు.

పరిస్థితులను బట్టి వ్యూహాలు...

ఇన్వెస్టర్లు ఒకింత రిస్క్ భరించగలిగేతే బాండ్ ఫండ్స్‌ను పరిశీలించవచ్చు. బాండ్ల ధరలు ర్యాలీ జరిపితే డైనమిక్ బాండ్ ఫండ్స్ లాభపడతాయి. డైనమిక్ బాండ్ ఫండ్స్‌కు వడ్డీరేట్ల హెచ్చుతగ్గులే కీలకం. ఇక ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఆల్ సీజన్స్‌బాండ్ ఫండ్ (గతంలో దీనిని ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లాంగ్ టర్మ్ ప్లాన్‌గా వ్యవహరించేవారు) విషయానికొస్తే, వివిధ వడ్డీ రేట్ల కాలాల్లో నిలకడైన రాబడులనిచ్చింది. 2014–2016 మధ్య కాలంలో ఈ ఫండ్ 16–19 శాతం రేంజ్‌లో రాబడులనిచ్చింది. లాంగ్‌టర్మ్ గిల్ట్‌ఫండ్స్ 2–3 శాతమే రాబడులనిచ్చిన 2017లో ఈ ఫండ్ 5 శాతం వరకూ రాబడినిచ్చింది. ఒడిదుడుకుల పరిస్థితుల్లో బాండ్లు/డిబెంచర్లు/కమర్షియల్ పేపర్ వంటి సాధనాల్లో ఇన్వెస్ట్‌మెంట్స్ కాలపరిమితిని సమర్థవంతంగా నిర్వహించడం, పరిస్థితులు బాగా ఉన్నప్పుడు ర్యాలీలను క్యాష్ చేసుకోవడం వంటి వ్యూహాలను పాటించడం ద్వారా ఈ ఫండ్ నష్టాలను తగ్గించుకోగలిగింది. ఈ కేటగిరిలో ఫండ్స్ కంటే మెరుగైన రాబడులనివ్వగలిగింది. ఇక ఐదు, పదేళ్ల కాలాన్ని పరిగణనలోకి తీసుకున్నా, ఈ ఫండ్ వార్షిక రాబడులు 9–10 శాతం రేంజ్‌లో ఉన్నాయి. ఈ కాలంలో ఈ కేటగిరీ ఫండ్ల సగటు రాబడి దీనికంటే తక్కువగా వుంది. రెండు–మూడేళ్లు ఇన్వెస్ట్ చేయాలనుకునే ఇన్వెస్టర్లు ఈ డైనమిక్ బాండ్ ఫండ్‌ను పరిశీలించవచ్చు.





చురుకైన మెచ్యూరిటీ మేనేజ్‌మెంట్

బాండ్ల ధరల అధారంగా డెట్ ఫండ్ ఎన్‌ఏవీ(నెట్ అసెట్ వేల్యూ) పెరగడం, తగ్గడం ఉంటుంది. వడ్డీరేట్ల కదలికలు బాండ్ల ధరలను ప్రభావితం చేస్తాయి. వడ్డీరేట్లు పెరిగితే, బాండ్ల ధరలు తగ్గుతాయి. అలాగే వడ్డీరేట్లు తగ్గితే బాండ్ల రేట్లు పెరుగుతాయి. కాలపరిమితి అధికంగా ఉండే బాండ్ల రాబడులు మరింత సున్నితంగా ఉంటాయి. ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ ఆల్ సీజన్స్‌బాండ్ ఫండ్.. బాండ్లలో ఇన్వెస్ట్‌చేసే సగటు మెచ్యూరిటీ కాలం 4–20 ఏళ్లుగాఉంది. గత ఏడాది జూలై–అక్టోబర్ మధ్య ఈ సగటు మెచ్యూరిటీ కాలం 1.5–2 సంవత్సరాలు గానూ, గత 2 నెలల్లో 3–5 సంవత్సరాలు గానూ ఉంది. మెచ్యురిటీ డ్యురేషన్ ఇంత యాక్టివ్‌గా ఉండటం వల్ల మధ్యంతర బాండ్ ర్యాలీ ప్రయోజనాలను ఈ బాండ్ అందిపుచ్చుకోవడమే కాకుండా ఈ కేటగిరీలో మంచి రాబడులనిస్తోన్న ఫండ్‌గా నిలుస్తోంది.

టాప్ హోల్డింగ్స్

అంశం	పెట్టుబడుల శాతం
కేంద్ర ప్రభుత్వ బాండ్లు	20.55
శ్రీరామ్ ట్రాన్స్‌పోర్ట్ ఫైనాన్స్ ఎన్‌సీడీ	6.09
రిలయన్స్ ఇండస్ట్రీస్ ఎన్‌సీడీ	5.00
నయారా ఎనర్జీ బాండ్లు	4.98
ప్రామోంట్ హిల్‌సైడ్ డిబెంచర్లు	4.90
వేదాంత డిబెంచర్లు	4.88
ఇండియాబుల్స్ హౌసింగ్ ఫై. బాండ్లు	3.62
టాటా స్టీల్ డిబెంచర్లు	3.55

రాబడుల పోలిక(%)

కాలం	ఐసీఐసీఐ ఫండ్	ఈ కేటగిరీ ఫండ్స్
1 సంవత్సరం	5.7	4.9
3 సంవత్సరాలు	9.1	7.2
5 సంవత్సరాలు	10.4	8.4



మీరు కొన్న షేరు ధర కళ్ల ముందే సగానికి పడిపోతున్నా, నిబ్బరంగా ఉండగలిగితేనే స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేయాలి.
– వారెన్ బఫెట్, ప్రసిద్ధ ఇన్వెస్టరు

బొమ్మ-బొరుసు



అంతర్జాతీయ ట్రెండ్, ఫలితాలే ఆధారం..

- సోమవారం కోటక్ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ ఫలితాలు
- ఐటీసీ, మారుతీ సుజుకీ, ఎల్ అండ్ టీ ఫలితాలు ఈవారమే
- క్రూడ్, రూపాయిపై దృష్టి..

న్యూఢిల్లీ: ఈ ఏడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్) కార్పొరేట్ ఫలితాలు.. దేశీ స్టాక్ సూచీలకు దిశా నిర్దేశం చేయనున్నాయని దలాల్ స్ట్రీట్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పటివరకు వెల్లడైన కంపెనీల ఫలితాలు పర్వాలేదనిపించుకోగా.. ఇండెక్స్ హెవీవెయిట్ అయిన ఐటీసీ ఫలితాలు ఏ విధంగా ఉంటాయనే అంశంపై మార్కెట్ వర్గాలు దృష్టిసారించాయి. బుధవారం వెల్లడికానున్న ఈ సంస్థ ఫలితాలు.. శుక్రవారం విడుదలకానున్న ఎల్ అండ్ టీ, మారుతీ సుజుకీ ఫలితాలు ఈవారంలో మార్కెట్ ట్రెండ్‌ను ప్రభావితం చేయనున్నాయని భావిస్తున్నారు. మరోవైపు గత శుక్రవారం మార్కెట్ ముగిసిన తరువాత విప్రో.. శనివారం హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ఫలితాలు వెల్లడికాగా, దీని ప్రభావం సోమవారం మార్కెట్ ప్రారంభంపై కనిపించనుంది. క్యూ3 ఫలితాలతో పాటు కంపెనీల యాజమాన్యం చేసే వ్యాఖ్యలను మార్కెట్ వర్గాలు నిశితంగా పరిశీలిస్తున్నట్లు ఎపిక్ రీసెర్చ్ సీఈఓ ముస్తఫా నదీమ్ అన్నారు.

ఈవారంలో జోరుగా బ్యాంకింగ్ ఫలితాలు..

హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ, కోటక్ మహీంద్రా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫలితాలు సోమవారం వెల్లడికానున్నాయి. టీవీఎస్ మోటార్ గణాంకాలు మంగళవారం వెల్లడికానుండగా, ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ ఫలితాలు బుధవారం.. యస్ బ్యాంక్, కాల్గేట్-పామోలివ్ (ఇండియా), అల్ట్రాటెక్ సిమెంట్ క్యూ3 ఫలితాలు గురువారం వెల్లడికానున్నాయి.

ఇప్పటివరకు వెల్లడైన ఫలితాలు పర్వాలేదు..

'ఆశాజనక ఫలితాలతో చాలా వరకు ఐటీ కంపెనీలు ఆకట్టుకున్నాయి. ఇప్పటివరకు వెల్లడైన ఐటీ సంస్థల క్యూ3.. అంచనాలను అధిగమించాయి. యాజమాన్యాలు చేసిన వ్యాఖ్యలు కూడా పాజిటివ్‌గానే ఉన్నాయి. ఈ ఫలితాల సీజన్ ఆశాజనకంగా ఉండనుందనే అంశానికి ఇవి సంకేతాలుగా ఉన్నాయి.'



అని ఎస్సెల్ మ్యూచువల్ ఫండ్ సీఐఓ విరల్ బెరవాలా విశ్లేషించారు.

అంతర్జాతీయ అంశాలపై దృష్టి..

అమెరికా–చైనాల వాణిజ్య యుద్ధం ముగిసిన సూచనలు ఏవీ కనిపించడం లేదు. ఇదిలా ఉండగా.. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఉత్తరకొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌తో ఫిబ్రవరిలో మరోసారి సమావేశమవుతారని ఇప్పటికే వైట్‌హౌస్ వెల్లడించింది. ఈ నేపథ్యంలో వాణిజ్య యుద్ధం అంశంపై ఇన్వెస్టర్లు ఓ కన్నేసి ఉంచడం మంచిదని నిపుణులు సూచిస్తున్నారు. మరోవైపు బ్రిటన్ పార్లమెంటులో ప్రధాని థెరెసా మే ప్రభుత్వంపై ప్రతిపక్షం ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై జరిగిన ఓటింగ్‌లో మే స్వల్ప ఆధిక్యంతో గెలుపొందిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా మాట్లాడిన ఆమె.. సోమవారం మరో కొత్త బ్రెగ్జిట్ ఒప్పందాన్ని సభ ముందు ఉంచుతానని స్పష్టం చేశారు.

ముడిచమురు ధరల ప్రభావం..

ఒపెక్ సప్లై కోత నిర్ణయాలతో గతకొంతకాలంగా క్రూడ్ ధరలు పెరుగుతూ వస్తున్నాయి. బ్యారెల్ బ్రెంట్ క్రూడ్ ధర 61 డాలర్లను అధిగమించింది. ఈ ర్యాలీ ఇలానే కొనసాగితే, డాలరుతో రూపాయి మారకం విలువపై ఒత్తిడి కలిగించే అవకాశం ఉన్న నేపథ్యంలో మార్కెట్ అంశాన్ని నిశితంగా పరిశీలిస్తుందని రాయిటర్స్ విశ్లేషించింది. ఈ అంశం ఆధారంగానే వడ్డీ రేట్ల కోతపై వచ్చే ఆర్‌బీఐ సమావేశంలో నిర్ణయం తీసుకోనుందని వివరించింది.

ఎఫ్ఐఐల నికర విక్రయాలు..

ఈఏడాది జనవరి 1–18 కాలంలో విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐ) భారత మార్కెట్ నుంచి రూ. 4,040 కోట్లను ఉపసంహరించుకున్నట్లు డిపాజిటరీ డేటా ద్వారా వెల్లడయింది.

బోర్డ్ మీటింగ్స్

కోటక్ మహీంద్రా బ్యాంక్, యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హెచ్‌డీఎఫ్‌సీ ఏఎమ్‌సీ, హడ్కో, హిందుస్తాన్ జింక్, జస్ట్ డయల్, ఎల్ అండ్ టీ ఫైనాన్షియల్ హోల్డింగ్స్, శాస్కేన్ టెక్నాలజీస్, ఆమ్‌టెక్ ఆటో, కోరమాండల్ ఇంటర్నేషనల్, జెన్సర్ టెక్నాలజీస్

కోడిగుడ్లు

(హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 21-1-2019

విశాఖ	425–00
చిత్తూరు	433–00
వరంగల్	407–00
చెన్నై	440–00
ముంబై	460–00
విజయవాడ	425–00
నమక్కల్	425–00
గోదావరి	425–00
20–1–2019 ఫామ్ ధర...	
హైదరాబాద్	405–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.65
బెంగళూరు	425–00
కోల్‌కతా	466–00
ఢిల్లీ	435–00

బ్రిటన్‌ను మించనున్న భారత్!!

- ప్రపంచ ఎకానమీల్లో అయిదో స్థానానికి
- ఈ ఏడాది ర్యాంకింగ్స్‌పై పీడబ్ల్యూసీ అంచనాలు

న్యూఢిల్లీ: ప్రపంచంలోనే అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల జాబితాలో ఈసారి బ్రిటన్‌ను భారత్ అధిగమించవచ్చని అంతర్జాతీయ కన్సల్టెన్సీ సంస్థ పీడబ్ల్యూసీ ఒక నివేదికలో పేర్కొంది. ప్రపంచ బ్యాంకు గణాంకాల ప్రకారం 2017లో ఫ్రాన్స్‌ను దాటేసిన భారత్ 2.59 లక్షల కోట్ల డాలర్ల జీడీపీతో ఆరో అతి పెద్ద ఎకానమీగా అవతరించింది. బ్రిటన్ అయిదో స్థానంలో ఉంది. అయితే, ఇక తాజా పీడబ్ల్యూసీ నివేదిక ప్రకారం భారత్ అయిదో స్థానానికి, ఫ్రాన్స్ ఆరో స్థానానికి చేరనుండగా.. బ్రిటన్ ఏడో స్థానానికి పడిపోనుంది. 2017లో బ్రిటన్ జీడీపీ 2.62 లక్షల కోట్ల డాలర్లుగాను, ఫ్రాన్స్ జీడీపీ 2.58 లక్షల కోట్ల స్థాయిలోనూ నమోదయ్యాయి. ప్రస్తుతం 19.39 లక్షల కోట్ల డాలర్ల పరిమాణంతో అమెరికా అగ్రస్థానంలో ఉండగా, చైనా (12.23 లక్షల కోట్ల డాలర్లు), జపాన్ (4.87 లక్షల కోట్ల డాలర్లు) జర్మనీ (3.67 లక్షల కోట్ల డాలర్లు) తర్వాత స్థానాల్లో ఉన్నాయి. సాధారణంగా ఒకే స్థాయి అభివృద్ధి, జనాభా తదితర అంశాల కారణంగా బ్రిటన్, ఫ్రాన్స్‌ల స్థానాలు అటూ, ఇటూ అవుతూ ఉంటాయని.. కానీ భారత్ మాత్రం ర్యాంకింగ్ పెంచుకుంటూనే ఉందని పీడబ్ల్యూసీ తెలిపింది.



గ్లోబల్ ఎకానమీ వాచ్ పేరిట రూపొందించిన పీడబ్ల్యూసీ నివేదిక ప్రకారం.. 2019లో భారత స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ) వృద్ధి 7.6 శాతంగా ఉండనుండగా, ఫ్రాన్స్‌ది 1.7 శాతంగాను, బ్రిటన్‌ది 1.6 శాతంగాను వృద్ధి నమోదు కానుంది. 'అంతర్జాతీయంగా వాణిజ్య యుద్ధ భయాలు, చమురు సరఫరాపరమైన షాక్‌లేమీ లేకపోతే 2019–20లో భారత్ 7.6 శాతం వృద్ధి రేటు నమోదు చేయొచ్చు. కొత్తగా అమల్లోకి తెచ్చిన వస్తు, సేవల పన్నుల విధానం (జీఎస్‌టీ), కొత్తగా ఏర్పడే ప్రభుత్వం తొలి ఏడాదిలో తీసుకునే విధానపరమైన నిర్ణయాలు అధిక వృద్ధికి ఊతమిచ్చే అవకాశం ఉంది' అని పీడబ్ల్యూసీ పేర్కొంది. ప్రపంచ ఎకానమీపై ప్రభావం చూపే అంశాల ఆధారంగా పీడబ్ల్యూసీ ఏటా ఈ జాబితా రూపొందిస్తుంది.

ఇద్దరు పీఎన్‌బీ ఈడీలపై వేటు..




న్యూఢిల్లీ: నీరవ్ మోదీ కుంభకోణం ప్రభావంతో పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ)కి చెందిన మరో ఇద్దరు అధికారులపై వేటు పడింది. విధుల నిర్వహణలో వైఫల్యం ఆరోపణలతో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్స్ (ఈడీ) కేవీ బ్రహ్మాజీ రావు, సంజీవ్ శరణ్‌లను పదవీ బాధ్యతల నుంచి తొలగిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ఇది తక్షణమే అమల్లోకి వచ్చినట్లు కేంద్ర ఆర్థిక శాఖ తెలిపింది. ప్రధాన బ్యాంకింగ్ వ్యవస్థను (సీబీఎస్), అంతర్జాతీయ లావాదేవీలకు ఉపయోగించే వ్యవస్థ స్విఫ్ట్‌కు అనుసంధానించాలన్న ఆర్‌బీఐ ఆదేశాలను అమలు చేయడంలో ఇద్దరూ విఫలమయ్యారని ఆరోపణలు ఉన్నాయి. బ్రహ్మాజీ రావు ఈ నెలలో రిటైర్ కావాల్సి ఉండగా, శరణ్ పొడిగించిన పదవీకాలం ఈ ఏడాది మేలో ముగియాల్సి ఉంది. వజ్రాభరణాల వ్యాపారి నీరవ్ మోదీ రూ. 14,000 కోట్ల కుంభకోణం దరిమిలా అప్పట్లో పీఎన్‌బీ చీఫ్‌గా వ్యవహరించిన ఉషా అనంతసుబ్రమణియన్‌ను కూడా కేంద్రం గతేడాది డిస్మిస్ చేసిన సంగతి తెలిసిందే.

సెన్సెక్స్ కీలకస్థాయి 36,470

మార్కెట్ పంచాంగం


ఈ నెల తొలి రెండు వారాల్లో పరిమితశ్రేణిలో కదలిన ప్రపంచ ప్రధాన మార్కెట్లు...ముఖ్యంగా అమెరికా, యూరప్‌లు గతవారం బ్రేక్‌అవుట్‌ను సాధించి, ముందడుగు వేశాయి. ఇదేబాటలో భారత్ సూచీలు కొంత పెరిగినప్పటికీ, మూడు వారాల నిరోధాన్ని అధిగమించడంలో ఇబ్బంది పడుతున్నాయి. అయితే ఇన్ఫోసిస్, ఐటీసీలకు తోడు ఇతర హెవీవెయిట్ షేర్లయిన టీసీఎస్, రిలయన్స్ ఇండస్ట్రీస్‌లు క్రితం వారం ర్యాలీ జరపడం ఇన్వెస్టర్లకు ఊరటనిచ్చే అంశం. మరో వారం రోజుల్లో వెల్లడికానున్న కేంద్ర బడ్జెట్లో...ప్రభుత్వ ద్రవ్యలోటును పెంచే ప్రతిపాదనలుంటాయన్న అంచనాల నేపథ్యంలో విదేశీ ఇన్వెస్టర్లు వ్యవహరించే పెట్టుబడుల శైలికి అనుగుణంగా సమీప భవిష్యత్తులో మన మార్కెట్ కదలికలు వుండవచ్చు. ఇక సూచీల సాంకేతిక అంశాల విషయానికొస్తే,

సెన్సెక్స్ సాంకేతికాలు...



జనవరి 18తో ముగిసిన వారంలో బీఎస్‌ఈ సెన్సెక్స్ తొలిరోజున 35,692 పాయింట్ల కనిష్ట స్థాయికి తగ్గిన తర్వాత క్రమేపీ పెరిగి చివరి మూడురోజులూ 36,470 పాయింట్ల సమీపంలో అవరోధాన్ని చవిచూసింది. చివరకు అంతక్రితం వారంకంటే 377 పాయింట్లు లాభపడి 36,387 పాయింట్ల వద్ద ముగిసింది. గతవారం వరుసగా మూడురోజులపాటు నిరోధాన్ని కల్పించిన 36,470 పాయింట్ల స్థాయి ఈ వారం కీలకమైనది. ఈ స్థాయిపైన సోమవారం గ్యాప్‌అప్‌తో ప్రారంభమై, స్థిరపడితే తొలుత 36,560 పాయింట్ల స్థాయికి చేరవచ్చు. అటుపై ముగిస్తే 36,800–37,050 పాయింట్ల శ్రేణిని అందుకోవొచ్చు. ఈ వారం పైన ప్రస్తావించిన తొలి నిరోధశ్రేణిని దాటలేకపోయినా, సోమవారం మార్కెట్ నిస్తేజంగా ప్రారంభమైనా 36,200 పాయింట్ల సమీపంలో తొలి మద్దతు లభిస్తున్నది. ఈ మద్దతు దిగువన ముగిస్తే 35,950 పాయింట్ల స్థాయికి తగ్గవచ్చు. ఈ లోపున తిరిగి 35,690 పాయింట్ల స్థాయికి పరీక్షించవచ్చు.

నిఫ్టీ కీలకస్థాయి 10,930



గతవారం తొలుత 10,692 పాయింట్ల కనిష్టస్థాయికి తగ్గిన ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ వారంలో చివరి మూడు రోజులూ 10,930 పాయింట్ల సమీపంలో నిరోధాన్ని ఎదుర్కొని, ముందుకు సాగలేకపోయింది. చివరకు అంతక్రితంవారంతో పోలిస్తే 112 పాయింట్ల లాభంతో 10,907 పాయింట్ల వద్ద ముగిసింది. ఈ వారం నిఫ్టీకి 10,930 పాయింట్ల స్థాయి కీలకమైనది. ఈ స్థాయిపైన మార్కెట్ బుల్లిష్‌గానూ, ఈ స్థాయిలోపున బేరిష్‌గానూ ట్రేడ్‌కావొచ్చు. అంతర్జాతీయ సానుకూల సంకేతాల ప్రభావంతో ఈ సోమవారం 10,930పైన నిఫ్టీ గ్యాప్‌అప్‌తో మొదలై, నిలదొక్కుకుంటే 10,985 స్థాయి వరకూ పెరిగే అవకాశం వుంది. ఈ మూడువారాల గరిష్టస్థాయిని దాటితేనే తదుపరి అప్‌ట్రెండ్ సాధ్యపడుతుంది. అటుపై 11,020–11,110 పాయింట్ల శ్రేణివరకూ పెరగవచ్చు. ఈ వారం పైన సూచించిన కీలకస్థాయిని దాటలేకపోయినా, ఈ సోమవారం నిఫ్టీ బలహీనంగా ప్రారంభమైనా 10,850 పాయింట్ల సమీపంలో తొలి మద్దతు లభిస్తున్నది. ఈ స్థాయి లోపున ముగిస్తే 10,775 పాయింట్ల వద్దకు తగ్గవచ్చు. ఈ లోపున క్రమేపీ తిరిగి 10,690 పాయింట్ల స్థాయిని తిరిగి పరీక్షించవచ్చు.

– పి. సత్యప్రసాద్



వైబ్రాంట్ గుజరాత్ సదస్సులో ప్రభుత్వ రంగ భారత్ పెట్రోలియం (బీపీసీఎల్) స్టాల్ ఏర్పాటు చేసింది. బీపీసీఎల్ కార్యకలాపాలు, దేశ ఆర్థిక వృద్ధిలో పోషిస్తున్న కీలక పాత్ర గురించి టెక్నాలజీ తోడ్పాటుతో సందర్శకులకు అవగాహన కల్పిస్తోంది. ఈ నెల 22 వరకూ సదస్సు జరుగుతుందని, తమ స్టాల్‌ను సందర్శకులు ఆసక్తిగా తిలకిస్తున్నారని బీపీసీఎల్ ఒక ప్రకటనలో పేర్కొంది.

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ నికర లాభం 20% అప్

క్యూ3 లాభం రూ.5,586 కోట్లు



న్యూఢిల్లీ: ప్రైవేట్ రంగ బ్యాంకింగ్ దిగ్గజమైన హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ ప్రస్తుత ఆర్థిక సంవత్సర మూడో త్రైమాసికానికి ఆశాజనక ఫలితాలను ప్రకటించింది. ఈ ఏడాది క్యూ3(అక్టోబర్–డిసెంబర్)లో కంపెనీ నికర లాభం 20.3% వృద్ధి చెంది రూ.5,585.9 కోట్లుగా నమోదైంది. అంతక్రితం ఏడాది ఇదే త్రైమాసికానికి రూ.4,642.6 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. ఈసారి లాభం గణనీయంగా పెరగడానికి.. అధిక నికర వడ్డీ ఆదాయం (ఎన్ఐఐ) ప్రధాన కారణమని బ్యాంక్ తెలియజేసింది. ఇక బ్యాంక్ క్యూ3 పూర్తి ఆదాయం రూ.30,811 కోట్లుగా నమోదైంది. క్రితం ఏడాదిలో ఇది రూ.24,450 కోట్లుగా ఉంది. ప్రొవిజన్స్ రూ.2,211,53 కోట్లుగా బ్యాంక్ తెలిపింది.

తగ్గిన నికర ఎన్‌పీఏలు..

గడిచిన త్రైమాసికంలో బ్యాంక్ నికర నిరర్థక ఆస్తులు 0.42 శాతంగా నిలిచాయి. 2017–18 క్యూ3లో ఇవి 0.44 శాతంగా ఉండగా.. ఈసారి స్వల్ప తగ్గుదల కనిపించింది. ఇక స్థూల ఎన్‌పీఏలు స్వల్పంగా పెరిగాయి. గతేడాది క్యూ3లో 1.29 శాతం కాగా, ఈసారి 1.38 శాతంగా నమోదయ్యాయి.

స్టాక్స్ వ్యూ

హిందుస్తాన్ యూనిలివర్ — బ్రోకరేజ్ సంస్థ: మోతిలాల్ ఓస్వాల్ — కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ.1,744 **టార్గెట్ ధర:** రూ.2,120

ఎందుకంటే: హిందుస్తాన్ యూనిలివర్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం డిసెంబర్ క్వార్టర్ ఫలితాలు అంచనాలకు అనుగుణంగానే ఉన్నాయి. నికర అమ్మకాలు 11 శాతం పెరిగి రూ.9,560 కోట్లకు వృద్ధి చెందాయి. ఇబిటా 22 శాతం పెరిగి రూ.2,050 కోట్లకు, నికర లాభం 17 శాతం పెరిగి రూ.1,400 కోట్లకు చేరాయి. ఇక ఈ ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల కాలాన్ని పరిగణనలోకి తీసుకుంటే, అమ్మకాలు 11 శాతం, ఇబిటా 21 శాతం, నికర లాభం కూడా 21 శాతం చొప్పున వృద్ధి చెందాయి. ఈ ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసిక కాలంలో అమ్మకాలు 10 శాతం, ఇబిటా 14 శాతం, నికర లాభం 12 శాతం చొప్పున పెరుగుతాయని అంచనా వేస్తున్నాం. ఈ క్యూ3లో పట్టణాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లోనే అమ్మకాలు బాగా పెరిగాయి. 'విన్నింగ్ మెనీ ఇండియాస్' వ్యూహంలో భాగంగా మార్కెట్ అవసరాలకు తగ్గట్లుగా ఉత్పత్తులను అందుబాటులోకి తెస్తోంది. దీంట్లో భాగంగానే మార్జిన్లు అధికంగా ఉండే సౌందర్య, వ్యక్తిగత సంరక్షణ ఉత్పత్తులను రూ.10 ప్యాక్‌ల్లో అందిస్తోంది. ఈ ప్యాక్‌లకు మంచి స్పందన లభిస్తోంది. అమ్మకాలు ఆరోగ్యకరమైన వృద్ధి సాధిస్తాయని, ఉత్పత్తుల ధరలు పెంచకపోయినా, ఇబిటా పటిష్టమైన వృద్ధినే సాధిస్తుందని భావిస్తున్నాం. పెద్ద ఎఫ్‌ఎమ్‌సీజీ కంపెనీల్లో నికర లాభంలో మంచి వృద్ధి సాధిస్తున్న కంపెనీల్లో ఇది అత్యుత్తమమైనదని చెప్పవచ్చు. రాబడి నిష్పత్తులు అధికంగా ఉన్న కంపెనీ కూడా ఇదే. నేచురల్స్ ఉత్పత్తులు బాగా అమ్ముడవుతుండగా, ఆయుర్వేద ఉత్పత్తుల విభాగం లీవర్ ఆయుష్ అమ్మకాలు పుంజుకుంటున్నాయి. ప్రీమియమ్ ఉత్పత్తులకు డిమాండ్ పెరుగుతుండటం సానుకూలాంశాలు.

జీ ఎంటర్‌టైన్మెంట్ ఎంటర్‌ప్రైజెస్ — బ్రోకరేజ్ సంస్థ: హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ — కొనొచ్చు



ప్రస్తుత ధర: రూ.440 **టార్గెట్ ధర:** రూ.512

ఎందుకంటే: ఈ కంపెనీ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం మూడో త్రైమాసిక ఆర్థిక ఫలితాలు పటిష్టంగానే ఉన్నాయి. డిజిటల్ విభాగం(జీ ఫైవ్)లో పెట్టుబడులు కొనసాగుతున్నప్పటికీ, ప్రకటనలు, చందా ఆదాయం, మార్జిన్ల వంటి అంశాల్లో పటిష్టమైన ఫలితాలనే సాధించింది. ఈ క్యూ3లో ఆదాయం 18%, ఇబిటా 27%, నికర లాభం 44% చొప్పున పెరిగాయి. వ్యాట్ రిఫండ్, తక్కువ పన్ను కారణంగా ఇతర ఆదాయం అధికంగా రావడంతో నికర లాభం బాగా పెరిగింది. మార్జిన్లు 2.5 శాతం పెరిగి 35%కి వృద్ధి చెందాయి. ఈ ఆర్థిక సంవత్సరంలో కంపెనీ పనితీరు బాగానే ఉన్నా, షేర్ ధర మాత్రం 22 శాతం పతనమైంది. ఆపరేటింగ్ క్యాష్ ఫ్లోస్ బలహీనంగా ఉండటం, డిజిటల్ విభాగంలో పోటీ తీవ్రంగా ఉండటం దీనికి ప్రధాన కారణాలు. భారత టీవీ మార్కెట్లో జీ టీవీదే అగ్రస్థానం. మార్కెట్ వాటా 2 శాతం పెరిగి 20.2 శాతానికి చేరింది. రానున్న కాలంలో ఈ మార్కెట్ మరింతగా పెరిగే అవకాశాలున్నాయి. ట్రాయ్ కొత్త టారిఫ్ విధానం స్వల్పకాలంలో కొంత ఒడిదుడుకులకు గురిచేసినా, దీర్ఘకాలంలో ఈ కంపెనీకి ప్రయోజనకరమే. కంపెనీ డిజిటల్ విభాగం, జీ5.. భారత్‌లో రెండో అతిపెద్ద డిజిటల్ ఎంటర్‌టైన్మెంట్ ప్లాట్‌ఫార్మ్. ఆరు ప్రాంతీయ భాషల్లో కంటెంట్ ఉన్న ఏకైక ఓటీటీ(ఓవర్–ద–టాప్) యాప్ ఇది. డిజిటల్ విభాగంపై పెట్టుబడులు పెంచుతోంది. అంతర్జాతీయ వ్యూహాత్మక భాగస్వామికి అధిక ప్రీమియమ్‌తో వాటా విక్రయించాలని కంపెనీ ప్రమోటర్ భావిస్తున్నారు. సమీప భవిష్యత్తులో ఈ వాటా విక్రయం జరిగితే, షేర్ ధర మరింతగా పెరిగే అవకాశాలున్నాయి.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే.

నికో.. తప్పుకో!!

- భాగస్వామ్య సంస్థకు రిలయన్స్ నోటీసులు
- చెల్లింపుల్లో డిఫాల్ట్ అవడమే కారణం



న్యూఢిల్లీ: కేజీ–డీ6 గ్యాస్ బ్లాక్ క్షేత్ర అభివృద్ధి వ్యయాల చెల్లింపుల్లో విఫలమైన నేపథ్యంలో వెంచర్ నుంచి తప్పుకోవాల్సిందిగా కెనడాకు చెందిన భాగస్వామ్య సంస్థ నికో రిసోర్సెస్‌కు రిలయన్స్ ఇండస్ట్రీస్ (ఆర్ఐఎల్) నోటీసులిచ్చింది. ఆర్–క్లస్టర్, శాటిలైట్ క్లస్టర్ వంటి వాటి అభివృద్ధికి తన వంతుగా 5–6 బిలియన్ డాలర్లను సమకూర్చలేకపోవడం, రుణదాతలకు చెల్లింపుల్లో డిఫాల్ట్ కావడం, కేజీ–డీ6 వెంచర్‌లో తన 10 శాతం వాటాలను కొనుక్కునే వారిని దొరకపుచ్చుకోవడంలో విఫలం కావడం తదితర అంశాలు ఇందుకు కారణం. సంయుక్త నిర్వహణ ఒప్పందం (జేవోఏ) ప్రకారం నికోకు డిఫాల్ట్ నోటీసులు జారీ చేసినట్లు ఇటీవలి మూడో త్రైమాసిక ఫలితాల్లో రిలయన్స్ వెల్లడించింది. నిర్దిష్ట గడువులోగా కూడా చెల్లింపులు జరపకపోవడంతో జేవోఏ, ఉత్పత్తిలో వాటాల ఒప్పందం (పీఎస్‌సీ) నుంచి తప్పుకోవాలంటూ తమతో పాటు మరో భాగస్వామ్య సంస్థ బీపీ కూడా నికోకు నోటీసులు ఇచ్చినట్లు తెలిపింది. అయితే, నికో వీటిని సవాల్ చేస్తూ.. ఆర్బిట్రేషన్ నోటీసులు పంపినట్లు రిలయన్స్ పేర్కొంది. కేజీ–డీ6 బ్లాక్‌లో రిలయన్స్‌కు 60 శాతం, బ్రిటన్‌కి చెందిన బీపీకి 30 శాతం, నికో రిసోర్సెస్‌కు వాటాలు ఉన్నాయి.

నేటి నుంచి దావోస్ సదస్సు

- డబ్ల్యూఈఎఫ్‌కు వస్తున్న దిగ్గజాలు
- భారత్ నుంచి 100 మంది పైగా సీఈవోల బృందం
- ట్రంప్, పుతిన్, మాక్రాన్, థెరిసా మే సదస్సుకు దూరం



దావోస్: స్విట్జర్లాండ్‌లోని దావోస్ వేదికగా వరల్డ్ ఎకనామిక్ ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సు సోమవారం (నేడు) నుంచి ప్రారంభం కానుంది. ఈ నెల 25 దాకా జరిగే ఈ సదస్సులో ప్రపంచ ఎకానమీ ఎదుర్కొంటున్న సవాళ్ల గురించి చర్చించేందుకు, పరిష్కార మార్గాలపై కసరత్తు చేసేందుకు వివిధ దేశాల అధినేతలు, విధాన కర్తలు, పారిశ్రామిక దిగ్గజాలు పాల్గొనున్నారు. వీరిలో జర్మనీ చాన్సలర్ ఏంజెలా మెర్కెల్, స్విట్జర్లాండ్ అధ్యక్షుడు యూలి మారర్, జపాన్ అధ్యక్షుడు షింజో అబె, ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహు తదితర 30 దేశాలకు చెందిన అధినేతలు ఉండనున్నారు. ప్రపంచ బ్యాంక్, అంతర్జాతీయ ద్రవ్య నిధి, ప్రపంచ వాణిజ్య సంస్థ మొదలైన అంతర్జాతీయ సంస్థల ప్రతినిధులు, ఆర్థికవేత్తలు, మీడియా సంస్థల అధిపతులు, సెలబ్రిటీస్ మొదలైన వారు 3,000 మంది పైగా ఇందులో పాల్గొనున్నారు. భారత్ నుంచి సుమారు 100 మంది పైగా బృందం దీనికి హాజరవుతోంది. కేంద్ర మంత్రి సురేశ్ ప్రభు, మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్ నాథ్, ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్, పంజాబ్ మంత్రి మన్‌ప్రీత్ బాదల్‌తో పాటు ముకేశ్ అంబానీ, గౌతమ్ అదానీ, సంజీవ్ బజాజ్, అజీం ప్రేమ్‌జీ తదితర 100 మంది పైగా పారిశ్రామిక దిగ్గజాలు కూడా దావోస్ సదస్సులో పాల్గొనున్నారు. 'గ్లోబలైజేషన్ 4.0: నాలుగో పారిశ్రామిక విప్లవం నేపథ్యంలో ప్రపంచాన్ని తీర్చిదిద్దుకోవడం' అనే థీమ్‌తో ఈసారి సదస్సు జరగనుంది.

ట్రంప్, పుతిన్ గైర్హాజరు..

తమ తమ దేశాల్లో రాజకీయ, ఆర్థిక సమస్యల నేపథ్యంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, బ్రిటన్ ప్రధాని థెరిసా మే, ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమాన్యుయెల్ మాక్రాన్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ తదితరులు మాత్రం ఈసారి హాజరు కావడం లేదు. ప్రపంచ దేశాలకు పొంచి ఉన్న రిస్కులకు తక్షణం పరిష్కారమార్గం కనుగొనాల్సిన అవసరాన్ని ఇది సూచిస్తోందని పరిశీలకులు చెప్పారు. మరోవైపు, భారత్ నుంచి ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ, చమురు శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పాటు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ తదితరులు కూడా డబ్ల్యూఈఎఫ్‌లో పాల్గొనడం లేదు.


చర్చనీయాంశాలు..

గ్లోబలైజేషన్ ప్రయోజనాలు, ప్రపంచ శాంతి కోసం తీసుకోతగిన చర్యలు, అభివృద్ధి ఫలాలు అందరికీ అందేలా తీసుకోవాల్సిన చర్యలు మొదలైన అంశాల గురించి ఈ సదస్సులో చర్చించనున్నారు. వాతావరణంలో మార్పులు, అంతర్జాతీయ గవర్నెన్స్ అంశాలు కీలక చర్చనీయాంశాలుగా ఉండనున్నాయి. భౌగోళిక, రాజకీయ, ఆర్థిక రిస్కులు పెరిగిపోతున్నాయని, ప్రపంచ దేశాల మధ్య సంబంధాలు దెబ్బతింటుండటం వల్ల వీటిని సమష్టిగా ఎదుర్కొనే అవకాశాలు సన్నగిల్లుతున్నాయని డబ్ల్యూఈఎఫ్ ఇప్పటికే ఒక నివేదికలో హెచ్చరించింది. డేటా మోసాలు, భారీ స్థాయిలో సైబర్ దాడులతో పాటు సమాజంలో అసమానతలు పెరిగిపోతుండటం వంటి సవాళ్లను కూడా ఇందులో ప్రస్తావించింది.

ఇతరత్రా విశేషాలు..

అయిదు రోజులపాటు జరిగే సదస్సులో భాగంగా 350 పైచిలుకు అధికారిక చర్చాగోష్టులు ఉంటాయి. 1,700 మంది పైచిలుకు వ్యాపార దిగ్గజాలు వీటిలో పాల్గొంటున్నారు. ఆడిడాస్, రియో టింటో, ఐకియా, టోటల్, ఆలీబాబా, పెప్సీకో, కోకాకోలా, నెస్లే వంటి ఎంఎన్‌సీ దిగ్గజాల సీఈవోలు వీరిలో ఉన్నారు.

ఎండోమెంట్ ప్లాన్‌లలో 11% రాబడి వస్తుందా ?



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా వయస్సు 35 సంవత్సరాలు. గత రెండున్నరేళ్ల నుంచి నేను సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఈక్విటీ మ్యూచువల్‌ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తున్నాను. ఈ ఇన్వెస్ట్‌మెంట్స్‌ను కనీసం 5–10 సంవత్సరాలు కొనసాగిద్దామనుకుంటున్నాను. నాకు ఇటీవలే ఇంక్రిమెంట్ వచ్చి జీతం పెరిగింది. దీంతో నా ఇన్వెస్ట్‌మెంట్స్ కూడా పెంచుదామనుకుంటున్నాను. ఏ కేటగిరీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయమంటారు ?

–దీప్తి, హైదరాబాద్

ఈక్విటీ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు గత రెండున్నరేళ్ల కాలం చాలా కీలకమైనది. మార్కెట్ గరిష్ట స్థాయిలకు పెరగడం, అలాగే భారీగా నష్టపోవడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. గత రెండున్నరేళ్లలో ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేసిన ఇన్వెస్టర్లు ఇలా ఒక పూర్తి మార్కెట్ సైకిల్‌ను చూసి ఉంటారు. కాబట్టి స్టాక్ మార్కెట్లో ఇన్వెస్ట్ చేయడానికి సంబంధించిన పూర్తి అనుభవాన్ని మీరు పొంది ఉంటారు. ఇక ప్రస్తుత విషయానికొస్తే, మీరు పెంచాలనుకుంటున్న ఇన్వెస్ట్‌మెంట్స్ కోసం రెండు మల్టీ క్యాప్ ఫండ్స్‌ను ఎంచుకోండి. ఒకటి విలువాధారిత ఫండ్, మరొకటి వృద్ధి ఆధారిత ఫండ్ అయి ఉంటే ఇంకా బావుంటుంది. మీరు పెంచాలనుకుంటున్న ఇన్వెస్ట్‌మెంట్ మొత్తాన్ని ఈ రెండు ఫండ్స్‌లో 40:60 శాతంగా ఇన్వెస్ట్ చేసేలా చూసుకోండి. ఇక డైవర్సిఫికేషన్ ప్రయోజనాల కోసం ఈ రెండు ఫండ్స్ ఒకే మ్యూచువల్ ఫండ్ కంపెనీవి కాకుండా రెండు వేర్వేరు మ్యూచువల్ ఫండ్స్ కంపెనీలవి అయి ఉండేలా చూసుకోవాలి.

ఒక బీమా సంస్థ ఎండోమెంట్ ప్లాన్‌లో ఇన్వెస్ట్ చేస్తే 11 శాతం రాబడి వస్తుందని, పన్ను ప్రయోజనాలు కూడా పొందవచ్చని ఆ బీమా సంస్థ ఏజెంట్ చెబుతున్నాడు. ఇది నిజమేనా ? ఎండోమెంట్ ప్లాన్‌లో ఇన్వెస్ట్ చేస్తే 11 శాతం రాబడులు పొందవచ్చా ? నన్ను ఏం చేయమంటారు ? ఆ ఎండోమెంట్ ప్లాన్‌లో ఇన్వెస్ట్ చేయమంటారా ?

–కరుణాకర్, విజయవాడ

పాలసీల విక్రయం కోసం బీమా సంస్థలకు చెందిన కొందరు ఏజెంట్లు లేని పోని విషయాలు కల్పించి చెబుతూ ఉంటారు. ఎండోమెంట్ ప్లాన్‌లో ఇన్వెస్ట్ చేస్తే 11 శాతం రాబడి వస్తుందని చెప్పడం ఇలాంటిదే. దీనిని మీరు నమ్మకండి. అసలు ఇన్వెస్ట్ చేయడానికి ఎండోమెంట్ ప్లాన్‌లనే ఎంచుకోవద్దు. బీమా అవసరాలకు, భవిష్యత్తు ఆర్థిక లక్ష్యాల సాధన కోసం ఒకే ఇన్వెస్ట్‌మెంట్ సాధనం ఉండకూడదు. బీమా అవసరాలకు, భవిష్యత్తులో మంచి రాబడులు పొందడానికి ఇన్వెస్ట్‌మెంట్స్ వేర్వేరుగా ఉండాలి. మీ పరోక్షంలో మీ కుటుంబం ఆర్థికంగా ఇబ్బంది పడకుండా ఉండాలంటే, టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలో ఇన్వెస్ట్ చేయండి. ఆన్‌లైన్ టర్మ్ ఇన్సూరెన్స్ పాలసీలో ఇన్వెస్ట్ చేస్తే ఇంకా మంచిది. దీంట్లో వ్యయాలు తక్కువగానూ, బీమా కవరేజ్ అధికంగానూ ఉంటుంది. ఇక పిల్లల ఉన్నత చదువుల అవసరాలు. సొంత ఇల్లు సమకూర్చుకోవడం, రిటైర్మెంట్ నిధి ఏర్పాటు వంటి దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల సాధన కోసం ఈక్విటీ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయాలి. సిస్టమేటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్(సిప్) విధానంలో ఇన్వెస్ట్ చేస్తే మంచి రాబడులు వస్తాయి.

స్థిర ఆదాయం పొందడం లక్ష్యంగా నేను కొంత మొత్తాన్ని మూడేళ్ల నుంచి ఐదేళ్ల కాలానికి ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నాను. నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీలు(ఎన్‌బీఎఫ్‌సీ) ఫిక్స్‌డ్ డిపాజిట్లలో ఇన్వెస్ట్ చేయొచ్చంటారా ? లేకుంటే డైనమిక్ బాండ్ ఫండ్స్‌ను ఎంచుకోమంటారా ?

–గంగాధర్, కరీంనగర్

స్థిర ఆదాయం పొందే లక్ష్యం మీదైతే డైనమిక్ బాండ్ ఫండ్స్‌ను ఎంచుకోవద్దు. స్వల్ప కాలం నుంచి మధ్య కాలానికి డైనమిక్ బాండ్ ఫండ్స్‌లో నష్టాలు వచ్చే అవకాశాలు కూడా ఉంటాయి. వడ్డీ రేట్ల విషయంలో గత నాలుగు నుంచి ఐదేళ్ల కాలంలో ఫండ్ మేనేజర్ల అంచనాలు తల్లకిందులయ్యాయి. రేట్లు తగ్గుతాయనుకున్నప్పుడు పెరగడమో, పెరుగుతాయనుకున్నప్పుడు తగ్గడమో జరగడం...ఇలా ఫండ్ మేనేజర్ల అంచనాలకు భిన్నమైన పరిస్థితులు నెలకొన్నాయి. మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేస్తే మంచి రాబడులు వచ్చే మాట వాస్తవమే కానీ, మ్యూచువల్ ఫండ్స్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు నష్టభయం ఉండదని చెప్పలేం. కొంత మొత్తంలో ఖచ్చితమైన ఆదాయం కావాలనుకుంటే, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్స్ కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ)ల డిపాజిట్లలో ఇన్వెస్ట్ చేయవచ్చు. అయితే వీటిల్లో కూడా నష్ట భయం పూర్తిగా ఉండదని చెప్పలేం. అయితే కంపెనీ పేరు ప్రఖ్యాతులు, క్రెడిట్ రేటింగ్ ఆధారంగా ఎన్‌బీఎఫ్‌సీ డిపాజిట్లను ఎంచుకోవాలి. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ కోసం మూడు రకాలైన ఫండ్స్‌ను పరిశీలించవచ్చు. లిక్విడ్, షార్ట్ డ్యురేషన్, అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్‌ను పరిగణనలోకి తీసుకోవచ్చు. ఫిక్స్‌డ్ ఇన్‌కమ్ కోసం ఒక రిటైల్ ఇన్వెస్టర్ ఈ మూడు కాకుండా ఇతర ఫండ్స్ గురించి ఆలోచించడం వృథా. అయితే ఇటీవలి ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ సంక్షోభం కారణంగా ఇప్పుడు ఇన్వెస్టర్లు లిక్విడ్ ఫండ్స్ పేర్లు వింటే వణికిపోతున్నారు. ఐఎల్‌అండ్‌ఎఫ్‌ఎస్ సంక్షోభం ఒక యాక్సిడెంట్ మాత్రమే అని నేను భావిస్తున్నాను. లిక్విడ్, షార్ట్ డ్యురేషన్, అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్... ఎన్‌బీఎఫ్‌సీల డిపాజిట్ల కంటే కూడా మెరుగైన రాబడులనే ఇస్తాయి. మరోవైపు పన్ను ప్రయోజనాలు కూడా లభిస్తాయి.

Published and Printed by K. Ramachandra Murthy, Editorial Director on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., Editor: V. Murali, Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792


HONDA
The Power of Dreams
కలలను సాకారం చేస్తాం
ఏం షైన్ ఇది!
CB Shine
భారతదేశం అభిమానించే 125cc బైక్
ఇప్పుడు కొత్త ప్రీమియం ఫ్రంట్ లుక్‌తో పాటు!
Paytm mall
UPTO ₹ 5000/-^^ EXTRA BENEFITS
₹ 5,999# తక్కువ డౌన్ పేమెంట్
₹ 2,100* వరకు JOY CLUB ప్రయోజనాలు
₹1,000** ఎక్స్ఛేంజ్ బోనస్
1 సంవత్సరం OD ప్రీమియం ఉచితం**
సొగసైన వైజర్ క్రోమ్ గార్నిష్
క్రోమ్ కార్బ్యురేటర్ కవర్
క్రోమ్ ఫినిష్ మఫ్లర్
ఈక్వలైజర్ సహితమైన కాంబి బ్రేక్ సిస్టమ్^
HDFC BANK We understand your world
L&T Financial Services
IndusInd Bank
SHRIRAM City MONEY WHEN YOU NEED IT MOST
హోండా అంటే HONDA
Honda Motorcycle and Scooter India Pvt. Ltd., Registered Office: Commercial Complex II, Sector - 49-50, Golf Course Extension Road, Gurugram - 122018 (Haryana), India; Website: www.honda2wheelersindia.com; Customer Care: customercare@honda2wheelersindia.com
*Terms and Conditions apply. For further details, please visit www.hondajoyclub.com. #Rs.5999/- Low Down Payment as per financier policy and subject to relevant document. Financier can withdraw scheme anytime without any prior notice. ^^Paytm offer subject to Paytm's & respective dealer's terms & conditions. Paytm offer is applicable on select products and at select dealerships only. Paytm offer is available at the sole discretion of dealer. All schemes are at sole discretion of dealership and maybe revoked at any time. **Conditions apply. ^Application of Combi Brake System on Honda Motorcycles upon engaging the foot pedal. Efficiency of braking depends upon the riding conditions and speed of the vehicle. Accessories shown in the picture are not a part of the standard equipment. Product shown in the picture may vary from actual product available in market.
BEST DEAL HONDA Buy. Sell. Exchange
ALWAYS WEAR HELMET WHILE RIDING
Also available: Annual Maintenance Contract** Road Side Assistance** Engine Health Assurance**
Follow us on
Honda Exclusive Authorized Dealerships: NALGONDA: Sri Vigneshwara Honda - 9290143623, 9290053788; Kushal Honda - 08682-248822/33, 9160644472/73/74; MIRYALGUDA: Mereddy Honda - 9618688155, 08689230666/7; KODAD: Mereddy Honda - 08683253925, 9618688177; SURYAPET: Sri Vigneshwara Honda - 8885312455, 8179181884; DEVARAKONDA: Sri Honda - 8688111770, 08691-252225; HALIA: Mereddy Honda - 9618688166, 08680278822; BHONGIR: Kushal Honda - 08685-243555, 9154308152; MOTHKUR: Kushal Honda - 08694-287999, 9949939988; THIRUMALGIRI: Saraswathi Honda - 08693-243243 9505243243; BIBINAGAR: Kakateeya Honda - 9949588911, 9121886912; CHITIYAL: Sri Laxmi Narasimha - 9948138583, 9948537805; ALER: Kushal Honda - 9951208888; CHOUTUPPAL: Kushal Honda - 7330869678.
For Bulk/Institutional enquiries, please write us at: institutionalsales@honda2wheelersindia.com


మహానటి తర్వాత...
- సినిమా పేజీలో


కాలేయ క్యాన్సర్ ఇకపై ప్రాణాంతకం కాదు
- లోపలి పేజీలో

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ సోమవారం
21-1-2019

బంధం

ఇష్టం లేని ఫొటో

ఇష్టం లేని ఫొటోను దాచేస్తాం. దాచడం కూడా ఇష్టం లేని ఫొటోను? చింపేస్తాం. పెళ్లి ఫొటోలో తనతో పాటు తన చదువూ ఉండాలనుకుంది గీతాంజలి. వీలవలేదు. పెళ్లయ్యాక తన ఫ్యామిలీ ఫొటోలోనైనా తన చదువు ఉండాలనుకుంది. కుదరలేదు. మొత్తం ఫొటోను చింపేయలేదు కదా. అందుకని భర్త, పిల్లల మధ్యలోంచి తనను మాత్రం తొలగించుకుంది. చావులోనైనా చదువుతో కలిసి ఉండాలనుకుందేమో ఫొటోలోంచి వెళ్లిపోయింది!

● మాధవ్ శింగరాజు

పెద్ద చదువులు, పెద్ద డిగ్రీలు అందరికీ కుదరవు. ఆడపిల్లకు అసలే కుదరవు. ఎంత సంపన్నుల పిల్లకైనా.. డిగ్రీలోనో, ఇంటర్‌లోనో, దురదృష్టం పెళ్లి పెద్దలా నెత్తిమీద కూర్చుంటే మరీ టెన్త్‌కే.. పెళ్లడ్డు పడుతుంది ఎక్స్‌ట్రా కరిక్యులర్ యాక్టివిటీలా! మళ్లొచ్చి చదవడానికి ఉండదు. ఆలీబాబా నలభై దొంగల రాతి గుహకు ఉండే మాయా ద్వారం మూతపడినట్లుగా క్లాస్ బుక్స్ అన్నీ మూతపడి ఉంటాయి, తెల్లారే లేచి చూస్తే. వాటిని తెరవడానికి పాస్‌వర్డ్ కావాలి. ఇంకెక్కడ ఉంటుంది! పెళ్లి రోజే వేళ్లతో నీళ్ల బిందెలోని ఉంగరాన్ని వెతుకుతున్నప్పుడే పెళ్లికొడుకు ఉదారంగా బిందె లోపలి ఉంగరాన్ని పెళ్లికూతురు చేతికి చిక్కనిచ్చి, ఆమె వేలికి కలిపించకుండా ఉండే మహిమ గల చదువు ఉంగరాన్ని ఒడుపుగా లాగేసుకుంటాడు. అప్పట్నుంచీ ఆమె వేళ్లకు, చేతులకు ఇంటి పనే అలంకరణ! చదువు పూర్తి చేయకపోయినా చేతికి వచ్చిన 'గృహిణి' అనే డిగ్రీ సర్టిఫికెట్‌తోనే


చివరి సంతకం : గీతాంజలి, ఐపీఎస్

ఆమె జీవితం నడుస్తుంది, గడుస్తుంది. జీవితాంతం వరకు. అది ఆమె కోరుకోని డిగ్రీ. కోరుకోనిదైనా కాన్వొకేషన్ కోటు, హ్యాటూ పెట్టుకుని, పట్టలేని సంతోషంతో గాలిలోకి కాళ్లు ఒకవైపుకు లేపి ఎగురుతున్నట్లుగా పెళ్లి పీటలపై బలవంతపు ఫొటో తీయించుకోవలసిందే. వెడ్డింగ్ విషెస్ తలంబ్రాల్లా వచ్చి తలపైన, ముఖం మీద, కంట్లో పడుతుంటాయి. 'పెళ్లొద్దు నాన్నా.. చదువుకుంటాను నాన్నా' అని ఇంకా ఏడుస్తూనే ఉన్న ఆ కళ్లు ఎవరికి కనిపిస్తాయి.. పక్కనే కూర్చొని కళ్లలోకే చూస్తున్న పెళ్లికొడుక్కే కనిపించకపోతే!

'పెళ్లొద్దు నాన్నా, చదువుకుంటాను నాన్నా' అని పదేళ్ల క్రితం గీతాంజలి కూడా ఏడ్చింది. లైఫ్‌లో చాలా ఎత్తుకు ఎదగాలనుకుంది తను. ఐపీఎస్ చేయాలనుకుంది. పదహారేళ్లు తనకి. తల్లి ఒడిలో కూర్చొని అప్పటి వరకు టెన్త్ హోమ్ వర్క్ చేసుకున్న ఆ చిన్నారి.. ఇంటర్‌లో చేరగానే ఒక్కసారిగా ఎదిగిన పిల్లలా కనిపించింది తండ్రికి. భయపడిపోయాడు. పెళ్లి చేసేయాలని తొందరపడ్డాడు. చేసేశాడు. గీతాంజలికి ఇప్పుడు ఇరవై ఆరేళ్లు. ఇద్దరు పిల్లలు. పెళ్లవకుండా ఉంటే ఇప్పటికీ తనూ ఒక పిల్లే. పెద్ద పిల్ల. ఐపీఎస్‌గా సెలక్టయ్యో, ఐపీఎస్‌కీ ప్రిపేర్ అవుతూనో ఉండేది. ఇప్పుడు కూడా ఎస్సై ఉద్యోగానికి ప్రిపేర్ అవుతూనే ఉంది. శనివారం ఆత్మహత్య చేసుకుంది! భర్త మహారాష్ట్రలో లెక్చరర్. వచ్చిపోతుంటాడు. తను, పిల్లలు హైదరాబాద్‌లో ఉంటారు. సంక్రాంతి పండక్కి అమ్మావాళ్లింటికి ఆదిలాబాద్ వెళ్లొచ్చింది. శుక్రవారం వచ్చింది. శనివారం ఉరేసుకుంది. పిల్లల్ని అనాథల్ని చేసి వెళ్లిపోయింది. పిల్లలేనా? తను కన్న కలల్ని, తను అల్లుకున్న ఆశల్ని, తను ఏర్పరచుకున్న ఆశయాల్ని.. అన్నిటినీ అనాథల్ని చేసింది. ఇంట్లో ఫ్యాన్‌కి వేలాడుతున్న ఆమె కాళ్లను.. పెళ్లి, పిల్లలు, సంసారం కన్నా ఎక్కువ అనుకున్న ఆమె కలలు, ఆశలు, ఆశయాలు.. 'అమ్మా.. అమ్మా..' అని చుట్టేసుకుని రోదిస్తున్న దృశ్యాన్ని ఊహించండి. ఏడు పేజీల సూసైడ్ నోట్ రాసింది గీతాంజలి. అది చదివి ఆమె తల్లిదండ్రుల గుండెలు బద్దలైపోయి ఉంటాయి. పదేళ్ల క్రితం పెళ్లి రోజు కూతురు చదువుతూ చదువుతూ పుట్టింట్లో వదిలేసి వెళ్లిన ఆఖరి టెక్స్ట్ బుక్ వాళ్లకు గుర్తొచ్చే ఉంటుంది. గీతాంజలి మృతదేహాన్ని చూసి గీతాంజలి భర్త అపరాధభావంతో కుమిలిపోతూ ఉండుంటాడు. 'కాస్త పిల్లల్ని పట్టుకోండి, ఈ ఇంపార్టెంట్ క్వొశ్చన్ ఒక్కటీ పూర్తి చేసేస్తాను' అన్నప్పుడు.. 'అవసరమా గీతా.. నేను చేయకపోతే కదా నీకు ఉద్యోగం' అని తను విసుక్కుని ఉంటే అది అతడికి గుర్తుకు వచ్చే ఉంటుంది.

'ఏడ్వని రోజు లేదు. అందుకే వెళ్లిపోతున్నా' అని సూసైడ్ నోట్‌లో రాసింది గీతాంజలి. 'ఆడపిల్లల మనసు అర్థం చేసుకోండి' అని రాసింది. 'పెళ్లొద్దంటే చేయకండి', 'వద్దన్న పెళ్లి చెయ్యకండి' అని రాసింది. 'కలామ్ మాటల్ని ఆదర్శంగా తీసుకుని ఎన్నో కలలు కన్నాను. నా కలలు కలలుగానే ఉండిపోయాయి' అని రాసింది. 'పెద్ద చదువులు చదవాలనుకున్నాను. పెద్ద ఉద్యోగం సంపాదించాలనుకున్నాను. అంత పెద్ద చదువుతో, అంత పెద్ద ఉద్యోగంతో.. నా భర్త పక్కన తిరగాలనుకున్నాను. కానీ నాన్న, నా పెళ్లి చేసి పంపించేశాడు. ఇంటర్‌తోనే నా చదువు ఆగిపోయింది. కోరుకున్న జీవితం దక్కలేదు. ఇంతకుమించి జీవితంలో కోల్పోడానికి ఏముంటుంది?' అని రాసింది. 'తల్లిదండ్రులూ.. చిన్నప్పుడే మీ పిల్లలకు పెళ్లిళ్లు చెయ్యకండి' అని రాసింది. 'మామయ్యా.. నా పిల్లల్ని బాగా చదివించండి' అని రాసింది. 'బిట్టు, సాయి.. బాగా చదువుకోండి' అని రాసింది. ఉత్తరంపై ఎన్ని కన్నీటి చుక్కల మరకలు ఉన్నాయో తెలియదు కానీ, ఉత్తరం చివర్న గీతాంజలి తన పేరును ఎలా రాసుకుందీ చదివితే ఎంతటివారికైనా దుఃఖం కట్టలు తెంచుకుంటుంది. 'గీతాంజలి, ఐపీఎస్' అని రాసుకుంది గీతాంజలి!!

కష్టపడి చదివి సాధించుకున్న డిగ్రీని పేరు పక్కన పెట్టుకుంటే పేరుకు వాల్యూ ఉంటుంది. గొప్పగా, గౌరవంగా ఉంటుంది. ఏ రంగంలోని ప్రసిద్ధతనైనా పరిపూర్ణం చేసే 'తగిలింపు'.. చదువు టైటిల్! కేవీరెడ్డి బి.ఎ., కిరణ్ బేడీ ఐపీఎస్. ఒక కంప్లీట్‌నెస్! అందుకేనేమో గీతాంజలి కనీసం చావులోనైనా చదువుతో కలిసి ఉండాలని కోరుకున్నట్లుంది. ఉన్న కుటుంబంతో కలిసి జీవించాలన్న కోరిక కన్నా, లేని చదువుతో కలిసి మరణించాలని అనుకున్నట్లుంది. పెట్టుకోడానికి తన పేరు పక్కన 'ఐపీఎస్' అని పెట్టుకున్నా.. ఐపీఎస్‌కే తన పేరును టైటిల్‌గా పెట్టి వెళ్లిపోయింది. అందుకే ఆమె గీతాంజలి, ఐపీఎస్ కాదు. ఐపీఎస్, గీతాంజలి. ఎంత గౌరవం తెచ్చిపెట్టింది చదువుకు ఈ అమ్మాయి!

కానీ.. చేసింది ఏం మంచి పని! చదివితే వచ్చే క్వాలిఫికేషన్‌కు, ఉద్యోగం చేస్తే వచ్చే శాటిస్‌ఫాక్షన్‌కు 'గృహిణి' అనే డిగ్రీ, 'గృహిణి' అనే జాబ్.. సమానం కాకపోవచ్చు. అసలది డిగ్రీ, అసలది జాబ్ ఎలా అవుతుందనీ అనిపించవచ్చు. కష్టపడి చదివి సంపాదించిన డిగ్రీకి ఎంత విలువ ఉంటుందో, చదవాలని ఆశ ఉండీ చదివే అవకాశం లేకపోయిన డిగ్రీకీ అంతే విలువ ఉంటుంది. అయినా ప్రాణ సమానంగా ప్రేమించిన చదువు కోసం ప్రాణాన్నే తీసేసుకుంటే చదువుకు ఏం విలువ ఇచ్చినట్లనే ఆలోచన ఆఖరి నిముషంలోనైనా గీతాంజలిలో కలిగి ఉంటే ఎంత బాగుండేది! ●



షేవింగ్ చేస్తున్న నేహా

నాన్నకు వారసులు

అమ్మానాన్న, ఇద్దరమ్మాయిలు. 'పదిలంగా అల్లుకొన్న పొదరిల్లు మాది'.. అన్నట్లే వాళ్లది ముచ్చటైన కుటుంబం. ఆ ముచ్చట అలాగే కొనసాగితే ఆ ఇద్దరు అమ్మాయిలు అందరు అమ్మాయిల్లాగే ఉండేవాళ్లు. అబ్బాయిలుగా వారే వాళ్లే కాదు. 'మారడం' అంటే.. అబ్బాయిలుగా నటించాల్సి రావడం. ఆ నటన కూడా వెండి తెర మీదో, రంగస్థలం మీదో కాదు, నిత్య జీవితంలో! తెర మీద నటిస్తే చప్పట్లు కొడతారు. హర్షిస్తారు. నిజ జీవితంలో నటిస్తే అవేం ఉండవు. అయితే ఇక్కడే మరో ట్విస్ట్ ఉంది. జీవితంలో నటించక తప్పని ఆ ఇద్దరు అమ్మాయిల్ని సమాజం గౌరవించింది. ప్రభుత్వం కూడా వాళ్లను సత్కరించింది. ఆ గౌరవాన్ని, ఆ సత్కారాన్ని అందుకున్న అమ్మాయిలే జ్యోతికుమారి, నేహా.

షాపు తెరిచారు.. వేషం మార్చారు

జ్యోతి కుమారి వయసు 18, నేహకు పదహారేళ్లు. ఉత్తరప్రదేశ్‌లోని గోరఖ్‌పూర్ నగరానికి దగ్గరగా ఉన్న భన్వారీతోలి వాళ్లుండే గ్రామం. వాళ్ల నాన్న ధృవ నారాయణ. సెలూన్ నడిపేవాడు. నాలుగేళ్ల కిందటి వరకు ఆయన సెలూన్ నడుపుతూనే ఇంటిని పోషించాడు. పిల్లలిద్దరినీ చదివించాడు. 2014లో ఉన్నట్లుండి అనారోగ్యం పాలయ్యాడు. మంచం మీద నుంచి లేచి సెలూన్‌కు రావడానికి కూడా వీల్లేని పరిస్థితి. సెలూన్ మూతపడింది. అతడు మంచాన పడటంతో ఆ కుటుంబం కుప్పకూలిపోయింది. ఇల్లు జరగాలంటే సెలూన్ తెరవాలి. తెరిచినా సెలూన్‌లో పని ఎవరు చేయాలి? ఇంట్లో ఒక్క మగపిల్లాడు కూడా లేడు. ధృవ నారాయణ భార్యకు భర్తను చూసుకోవడంతోనే సరిపోతోంది. పైగా సెలూన్ అన్నది ఆడపిల్లలు చేసే పని కాదు. మరి.. ఇల్లు గడవాలంటే, ఆ ఇద్దరే ఏదో ఒక పని చేయాలి. వేరే మార్గం లేదు. బాగా ఆలోచించాక ఓ రోజు.. అక్కాచెల్లెళ్లిద్దరూ వెళ్లి సెలూన్ తలుపులు తెరిచి శుభ్రం చేశారు. నాన్న పని చేసేటప్పుడు చూసిన అనుభవం తప్ప స్వయంగా చేసిన అనుభవం లేదు. 'సవ్యంగా చేస్తారా ఈ ఆడపిల్లలు' అని సెలూన్‌కి వచ్చే మగవాళ్లకు భయం. ''జాగ్రత్తగా చేస్తాం'' అని బతిమిలాడి వచ్చిన వాళ్లకు హెయిర్‌కటింగ్‌లు, షేవింగ్‌లు చేశారు. 'ఫర్వాలేదు, పిల్లలకు పని సులువుగానే పట్టుపడింది' అనుకున్న పెద్దవాళ్లు భరోసాగా వీళ్ల సెలూన్‌కు రావడం మొదలు పెట్టారు. కొత్త వాళ్లు సెలూన్


అవార్డు అందుకుంటున్న అక్కచెల్లెళ్లు : నేహ (ఎడమ), జ్యోతి

వరకు వచ్చి అమ్మాయిలను చూసి వెనుదిరిగి వెళుతున్నారు. వెళ్లేవాళ్లు వెళ్లిపోతుంటే, 'ఈ సెలూన్‌లో అయితే అమ్మాయిలు షేవ్ చేస్తార్రా' అని వచ్చే పోకిరీ కుర్రాళ్లతో వాళ్లకు కష్టాలొచ్చిపడ్డాయి. హెయిర్ కటింగ్ చేసేటప్పుడు, షేవ్ చేసేటప్పుడు ఆకతాయిలు వెకిలి వేషాలు వేసేవాళ్లు. అప్పుడు తీసుకున్నారా అమ్మాయిలు ఓ నిర్ణయం. సెలూన్‌కి వచ్చిన వాళ్ల హెయిర్ కట్ చేయడం కాదు, ముందు తమ హెయిర్ కట్ చేసుకోవాలని. ఒకరికొకరు హెయిర్ కట్ చేసుకుని, జీన్స్, టీ షర్టులు వేసుకున్నారు. రాజు, దీపక్ అని పేర్లు పెట్టుకున్నారు. ఊరికి దూరంగా హైవేకు దగ్గరగా ఉన్న సెలూన్ కావడంతో కస్టమర్లలో సొంతూరి వాళ్లకంటే బయటి వాళ్లే ఎక్కువ. అమ్మాయిలే అబ్బాయిలుగా మారారనే వాస్తవం త్వరగానే మరుగున పడిపోయింది. ఊర్లో ఉన్న వంద కుటుంబాల వాళ్లకూ వీళ్లు అబ్బాయిలు కాదు అమ్మాయిలని తెలుసు. ఆ నిజాన్ని పనిగట్టుకుని సెలూన్‌కి వచ్చే వాళ్లకు చెప్పి ఆడపిల్లల పొట్టకొట్టే అనైతికానికి ఎవరూ పాల్పడలేదు.

> **చేసింది చిన్న యుద్ధం కాదు**
>
> జీవితంలో ఎదురయ్యే క్లిష్టమైన పరిస్థితులను మించిన శత్రువులుండరు. ఆ శత్రువుతో పోరాడాలంటే దృఢమైన సంకల్పబలం ఉండాలి. టీనేజ్ దాటని ఈ అమ్మాయిలు చేసిన యుద్ధం చిన్నది కాదు. స్ఫూర్తిదాయకమైన ఈ సిస్టర్స్ గురించి సమాజానికి తెలియచేయాల్సిన అవసరం ఉంది.
>
> – అభిషేక్ పాండే,
> అవార్డును అందజేసిన ప్రభుత్వాధికారి

చదువును కుంటుపడనివ్వలేదు

దీపక్, రాజు (జ్యోతి, నేహా)ల సంపాదన రోజుకు నాలుగు వందలు. ఇంట్లో నలుగురూ కడుపు నిండా తింటున్నారు, ధృవ నారాయణకు మందులకూ డబ్బులు ఉంటున్నాయి. ఇదే మాట చెబుతూ ''ఆడపిల్లలను సెలూన్‌కి పంపించేటప్పుడు మనసు మెలిపెట్టినట్లయింది. ఇప్పుడు నా కూతుళ్లను చూస్తుంటే గర్వంగా ఉంది. సెలూన్ నడుపుతూ మమ్మల్ని పోషించడమే కాదు, వాళ్లు చదువుకుంటున్నారు కూడా'' అని సంతోషిస్తున్నారు ధృవ నారాయణ. జ్యోతి డిగ్రీ పూర్తి చేసింది. నేహ ఉదయం కాలేజీకెళ్లి, మధ్యాహ్నం నుంచి సెలూన్‌లో పని చేస్తుంది.

''మగవాళ్లకు హెయిర్ కటింగ్, షేవింగ్ చేస్తున్నామని, మగవాళ్లలాగ హెయిర్ కట్ చేసుకుని, షర్టు–ప్యాంటు వేసుకుంటున్నామని మమ్మల్ని వెక్కిరించిన వాళ్లున్నారు. వాళ్లు వెక్కిరించారని పని మానుకునే పరిస్థితి కాదు మాది. అందుకే ఎవరు ఏమన్నా ఈ పనిని కొనసాగిస్తున్నాం. ఇప్పుడు మేము ఎవరికీ భయపడటం లేదు. ధైర్యంగా పని చేసుకుపోతున్నాం. మాకు అబ్బాయిల్లా నటించాల్సిన అవసరం కూడా లేదిప్పుడు. మేము అమ్మాయిలం అని ధైర్యంగా చెప్పగలుగుతున్నాం. అక్క కూడా జుట్టు పెంచుకుంటోందిప్పుడు'' అంటోంది నేహ. వీళ్లకు ఒక అవార్డు కూడా వచ్చింది! ఆ వివరాలు చెబుతూ ''ఓ రోజు గోరఖ్‌పూర్ నుంచి ఓ విలేఖరి ఇటువైపు వచ్చినప్పుడు మా సెలూన్‌కొచ్చారు. మమ్మల్ని చూసి ఆశ్చర్యంగా మా వివరాలడిగారు. మా కథనాన్ని పత్రికలో రాశారు. ఆ కథనాన్ని చూసిన ప్రభుత్వ అధికారులు మమ్మల్ని వెతుక్కుంటూ వచ్చి అభినందించారు. అది మాకెంతో ఉత్సాహాన్నిచ్చింది'' అంటోంది జ్యోతి.

ఆర్థిక అవసరాలు వెంటాడినప్పుడు మహిళలు ఇంటి అవసరాలను తీర్చడానికి ఎన్నో పనులు చేస్తుంటారు. గ్రామాల్లో పొలం పనులకు పోతుంటారు. ప్రభుత్వాలు కూడా మహిళలకు ఉపాధి అనగానే కుట్టు మిషన్లు, ఎంబ్రాయిడరీ ట్రైనింగ్ అనే అనుకుంటాయి. ఈ అమ్మాయిలు వాళ్ల ఇంటి వృత్తిలోనే ఉపాధి పొందుతున్నారు. తండ్రికి వారసులుగా జీవితాన్ని నిలబెట్టుకోవడానికి కొత్త మార్గాన్ని నిర్మించుకున్నారు.

– మంజీర

అన్వేషణ

కోకిల గీతం... తుమ్మెద రాగం

'అన్వేషణ' సినిమాలో భానుప్రియ, కార్తీక్ లాంటివాళ్లు.. అక్షిత, పీయూష్! ఆ సినిమాలో భానుప్రియ చెట్టూ పుట్టా తిరిగి శ్రావ్యమైన శబ్దాలను అన్వేషిస్తూ ఉంటే, కార్తీక్ ఆమెకు హెల్ప్ చేస్తుంటాడు. ఇక్కడా అంతే. అక్షితకు ఆమె భర్త పీయూష్ పరిశోధన సహకారం అందిస్తున్నారు. ఈ దంపతులకు వినాయక్ అనే మరో ప్రకృతి ప్రేమికుడు కూడా తోడయ్యాక.. అంతరించిపోతున్న గిరిజన గీతాలన్నీ ఒకటొకటిగా మళ్లీ ప్రాణం పోసుకుంటున్నాయి.

భారతదేశంలో కొన్ని వేల గిరిజన జాతులు ఉన్నాయి. వారి సంప్రదాయాలు, వేషధారణ, సంగీతం అన్నీ వేటికవే ప్రత్యేకం. అటువంటి జాతులలో కొన్ని జాతులు రానురాను అంతరించిపోతున్నాయి. వాటికి సంబంధించిన సమాచారాన్ని ఎవరో ఒకరు జాగ్రత్త చేయకపోతే, కొంతకాలానికి ఈ జాతుల గురించి ప్రపంచానికి తెలిసే అవకాశం ఉండదనే ఉద్దేశంతో పీయూష్ గోస్వామి, అక్షిత దంపతులు 'ది ఫార్‌గాటెన్ సాంగ్స్' అనే ఒక ప్రణాళిక రూపొందించారు!

బియాట్ పాట 'బీట్' ఆగింది!

పీయూష్, అక్షిత దంపతులు నిరంతరం ప్రయాణిస్తూనే ఉంటారు. అలా ఒకసారి అస్సాం లోని డిమో హసావ్ జిల్లాను సందర్శించారు. అక్కడ 'ఎపా లల్లురా' అనే బియాట్ గిరిజన తెగ నాయకుడిని కలిశారు. ఆయనతో మాట్లాడుతూండగా ఆ తెగ వారి సంగీతం కాలగర్భంలో కలిసిపోతోందన్న బాధ ఆ నాయకుడి ముఖంలో కనిపించింది. వారు బియాట్ భాషతో పాటుగా యాసతో కూడిన హిందీ, బెంగాలీ, అస్సామీ, ఢింసా భాషలు, నాగాలాండ్‌లోని మాండలికాలు మాట్లాడగలరని లల్లూరా మాటల నుంచి తెలుసుకున్నారు. వారి భాష కేవలం మౌఖికంగా మాత్రమే మిగిలే స్థితికి వచ్చింది. వారిలోని కొత్తతరానికి.. బియాట్ భాష రాకపోవడం వల్ల సంప్రదాయ సంగీతానికి కాలం చెల్లుతోందని ఈ దంపతులకు లల్లూరా చెప్పారు.


అక్షిత


పీయూష్

బియాట్ జాతి వారు ఈశాన్య భారతంలో ఉంటారు. వీరు చైనా నుంచి ఇక్కడకు వలస వచ్చినట్లుగా భావిస్తారు. అక్కడ వారు మైనారిటీలే అయినప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం ఇంకా గుర్తించలేదు. ఈ విషయం గోస్వామి దంపతులను కదిలించింది. వీరు అప్పటికే 'రెస్ట్ ఆఫ్ మై ఫ్యామిలీ' (ఈ ఊరు, ఈ నేల) అనే ఒక లాభాపేక్ష లేని సంస్థను స్థాపించారు. గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న సాంఘిక, ఆర్థిక సమస్యలను తెలుసుకుని, పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నారు. లల్లూరా మాటలు విన్నాక ''ఏదో ఒకటి చేద్దాం'' అన్నారు గోస్వామి.

ఎక్కడ దొరికితే అక్కడ

2018 లో ఈ దంపతులు గిరిజన సంప్రదాయ గీతాల కోసం ప్రయత్నాలు ప్రారంభించారు. ఎక్కడ బియాట్ పాటలు దొరికితే అక్కడ, ఎవరు పాడుతుంటే వారివి అక్కడికక్కడే రికార్డు చేయడం మొదలుపెట్టారు. ఈ జాతి వారికి సంబంధించి తాము సేకరించినవాటిని ఒక డాక్యుమెంటరీ సినిమాగా రూపొందించారు. 'ద ఫర్‌గాటెన్ సాంగ్స్' అని పేరు పెట్టి ఈ ఏడాది జనవరి 8వ తేదీన విడుదల చేశారు. గోస్వామి దంపతులతో గ్రామీణ కళాకారులు చాలా మంది ప్రయాణిస్తున్నారు. దారిలో వారు వింటున్న కొత్త కొత్త శబ్దాలను, కథలను రికార్డు చేస్తూ, పాటలకు జోడిస్తున్నారు. అలాగే ఆయా జాతుల వారు ఎదుర్కొంటున్న సమస్యలను కూడా తెలుసుకుంటున్నారు. గిరిజనుల జానపదాలను షార్ట్ ఫిల్మ్‌లుగా తీసి, ఆడియో రిలీజ్‌లు కూడా పెడుతున్నారు.

సంగీత శంఖంలో కథల తీర్థం

చెన్నైలో నివసిస్తున్న వినాయక్ అనే మరో యువకుడు గోస్వామి దంపతులతో కలిసి, వారు చేపట్టిన ప్రాజెక్టును విజయవంతంగా నడుపుతున్నారు. ప్రకృతిలో ఉండే శబ్దాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కలిపి, జానపదులకు సంబంధించిన కథలను సంగీతం ద్వారా చెబితే అందరికీ త్వరగా చేరుతుందని, సమాజంలో అందరికీ అవేర్‌నెస్ కలుగుతుందని భావించాడు వినాయక్.


ఎపా లల్లురా

బియాట్ తర్వాత.. బోండా, బస్తర్


కనుమరుగైపోతున్న సంస్కృతిని కాపాడటం కోసం లల్లూరా పాడుతున్న పాటలను ఒకచోట పొందుపరచడం కోసం గోస్వామి, వినాయక్‌లు అడవుల్లో అడుగులు వేస్తున్నారు. భయంకరమైన రోడ్ల మీద ప్రేమగా ప్రయాణిస్తున్నారు. వినాయక్‌కి వారి గురించిన విశేషాలు అర్థమయ్యాక, పాటలు, వివిధ శబ్దాలను సేకరించారు. అనేకమంది గాయకులను కలుసుకుంటున్నారు. బియాట్ సంప్రదాయ గీతాలను ఎపా లల్లూరా, ఎపా రొయిలియానాలు పాడుతుండగా వినాయక్ రికార్డు చేస్తున్నారు. ఇక్కడ పని పూర్తయ్యాక, ఒరిస్సాకు చెందిన బోండా జాతివారి గురించి, బస్తర్‌లో ఉన్న గోండు జాతి గురించి పరిశోధన చేయనున్నారు.

– జయంతి

చెట్టు నీడ

పెద్దపులి

ఆయన ఒక సంగీత విద్వాంసుడు. వయొలిన్ వాయించాడంటే మండుటెండల్లో కూడా వర్షాలు కురుస్తాయని పేరు. ఆయన ఒకసారి ఒక సర్కస్ చూడటానికి వెళ్లాడు. అక్కడొక సర్కస్ కళాకారుడు వయొలిన్ వాయిస్తుంటే ఒక ఎలుగుబంటి డాన్స్ చేసింది. ప్రేక్షకుల చప్పట్లతో సర్కస్ టెంట్ మార్మోగింది. అది చూసిన మన వయొలిన్ విద్వాంసుడు ''బాగా తర్ఫీదునిచ్చిన ఎలుగుబంటి మాత్రమే నీ వయొలిన్‌కు తగినట్టు నాట్యం చేయగలదు. కాని నా సంగీతంతో ఎటువంటి జంతువు చేతనైనా నాట్యం చేయించగలను''అన్నాడు గొప్పగా. ''అది సాధ్యం కాదు'' అన్నాడు సర్కస్ కళాకారుడు. ఇద్దరికీ మాటా మాటా పెరిగి పోటీకి దారితీసింది. దాంతో వయొలిన్ విద్వాంసుడికి ఎదురుగా ఒక సింహాన్ని పంపాడు సర్కస్ కళాకారుడు. వయొలిన్ నాదానికి చిందులేస్తూ ఆడింది సింహం. ఆ తరువాత ఒక చిరుతపులిని పంపాడు. అది కూడా వయొలిన్ సంగీతానికి మైమరచి నాట్యం చేసింది. తరువాత ఒక పెద్ద పులి వంతు వచ్చింది. ఏమాత్రం బెదిరిపోకుండా అద్భుతంగా వయొలిన్ వాయించసాగాడు విద్వాంసుడు. అయితే ఆ పులి సంగీతానికి అసలు ఏమీ మైమరచిపోకుండా పంజావిప్పి వయొలిన్ విద్వాంసుడి మీదికి దూకబోయింది. బిత్తరపోయిన ప్రేక్షకులు చెల్లాచెదరయ్యారు. విద్వాంసుడు కూడా వయొలిన్‌ను కిందపడేసి పరుగుతీసి పులి బారి నుంచి తప్పించుకున్నాడు. సర్కస్ సిబ్బంది



ఒడుపుగా పులిని బోనులో బంధించారు. ప్రాణభయం నుంచి తేరుకున్న సంగీత విద్వాంసుడు సర్కస్ కళాకారుని ముందు తన ఓటమిని అంగీకరిస్తూనే, ఆ పెద్దపులి తన సంగీతానికి కట్టుబడకపోవడం తనకెంతో ఆశ్చర్యం కలిగిస్తోందన్నాడు. అందుకు సర్కస్ కళాకారుడు నవ్వుతూ ఇలా అన్నాడు. ''ఆ పెద్ద పులి పుట్టినప్పుడే దానికి చెవుల్లేవు. ఈ సంగతి గమనించిన ప్రేక్షకులు పారిపోవడం ప్రారంభించారు. మీరు అది గమనించకుండా వయొలిన్ వాయిస్తూనే ఉన్నారు''అన్నాడు. సంగీత విద్వాంసుడు తల దించుకున్నాడు. ఈ కథను చెప్పిన గురువు తన శిష్యులతో– చదువు, తెలివి, చురుకుదనం మాత్రమే ఉంటే చాలదు. వర్తమానం గురించిన స్పృహ కూడా అవసరం. ఈ వివేకం లేనివారికి ఎన్ని తెలివితేటలున్నా ఏవిధమైన ప్రయోజనమూ ఉండదని గ్రహించాలి'' అని బోధించాడు.

– డి.వి.ఆర్.

ఇంటిప్స్

● నాన్‌స్టిక్ పాత్రలు, పెనాలను సులభంగా శుభ్రం చేయాలంటే... వాటిలో వేడినీటిని పోసి పది నిమిషాలసేపు అలాగే ఉంచి తర్వాత క్లీనింగ్



పౌడర్‌తో కాని డిటర్జెంట్‌తో కాని కడగాలి.

● షూస్ మీద మొండి మరకలు ఉండి వదలకపోతే వాటి మీద ఆఫ్టర్ షేవ్ లోషన్ కొద్ది చుక్కలు వేసి తుడవాలి.

సాక్షి ఫ్యామిలీ

నల్లగొండ ॥ సోమవారం
21-1-2019

లవ్ డాక్టర్ | నన్నడగొద్దు ప్లీజ్


ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ సార్! నేనొక అమ్మాయిని ప్రేమించాను. తను కూడా నన్ను లవ్ చేసింది. అయితే కొద్ది రోజుల క్రితం ఒక అబ్బాయి తన వెంటపడి తన ఫోన్ నంబర్ ఇచ్చాడట. ఆ విషయం నాకు చెప్పలేదు. నంబర్ ఇచ్చిన టూ మంత్స్ తర్వాత రోజూ కాల్ చేస్తూ మాట్లాడేదట. నాతో కూడా చాలా ప్రేమగా ఉండేది. కానీ మా విషయం ఆ అబ్బాయికి చెప్పలేదట. రీసెంట్‌గా ఆ విషయం ఒక ఫ్రెండ్ ద్వారా బయటపడింది. నిలదీస్తే.. 'నేను కేవలం ఫ్రెండ్‌లానే ఆ అబ్బాయితో మాట్లాడాను. నేను ఏ తప్పు చెయ్యలేదు' అంటోంది. ఇప్పుడు నేను తనని ఏలా నమ్మాలి? నాకు చెప్పకపోవడం తప్పేనని ఒప్పుకుంది. క్షమించమంటోంది. 'నేను ఎప్పుడూ ఆ అబ్బాయిని లవర్‌గా అనుకోలేదు. నేను నిన్ను మాత్రమే లవ్ చేశాను' అంటోంది. ఇప్పుడు ఏం చెయ్యాలో అర్థం కావట్లేదు. ప్లీజ్ మంచి సలహా ఇవ్వండి.

– రామకృష్ణ

చెంపలేసుకుంది కదన్నా! క్షమించెయ్యి!!


'సార్..! లవర్‌కి తెలియకుండా అక్కడ కనెక్షన్ పెట్టుకుంటే... క్షమించేయమంటారేంటి సార్? మీ మాట విని రేపు ఓ అండర్‌స్టాండింగ్‌కి వచ్చి, పెళ్లో గిళ్లో అనుకుని, ఆ తర్వాత కూడా ఇలాగే ఫ్రెండ్లీగా ఎవరితోనైనా మాట్లాగితే... మనోడు ఏమవుతాడు సార్? మొత్తం మటాష్ అయిపోదా సార్? మీరు ఆన్సర్ ఇచ్చేటప్పుడు వాళ్ల షూస్‌లోకి వెళ్లి కష్టం–నష్టం, బాధ–వ్యథా.. అర్థం చేసుకుని మంచిగా బాలెన్స్‌గా ఆన్సర్ ఇస్తారని మీకు ఉత్తరం రాస్తే... మీరు ఆ అమ్మాయి సైడ్ తీసుకుని వీడి జీవితం కొల్లేరు చేస్తున్నారేంటి సార్? మీకే అలా అయితే ఎలా ఉంటుంది సార్? మొత్తం కాలిపోదా సార్? ఫుల్‌గా డిప్రెషన్ రాదా సార్? అంతగా ప్రేమించిన అమ్మాయి ఫోన్‌లో మాట్లాడుతుందో... ఇంకేమైనా కమిట్ అయ్యిందో మీకెలా తెలుసు సార్? పండులాంటి రామకృష్ణ లైఫ్‌లో కుళ్లిపోయిన సజెషన్ జత చేస్తే పండు కూడా కుళ్లిపోద్ది కదా సార్? మీరు కొంచెం మగ లవర్‌లా ఫీలవ్వడం మొదలుపెట్టడం సార్! ఎప్పుడూ చెల్లెమ్మా... చెల్లెమ్మా... అని వాళ్ల జడ కుచ్చులు పట్టుకుని తిరగడం కాదు.. దమ్ముంటే అబ్బాయిలకు కూడా కరెక్ట్ అడ్వైజ్ ఇవ్వండి సార్!'

విన్నావుగా రామకృష్ణా! నాకైతే అవన్నీ తెలియవు. నమ్మితే సంపూర్ణంగా నమ్ము. సగం నమ్మకం, సగం అపనమ్మకంతో లవ్‌లో ఉండటం శుద్ధ దండగ. బిలీవ్ ఆర్ గో అవే!!

lovedoctorram@sakshi.com


ప్రముఖ నటుడు కృష్ణంరాజు జన్మదిన వేడుకలు ఆదివారం హైదరాబాద్‌లో జరిగాయి. కుటుంబ సభ్యులు మరియు అభిమానుల సమక్షంలో ఆయన కేక్ కట్ చేశారు. భార్య శ్యామలా దేవి, ప్రభాస్‌లతో కేక్ కట్ చేస్తున్న ఫొటో ఇది.

బంగార్రాజు ఈజ్ బ్యాక్


నాగార్జున

2016 సంక్రాంతికి బంగార్రాజుగా 'సోగ్గాడే చిన్ని నాయనా' సినిమాలో నాగార్జున ఏ రేంజ్‌లో అల్లరి చేశారో తెలిసిందే. ఇందులోని బంగార్రాజు పాత్రకు ప్రీక్వెల్ ప్లాన్ చేస్తున్నాం అని పలు సందర్భాల్లో నాగార్జున పేర్కొన్నారు కూడా. బంగార్రాజు తిరిగి రావడానికి రంగం సిద్ధం అయింది. మార్చిలో ఈ చిత్రం షూటింగ్ స్టార్ట్ కానుందని సమాచారం. ఈ ప్రీక్వెల్‌కు సంబంధించిన కథను దర్శకుడు కల్యాణ్ కృష్ణ పూర్తి చేశారట. స్క్రిప్ట్‌కు సంబంధించిన ప్రీ ప్రొడక్షన్ పనులు కూడా పూర్తి కావచ్చాయట. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై నాగార్జున ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ఫస్ట్ పార్ట్‌లో నాగార్జున సరసన నటించిన రమ్యకృష్ణ, మిగతా తారాగణమంతా కనిపిస్తారో లేదో వేచి చూడాలి. సినిమాకు సంబంధించిన సాంకేతిక నిపుణుల వివరాలు తెలియాల్సి ఉంది. కేవలం బంగార్రాజు పాత్రతో పూర్తి కథంటే 'సోగ్గాడే..' కంటే రెండింతల ఎనర్జీతో నాగ్ కనిపిస్తారని ఊహించవచ్చు. 'సోగ్గాడే చిన్ని నాయనా' ద్వారా దర్శకుడిగా పరిచయమైన కల్యాణ్ కృష్ణ ప్రీక్వెల్‌ని మరింత ఎంటర్‌టైనింగ్‌గా ప్లాన్ చేస్తున్నారట.

మహానటి తర్వాత...


కీర్తి సురేశ్

'మహానటి' తర్వాత స్ట్రయిట్ తెలుగు సినిమాలేవీ సైన్ చేయలేదు కీర్తీ సురేశ్. తాజాగా కొత్త దర్శకుడు నరేంద్ర దర్శకత్వంలో ఓ లేడీ ఓరియంటెడ్ మూవీ చేయడానికి అంగీకరించారు. ఈ సినిమా షూటింగ్ వచ్చే నెల మూడో వారం నుంచి స్టార్ట్ కానుందని సమాచారం. ఇందులో కీర్తీ సురేశ్ లీడ్ రోల్‌లో కనిపిస్తారు. ఆమెతో పాటు మరో మూడు ముఖ్యమైన పాత్రలు ఉంటాయట. 'మహానటి'కి కెమెరామేన్‌గా వర్క్ చేసిన డ్యానీ ఈ సినిమాకి కెమెరామేన్‌గా వ్యవహరించనున్నారు. 'మహానటి' తర్వాత కీర్తి అంగీకరించిన సినిమా ఇదే కావడం, ఆ సినిమా తర్వాత డ్యానీ చేస్తున్న సినిమా ఇదే కావడం విశేషం. ఎక్కువభాగం అమెరికాలో షూటింగ్ జరుపుకోనున్న ఈ చిత్రాన్ని మహేశ్ యస్.కోనేరు నిర్మిస్తున్నారు. కల్యాణీ మాలిక్ సంగీతం అందిస్తున్నారు.


డ్యానీ

సైంటిస్ట్‌తో జోడీ

సినిమాల ఎంపికలో కథానాయిక సిమ్రాన్ స్పీడ్ పెంచినట్లు తెలుస్తోంది. గతేడాది 'సీమరాజా' అనే తమిళ సినిమాలో విలన్‌గా నటించారామె. ఈ ఏడాది రజనీకాంత్ హీరోగా నటించిన 'పేట' చిత్రంలో ఒక కథానాయికగా ప్రేక్షకుల ముందుకొచ్చారు. ఇప్పుడు ఆమె మాధవన్ సరసన నటించబోతున్నారని ప్రచారం జరుగుతోంది. ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ (ఇస్రో) మాజీ శాస్త్రవేత్త నంబి నారాయణన్ జీవితం ఆధారంగా 'రాకెట్రీ: ది నంబి ఎఫెక్ట్' అనే సినిమా రూపొందుతున్న సంగతి తెలిసిందే. ఇందులో మాధవన్ హీరోగా నటిస్తున్నారు. అనంత్ మహాదేవన్, ఆర్. మాధవన్ దర్శకులు. ఈ సినిమాలో సిమ్రాన్ కథానాయికగా నటించబోతున్నారని తాజా కోలీవుడ్ టాక్. తెలుగు, తమిళం, హిందీ, ఇంగ్లీష్ భాషల్లో తెరకెక్కుతోన్న ఈ సినిమా సమ్మర్‌లో విడుదల కానుంది.


సిమ్రాన్

కోల్‌కత్తా చిత్రోత్సవాల్లో అప్పూ

ఏనుగుని చూడాలనే చిన్న కోరిక కలుగుతుంది అప్పూకు. కానీ అది తీర్చే తీరిక వాళ్ల తల్లిదండ్రులకు ఉండదు. దాంతో స్నేహితులతో కలసి అప్పూ చేసిన సాహసం ఏంటి? అనేది 'అప్పూ' చిత్రకథ. పిల్లల చిన్న చిన్న కోరికలు తీర్చకపోతే ఏం జరుగుతుంది? అనే కథాంశంతో తెరకెక్కింది. కె. లక్ష్మి సమర్పణలో మోహన్ మూవీ మేకర్స్ పతాకంపై కె. మోహన్ స్వీయ దర్శకత్వంలో రూపొందించారు. మాస్టర్ సాయి శ్రీవంత్ (యశస్వి) టైటిల్ రోల్ పోషించిన ఈ బాలల చిత్రం 8వ కోల్‌కత్తా అంతర్జాతీయ బాలల చిత్రోత్సవాలకు ఎంపికైంది. ఈ సందర్భంగా దర్శక–నిర్మాత మోహన్ మాట్లాడుతూ – ''కోల్‌కత్తా అంతర్జాతీయ చిత్రోత్సవాల్లో మా సినిమా ఎంపిక అవ్వడం సంతోషంగా ఉంది. ఈ నెల 20 నుంచి 27 వరకూ జరిగే ఈ చిత్రోత్సవాల్లో 22న మా 'అప్పూ' చిత్రం ప్రదర్శిస్తారు. 2017లో హైదరాబాద్‌లో జరిగిన ప్రతిష్టాత్మక అంతర్జాతీయ బాలల చలన చిత్రోత్సవాల్లో మా చిత్రం ప్రదర్శితమైంది. ఇప్పుడు కోల్‌కత్తా చిత్రోత్సవాల్లో 35 దేశాల నుంచి వచ్చిన 200పై చిలుకు చిత్రాల్లో మా 'అప్పూ' ఉండటం చాలా ఆనందంగా ఉంది'' అన్నారు.


సాయి శ్రీవంత్

దర్శకరత్న విగ్రహావిష్కరణ


మోహన్ బాబు, దాసరి నారాయణరావు

దర్శకుడిగా, రచయితగా, నటుడిగా దర్శకరత్న దాసరి నారాయణరావు సంపాదించుకున్న పేరు ప్రఖ్యాతులు గురించి తెలిసిందే, పాలకొల్లు నుంచి సాదాసీదా వ్యక్తిగా మద్రాస్‌లో అడుగుపెట్టిన దాసరి సినిమా పరిశ్రమలో వేసిన విజయవంతమైన అడుగులు ఎన్నో. ఎందరో దర్శకులకు స్ఫూర్తిగా నిలిచిన దాసరి 2017లో మరణించారు. సినీ చరిత్రలో మరచిపోలేని ప్రముఖుల్లో ఒకరైన ఆయన విగ్రహావిష్కరణ ఈ నెల 26న జరగనుంది. దాసరి పుట్టిన ఊరు పాలకొల్లులో ఈ విగ్రహాన్ని ఆయన ప్రియ శిష్యుడు, ప్రముఖ నటుడు, నిర్మాత, విద్యావేత్త మంచు మోహన్ బాబు ఆవిష్కరిస్తారు. దాసరి విగ్రహ నిర్మాణ కమిటీ ఆధ్వర్యంలో జరగనున్న ఈ కార్యక్రమంలో చలనచిత్ర, రాజకీయ రంగాలకు చెందిన పలువురు ప్రముఖులు హాజరుకానున్నారు. సంగీత దర్శకులు కోటి ఆధ్వర్యంలో దాసరి సంగీత విభావరి జరుగుతుంది.

వారియర్


సునీల్ శెట్టి

మోహన్‌లాల్ హీరోగా ప్రియదర్శన్ దర్శకత్వంలో రూపొందుతున్న బహు భాషా చిత్రం 'మరక్కార్: అరబికడలింటే సింహమ్'. దాదాపు 150 కోట్ల బడ్జెట్‌తో ఈ సినిమాను తెరకెక్కిస్తున్నారు. యాక్షన్ కింగ్ అర్జున్, సునీల్ శెట్టి, ప్రభుదేవా, కీర్తీ సురేశ్, ప్రణవ్ మోహన్‌లాల్, కల్యాణీ ప్రియదర్శన్ కీలక పాత్రల్లో కనిపిస్తారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ హైదరాబాద్‌లో వేసిన ఓ ప్రముఖ స్టూడియోలో జరుగుతోంది. మోహన్‌లాల్, సునీల్ శెట్టి, ప్రభుదేవాలపై కీలక సన్నివేశాలను ప్లాన్ చేశారు. ఈ సినిమాలోని సునీల్ శెట్టి లుక్‌ను రిలీజ్ చేశారు చిత్రబృందం. ఓ హాలీవుడ్ సినిమాలోని వార్ ఫిల్మ్ ఆధారంగా ఆయన లుక్‌ను డిజైన్ చేశారట. ఈ చిత్రంలో వారియర్‌గా (యోధుడు) సునీల్‌శెట్టి నటిస్తున్నారు.

కటౌట్లు పెట్టొద్దు


శింబు

ఏ హీరో అయినా తన సినిమా రిలీజ్ రోజు థియేటర్ల వద్ద భారీ కటౌట్లు ఉండాలని కోరుకుంటాడు. ఎన్ని కటౌట్లుంటే అంత స్టార్‌డమ్ ఏర్పరచుకున్నట్టు లెక్క. కానీ తమిళ నటుడు శింబు మాత్రం తన తర్వాతి సినిమా నుంచి కటౌట్లు ఏర్పాటు చేయొద్దని ఫ్యాన్స్‌ని కోరారు. 'అత్తారింటికి దారేది' చిత్రం రీమేక్ 'వందా రాజావాదాన్ వరువేన్' సినిమాలో నటించారు శింబు. ఈ చిత్రానికి సుందర్ సి. దర్శకుడు. మేఘా ఆకాశ్, కేథరీన్ థెరీసా కథానాయికలుగా నటించిన ఈ సినిమా ఫిబ్రవరి 1న విడుదల కానుంది. ఈ సందర్భంగా ఫ్యాన్స్‌ను ఉద్దేశిస్తూ ఓ వీడియో పోస్ట్ చేశారు శింబు. ''నా సినిమా రిలీజ్ అని పెద్ద పెద్ద కటౌట్లు, బ్యానర్లు కట్టి మీరు కష్టపడి సంపాదించిన డబ్బు వృథా చేయకండి. దానికి బదులు మీ ఇంట్లో వాళ్లకు కొత్త దుస్తులు కొనండి, చిన్నపిల్లలకు చాక్లెట్లు కొనండి. అప్పుడు నేనింకా హ్యాపీగా ఫీల్ అవుతాను'' అని శింబు పేర్కొన్నారు.

కాసుకో సుడోకు

	5		8			7		
		9	6		7			
7	3		2	5				9
							7	6
6	8	5	1		9	3	2	4
4	7							
2				8	3		5	7
			4		6	1		
		8			5		9	

నిన్నటి జవాబు

6	1	7	5	8	3	2	4	9
9	5	2	4	6	1	3	7	8
4	3	8	7	9	2	6	5	1
1	7	6	2	5	4	9	8	3
8	4	3	1	7	9	5	2	6
5	2	9	8	3	6	4	1	7
7	6	1	9	4	5	8	3	2
3	8	5	6	2	7	1	9	4
2	9	4	3	1	8	7	6	5

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా,నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

వంద రోజుల స్నేహం

''షిరాజ్ కాన్ఫిడెన్స్ నాకు చాలా బాగా నచ్చుతుంది. అతనికి సినిమా తీయడమే కాకుండా ఎలా ప్రమోట్ చేయాలో కూడా బాగా తెలుసు. ప్రేక్షకులని కూర్చోబెట్టే ప్రతిభ ఒక్క దర్శకుడికే ఉంటుంది. అది షిరాజ్‌కు ఉంది. తను హీరోగా పరిచయం అయ్యి దర్శకుడిగా మంచి ప్రతిభ కనబరుస్తున్నాడు'' అని నిర్మాత సాయి వెంకట్ అన్నారు. సమీర్ ఖాన్, శైలజ, సునీత పాండే, ఆశి రాయ్, శ్రద్ధ, అక్షత ముఖ్య తారలుగా షిరాజ్ (షేర్) దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'కెఎస్ 100'. చంద్రశేఖర్ మూవీస్ పతాకంపై కె. వెంకట్‌రామ్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రం ట్రైలర్‌ని నిర్మాతలు సాయి వెంకట్, మల్టీ డైమెన్షన్ వాసు, అట్లూరి రామకృష్ణ విడుదల చేశారు. షిరాజ్ మాట్లాడుతూ– ''ఈ తరం అమ్మాయిలు ఏవిధంగా ఫాస్ట్ కల్చర్‌ను అలవర్చుకున్నారు అనే పాయింట్‌తో తెరకెక్కించిన చిత్రమిది. కెఎస్ అంటే హీరోల పాత్ర పేరు కుమార్, స్వామి. 100 అంటే వాళ్ల వంద రోజుల స్నేహమే. మంచి మెసేజ్ ఓరియంటెడ్ ఫిల్మ్. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కించాం. ఈ చిత్రంలో నటించిన వారికి మంచి ప్రతిభ ఉండటంతో వీరితో మరో సినిమా చేయనున్నాం'' అన్నారు. ''హారర్, థ్రిల్లర్, రొమాంటిక్ మూవీ ఇది. అందరికీ నచ్చుతుందనే నమ్మకం ఉంది'' అని వెంకటరామ్ రెడ్డి అన్నారు. సమీర్ ఖాన్, సునీతా పాండే, అక్షత, కూసెట్టి, అజీబ్, సంగీత దర్శకుడు నవనీత్ చారి తదితరులు పాల్గొన్నారు.


సమీర్, సునీత

అది అందరి బాధ్యత


శ్రనిత్ రాజ్, కల్యాణి పటేల్, అనిరుధ్, నేహా ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'గేమర్'. బి.జి.వెంచర్స్ పతాకంపై రాజేష్ తడకల స్వీయ దర్శకత్వంలో నిర్మించిన ఈ సినిమా ట్రైలర్‌ని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వివేక్ వెంకటస్వామి ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ– ''గేమర్' ట్రైలర్ అద్భుతంగా ఉంది. తడకల రాజేష్ నూతన నటీనటులను ప్రోత్సహిస్తూ ఈ సినిమా తీశారు. ఇలాంటి చిన్న సినిమాల దర్శక, నిర్మాతలను ప్రోత్సహించే బాధ్యత ప్రభుత్వంపైనా, సమాజంపైనా ఉంది. వీళ్లందరికీ థియేటర్లు దొరకడం కష్టంగా ఉంది. కొత్త టాలెంట్ రావాలంటే చిన్న దర్శక–నిర్మాతలను ఎంకరేజ్ చేయాలి. అప్పుడే గ్రామాల్లో ఉన్న ప్రతిభావంతులకు అవకాశాలు దక్కుతాయి'' అన్నారు. తడకల రాజేష్ మాట్లాడుతూ– ''ఇప్పటికే ఆరు చిత్రాలు చేసిన నాకు 'గేమర్' ఏడో సినిమా. బి.జి.యాక్టింగ్ అకాడమీ ద్వారా నటీనటులకు శిక్షణ ఇవ్వడంతో పాటు వారికి అవకాశం ఇస్తున్నాను. ఈ చిత్రంలోని ప్రతి సీన్ డిఫరెంట్‌గా ఉంటూ ఆసక్తి రేపుతుంది. ప్రేక్షకులు ఎంజాయ్ చేస్తారనే నమ్మకం ఉంది. ఫిబ్రవరి 1న సినిమా విడుదల చేస్తున్నాం'' అన్నారు. హీరో శ్రనిత్, హీరోయిన్ కల్యాణి, అనిరుధ్, నరేందర్, అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.


కల్యాణి, రాజేష్ తడకల, వివేక్ వెంకటస్వామి, శ్రనిత్ రాజ్

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ ॥ సోమవారం
21-1-2019

పరిచయం | అంజలి హజారికా

దూరం ఒకటే దారే వేరు



మహిళల్లో ఉన్న ప్రతిభాపాటవాలకు సంప్రదాయ భావజాలం ఏ విధంగా అడ్డంకిగా మారుతోందనే విషయాలను సంకలనం చేస్తూ 'వాక్ ద టాక్, ఉమెన్, వర్క్, ఈక్విటీ, ఎఫెక్టివ్‌నెస్' పుస్తకం రాశారు అంజలి. ఇటీవల హైదరాబాద్, బేగంపేటలోని ప్లాజా హోటల్‌లో జరిగిన ఇంటరాక్షన్ సెషన్‌లో డాక్టర్ అంజలి హజారికా పాల్గొన్నారు. ఆ సందర్భంగా ఆమె సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు.

"పిల్లలూ! డాక్టర్ బొమ్మ వేయండి". పిల్లలందరూ డాక్టర్ బొమ్మ వేశారు. "ఇప్పుడు... పైలట్ బొమ్మ వేస్తారా?" పైలట్ బొమ్మ కూడా వేశారు. "ఫైర్‌మన్ బొమ్మ?" అదీ వేశారు.

డ్రాయింగ్‌షీట్ మీద తమ పేర్లు రాసిచ్చారు క్లాసులోని పిల్లలంతా. మొత్తం అరవై షీట్‌లు. ఆ డ్రాయింగ్ షీట్‌లలో ఉన్నది యాభై ఐదు మంది మగ డాక్టర్లు, ఐదుగురు లేడీ డాక్టర్లు. యాభై ఐదు మంది మగ పైలట్‌లు, ఐదుగురు మహిళా పైలట్‌లు. ఫైర్ మన్ దగ్గరకొచ్చేసరికి అరవై మందీ మగవాళ్లే!!

ఇవి పిల్లలు గీసిన బొమ్మలు మాత్రమే కాదు, సమాజానికి దర్పణాలు కూడా. పిల్లలేం చూశారో అదే బొమ్మ వేశారు. సమాజం ఎలా ఉందో దాన్నే పిల్లలు చూశారు. డాక్టర్ అంజలి హజారికా నాలుగేళ్ల పాటు సమాజాన్ని శోధించి తెలుసుకున్న వాస్తవాలను నిర్ధారించుకోవడానికి ఏడెనిమిదేళ్ల పిల్లలనే గీటురాయిగా తీసుకున్నారు. ఆ గీటురాళ్లు చూసిన, చూపించిన సమాజం డ్రాయింగ్ షీట్‌లలో కనిపించింది.

వేరు చేసేది సమాజమే!

పురుషాధిక్య సమాజంలో మహిళలకు ఎదురవుతున్న అడ్డంకులకు ఆ రంగం, ఈ రంగం అనే తేడా లేదని.. 2009లో నోబుల్ బహుమతి అందుకున్న ఇజ్రాయెల్ మహిళ అదా యోనాత్ మాటల్ని ఉటంకించారు... అంజలి. ఆ దేశం నుంచి నోబుల్ బహుమతి అందుకున్న పదిమందిలో ఏకైక మహిళ యోనాత్. అయితే యోనాత్ ప్రొఫెషన్‌లో నిలదొక్కుకోవడానికి మహిళ అనే వివక్ష కారణంగా లెక్కలేనన్ని సవాళ్లను ఎదుర్కోక తప్పలేదని చెప్పారు అంజలి. ''ఏదైనా ఒక పనిలో ఒక మగవ్యక్తి విఫలమైతే అది అతడి వ్యక్తిగత వైఫల్యంగా పరిగణిస్తుంది సమాజం. అదే ఒక మహిళ విఫలమైతే ఆ వైఫల్యాన్ని మహిళా జాతి మొత్తానికీ ఆపాదిస్తుంది. 'అమ్మాయి అయినా అబ్బాయి అయినా పుట్టినప్పుడు వాళ్లు పిల్లలు మాత్రమే. పెరిగే క్రమంలో అబ్బాయి, అమ్మాయిల్లా వారిని వేరు చేస్తున్నది సమాజమే'' అన్నారామె. ''సమానత్వం కోసం చేసే పోరాటాలు కొన్నిసార్లు శృతి తప్పి ఆధిపత్య పోరాటాలుగా రూపుదిద్దుకుంటున్నాయి. నిజానికి జెండర్ ఈక్వాలిటీ కోసం చేసే ప్రయత్నం మగవాళ్లను కించపరచడానికి, వారిని న్యూనత పరచడానికి కాకూడదు, వివక్షలేని సమాజ నిర్మాణం కోసం చేసే ప్రయత్నం అది. ఇప్పటివరకు ఉన్న మూస భావజాలం నుంచి మగవాళ్లే కాదు ఆడవాళ్లు కూడా బయటకు రావాల్సిన అవసరం ఉంది'' అన్నారు అంజలి.

నిర్ణయం 'ఆమె'దే

మహిళ ఏ రంగంలో కొనసాగాలనేది కూడా అత్తింటి వాళ్లే నిర్ణయిస్తున్నారు. ప్రస్తుతం ఒక యూనివర్సిటీలో ప్రొఫెసర్‌గా ఉన్న ఒక మహిళ అనుభవాన్ని ఈ సందర్భంగా ఉదహరించారు అంజలి. ''పెళ్లిచూపులకొచ్చాడు ఓ అబ్బాయి. తనది చాలా పెద్ద హోదా కలిగిన ఉద్యోగం. తరచూ టూర్లు ఉంటాయి. ఇంట్లో ఉండే తన తల్లిదండ్రులను చూసుకోవాల్సిన బాధ్యత ఇంటికి వచ్చే కోడలిదే. కాబట్టి తన భార్య ఉద్యోగం చేయకూడదు అని నిబంధన పెట్టాడతడు. అప్పుడు పెళ్లి కూతురి తల్లి ఒకే మాట చెప్పారు. 'మీక్కావలసింది రోజంతా ఇంట్లో ఉండే పని మనిషి. మంచి జీతం ఇచ్చి ఒక సర్వెంట్ మెయిడ్‌ను నియమించుకోండి. మా అమ్మాయికి తన కెరీర్ మీద కొన్ని లక్ష్యాలున్నాయి అని చెప్పారామె. అప్పుడా తల్లి అంత స్థిరంగా ఆ మాట చెప్పలేకపోయి ఉంటే ఆమె కూతుర్ని ఈ రోజు ప్రొఫెసర్ హోదాలో చూడగలిగే వాళ్లం కాదు. అలాగే మరో మహిళ విషయంలో ఆమె అత్తింటి వాళ్లు తాము చాలా ఉదారంగా ఉన్నాం చూడండి.. అన్నట్లు వ్యవహరించారు. వాళ్లు చెప్పేదేమంటే... అమ్మాయి తాను చేస్తున్న ఉద్యోగం మానేయాలి, ఇప్పటి వరకు ఉన్న సీనియారిటీని వదులుకుని పెళ్లి చేసుకుని అత్తగారింట్లో అడుగుపెట్టాలి. చదువుకుని ఇంట్లో ఖాళీగా ఉండడం కష్టంగా అనిపిస్తే ఇంటి పనులన్నీ చేసుకుని ఇంటికి దగ్గరలో ఉన్న స్కూల్లో ఉద్యోగానికి వెళ్లవచ్చు– అని. అంటే ఒక అమ్మాయికి తన జీవితం మీద నిర్ణయం తీసుకునే అవకాశం తన చేతిలో ఉండడం లేదు. అత్తింటివారి చేతిలోకి వెళ్లిపోతోంది. ఇక్కడ మనం ఆక్షేపించాల్సింది పెళ్లి చేసుకుని అత్తగారింటికి వెళ్లడాన్ని కాదు, పెళ్లి కోసం కెరీర్‌ను వదిలేసుకోవాల్సి రావడాన్ని మాత్రమే. కెరీర్ అంటే డబ్బు సంపాదించే ఉపాధి మాత్రమే కాదు, అది ఆమె గుర్తింపు, ఆమెకు దక్కే గౌరవం. అందుకే మహిళలు తమ గుర్తింపుకు, గౌరవానికి భంగం కలగని విధంగా నిర్ణయాలు తీసుకోగలగాలి. ఎటువంటి క్లిష్టమైన పరిస్థితులు ఎదురైనా సరే తమ ఐడెంటిటీని నిలబెట్టుకోవాలి, అవసరమైతే పరిస్థితులతో పోరాడడానికి సిద్ధంగా ఉండాలి. అందుకు ఇంటి వాతావరణం కూడా సహకరించాలి'' అన్నారు అంజలి.

తప్పని బాధ్యతలు

''ప్రపంచంలో ఒక దేశానికీ మరో దేశానికీ మధ్య తప్పనిసరిగా వైవిధ్యత ఉంటుంది. ఆ దేశానికంటూ ప్రత్యేకమైన బలాలు, బలహీనతలు ఉంటాయి. మహిళల విషయానికి వస్తే... అది కమ్యూనిస్టు దేశమైనా, క్యాపిటలిస్టు దేశమైనా, సోషలిస్టు దేశమైనా సరే... మహిళల అవకాశాలకు దారులు మూసేయడంలో మాత్రం వైవిధ్యత కనిపించలేదు. నేటికీ అమెరికా వంటి అగ్రరాజ్యంలో కూడా ప్రజాప్రతినిధులుగా మహిళలను వేళ్ల మీద లెక్క పెట్టుకోవాల్సిన పరిస్థితే ఉంది'' అంటారు అంజలి. దీనికి తోడు మహిళల పట్ల అనేక అపోహలు రాజ్యమేలుతున్న వైనాన్ని వివరించారామె. ''ఫలానా బాధ్యతను నిర్వర్తించడానికి మహిళలు కరెక్ట్ కాదు, ఈ క్లిష్టమైన వ్యవహారాన్ని నడిపించడం మహిళలకు అసాధ్యం, మహిళలకు ప్రొఫెషన్‌లో ఎదగాలని, ప్రమోషన్‌లు తెచ్చుకోవాలని ఉండదు. మగవాళ్లతో సమానంగా పని చేయాలనుకోరు. ఇంటర్నేషనల్ అసైన్‌మెంట్‌లు అప్పగిస్తే వెళ్లడానికి ముందుకు రారు, ట్రాన్స్‌ఫర్‌కు సిద్ధంగా ఉండరు' అనే దురభిప్రాయాలు చాలామందిలో నెలకొని ఉండడాన్ని గమనించాను. మరికొన్ని కార్పొరేట్ కంపెనీల నిర్వాహకుల మాటల్లో 'ఈ ఉద్యోగానికి ఆమెకి అన్ని అర్హతలున్నాయి. అయితే మన కంపెనీ క్లయింట్లు మహిళా ఇంజనీర్ అంటే మనకు ప్రాజెక్టులు ఇస్తారో ఇవ్వరో' అనే సందేహం కనిపించింది. మరొకరయితే 'ఆమెకు ప్రమోషన్ ఇవ్వడం ఎలా, తరచూ అఫిషియల్ టూర్లుంటాయి' అంటారు. నిజానికి ఈ తరం మహిళలు ఇలాంటి మిషలతో ఉద్యోగంలో ఎదుగుదలను వదులుకోవడం లేదు. ఈ అభిప్రాయాలు మగవారిలో నాటుకుపోయి ఉన్నాయంతే'' అన్నారామె.

పరుగు ఒక్కటే... భారమే తేడా

''1991లో 'పని ప్రదేశంలో మహిళల పరిస్థితి' అనే అంశం మీద వాషింగ్టన్‌లో ఓ సదస్సులో పాల్గొన్నాను. పని చేసే మహిళలకు గృహిణి నిర్వహించిన ఇంటి బాధ్యతలను పూర్తి చేయాల్సిన అదనపు బరువు తప్పడం లేదు. వ్యవసాయ రంగంలో ఉండే మహిళ నుంచి, కార్పొరేట్ రంగంలో ఉద్యోగిని వరకు అందరి పరిస్థితీ ఇదే. ఇంటి బాధ్యతలు పూర్తి చేసి ఆఫీసుకెళ్లిన తర్వాత మగవాళ్లతో పోటీ పడి రేసులో పరుగెత్తాలి. ఒక్కమాటలో చెప్పాలంటే మగవాళ్లు ఏ బరువూ లేకుండా పరుగుపందెంలో పాల్గొంటుంటే, ఆడవాళ్లు మాత్రం కాళ్లకు ఇంటి బాధ్యతల ఇనుపగుండు కట్టుకుని రేసులో పాల్గొంటున్నారు. వర్క్ ప్లేస్‌లో మగవాళ్లు– ఆడవాళ్లు ఇద్దరూ సమానమేననే వాస్తవాన్ని మగవాళ్లే కాదు ఆడవాళ్లు కూడా గుర్తుంచుకోవాలి. ఆడవాళ్లు పని ప్రదేశంలో తమకవసరమైన ప్రత్యేక సౌకర్యాల కోసం డిమాండ్ చేయవచ్చు కానీ, పని తగ్గించుకోవడానికి వెసులుబాటు కోరుకోకూడదు. ప్రతి మహిళకూ తన శక్తి మీద, తాను నిర్వర్తించాల్సిన పనుల మీద అవగాహన ఉండాలి. తన బాధ్యతలను పూర్తి చేయడానికి ఇతరుల మీద ఆధారపడకూడదు. తన శక్తి మీదే తాను నిలబడాలి. సమాజం నిర్దేశించిన చట్రం నుంచి బయటపడి కొత్త సామాజిక చక్రాన్ని రూపొందించాలి. అది వివక్షకు తావులేని సమానత్వం సాధించిన సమాజం కావాలి'' అన్నారు అంజలి హజారికా.

– వాకా మంజులారెడ్డి

అమ్మ మాట

మా అమ్మ నాకు చెప్పిన మాట ఒక్కటే.. 'ఇతరులకు నీ సహాయం అవసరమైనప్పుడు నువ్వు అక్కడ ఉండాలి. అలాగని నువ్వు వెనుకపడకూడదు' అని. ఈ మాటే నన్ను నడిపించింది, ఈ స్థానంలో నిలబెట్టింది. యువతులు భర్తను ఎంపిక చేసుకోవడంలో తమను తాము సరిదిద్దుకోవాల్సిన అవసరం ఉంది. అతడు తనకంటే ఎక్కువ చదువుకుని ఉండాలి, తన కంటే పెద్ద ఉద్యోగం చేస్తుండాలి అనే సంప్రదాయ భావజాలం నుంచి మహిళ బయటకు రావాలి. కలిసి జీవించడానికి ఒకరినొకరు అర్థం చేసుకోగలగడం, అభిప్రాయాలు కలవడం వంటి వాటికి ప్రాధాన్యం ఇవ్వాలి.

– అంజలి హజారికా, రచయిత, సామాజిక ధోరణుల అధ్యయనవేత్త

విస్తృత పర్యటనలు



డాక్టర్ అంజలి హజారికా పుట్టింది మహారాష్ట్రలోని పూనాలో. సైకాలజీ, సోషల్ సైన్సెస్‌లో పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేశారు. మేనేజ్‌మెంట్‌లో డాక్టరేట్ చేశారు. పాశ్చాత్యదేశాల్లో విస్తృతంగా పర్యటించి ప్రాచ్య– పాశ్చాత్య సమాజాలను తులనాత్మకంగా బేరీజు వేశారు. భారతదేశంలోని ఆయిల్ అండ్ గ్యాస్, పెట్రోలియం కంపెనీలతో పని చేశారు. ఉద్యోగుల రక్షణ, సంక్షేమం కోసం సంస్థలు కల్పించాల్సిన సౌకర్యాల గురించి ఆయా సంస్థలకు వ్యవస్థీకృతమైన దిశానిర్దేశం చేశారు. ఆమె సేవలకు భారత పెట్రోలియం మంత్రిత్వ శాఖ 'ఎక్సలెన్స్' అవార్డుతో గౌరవించింది. అమెరికాలోని ఇంటర్నేషనల్ అసోసియేషన్ ఫర్ ద సొసైటీ ఆఫ్ డ్రీమ్స్ సంస్థకు గౌరవ వైస్ ప్రెసిడెంట్ ఆమె. పబ్లిక్ సెక్టార్‌లో పని చేస్తున్న మహిళల కోసం వేదికను నెలకొల్పడంలో అంజలి విశేషమైన సేవలందించారు. న్యూఢిల్లీలో నిర్వహించిన పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్ నిర్వాహకుల సదస్సును అధ్యక్ష బాధ్యతలతో నిర్వహించారామె.



"తేడా ఏముందీ! దూరం ఒకటే కదా!"

ఆశారేఖ

కాలేయ క్యాన్సర్... ఇకపై ప్రాణాంతకం కాబోదు!



కాలేయ క్యాన్సర్ వచ్చిందంటే చాలు... రోగికి ఇక రోజులు దగ్గరపడ్డాయనేది సాధారణంగా ప్రజల్లో ఒక అపోహ. కానీ... వ్యాధి ఉన్న భాగాన్ని తొలగించి, కాలేయ మార్పిడిలోలాగే ఆరోగ్యకరమైన భాగాన్ని ఉంచేస్తే అది మళ్లీ మామూలు సైజుకు పెరుగుతుంది. ఈ తరహా శస్త్రచికిత్సతో అనవసరంగా, నిరర్థకంగా పోతున్న ఎన్నో ప్రాణాలు నిలబడతాయంటున్నారు ప్రొఫెసర్ టామ్ చెరియన్. కానీ ఈ వైద్యం ఎందరికో అందడం లేదు. చాలామందికి ఈ శస్త్రచికిత్స గురించి తెలియనే తెలియదు. ఈ అవగాహనను ప్రజలందరికీ పంచి, అమూల్యమైన ప్రాణాలను కాపాడటం కోసమే ఈ ప్రత్యేక కథనం.



కాలేయ క్యాన్సర్లతో ఎన్నో ప్రాణాలు గాల్లో కలిసిపోతున్నాయి. కేవలం ఒక్క మనదేశంలోనే ప్రతీఏటా 1.50,000 నుంచి 2.10,000 మంది కాలేయ క్యాన్సర్లతో ప్రాణాలొదులుతున్నారు. కానీ కేవలం అవగాహన లోపంతోనే ఇన్ని ప్రాణాలు పోతున్నాయని, వీటిలో చాలా ప్రాణాలను రక్షించవచ్చునంటున్నారు ప్రొఫెసర్ డాక్టర్ టామ్ చెరియన్. ఎంపిక చేసిన 51 మంది రోగులపై నిర్వహించిన శస్త్రచికిత్సతో వారు కొత్త ఊపిరిపోసుకున్నారు. అంతేకాదు... వారిలో కేవలం 10% మందిలో మాత్రమే వ్యాధి మళ్లీ తిరగబెట్టింది. ఈ చికిత్స గనక చాలామందికి అందితే నిరర్థకంగా పోతున్న ఎన్నో ప్రాణాలు నిలబడతాయంటున్నారాయన.

కాలేయ (లివర్) క్యాన్సర్లలో హెపాటోసెల్యులార్ క్యాన్సర్లు మొదలుకొని కొలాంజియోకార్సినోమా వరకు అనేక రకాలున్నాయి. మిగతా క్యాన్సర్లతో పోలిస్తే కాలేయానికి సంబంధించిన క్యాన్సర్ వచ్చి అది అడ్వాన్స్‌డ్ దశకు చేరిందంటే దాన్ని తుది మజిలీ (టెర్మినల్ ఇల్‌నెస్)గానే అందరూ అనుకుంటారు. ఇది చాలావరకు నిజమే అయినా మరీ అంతగానూ నిరాశపడాల్సిందేమీ లేదని భరోసా ఇస్తున్నారు ప్రొఫెసర్ డాక్టర్ టామ్‌చెరియన్. అధునాతనమైన ఇమేజింగ్ ప్రక్రియలు, సాంకేతికంగా సంక్లిష్టమైన, అత్యంత ఉన్నత ప్రమాణాలతో కూడిన శస్త్రచికిత్సతో అడ్వాన్స్‌డ్ దశగా పరిగణించే వ్యాధితో బాధపడుతున్న 51 మంది రోగుల ప్రాణాలు కాపాడగలిగారాయన.



ఈ రోగుల ప్రత్యేకత ఏమిటి?

శస్త్రచికిత్సకు ఎంపిక చేసిన ఈ రోగుల గ్రూపును ఒకసారి పరిశీలిస్తే కాలేయ క్యాన్సర్ రోగుల భవిష్యత్తు ఎంత ఆశాజనకంగా ఉందో తెలుస్తుంది. వీళ్లలో చాలామంది దీర్ఘకాలిక కాలేయ వ్యాధులు (క్రానిక్ లివర్ డిసీజ్) లేదా సిర్రోసిస్‌తో బాధపడుతున్నవారు. మామూలుగానైతే వీరికి శస్త్రచికిత్స చేయడం అంటే అది సాధ్యం కాదనే భావన ఉంటుంది. ఇక వీరిలో ముగ్గురు నలుగురు 70 ఏళ్లకు పైబడ్డవారు. ఆ వయసులో సిర్రోసిస్ వచ్చిన వారికి శస్త్రచికిత్స చేస్తే వారు తట్టుకోలేరనేది మరొక అపోహ. చాలా పెద్ద పెద్ద సెంటర్లలో సైతం వారికి ఆపరేషన్ సాధ్యం కాదంటూ పెద్ద పెద్ద డాక్టర్లూ తేల్చేశారు. అంటే వాళ్లంతా ఏదో నిర్లక్ష్యంతో ఆ మాట అన్నారని చెప్పలేం. ఎందుకంటే ఈ రంగంలో వచ్చిన అధునాతన ఇమేజింగ్ ప్రక్రియలు, ఆపరేషన్ తాలూకు సునిశితత్వాల గురించి వారికీ తెలియకపోవడమే ఇందుకు కారణం. ఇలాంటి గ్రూపులో అందరికీ శస్త్రచికిత్స అయ్యాక కనీసం 2% నుంచి 3% కేసుల్లోనైనా మరణం సంభవించడం సాధారణంగా జరుగుతుంది. అయితే అదృష్టవశాత్తూ అందరి శస్త్రచికిత్సలూ విజయవంతమయ్యాయి. అందరూ జీవిస్తూ ఉన్నారు. మంచి ప్రమాణాలతో కూడిన ఉన్నత స్థాయి శస్త్రచికిత్స టెక్నిక్, ఆపరేషన్ అయ్యాక తీసుకున్న జాగ్రత్తలు (పోస్ట్ ఆపరేటివ్ కేర్) లాంటి ఎన్నో అంశాలు ఈ గ్రూపుపై నిర్వహించిన శస్త్రచికిత్సలు విజయవంతమయ్యేందుకు తోడ్పడ్డాయి. వీరిలో కొందరైతే కేవలం 10 రోజుల్లోనే డిశ్చార్జ్ అయ్యారు. వారు తమ తమ రోజువారీ పనులు చేసుకుంటున్నారు. సాధారణంగా పరిశోధనాత్మకంగా ఇలా కొత్త శస్త్రచికిత్స ప్రక్రియలను లండన్, న్యూయార్క్ వంటి చోట్ల నిర్వహిస్తుంటారని వింటుంటాం. ఇప్పుడు తెలంగాణలోనూ ఇదే జరిగింది. ఇక ఈ శస్త్రచికిత్సలోని సాంకేతికత పురోగతిని, నైపుణ్యాలను ఎందరో డాక్టర్లకు అందేలా చేసి, ఎన్నో ప్రాణాలు నిరర్థకంగా పోకుండా కాపాడటమే ఇప్పటికి మన ముందున్న సవాలు.

శస్త్రచికిత్సే ఎందుకు?

కాలేయ గడ్డలు (ట్యూమర్స్) చాలామటుకు కీమోకు గానీ, రేడియోథెరపీకి గానీ ఒకపట్టాన లొంగవు. కాబట్టి ఆ ప్రక్రియలతో వ్యాధి నయం చేయడం సాధ్యం కాదు. ఇక శస్త్రచికిత్స అయితే వాటిని తొలగించడానికి సాధ్యమవుతుంది. అయితే ఇంతగా సంక్లిష్టమైన ఈ శస్త్రచికిత్స నిర్వహించగలిగే నైపుణ్యం ఉన్న శస్త్రచికిత్సకులు పెద్దగా లేకపోవడంతో పాటు, దీని గురించి ప్రజల్లో అవగాహన లేమి, కొన్ని సందర్భాల్లో శస్త్రచికిత్స అనంతర దుష్పరిణామాలతో నివారించడానికి సాధ్యమయ్యే ఎన్నో మరణాలు అనవసరంగా చోటుచేసుకుంటున్నాయి.

ఎలా ఉపయోగపడుతుందీ శస్త్రచికిత్స?

కాలేయ మార్పిడి శస్త్రచికిత్సలో కొంత కాలేయ భాగాన్ని మాత్రమే అమర్చితే... అది మళ్లీ పూర్తి కాలేయంగా రూపొందుతున్నదన్న విషయం తెలిసిందే. సరిగ్గా ఇదే తరహా విధానాన్ని కాలేయంలోని క్యాన్సర్ తొలగింపునకూ వర్తింపజేశారు డాక్టర్ టామ్ చెరియన్. తాను ఎంపిక చేసుకున్న 50 మంది రోగులకు ఈ తరహా శస్త్రచికిత్సలు నిర్వహించారు. వీరిలో అందరూ కాలేయ క్యాన్సర్‌నుంచి విముక్తులయ్యారు. ఒక్కటంటే ఒక్క మరణమూ సంభవించలేదు. అయితే ఒక్కమాట. కాలేయ క్యాన్సర్లతో బాధపడుతున్న లక్షలాది రోగులతో పోలిస్తే బతికి బయటపడ్డవారి సంఖ్య చాలా చాలా చిన్నది. కానీ ఇదే భవిష్యత్తుకు ఆశారేఖ అయ్యింది. కాలేయ క్యాన్సర్ అంటే మరణమే అనే జనంలోని ఒక అపోహను తుడిచిపెట్టే సందర్భం వచ్చింది. ఇదే పద్ధతిని అనుసరిస్తే అనవసరంగా కోల్పోవడానికి సిద్ధంగా ఉన్న ఎన్నో ప్రాణాలు నిలుస్తాయి. ఇప్పటికి ఇదే మంచి శుభవార్త.



ప్రొఫెసర్ టామ్ చెరియన్,
నేషనల్ డైరెక్టర్, హెచ్‌పీబీ సర్జరీ అండ్ లివర్ ట్రాన్స్‌ప్లాంటేషన్, కేర్ హాస్పిటల్స్ గ్రూప్ అండ్ ప్రొఫెసర్ అండ్ సర్జన్, నిమ్స్, హైదరాబాద్


పరి | పరిశోధన

కృత్రిమ రక్తనాళాల తయారీ... ఇక పక్కా!




శరీర అవయవాలన్నింటికీ ఆక్సిజన్ సరఫరా చేసేందుకు కావాల్సిన రక్తనాళాలను కృత్రిమంగా తయారు చేయడంలో విజయం సాధించారు బ్రిటిష్ కొలంబియా యూనివర్సిటీ శాస్త్రవేత్తలు. మూలకణాల సాయంతో పరిశోధనశాలలో తయారైన ఈ కృత్రిమ రక్తకణాలు సమీప భవిష్యత్తులో గుండెపోటు, కేన్సర్, మధుమేహం వంటి అనేక వ్యాధులకు సమర్థమైన చికిత్స అందించేందుకు వీలు కల్పిస్తుందని అంచనా. మధుమేహాన్నే ఉదాహరణగా తీసుకుంటే ఈ సమస్య ఉన్న వారి రక్తనాళాలు అసాధారణ రీతిలో మందంగా మారతాయి. దీనివల్ల వాటిద్వారా ఆక్సిజన్, ఇతర పోషకాల ప్రవాహం తగ్గిపోయి సమస్యలు వస్తాయి. బ్రిటిష్ కొలంబియా శాస్త్రవేత్తలు తాము తయారు చేసిన కృత్రిమ రక్తనాళాలను మధుమేహ వ్యాధి లక్షణాలున్న వాతావరణంలో ఉంచినప్పుడు అవి కూడా మందంగా మారాయి. సెక్రెటీస్ అనే ఎంజైమ్‌తో దీన్ని అడ్డుకోవచ్చునని కూడా వీరు గుర్తించారు. ఈ పరిశోధన ఆధారంగా సెక్రటీస్ ఎంజైమ్ ఉత్పత్తిని నియంత్రించే మందులు తయారు చేస్తే మధుమేహానికి చికిత్స కల్పించవచ్చునని ఇప్పటికే గుర్తించారు. ఇతర వ్యాధులను అర్థం చేసుకోవడంలోనూ ఈ కృత్రిమ రక్తనాళాలు ఎంతో ఉపయోగపడతాయని.. మానని గాయాలు.. గుండెజబ్బులు వీటిల్లో ఉంటాయని అంటున్నారు ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త రీనర్ విమ్మర్!

లంఖణం పరమౌషధమే!



ఉపవాసం అద్భుతమైన ఔషధమని మన పెద్దలు ఎప్పుడో చెప్పారు. సైన్స్ కూడా దాన్ని ధ్రువీకరించింది. తాజాగా యూనివర్సిటీ ఆఫ్ కాలిఫోర్నియా శాస్త్రవేత్తలు ఉపవాసం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలకు కారణమేమిటో స్పష్టం చేస్తోంది. ఆహారం తీసుకోకపోవడం వల్ల మన కాలేయం, అస్థిపంజర కండరాలపై ప్రభావం పడుతుందని ఇది కాస్తా జీవక్రియల ప్రక్రియను దృఢపరుస్తుందని అంటున్నారు పాలో సాసోన్ కోర్సీ అనే శాస్త్రవేత్త. ఫలితంగా వయసు పెరిగే కొద్దీ వచ్చే సమస్యలు, ఆరోగ్యంపై సానుకూల ప్రభావం చూపుతుందని విశ్లేషించారు. మారిపోయే శరీర వాతావరణానికి తగినట్టుగా శరీరంలోని గడియారం కొన్ని మార్పులు చేసుకుంటూ శరీర స్థితిని కాపాడుతూ ఉంటుందని.. ఆహారం ఈ గడియారాన్ని ప్రభావితం చేస్తుందని వివరించారు కోర్సీ. నిరాహారం వల్ల ఇందుకు సంబంధించిన జన్యువులు చైతన్యవంతం అవుతున్నాయని అస్థిపంజర కండరాలు వీటిల్లో ఒకటని చెప్పారు. ఎలుకలకు 24 గంటలపాటు ఆహారం ఇవ్వకుండా తాము ఒక ప్రయోగం చేశామని ఈ సమయంలో శరీరం మొత్తమ్మీద ఆక్సిజన్ వినియోగం తక్కువైపోగా.. ఉచ్ఛ్వాస నిశ్వాసల్లోనూ తేడాలు వచ్చాయని ఆహారం తీసుకోగానే పరిస్థితి మొదటికి వచ్చిందని కోర్సీ తెలిపారు.

దోమలకు చెక్ పెట్టే బ్యాక్టీరియా..



ఎన్ని రకాల కాయిల్స్, లిక్విడ్స్ వాడినా దోమల బెడద తప్పడం లేదా? మీ సమస్యకు విస్కాన్సిన్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఓ వినూత్నమైన పరిష్కారాన్ని కనుక్కున్నారు. మట్టిలో ఉండే ఓ బ్యాక్టీరియా అత్యంత సమర్థంగా దోమలు దూరంగా పారిపోయేలా చేయగల రసాయనాన్ని సృష్టిస్తోందని వీరు గుర్తించారు. ఈ రసాయనం డీడీటీ కంటే చాలా శక్తిమంతమైందని అంచనా. డీడీటీతో దోమల నివారణ జరుగుతున్న కొన్ని ఇతర సమస్యల కారణంగా ఈ రసాయనంపై చాలా దేశాల్లో నిషేధం ఉన్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో సహజసిద్ధమైన ప్రత్యామ్నాయం కోసం చాలాకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. జీనోరాబ్డస్ బుడపెస్టెనిసిస్ అనే బ్యాక్టీరియా కీటకాలను ఎలా చంపగలుగుతోందో తెలుసుకునేందుకు శాస్త్రవేత్తలు కొన్ని ప్రయోగాలు చేశారు. ఈ క్రమంలో బ్యాక్టీరియా విడుదల చేసే రసాయనం దోమలు దూరంగా పారిపోయేలా చేస్తున్నట్లు గుర్తించారు. బ్యాక్టీరియా ఉత్పత్తి చేస్తున్న రసాయనం డీడీటీ కంటే నాలుగు రెట్లు ఎక్కువ ప్రభావశీలి అని కూడా ఈ పరిశోధనల ద్వారా తెలిసింది. అంతేకాకుండా... ఈ రసాయనం తక్కువ స్థాయిలో ఉన్నప్పుడు దోమలు రక్తం పీల్చకుండా మాత్రమే నిరోధిస్తోందని.. ఎక్కువగా ఉన్నప్పుడు మాత్రమే దోమలు పారిపోయేలా చేస్తోందని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త ఒకరు తెలిపారు.

సాక్షి భవిత

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com

స్పర్ధయా వర్ధతే విద్య

సోమవారం
21-1-2019

విద్య, ఉద్యోగ సమాచారం

మేనేజ్‌మెంట్ విద్యపై సాక్షి-విట్ అవగాహన కార్యక్రమం

SAKSHI AdvantEdge
VIT Vellore Institute of Technology
Business School

ఆర్ట్స్, సైన్స్, ఇంజనీరింగ్‌లో డిగ్రీ పూర్తిచేసిన వారు కార్పొరేట్, బహుళజాతి సంస్థల 'మేనేజ్‌మెంట్' విభాగాల్లో సుస్థిర కెరీర్‌ను అందుకునేందుకు మార్గం.. మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్(ఎంబీఏ). ప్రతిష్టాత్మక సంస్థల్లో ఎంబీఏ పూర్తిచేసిన వారు కెరీర్ పరంగా ఎదగొచ్చు. సొంతంగా స్టార్టప్ కంపెనీలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ప్రతిష్టాత్మక వెల్లూర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (విట్) బిజినెస్ స్కూల్.. 'సాక్షి' మీడియా గ్రూప్‌తో కలిసి ఔత్సాహికులకు మేనేజ్‌మెంట్ విద్యపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించనుంది. ఈ నెల 28న హైదరాబాద్‌లో, 29న విజయవాడలో జరిగే కార్యక్రమాల్లో విట్ బిజినెస్ స్కూల్ సీనియర్ ఫ్యాకల్టీ సభ్యులు.. మేనేజ్‌మెంట్ విద్యతో అంతర్జాతీయ అవకాశాలు అందుకోవడంపై యువతకు దిశానిర్దేశం చేస్తారు.

- ✦ **హైదరాబాద్ (28.1.2019):**
  వేదిక: భారతీయ విద్యాభవన్ ఆడిటోరియం, డోర్ నెం: 5-9-1105, కులపతి మున్షీ సదన్, కింగ్‌కోఠి రోడ్, బషీర్‌బాగ్, హైదరాబాద్.
- ✦ **విజయవాడ (29.1.2019):**
  వేదిక: తుమ్మలపల్లి కళాక్షేత్రం, హనుమాన్ పేట్, ప్రభుత్వ పాత ఆసుపత్రి రోడ్డుకు ఎదురుగా, విజయవాడ.

సౌత్ వెస్టర్న్ రైల్వేలో 81 ఖాళీలు

హుబ్లీ ప్రధాన కేంద్రంగా కార్యకలాపాలు నిర్వహిస్తున్న సౌత్ వెస్టర్న్ రైల్వే ఒప్పంద ప్రాతిపదికన 81 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

1. **సీనియర్ టెక్నికల్ అసోసియేట్ (ఎస్‌టీఏ)-33**
- ✦ **అర్హత:** సంబంధిత విభాగంలో నాలుగేళ్ల బ్యాచిలర్స్ డిగ్రీ ఉత్తీర్ణత.

2. **జూనియర్ టెక్నికల్ అసోసియేట్ (జేటీఏ)-48**
- ✦ **అర్హత:** సంబంధిత విభాగంలో డిప్లొమా/బీఎస్సీ ఉత్తీర్ణత. ✦ **వయసు:** ఎస్‌టీఏ పోస్టులకు 20-33 ఏళ్లు, జేటీఏ పోస్టులకు 18-33 ఏళ్ల మధ్య ఉండాలి.
- ✦ **ఎంపిక:** ఎస్‌టీఏ పోస్టులకు గేట్ స్కోర్, జేటీఏ పోస్టులకు విద్యార్హతలో ప్రతిభ ఆధారంగా ఎంపిక చేస్తారు.
- ✦ **దరఖాస్తు ఫీజు:** రూ.100.
- ✦ **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** ఫిబ్రవరి 1
- ✦ **వెబ్‌సైట్:** www.rrchubli.in

ధైర్య సాహసాలు మీ సొంతమా.. దేశ భద్రతను కాపాడాలనే తపన మీలో ఉందా.. సాహసమే ఊపిరిగా దేశ రక్షణలో పాల్పంచుకుని.. సమున్నత హోదాలు అందుకోవాలనుకుంటున్నారా?! అయితే.. మీకు చక్కటి మార్గం.. నేషనల్ డిఫెన్స్ అకాడమీ(ఎన్‌డీఏ)! త్రివిధ దళాల్లో లెఫ్టినెంట్, సబ్ లెఫ్టినెంట్, ఫ్లయింగ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి యూపీఎస్సీ ఏటా రెండుసార్లు ఎన్‌డీఏ-ఎన్‌ఏ పేరుతో పరీక్ష నిర్వహిస్తోంది. ఇంటర్ అర్హతతోనే ఎన్‌డీఏలో అడుగుపెట్టి.. శిక్షణ పూర్తయ్యాక.. త్రివిధ దళాల్లో(ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్) పర్మనెంట్ కమిషన్డ్ ర్యాంకుతో కెరీర్ ప్రారంభించొచ్చు! అందుకోసం ముందుగా ఎన్‌డీఏ పరీక్షలో, ఎస్‌ఎస్‌బీ ఇంటర్వ్యూల్లో ఉత్తీర్ణత సాధించాలి! తాజాగా నేషనల్ డిఫెన్స్ అకాడమీ, నావల్ అకాడమీ(ఎన్‌డీఏ,ఎన్‌ఏ)-2019(1) నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్ష విధానం, ఖాళీలు, అర్హతలు, కెరీర్ అవకాశాల గురించి తెలుసుకుందాం..

యూపీఎస్సీ ఎగ్జామ్స్



సాహస కొలువుకు సరైన మార్గం..

ఎన్‌డీఏ-ఎన్‌ఏ

ఖాళీలు

- ఎన్‌డీఏ 342 (ఆర్మీ-208, నేవీ-42, ఎయిర్‌ఫోర్స్-92).
- నేవల్ అకాడమీ (10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్)-50.
- మొత్తం ఖాళీలు: 392

అర్హత

- **ఆర్మీ వింగ్:** ఏదైనా గ్రూప్‌తో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత.
- **ఎయిర్‌ఫోర్స్, నేవీ, నేవల్ అకాడమీ:** మ్యాథ్స్, ఫిజిక్స్ సబ్జెక్టులతో ఇంటర్మీడియెట్ ఉత్తీర్ణత.
- ద్వితీయ సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2019, డిసెంబర్ 24 నాటికి సర్టిఫికెట్లు అందుబాటులో ఉంచుకోవాలి.
- **వయసు:** జూలై 2, 2000-జూలై 1, 2003 మధ్యలో జన్మించి ఉండాలి.

త్రివిధదళాల్లో 392 ఖాళీల భర్తీకి యూపీఎస్సీ నోటిఫికేషన్

ఇంటర్‌తోనే త్రివిధ దళాల్లో శాశ్వత కొలువుకు మార్గం

ఉద్యోగంతోపాటు బీఏ/బీఎస్సీ/ బీటెక్ సర్టిఫికెట్ పొందొచ్చు

శిక్షణ కాలంలో రూ.56,100 స్టైపెండ్

ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్ష అంటే?

త్రివిధ దళాల్లో ఏర్పడే ఖాళీల భర్తీకి యూపీఎస్సీ ఏటా రెండుసార్లు నిర్వహించే పరీక్ష.. ఎన్‌డీఏ, ఎన్‌ఏ పరీక్ష. ఇందులో సాధించిన మెరిట్ ఆధారంగా.. అభ్యర్థులు దరఖాస్తు చేసుకునే సమయంలో పేర్కొన్న ప్రాథమ్యాలనుబట్టి ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీ విభాగాలకు సంబంధించిన శిక్షణకు అభ్యర్థుల ఎంపిక జరుగుతుంది. ఎన్‌ఏ(నేవల్ అకాడమీ) 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్ పరీక్షలో మెరిట్ ఆధారంగా.. నేవీలోనే టెక్నికల్ విభాగాల్లో చేరే అవకాశం లభిస్తుంది.

ప్రయోజనాలు

'అవకాశం ఉంటే బీటెక్‌లో లేదా బీఏ, బీఎస్సీ, బీకామ్ లాంటి డిగ్రీ కోర్సుల్లో చేరడం'-ప్రస్తుతం ఇంటర్మీడియెట్ విద్యార్థుల ముందున్న మార్గాలు! ఆ తర్వాత కెరీర్ పరంగా అవకాశాలకు ఎలాంటి హామీ ఉండదు. కానీ, ఎన్‌డీఏ ఎన్‌ఏ ఎంపిక ప్రక్రియలో విజయం సాధిస్తే మాత్రం విద్యార్థులు ఎంచుకున్న విభాగం ఆధారంగా బీఏ, బీఎస్సీ, బీటెక్ సర్టిఫికెట్లు చేతికి రావడమే కాకుండా.. ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీల్లో పర్మనెంట్ కమిషన్ ర్యాంకుతో కెరీర్ ప్రారంభించొచ్చు.

రెండంచెల ఎంపిక ప్రక్రియ

త్రివిధ దళాల్లో ఇంటర్ అర్హతతోనే కెరీర్‌కు మార్గం వేస్తున్న ఎన్‌డీఏ, ఎన్‌ఏ ఎంపిక ప్రక్రియ రెండంచెలుగా ఉంటుంది. తొలుత యూపీఎస్సీ రాత పరీక్షను నిర్వహిస్తుంది. ఇందులో మెరిట్ సాధించిన అభ్యర్థులకు దరఖాస్తులో పేర్కొన్న ప్రాథమ్యం ఆధారంగా.. ఎస్‌ఎస్‌బీల ఆధ్వర్యంలో ప్రత్యేక పరీక్షలు నిర్వహిస్తారు.

ఎన్‌డీఏ, ఎన్‌ఏ రాత పరీక్ష

- ఎన్‌డీఏ, ఎన్‌ఏ రాత పరీక్ష.. రెండు విభాగాల్లో మొత్తం 900 మార్కులకు జరుగుతుంది. ఇందులో మొదటి విభాగం-మ్యాథమెటిక్స్-300 మార్కులకు కాగా, రెండోది-జనరల్ ఎబిలిటీ టెస్ట్-600 మార్కులకు ఉంటుంది. ఒక్కో విభాగానికి రెండున్నర గంటలు చొప్పున మొత్తం అయిదు గంటల వ్యవధిలో ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష జరుగుతుంది.
- అందుబాటులో ఉన్న ఖాళీలు, రాత పరీక్షలో అభ్యర్థులు చూపిన మెరిట్ ఆధారంగా జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన అభ్యర్థులు తదుపరి దశలో తాము ప్రాథమ్యంగా ఎంచుకున్న విభాగం ఆధ్వర్యంలో ఎస్‌ఎస్‌బీ (సర్వీసెస్ సెలక్షన్ బోర్డ్) నిర్వహించే ఎస్‌ఎస్‌బీ టెస్ట్ / ఇంటర్వ్యూ లోనూ రాణించాల్సి ఉంటుంది.
- ఎయిర్‌ఫోర్స్ విభాగాన్ని ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న అభ్యర్థులు ఎస్‌ఎస్‌బీ ప్రక్రియ తర్వాత నిర్వహించే కంప్యూటరైజ్డ్ పైలట్ సెలక్షన్ సిస్టమ్‌లో కూడా విజయం సాధించాలి.

ఎస్‌ఎస్‌బీ

మొత్తం 900 మార్కులకు ఉండే ఎస్‌ఎస్‌బీ ఎంపిక ప్రక్రియ కొంత క్లిష్టంగానే ఉంటుంది. అభ్యర్థుల్లో మానసిక, శారీరక సామర్థ్యాన్ని పరిశీలించడమే ఈ ప్రక్రియ ప్రధాన ఉద్దేశం. ఎస్‌ఎస్‌బీ ప్రక్రియ ద్వారా ఇంటెలిజెన్స్ టెస్ట్, వెర్బల్ టెస్ట్, నాన్ వెర్బల్ టెస్ట్, సామాజిక అంశాలపై అవగాహన, తార్కిక విశ్లేషణ నైపుణ్యాలను పరీక్షిస్తారు. అదే విధంగా పిక్చర్ పర్సెప్షన్, డిస్క్రిప్షన్ టెస్ట్ (పీపీ అండ్ డీటీ) నిర్వహిస్తారు. మొత్తం అయిదు రోజుల పాటు ఎస్‌ఎస్‌బీ ప్రక్రియ సాగుతుంది. ఇందులోనూ తుది జాబితాలో నిలిచిన వారిని ప్రాథమికంగా నేషనల్ డిఫెన్స్ అకాడమీ-పుణె, నేవల్ అకాడమీ (ఎజిమల)లో శిక్షణకు ఎంపిక చేస్తారు.

ఎన్‌డీఏ, ఎన్‌ఏలో శిక్షణ

ఎన్‌డీఏ, ఎన్‌ఏ ఎంపిక ప్రక్రియలో విజయం సాధించిన అభ్యర్థులకు నేషనల్ డిఫెన్స్ అకాడమీలో మూడేళ్ల వ్యవధిలో శిక్షణ ఇస్తారు. మొదటి రెండున్నరేళ్లు అన్ని విభాగాల అభ్యర్థులకు ఒకే విధంగా శిక్షణ నిర్వహిస్తారు. చివరి ఆరు నెలలు అభ్యర్థులు ఎంపికైన విభాగం ఆధారంగా ఫిజికల్ ట్రెనింగ్ ఉంటుంది. ఇలా మొత్తం మూడేళ్ల శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు వారు ఎంపిక చేసుకున్న కోర్సు ఆధారంగా జేఎన్‌యూ-ఢిల్లీ నుంచి బీఏ, బీఎస్సీ, బీఎస్సీ (కంప్యూటర్ సైన్స్) డిగ్రీలను అందిస్తారు. ఎయిర్‌ఫోర్స్, నేవల్ విభాగాలను ప్రాథమ్యంగా ఎంపిక చేసుకున్న వారికి బీటెక్ చదివేందుకు కూడా అవకాశం ఉంటుంది. వీరు ఈ విషయాన్ని ముందుగానే తెలియజేయాలి. ఎన్‌ఏ 10+2 క్యాడెట్ ఎంట్రీ స్కీమ్‌కు ఎంపికైన వారికి నేవల్ అకాడమీ (ఎజిమల)లో నాలుగేళ్లపాటు ప్రత్యేకంగా శిక్షణనిస్తారు. ఆ తర్వాత వీరికి అప్లైడ్ ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, నేవల్ ఆర్కిటెక్చర్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ బ్రాంచ్‌లలో ఏదో ఒక బ్రాంచ్‌తో బీటెక్ సర్టిఫికెట్ అందిస్తారు.

ఫీల్డ్ ట్రైనింగ్

- ఎన్‌డీఏలో మూడేళ్ల శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు ఆయా దళాల్లో ప్రత్యేకంగా నిర్దిష్ట వ్యవధిలో మళ్లీ ఫిజికల్ ట్రెనింగ్ ఉంటుంది. ఆర్మీ క్యాడెట్లకు ఐఎంఏ(డెహ్రాడూన్), నేవీ క్యాడెట్స్‌కు నేవల్ అకాడమీ(ఎజిమల), ఎయిర్‌ఫోర్స్ క్యాడెట్లకు ఎయిర్‌ఫోర్స్ అకాడమీ (హైదరాబాద్)లలో ఫీల్డ్ ట్రైనింగ్ ఇస్తారు.
- శిక్షణ సమయంలో రూ.56,100 స్టైపెండ్ లభిస్తుంది. ఫీల్డ్ ట్రైనింగ్ కూడా విజయవంతంగా పూర్తిచేసుకున్న వారికి రూ.56,100-1,77,500 వేతన శ్రేణితో కెరీర్ ప్రారంభం అవుతుంది. ప్రాథమికంగా ఆర్మీ విభాగంలో లెఫ్టినెంట్, నేవీ విభాగంలో సబ్ లెఫ్టినెంట్, ఎయిర్‌ఫోర్స్ విభాగంలో ఫ్లయింగ్ ఆఫీసర్ కేడర్‌తో కెరీర్ ప్రారంభమవుతుంది.

ముఖ్య తేదీలు

- **దరఖాస్తు విధానం: upsconline.nic.in** వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఫిబ్రవరి 4, 2019.
- **పరీక్ష తేదీ:** ఏప్రిల్ 21, 2019.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, తిరుపతి, విశాఖపట్నం.
- **వెబ్‌సైట్: www.upsc.gov.in**

పరీక్షల్లో విజయానికి..




- ఎన్‌డీఏ రాత పరీక్ష మ్యాథమెటిక్స్, జనరల్ ఎబిలిటీ విభాగాల్లో ఉంటుంది. పేపర్-1 (మ్యాథమెటిక్స్)కు సంబంధించి అల్జీబ్రా, మ్యాట్రిక్స్ అండ్ డిటర్మినెంట్స్, అనలిటికల్ జామెట్రీ, ఇంటిగ్రల్ కాలిక్యులస్, డిఫరెన్షియల్ ఈక్వేషన్స్, వెక్టార్ అల్జీబ్రా, స్టాటిస్టిక్స్, ప్రాబబిలిటీ, ట్రిగనోమెట్రీ అంశాలపై పట్టు సాధించాలి.
- ప్రిపరేషన్‌కు ఇంటర్మీడియెట్ స్థాయి పుస్తకాలను ఉపయోగించుకోవాలి. ప్రాక్టీస్ టెస్ట్‌లు, మాక్ టెస్ట్‌లు రాయడం కూడా మేలు చేస్తుంది. ప్రశ్నలు కాన్సెప్ట్ బేస్డ్‌గా ఉంటాయి. కాబట్టి బేసిక్ ప్రిన్సిపుల్స్, వివిధ సిద్ధాంతాలు, సూత్రాలు, ఫార్ములాలపై పట్టు సాధించాలి. ప్రాక్టీస్‌కు అధిక ప్రాధాన్యం ఇవ్వాలి.
- పేపర్-2 జనరల్ ఎబిలిటీకి సంబంధించి.. బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్; వొకాబ్యులరీ, రీడింగ్ కాంప్రెహెన్షన్‌లపై పట్టు సాధించాలి.
- జనరల్ నాలెడ్జ్‌కు సంబంధించి.. ఫిజిక్స్, కెమిస్ట్రీ, జనరల్ సైన్స్, చరిత్ర-భారత స్వాతంత్ర్యోద్యమం, జాగ్రఫీ, కరెంట్ అఫైర్స్‌లపై అవగాహన పెంపొందించుకోవాలి.
- పాత ప్రశ్నపత్రాలు, ఆయా విభాగాలకు ఇచ్చిన వెయిటేజీ ఆధారంగా ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి. వెయిటేజీ పరంగా గత ప్రశ్నపత్రాలు, నోటిఫికేషన్‌ను పరిశీలిస్తే.. ఫిజిక్స్‌కు 25 శాతం; చరిత్ర, జాగ్రఫీలకు 20 శాతం; కెమిస్ట్రీకి 15 శాతం, జనరల్‌సైన్స్, కరెంట్ అఫైర్స్‌కు 10 శాతం చొప్పున వెయిటేజీ కనిపిస్తోంది. దీనికి అనుగుణంగా విద్యార్థులు తమ ప్రిపరేషన్ సాగించాలి.
- ఫిజిక్స్‌లో ఎలక్ట్రోమాగ్నటిజం, మెకానిక్స్, డైనమిక్స్‌లోని అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- కెమిస్ట్రీలో కెమికల్ అనాలసిస్, ఇనార్గానిక్ కాంపౌండ్స్, పిరియాడిక్ టేబుల్స్, కాన్సెప్ట్ ఆఫ్ ఫిజికల్ కెమిస్ట్రీ, ఈక్విలిబ్రియమ్, థర్మోడైనమిక్స్, క్వాంటమ్ మెకానిక్స్‌పై ప్రధానంగా దృష్టిసారించాలి. • జనరల్ సైన్స్‌లో వ్యాధులు-కారకాలు, ప్లాంట్ అనాటమీ, మార్ఫాలజీ, యానిమల్ కింగ్‌డమ్‌లపై అవగాహన ఏర్పరచుకోవాలి.
- కరెంట్ అఫైర్స్ కోసం పరీక్ష జరిగే తేదీకి ముందు ఆరు నెలల వ్యవధిలో జరిగిన సమకాలీన పరిణామాలపై దృష్టిసారించాలి.
- హిస్టరీకి సంబంధించి స్వాతంత్ర్య ఉద్యమ సంఘటనలు, రాజులు-రాజ్య వంశాలు, చారిత్రక కట్టడాలు, యుద్ధాల సంబంధిత అంశాలను అధ్యయనం చేయాలి.
- జాగ్రఫీ విషయంలో ప్రకృతి వనరులు, విపత్తులు, నదులు, పర్వతాలు, పర్యావరణం వంటి అంశాల్లో పట్టు సాధించడం మేలు చేస్తుంది.
- ఎన్‌డీఏ రాత పరీక్షలో అడుగుతున్న ప్రశ్నలన్నీ ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాల నుంచే ఉంటున్నాయి. దీన్ని దృష్టిలోపెట్టుకుని ఆరోతరగతి నుంచి పన్నెండో తరగతి వరకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అధ్యయనం చేయడం ఉపయుక్తంగా ఉంటుంది.

సివిల్స్, గ్రూప్స్ ప్రత్యేకం

ప్రపంచ ఆర్థిక ప్రగతి

ప్రపంచ ఆర్థిక వృద్ధి 2019లో 2.9 శాతానికి పరిమితమవుతుందని ప్రపంచ బ్యాంకు అంచనావేసింది. తాజాగా 'ప్రపంచ ఆర్థిక ప్రగతి నివేదిక 2019 (గ్లోబల్ ఎకనామిక్ ప్రాస్పెక్ట్స్ రిపోర్ట్-2019)'ను ప్రపంచబ్యాంకు విడుదల చేసింది. బహిర్గత డిమాండ్ తగ్గుదల.. ప్రపంచ విత్త మార్కెట్లో రుణాలపై అధిక వడ్డీ.. విధానాల అమలులో అనిశ్చితి తదితర కారణాలతో.. వేగవంతమైన మార్కెట్, అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థ (ఈఎండీఈ)ల్లో వృద్ధి రేటు తక్కువగా నమోదవుతుందని ప్రపంచబ్యాంకు నివేదిక పేర్కొంది. ఆయా ఆర్థిక వ్యవస్థలలో ఆశించిన వృద్ధి రేటు 4.2 శాతం కంటే తక్కువగా నమోదవుతుందని అభిప్రాయపడింది.



ప్రపంచ ఆర్థిక వృద్ధి 2019లో 2.9 శాతంగాను.. 2020, 2021లలో 2.8 శాతంగానూ ఉంటుందని ప్రపంచ బ్యాంకు అంచనా వేసింది. అమెరికా, చైనాల మధ్య వాణిజ్య యుద్ధం కారణంగా ప్రపంచ ఆర్థిక వృద్ధి మందగిస్తుంది. ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, చైనాలో ఆర్థిక కార్యకలాపాల తగ్గుదల.. ప్రపంచ ఆర్థిక ప్రగతిపై తీవ్ర ప్రభావం చూపుతుంది. విత్తమద్దతుతో అమెరికా తన వృద్ధిని కొనసాగించినప్పటికీ.. అధిక ద్రవ్యోల్బణ ఎదుర్కొంటుంది. వాతావరణ మార్పుల కారణంగా అంతర్జాతీయ ఆహారధరలలో ఒడిదుడుకులు అధికంగా ఉండి.. పేదరికం తీవ్రమవుతుంది. ప్రపంచవ్యాప్తంగా అంతర్జాతీయ వాణిజ్యం, పెట్టుబడుల పరంగా ఆంక్షలు తగ్గాయి. ఇటీవల కాలంలో వాణిజ్య వివాదాల పెరుగుదలతో ఈఎండీఈల్లో విత్తమార్కెట్‌లు అనేక ఒత్తిళ్లను ఎదుర్కొంటున్నాయి. రానున్న రోజుల్లో వాణిజ్య వివాదాల పెరుగుదల ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల ప్రగతిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశముంది. అభివృద్ధి చెందుతున్న మార్కెట్ ఆర్థిక వ్యవస్థలు తమ వాస్తవిక జీడీపీ వృద్ధిని పెంపొందించుకునే క్రమంలో.. మానవ మూలధనం పెంపు, పెట్టుబడికి సంబంధించిన అవరోధాలను తొలగించుకోవడం తోపాటు వాణిజ్య సంబంధాల మెరుగుదలపై దృష్టి సారించాలని నివేదిక పేర్కొంది.

అసంఘటిత రంగం

- ✦ ఈఎండీఈల స్థూల దేశీయోత్పత్తిలో.. అసంఘటిత రంగం ఉత్పత్తి వాటా 1/3 వంతు. కాగా మొత్తం ఉపాధిలో ఈ రంగం వాటా 70 శాతం. ఆయా ఆర్థిక వ్యవస్థలలోని అసంఘటిత రంగ ఉపాధిలో స్వయం ఉపాధి వాటా 50 శాతానికి పైగానే ఉంది. వ్యవసాయరంగ కార్యకలాపాలు అధికంగా ఉండటంతోపాటు మొత్తం శ్రామికులలో నైపుణ్యత లేని కార్మికులు అధికంగా ఉన్నందువల్ల అల్పాభివృద్ధి దేశాలలో అసంఘటిత రంగ కార్యకలాపాలు విస్తృతమయ్యాయి. అల్పాభివృద్ధి దేశాలలో ఉత్పాదకత తక్కువగా ఉండటంతోపాటు పన్ను రాబడి క్షీణించడంతో పేదరికం, అసమానతలు పెరిగాయి. ఈఎండీఈ ఆర్థిక వ్యవస్థలలో అసంఘటిత రంగ ఉపాధిలో దక్షిణాసియా వాటా ఎక్కువ. దక్షిణాసియా ప్రాంతంలోని వివిధ దేశాలలో నైపుణ్యత తక్కువగా ఉన్నవారు ఎక్కువ.
- ✦ దక్షిణాసియా ప్రాంతంలో అసంఘటిత రంగ ఉత్పత్తి.. ఇతర ప్రాంతాలలోని ఈఎండీఈల సగటు కంటే తక్కువ. 2008-2016 మధ్య దక్షిణాసియా ప్రాంత జీడీపీలో అసంఘటిత రంగ ఉత్పత్తి వాటా సగటు 30 శాతం. కాగా ఈఎండీఈల జీడీపీలో అసంఘటిత రంగ ఉత్పత్తి వాటా సగటు 35 శాతం. పన్ను భారం అధికంగా ఉండటం.. శ్రామిక మార్కెట్ నియంత్రణ.. వ్యాపారం ప్రారంభించడానికి వ్యయం అధికంగా ఉండటం..వంటి అంశాలు దక్షిణాసియా ప్రాంతంలో అసంఘటిత రంగ కార్యకలాపాల పెరుగుదలకు కారణమయ్యాయి. దక్షిణాసియాలో అసంఘటిత రంగ కార్మికుల వేతనాలు తక్కువగా ఉండటంతోపాటు నైపుణ్యత తక్కువగా ఉండి.. సాంఘిక భద్రతా వ్యవస్థల నుంచి ప్రయోజనాన్ని పొందలేకపోతున్నాయి. ఈ స్థితి దక్షిణాసియాలోని దేశాలలో అల్ప ఉత్పాదకత, అధిక పేదరికాన్ని స్పష్టపరుస్తున్నది.
- ✦ దక్షిణాసియాలో అతిపెద్ద అసంఘటిత రంగంతోపాటు అసమర్థ పన్ను పాలనా వ్యవస్థ కారణంగా ఈ ప్రాంతంలోని దేశాలలో పన్ను రాబడి తగ్గింది. ఈ ప్రాంతంలోని దేశాలలో పన్ను-జీడీపీ నిష్పత్తి ఈఎండీఈ దేశాల సగటు కంటే తక్కువ. ప్రభుత్వాలకు పన్ను రాబడి తగ్గడంతో అవస్థాపనా సౌకర్యాలు, సామాజిక రంగ కార్యకలాపాలపై పెట్టుబడి తగ్గుతుంది. తద్వారా ఆయా దేశాలకు పేదరికం, అసమానతలను నిర్మూలించడానికి చేసే ప్రయత్నాలలో సామర్థ్యం తగ్గుతుందని నివేదిక పేర్కొంది. దక్షిణాసియా ప్రాంతంలోని దేశాలకు 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్' మెరుగుపరచుకోవడానికి తగిన అవకాశముంది.

ప్రపంచ వాణిజ్యం

వస్తు వాణిజ్యవృద్ధి 2017తో పోల్చినప్పుడు 2018 మొదటి అర్ధ భాగంలో క్షీణించింది. సప్లయ్ వైపు అంశాల కారణంగా 2018లో రెండో అర్ధ భాగంలో.. చమురు ధరలలో ఒడిదుడుకులు ఎదురైనప్పటికీ.. సంవత్సరాంతానికి ఈ ఒడిదుడుకులు తగ్గాయి. వాణిజ్య వివాదాల ప్రభావంతో అనేక వస్తువుల ధరలు ముఖ్యంగా మెటల్స్ ధరలు తగ్గాయి. అధిక వాణిజ్య-సాంద్రత కలిగిన మూలధన వస్తు ఉత్పత్తి.. ఐరోపాతోపాటు,అభివృద్ధి చెందుతున్న ఆసియా ప్రాంతంలో తగ్గింది. 2018 తొలినాళ్లల్లో ప్రవేశపెట్టిన నూతన దిగుమతి సుంకాల కారణంగా.. అమెరికా వస్తు దిగుమతులు 12 శాతం, చైనా వస్తు దిగుమతులు 6.5 శాతం.. మొత్తంగా ప్రపంచ వస్తు దిగుమతులు 2.5శాతం మేర క్షీణించాయి.

జాతీయ భద్రతతోపాటు వివక్షపూరిత వాణిజ్య విధానాలను (అన్‌ఫెయిర్ ట్రేడ్ ప్రాక్టీసెస్) తగ్గించేందుకు అన్నట్లు అమెరికా దిగుమతి సుంకాలను పెంచింది. ముఖ్య ఆర్థిక వ్యవస్థల మధ్య వాణిజ్య వివాదాల కారణంగా 2018లో ప్రపంచ వస్తు వాణిజ్యం, పారిశ్రామిక కార్యకలాపాలు క్షీణించాయి. చైనాతోపాటు ముఖ్య అభివృద్ధి చెందిన దేశాలలో పెట్టుబడి వృద్ధి తక్కువగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో రాబోయే సంవత్సరాలలో వాణిజ్య వృద్ధి క్షీణించే సూచనలున్నాయని నివేదిక పేర్కొంది.

2019లో ప్రపంచ వృద్ధి 2.9 శాతానికి పరిమితం

వృద్ధి రేటుపై అమెరికా, చైనా మధ్య వాణిజ్య యుద్ధ ప్రభావం

వాతావరణ మార్పుల కారణంగా పెరగనున్న పేదరికం

భారత్‌లో 2018-19లో వృద్ధి రేటు 7.3 శాతం

తాజా నివేదికలో ప్రపంచ బ్యాంకు అంచనా

అల్పాదాయ దేశాలు

- ✦ వనరుల సాంద్రత తక్కువగా ఉన్న అల్పాదాయ దేశాలలో వృద్ధి పెరుగుదలకు వ్యవసాయ రంగంలో ఉత్పత్తితోపాటు అవస్థాపనా సౌకర్యాలపై కొనసాగుతున్న పెట్టుబడులు వంటి అంశాలు దోహదపడతాయని నివేదిక పేర్కొంది. చమురు ఎగుమతులపై ఆధారపడిన అల్పాదాయ దేశాలు.. చమురు ఉత్పత్తిని పెంచుకోవడం ద్వారా అధిక వృద్ధిని నమోదు చేసుకుంటాయి. మెటల్స్ ధరల తగ్గుదలతోపాటు బహిర్గత డిమాండ్ క్షీణించడం వల్ల లోహాల ఎగుమతి దేశాల పురోగతి తగ్గుతుంది. అల్పాదాయ దేశాల తలసరి ఆదాయ వృద్ధిలో పెరుగుదల లేకపోవడంతో.. ఆయా దేశాలలో పేదరిక తగ్గింపు తక్కువగా ఉంటుంది. అల్పాదాయ దేశాలలో తలసరి జీడీపీ వృద్ధి 2018లో 2.7 శాతం. కాగా 2019లో 3.1 శాతం, 2020-21లో సగటున 3.5 శాతంగా ఉంటుందని నివేదిక తెలిపింది.
- ✦ ప్రపంచంలో ముఖ్య ఆర్థిక వ్యవస్థలైన అమెరికా, ఐరోపా, చైనాల్లో రానున్న రోజుల్లో వృద్ధి మందగిస్తుందని భావిస్తున్న నేపథ్యంలో.. ఆయా దేశాలపై వాణిజ్యం, పెట్టుబడుల పరంగా ఆధారపడిన అల్పాదాయ దేశాల నుంచి ఎగుమతులు తగ్గే అవకాశముంది. అంతర్జాతీయ విత్త మార్కెట్‌లో అనిశ్చితి కారణంగా అల్పాదాయ దేశాలకు పెట్టుబడుల ప్రవాహం తగ్గుతుంది.

(భారత్.. వృద్ధిరేటు)

జనరల్ ఎస్సే

- ✦ భారత్ 2018-19 ఆర్థిక సంవత్సరంలో 7.3 శాతం.. ఆ తర్వాత రెండు సంవత్సరాలలో 7.5 శాతం ఆర్థిక వృద్ధిని సాధించగలదని ప్రపంచ బ్యాంకు నివేదిక అభిప్రాయపడింది. వినియోగం, పెట్టుబడుల పెరుగుదల కారణంగా భారత్‌లో వృద్ధి అధికంగా నమోదు కానుంది. తద్వారా భారత్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థగా కొనసాగుతుందని అంచనా. చైనా 2019లో 6.2 శాతం, 2021లో 6శాతం వృద్ధి మాత్రమే సాధించే అవకాశముంది.
- ✦ పెద్దనోట్ల రద్దు, జీఎస్‌టీ అమలు కారణంగా.. 2017లో భారత్ 6.7 శాతం వృద్ధి సాధించగా.. అదే సంవత్సరం చైనా 6.9 శాతం వృద్ధి రేటును నమోదు చేసుకుంది. పటిష్టమైన స్వదేశీ డిమాండ్, వస్తుసేవల పన్ను విధానంలో అభిలషణీయ మార్పులు, బ్యాంక్ రీక్యాపిటలైజేషన్, పరపతి వృద్ధి వంటి నిర్మాణాత్మక సంస్కరణల ఫలితంగా 2018లో చైనాను మించి భారత్ అధిక వృద్ధిని నమోదు చేసుకుంది. 2018లో చైనా 6.5 శాతం వృద్ధిరేటు సాధించగా... భారత్ 7.3 శాతం వృద్ధి నమోదుచేసుకుంది.
- ✦ పటిష్టమైన స్వదేశీ డిమాండ్ కారణంగా భారత్ కరెంట్ ఖాతా లోటు 2020లో జీడీపీలో 2.6 శాతంగా ఉంటుందని అంచనా. రిజర్వ్‌బ్యాంక్ లక్షిత ద్రవ్యోల్బణ రేటు కంటే.. దేశంలో ద్రవ్యోల్బణం అధికంగా నమోదు కావడానికి శక్తి, ఆహార ధరలలో పెరుగుదల ప్రధాన కారణంగా ఉంటుందని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొంది. వస్తు సేవల పన్ను, పెద్దనోట్ల రద్దు ఫలితంగా భారత్‌లో సంఘటిత రంగ పరిణామం పెరిగింది. వేగంగా అభివృద్ధి చెందుతున్న అనేక మార్కెట్ వ్యవస్థలతో పోల్చినప్పుడు భారత్ వృద్ధిలో ప్రగతి అధికంగా ఉందని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొంది.
- ✦ భారత బ్యాంకింగ్ రంగ ఆస్తులలో.. ప్రభుత్వ రంగ బ్యాంకుల వాటా దాదాపు 70 శాతం. ప్రభుత్వ రంగ బ్యాంకులు అధిక నిరర్థక ఆస్తులు, తక్కువ లాభదాయకత వంటి సమస్యలు ఎదుర్కొంటున్నాయి. దక్షిణాసియా 2019లో 7.1 శాతం వృద్ధి సాధించడంలో భారత్ వాటా అధికంగా ఉంటుంది. భారత్‌లో శ్రామిక మార్కెట్ నియంత్రణలను సరళతరం చేయడం.. మహిళలలో విద్యావకాశాలను పెంపొందించడం.. లింగ వివక్ష నిర్మూలించడానికి చట్టాలను రూపొందించడం వంటి లింగ సమానత్వ సాధన చర్యలు జీడీపీ వృద్ధిని వేగవంతం చేశాయి. అంతేకాకుండా సంఘటిత రంగంలో ఉపాధి పెంపునకు కారణమయ్యాయి.
- ✦ దక్షిణాసియాలోని వివిధ దేశాల మధ్య అసంఘటిత రంగం వాటాలో తేడాలున్నాయని నివేదిక పేర్కొంది. శ్రీలంక మొత్తం ఉత్పత్తిలో అసంఘటిత రంగం వాటా 2016లో 40 శాతం. కాగా భారత్ ఉత్పత్తిలో ఆ రంగం వాటా 20 శాతం కంటే తక్కువ. శ్రీలంకలో మొత్తం ఉపాధిలో స్వయం ఉపాధి వాటా 2016లో 42 శాతం కాగా భారత్‌లోనూ 76 శాతం నమోదైంది. భారత్‌లో ఇటీవల కాలంలో ప్రవేశపెట్టిన వస్తుసేవల పన్ను, పెద్దనోట్ల రద్దు కారణంగా అసంఘటిత రంగ కార్యకలాపాలు తగ్గి.. సంఘటిత రంగ కార్యకలాపాలు మెరుగయ్యాయని ప్రపంచ బ్యాంకు నివేదిక పేర్కొంది!!



డా॥ తమ్మా కోటిరెడ్డి
ప్రొఫెసర్, ఐబీఎస్, హైదరాబాద్